

'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 189

సోమవారం 29-9-2025



అమెరికాకు వెళ్లాలా?

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టాక.. 'డాలర్ డ్రీమ్స్'కి బ్రేకులు పడటం మొదలయ్యాయి. కొత్తగా పెట్టిన హెచ్–1బీ వీసా 'లక్ష డాలర్ల' నిబంధన.. పెద్ద స్పీడ్ బ్రేకర్ అంటున్నారు నిపుణులు. ఇప్పటికే అమెరికాకు వెళ్లే భారతీయుల సంఖ్య ఈ ఏడాది గణనీయంగా తగ్గింది. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా ఈ సంఖ్య భారీగా తగ్గే అవకాశం ఉంది. -2లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



VML.5841.2025

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 189
సోమవారం 29-9-2025


'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'


'స్వదేశీ' పండుగ
దసరా, దీపావళికి స్వదేశీ ఉత్పత్తులు కొనండి.. 'మన్ కీ బాత్'లో మోదీ -6లో


అప్పు చేసి 'ఈఎంఐ' కూడు
అన్ని కొనుగోళ్లకూ ఈఎంఐలే.. వీటిపై నియంత్రణ అవసరం -15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

న్యూస్‌రీల్

గ్రూప్-2 తుది ఫలితాలు విడుదల



రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-2 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను టీజీపీఎస్సీ ఆదివారం విడుదల చేసింది. 18 కేటగిరీల్లో 783 ఖాళీలకుగాను 782 ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేసింది.
- వివరాలు 12లో▶

1న బంగాళాఖాతంలో అల్పపీడనం



ఉత్తర, మధ్య బంగాళాఖాతంలో అక్టోబర్ 1న అల్పపీడనం ఏర్పడే చాన్స్ ఉన్నట్టు వాతావరణశాఖ తెలిపింది. ప్రస్తుతం ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది.
- వివరాలు 5లో▶

ఉగ్ర గోదావరి.. మహోగ్ర కృష్ణా

నారాయణపూర్, తుంగభద్ర డ్యాంల దిగువన కృష్ణా బేసిన్‌లో భారీ వర్షాలు
- వివరాలు 5లో▶

భారత్‌కు విజయ తిలకం

9వ సారి ఆసియా కప్ గెలిచిన టీమిండియా

- హోరాహోరీ ఫైనల్లో పాక్‌పై భారత్‌ను గెలిపించిన తిలక్ వర్మ
- టోర్నీలో పాకిస్తాన్‌పై మూడు మ్యాచ్‌ల్లోనూ భారత్ విజయం

కొన్నాళ్ల క్రితం పహల్గాంలో భారతీయ వనితల తిలకాన్ని పాక్ ఉగ్రమూక తుడిచేస్తే... 'ఆపరేషన్ సిందూర్' ఆ ఉగ్రమూక పునాదుల్నే పెకిలించింది. తాజాగా జరిగిన ఆసియా కప్ క్రికెట్ సంగ్రామం తెలుగోడి సత్తాతో 'ఆపరేషన్ విజయ తిలక్'గా ముగిసింది. లీగ్, సూపర్-4 దశల్లో చప్పగా సాగిన దాయాదుల సమరం ఫైనల్‌కు వచ్చేసరికి రసవత్తర అంకానికి చేరింది. మ్యాచ్ ఆఖరి ఓవర్ దాకా ఉత్కంఠరేపింది. అయితే ఇంత జరిగినా 'ఆ ఒక్కటీ' మారలేదు. అదే ఫలితం... 'విజయం'. కాకపోతే మొదటి రెండు ఏకపక్షంగా గెలిచిన టీమిండియాకు అంతిమ పోరాటంలో కఠిన సవాళ్లే ఎదురయ్యాయి. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న భారత బౌలింగ్‌పై పాక్ 19.1 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌటైంది. తర్వాత సులువైన లక్ష్యమే ఛేదిస్తుందిలే అనుకుంటే నాలుగో ఓవర్ ముగియకముందే భారత్ స్కోరు 20/3. ఈ దశలో గెలుపు బహుదూరంగా కనిపించింది. భారత అభిమాన గళం మూగబోయిన సమయంలో తెలుగోడు తిలక్ వర్మ తెగించే పోరాటం చేశాడు. సామ్సన్‌తో కలిసి ఇన్నింగ్స్ నిలబెట్టిన తిలక్... శివమ్ దూబేతో కలిసి గెలుపువైపు తీసుకొచ్చాడు. చివరి ఓవర్లో 10 పరుగులు చేయాల్సిన చోట సిక్స్‌తో విజయాన్ని ఖాయం చేసి అజేయంగా నిలిచాడు.
14లో


తిలక్ వర్మ 53 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 69 నాటౌట్

ఇకపై పాలన ఫ్యూచర్ సిటీ నుంచే..

నెలలో 3, 4 రోజులు నేను, భట్టి ఇక్కడే ఉంటాం : సీఎం రేవంత్

- పదేళ్లు అవకాశమిస్తే ఫార్చ్యూన్ 500 కంపెనీలను ఇక్కడికి రప్పిస్తా
- ఇక్కడి నుంచి బందరు పోర్ట్‌కు రోడ్డు, చెన్నై, బెంగళూరుకు బుల్లెట్ రైళ్లు
- మీ భూములు గుంజుకోం.. ఒప్పించి, మెప్పించే తీసుకుంటాం
- డిసెంబర్‌లో యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ భవనం ప్రారంభం
- ఎఫ్‌సీడీఏ భవనాలు, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు శంకుస్థాపన

2లో


గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

చెరువుల్ని చెరబడితే తాటతీస్తాం

2లో

- బతుకమ్మకుంట ప్రారంభ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

'ఆల్మట్టి' ఎత్తును ఆపుతావా?



- కృష్ణానదిపై కర్ణాటక కుట్రను నిలువరించే దమ్ముందా?
- నల్లమల పులిగా చెప్పుకునే సీఎం రేవంత్ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలి.. రాహుల్‌గాంధీ తనను ఎప్పుడు తీసేస్తాడోనన్న భయంలో ఉన్నాడు
- అచ్చంపేటలో బీఆర్‌ఎస్ జనగర్జన బహిరంగ సభలో కేటీఆర్

3లో

ప్రమాదమా.. కుట్రా?

- తమిళనాడులోని కరూర్ ఘటనలో 40కి చేరిన మరణాలు.. ఘటనపై 24 గంటల్లో నివేదిక సమర్పించాలని గవర్నర్ ఆదేశం
- భద్రతా వైఫల్యమే కారణమన్న అన్నాడీఎంకే
- బాధిత కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన విజయ్

12లో



కాల్పుల విరమణ కుదరదు

- మావోయిస్టులు ఆయుధాలు వదిలేసి లొంగిపోవాలి.. ఆయుధాలు వదిలేస్తే ఒక తూటా కూడా పేల్చం
- లొంగిపోయే వారికి రెడ్ కార్పెట్ స్వాగతం పలుకుతాం
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

- వివరాలు 6లో▶

నేడు స్థానిక నోటిఫికేషన్?


- ఎస్ఈసీ నోట్‌ఫైల్ సిద్ధం
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు జిల్లాల రిజర్వేషన్ల జాబితాను అందజేసిన పీఆర్‌ఆర్‌డీ డైరెక్టర్
- జెడ్పీ సీఈవోలు, డీపీఓల నుంచి పీఆర్ కమిషనరేట్‌కు చేరిన రిజర్వేషన్లు

- వివరాలు 2లో▶

లేటు వయసులో.. పెళ్లి, పిల్లలా?

- భార్యాభర్తల మధ్య వయసు అంతరంతో సమస్యలు
- ఛాలెంజ్‌గా మారే పిల్లల ఆలనాపాలనా, పెంపకమూ..

- వివరాలు 3లో▶



అమెరికాకు వెళ్లాలా?



అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టాక.. 'డాలర్ డ్రీమ్స్'కి బ్రేకులు పడటం మొదలయ్యాయి. కొత్తగా పెట్టిన హెచ్-1బీ వీసా 'లక్ష డాలర్ల' నిబంధన.. పెద్ద స్పీడ్ బ్రేకర్ అంటున్నారు నిపుణులు. ఇప్పటికే అమెరికాకు వెళ్లే భారతీయుల సంఖ్య ఈ ఏడాది గణనీయంగా తగ్గింది. 2024 మొదటి 8 నెలలతో పోలిస్తే.. 2025లో ఆగస్టు వరకు అమెరికా వెళ్లిన వారి సంఖ్య 4.3 శాతం తగ్గింది. ప్రత్యేకించి ఆగస్టులో ఇది ఏకంగా 14.8 శాతం తగ్గింది. గతంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా ఈ సంఖ్య భారీగా తగ్గే అవకాశం ఉంది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

భారీగా తగ్గిన విద్యార్థి, పర్యాటక వీసా ప్రయాణాలు

ఈ ఆగస్టులో ఏకంగా **14.8 శాతం** తగ్గుదల నమోదు

జనవరి-ఆగస్టులో **26 శాతం** తగ్గిన స్టూడెంట్ వీసాలు

ఈ ఆర్థిక సంవత్సరంలో తగ్గనున్న భారతీయుల సంఖ్య?

అమెరికా అంతర్జాతీయ వాణిజ్య విభాగం (యూఎస్ ఐటీఏ) గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది మొదటి 8 నెలల్లో... విద్యార్థి వీసాపై అమెరికా వెళ్లిన భారతీయులు 1,77,435. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది 26.1 శాతం తక్కువ. ఇక పర్యాటక వీసాల మీద వెళ్లినవారు 9.98 లక్షలు. గతేడాది మొదటి 8 నెలలతో పోలిస్తే ఇది 2.7 శాతం తక్కువ.

ఏయే వీసా మీద ఎంతమంది?



ప్రత్యేకించి విద్యార్థి వీసా మీద అమెరికా వెళ్లే వారి సంఖ్య.. 2024 ఆగస్టుతో పోలిస్తే ఈ ఏడాది ఆగస్టులో 44.5 శాతం తగ్గిపోయింది. పర్యాటక, విద్యార్థి వీసాలపై వెళ్లినవాళ్లు తగ్గడంతో మొత్తం సంఖ్యలోనూ భారీ తగ్గుదల నమోదయింది.

వీసా రకం	ఈ ఆగస్టులో వెళ్లినవారు	2024 ఆగస్టుతో పోలిస్తే తగ్గుదల శాతం
పర్యాటక వీసా	1,26,033	3.6
విద్యార్థి వీసా	41,540	44.5
మొత్తం	2,04,692	14.8

యూకే తరవాత మనమే

యూఎస్ ఐటీఏ గణాంకాల ప్రకారం.. గత రెండేళ్లలో ఆగస్టు నెలలో అమెరికాకు వచ్చిన విదేశీ విద్యార్థుల సంఖ్యతో పోలిస్తే.. ఈ ఏడాది ఆగస్టులో వీరి సంఖ్య భారీగా తగ్గిపోయింది. 2025లో ఆగస్టు వరకు చూస్తే.. యూకే తరవాత అమెరికాను అత్యధికంగా సందర్శించింది భారతీయులే. ఈ ఏడాది మొదటి 8 నెలల్లోమొత్తం 14.87 లక్షల మంది అమెరికాకు వెళ్లారు. 2024 జనవరి – ఆగస్టుతో పోలిస్తే ఇది 4.3 శాతం తక్కువ.

ఎంత మార్పు?
అమెరికాకు వెళ్లిన భారతీయులు

నెల	మార్పు శాతం	2024	2025
జనవరి	2.9	1,69,087	1,73,934
ఫిబ్రవరి	-1.8	1,17,122	1,15,006
మార్చి	-3.6	1,57,834	1,52,105
ఏప్రిల్	0.8	1,75,211	1,76,535
మే	0	2,63,150	2,63,108
జూన్	-8.1	2,33,149	2,14,345
జులై	-5.5	1,98,205	1,87,219
ఆగస్టు	-14.8	2,40,262	2,04,692

ఆధారం: అమెరికా పర్యాటక కార్యాలయం (యూఎస్ ఎన్‌టీటీఓ)

ఈ ఏడాది తగ్గుతుందా?

భారత ప్రభుత్వ బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ గణాంకాల ప్రకారం.. అమెరికాకు వెళ్తున్న భారతీయుల సంఖ్య 2022 నుంచి భారీగా పెరుగుతోంది. కానీ, ఈ ఏడాది గణనీయంగా తగ్గే అవకాశాలున్నాయి. అమెరికా ఆర్థిక సంవత్సరం అక్టోబరు 1న ప్రారంభమై సెప్టెంబరు 30న ముగుస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరం 11 నెలల్లో యూఎస్ వెళ్లిన మొత్తం భారతీయులు సుమారు 19.4 లక్షలు. గతేడాది సెప్టెంబర్‌లో 1.81 లక్షల మంది వెళ్లారు. ఈసారి సెప్టెంబరులో ఈ సంఖ్య భారీగా తగ్గే అవకాశం ఉంది. కాబట్టి మొత్తం సంఖ్య 21 లక్షలు దాటకపోవచ్చునని విశ్లేషకులు భావిస్తున్నారు.

సంవత్సరం	సంఖ్య
2019	19,38,302
2022	17,27,754
2023	20,54,369
2024	21,43,909

క్లుప్తంగా...

కొత్త హెచ్-1బీ వీసాలకే లక్ష డాలర్లు

సీఎం ప్రవాసీ ప్రజావాణిలో నిపుణులు

లక్డీకాపూల్: అమెరికాలో ఎఫ్-1 విద్యార్థులు, ఓపీటీలో ఉన్న అభ్యర్థులు హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేసుకుంటే లక్ష డాలర్ల ఫీజు వర్తించదని అమెరికా ఇమిగ్రేషన్ నిపుణులు స్పష్టం చేశారు. శనివారం రాత్రి ప్రజాభవన్‌లో సీఎం ప్రవాసీ ప్రజావాణి నిర్వహించిన హెచ్-1బీ ఇంటరాక్టివ్ సెషన్‌లో పలువురి అనుమానాలను యూఎస్ ఇమిగ్రేషన్ నిపుణులు నివృత్తి చేశారు. కొత్తగా అమెరికా హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారికి మాత్రమే లక్ష డాలర్ల ఫీజు వర్తిస్తుందన్నారు. ఇప్పటికే అమెరికాలో ఉద్యోగం చేస్తూ ఇతర సంస్థలకు మారిన వారికి ఈ ఫీజు ఉండదన్నారు. హెచ్-4 వీసా ఉన్న దంపతులు హెచ్1బీలోకి మారేందుకు దరఖాస్తు చేసుకున్నా లక్ష డాలర్ల ఫీజు వర్తించదని చెప్పారు. హెచ్-1బీ దరఖాస్తుపై ఎలాంటి సందేహాలున్నా సీఎం ప్రవాసీ ప్రజావాణిలో సంప్రదిస్తే నివృత్తి చేస్తామని కాంగ్రెస్ ఎన్నారై విభాగం స్టేట్ కోఆర్డినేటర్ అమరేందర్ రెడ్డి తెలిపారు.

45 మంది డిప్యూటీ కలెక్టర్ల నియామకం

శిక్షణ కోసం జిల్లాల కేటాయింపు ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1 పరీక్షల్లో ఉత్తీర్ణులై టీజీపీఎస్సీ ఎంపిక చేసిన 45 మందిని ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్లుగా నియమించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశా రు. వీరందరికీ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో శిక్షణ ఇచ్చేందుకు జిల్లాలను కూడా కేటాయించింది. అరవై రోజుల్లోపు వీరంతా జాయినింగ్ రిపోర్టు చేయాలన్నారు.

నేటి భవితలో..

- పోలీస్ జాబ్స్: ఢిల్లీలో పోలీస్ కొలువు
- 7,565 కానిస్టేబుల్ పోస్టులకు ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్
- 10+2/ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులు పోటీపడొచ్చు

ఢిల్లీ పోలీస్ విభాగంలో కానిస్టేబుల్ (ఎగ్జిక్యూటివ్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. కేంద్ర ప్రభుత్వ నియామకాల సంస్థ స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. మొత్తం 7,565 ఉద్యోగ నియామకాలకు దరఖాస్తులు కోరుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న పురుషులు, మహిళలు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ కానిస్టేబుల్ (ఎగ్జిక్యూటివ్) మేల్ అండ్ ఫిమేల్ ఇన్ ఢిల్లీ పోలీస్ ఎగ్జామినేషన్ 2025కు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు,ప్రిపరేషన్ తదితర వివరాలతోపాటు.. విద్య, ఉద్యోగ సమాచారం..

నేటి భవిత పేజీ కోసం సాక్షి ప్లస్ (ఈ పేపర్) ను చూడండి

ఫ్యూచర్ సిటీ నుంచే పాలన

- నెలలో మూడు, నాలుగు రోజులు నేను, భట్టి ఇక్కడే ఉంటాం: సీఎం రేవంత్‌రెడ్డి
- పదేళ్లు అవకాశమిస్తే ఫార్చ్యూన్ 500 కంపెనీలను ఇక్కడికి రప్పిస్తా
- ఎఫ్‌సీడీఏ భవనాలు, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు శంకుస్థాపన



గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో భట్టి విక్రమార్క, నరేందర్‌రెడ్డి, మల్‌రెడ్డి, అడ్లూరి, శ్రీధర్‌బాబు, నిర్మలాజగ్గారెడ్డి, కేఎల్‌ఆర్ తదితరులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: త్వరలో భారత్ ఫ్యూచర్ సిటీ నుంచే పరిపాలన సాగిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇకపై సచివాలయంలో కాకుండా ఫ్యూచర్‌సిటీ ఆఫీ సులో కూర్చుని పనిచేస్తానని చెప్పారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) భవన నిర్మాణంతోపాటు రావిర్యాల నుంచి ఆమనగల్ వరకు నిర్మించనున్న రేడియల్ రోడ్డు పనులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'భూమి విలువ నాకు తెలుసు. వ్యవసాయంతోనే కాదు వ్యాపారంలోనూ భూమితో నాకు సంబంధం ఉంది. మీ తాతల నాటి ఆస్తులు గుంజుకునే ఆలోచన నాకు లేదు. బాధితులకు పూర్తిగా న్యాయం చేసిన తర్వాతే భూములు తీసుకుని ముందుకు వెళ్తాం. డిసెంబర్‌లో యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించుకోబోతున్నాం. ఫ్యూచర్‌సిటీ అభివృద్ధి పనులను ఇక్కడి నుంచే పర్యవేక్షిస్తాం. ఇకపై సచివాలయంలో కాకుండా ఫ్యూచర్‌సిటీ ఆఫీసులో కూర్చుంటా. నెలకు మూడుసార్లు ఇక్కడే ఉంటా. ఏ అభివృద్ధి కార్యక్రమమైనా ఇకపై ఇక్కడి నుంచే చేపడుతా. నాతోపాటు ఉపముఖ్య మంత్రి భట్టి కూడా నెలకు నాలుగు సార్లు ఇక్కడికి వస్తారు. ఆయన కూడా తన కార్యకలాపాలను ఇక్కడి నుంచే కొనసాగిస్తారు. సింగరేణి సంస్థ కోసం 10 ఎకరాలు కేటా యించి, 2026 డిసెంబర్‌లోగా ఆఫీసును ప్రారంభించాల్సిందిగా కోరుతున్నా. ఫ్యూచర్‌సిటీలో ఓవర్‌హెడ్ విద్యుత్ లైన్లు కూడా తొలగించి, యూజీ కేబుల్స్ వేయబోతున్నాం. ఈ ఫ్యూచర్‌సిటీలో ఫార్చ్యూన్ 500 జాబితాలోని కంపెనీలు ఉండాలని కోరుకుంటున్నా. ఇప్పటి వరకు నగరంలో 85 వరకే ఉన్నాయి. రాబోయే పదేళ్లలో ప్రతి కంపెనీ ఇక్కడ పెట్టుబడి పెట్టే విధంగా తీర్చిదిద్దుతున్నాం'అని వివరించారు.

భావితరాల కోసమే మా తపన

భావితరాల బంగారు భవిష్యత్తు కోసమే తమ ప్రభుత్వం కష్టపడుతోందని సీఎం రేవంత్ తెలిపారు. 'ఈరోజు కూడా భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ తెలిపింది. కానీ మంచి సంకల్పంతో చేపట్టిన నవ్య.. భవ్య.. భారత్ ఫ్యూచర్ సిటీకి శంకుస్థాపన కోసం వరుణుడ కూడా సహకరించాడు. రేవంత్‌రెడ్డికి భూములున్నాయని చెప్తున్నారు. ఆయన కోసమే నగరం కడుతున్నారని ఆరోపిస్తున్నారు. నాకు భూమి ఉంటే భూమి మీదే ఉంటుంది. రహస్యంగా దాచుకోవడానికి నా దగ్గరేమీ లేదు. నేను నాగురించో.. నా సహచర మంత్రుల గురించో ఆలోచన చేయడం లేదు. మేమంతా రేపటి తరాల కోసమే ఆలోచన చేస్తున్నాం'అని సీఎం పేర్కొన్నారు.

న్యూయార్క్‌లో ఉన్నవాళ్లు చెప్పుకునేలా చేస్తా

'కుతుబ్‌షాహీలు, నిజాంలు పునాదులు వేసిన హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాలు నేడు ఎంతో అభివృద్ధి చెందాయి. నాడు చంద్రబాబు, వైఎస్సార్ మాకెందుకు అనుకుని ఉంటే..ఇవాళ హైటెక్‌సిటీ, ఔటర్‌రింగ్‌రోడ్డు, శంషాబాద్ ఎయిర్‌పోర్టు వచ్చేవి కాదు. నాటి నాయకుల ఆలోచన వల్లే ఫార్మా, ఐటీ రంగంలో ప్రపంచంతో పోటీపడుతున్నాం. సిలికాన్ వ్యాలీలో మన పిల్లలు గొప్ప స్థానాల్లో ఉన్నారు. గతకాలపు నేతల నుంచి మంచిని నేర్చుకుని భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలి. భవిష్యత్తు తరాల కోసమే భారత్ ఫ్యూచర్ సిటీ. న్యూయార్క్, టోక్యో, సింగపూర్, దుబాయ్ తరహాలో ఫ్యూచర్‌సిటీ గురించి గొప్పగా చెప్పుకునేలా తీర్చిదిద్దుతాం. నాకు పదేళ్లు అవకాశం ఇవ్వండి. న్యూయార్క్‌లో ఉన్నవాళ్లు కూడా ఫ్యూచర్ సిటీ గురించి చెప్పుకునేలా అభివృద్ధి చేస్తాం'అని సీఎం తెలిపారు.

చెన్నై, బెంగళూరుకు బుల్లెట్ రైళ్లు.. బందర్‌కు రోడ్డు

ఫ్యూచర్‌సిటీకి తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, ఇతర నగరాలకు రవాణా సౌకర్యం, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి మౌలిక సదుపాయాలు ఉన్నాయని సీఎం తెలిపారు. 'ఫ్యూచర్ సిటీ నుంచి శ్రీశైలం వరకు 100 మీటర్ల రోడ్డు వేస్తున్నాం. ఇటు ఫ్యూచర్ సిటీ నుంచి బెంగళూరు వరకు రోడ్డు, బుల్లెట్ ట్రైన్ మంజూరు చేయించుకున్నాం. దక్షిణ భారతదేశంలో నౌకాశ్రయం లేని రాష్ట్రం తెలంగాణ మాత్రమే. ఈ కొరతను తీర్చేందుకు మచిలీపట్నం వరకు రోడ్డు వేస్తున్నాం. ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా చెన్నై వరకు బుల్లెట్ ట్రైన్‌కు కేంద్రం అనుమతించింది'అని చెప్పారు. రైతులు నాయకుల ఉచ్చులో చిక్కుకుని నష్టపోవద్దని సూచించారు. బాధిత రైతులతో మాట్లాడి సమస్య లేకుండా చూడాలని కలెక్టర్, టీజీఐఐసీ అధికారులను ఆదేశించారు. 'అందరికీ న్యాయం చేస్తా. కోర్టు బయట కూర్చొని నష్టాన్ని పూడ్చుకుందాం'అని సూచించారు.

భవిష్యత్తు అంతా ఇక్కడే

దేశ భవిష్యత్తు అంతా ఫ్యూచర్ సిటీ చుట్టే తిరుగుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. దేశంలో ఏ నగరానికి లేని రేడియల్ రోడ్లు, సర్వీసు రోడ్లు, మెట్రో సౌకర్యం దీనికి ఉన్నాయని చెప్పారు. భవిష్యత్తులో ఈ సిటీ ప్రపంచానికే తలమానికం అవుతుందన్నారు. ఈ ప్రాంత వాసులకు అత్యాధునిక వైద్యశాలలు, కాలేజీలు, వర్సిటీలు, పరిశ్రమలు అందుబాటులోకి రాబోతున్నాయని తెలిపారు. సింగరేణి గ్లోబల్ కార్పొరేషన్ ఆఫీసు నిర్మాణాన్ని ఏడాదిలోపే పూర్తి చేస్తామని వెల్లడించారు. కొత్త యుగానికి కొత్త బాటలు వేయాలనే ఆలోచనతో ప్రణాళికాబద్ధమైన ఫ్యూచర్‌సిటీకి శంకుస్థాపన చేసినట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. చండీగఢ్ కంటే పది రెట్లు భిన్నంగా ఫ్యూచర్‌సిటీ రాబోతోందని చెప్పారు. సిటీ నిర్మాణం, అభివృద్ధిలో ప్రతి ఒక్కరికి భాగస్వామ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

ధ్యానంతోనే మానసిక ప్రశాంతత

కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్

కన్హాను సందర్శించిన కేంద్ర మంత్రి, మాజీ రాష్ట్రపతి కోవింద్



కన్హా ఆశ్రమంలో మొక్క నాటుతున్న కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తదితరులు

నందిగామ: సమాజంలోని ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని, ధ్యానంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని కన్హా శాంతి వనంలో శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు, హార్ట్‌ఫుల్‌నెస్ మార్గదర్శి కమ్లేశ్ పటేల్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి భూపేంద్ర యాదవ్, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భూపేంద్ర యాదవ్ మాట్లాడుతూ.. విద్య, ఆరోగ్యం, సమానత్వం, వనరుల లభ్యత తదితర అంశాలపై కమ్లేశ్ పటేల్ ప్రత్యేకంగా దృష్టి సారించి ఒక మహత్తరమైన విప్లవాన్ని తీసుకొచ్చారని అన్నారు. పర్యావరణ వ్యవస్థను కాపాడుకోవాలనే దూర దృష్టితో కన్హా ఆశ్రమంలో వేలాదిగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం గొప్ప విషయమని కొనియాడారు. రామ్‌నాథ్ కోవింద్ మాట్లాడుతూ.. కమ్లేశ్ పటేల్ (దాజీ)తో తనకున్న అనుబంధాన్ని దైవానుగ్రహంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. అనంతరం దాజీ రచించిన పుస్తకాలు ది హార్ట్‌ఫుల్‌నెస్ వే వాల్యూమ్, కంప్లీట్ వర్క్స్ ఆఫ్ రామ్‌చంద్రమిషన్ వాల్యూమ్, ఫ్రం దాజీ విత్ లవ్, హార్ట్‌ఫుల్ నెస్‌వే.. తదితర పుస్తకాలను ఆవిష్కరించారు. అంతకు ముందు దాజీ జన్మదినాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటారు.

విమలక్క పాట.. సీతక్క కోరస్



విమలక్క, కనకవ్వ పాటకు కోరస్ ఇస్తున్న మంత్రి సీతక్క తదితరులు


హైడ్రా సాంగ్‌ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి

సాక్షి, హైదరాబాద్/అంబర్‌పేట: అంబర్‌పేటలోని బతుకమ్మకుంట ప్రారంభోత్సవానికి విమలక్క, కనకవ్వ సైతం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత వేదికపై సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులకు మాత్రమే కూర్చునే అవకాశం కల్పించారు. తన స్థానంలో కూర్చున్న ముఖ్యమంత్రి.. స్టేజ్ సమీపంలో నిల్చుని ఉన్న స్థానిక మహిళలు, కనకవ్వను గమనించారు. దీంతో తన పక్కన, వెనుక ఉన్న సీట్లను ఖాళీ చేయించి వారిని పైకి పిలిచి కూర్చోబెట్టారు. 'బతుకమ్మ మన ఆడపడుచుల పండుగ, అమ్మ, అక్కల పండుగ. వారికే ప్రాధాన్యం ఇవ్వాలి' అని సీఎం వ్యాఖ్యానించారు. బతుకమ్మకుంట ప్రారంభోత్సవం విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న విమలక్క.. ఈ చెరువుపై రాసిన ఓ పాటను పాడారు. దీనికి కొందరు కోరస్ కావాలని కోరగా.. వేదికపై ఉన్న మంత్రి సీతక్క వెళ్లి కోరస్ అందించారు. ఆమె ఈ పాటతో పాటు కనకవ్వ పాడిన సంప్రదాయ బతుకమ్మ పాటకూ కోరస్ ఇచ్చారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగగా ప్రకటించిన ప్రభుత్వం సెక్యులర్ పండుగగానూ ప్రకటించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

చెరువుల్ని చెరబడితే తాటతీస్తాం

మూసీ నదికి పునరుజ్జీవం కల్పించి తీరుతాం

- ఒక్క పేద వాడిని కూడా ఇబ్బంది పడనీయం
- బతుకమ్మ కుంటకు వీహెచ్ పేరు
- మూసీకి అంబర్‌పేట వైపు రిటైనింగ్ వాల్ నిర్మిస్తాం
- అంబర్‌పేటలో మినీ సెక్రటేరియట్ కడతాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి



హైడ్రా అభివృద్ధి చేసిన బతుకమ్మ కుంటను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో పొన్నం, కాలేరు తదితరులు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో చెరువులు, కుంటలు, నాలాలను రక్షించడంతోపాటు మూసీకి పునరుజ్జీవం కల్పించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. చెరువుల్ని చెరబడితే తాట తీస్తామని హెచ్చరించారు. హైడ్రా పునరుజ్జీవం కల్పించిన అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటను ఆదివారం సీఎం ప్రారంభించి నగర ప్రజలకు అంకితం చేశారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రతిపాదన మేరకు ఈ చెరువుకు కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు పేరు పెట్టనున్నట్లు రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

విశ్వేశ్వరయ్య ఆలోచనలతో మూసీ ప్రక్షాళన..

కోవిడ్ తర్వాత పర్యావరణ మార్పులతో దేశవ్యాప్తంగా కుంభవృష్టి కురుస్తోందని, ఒకటి రెండు గంటల్లోనే 40 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవుతోందని సీఎం తెలిపారు. దీన్ని ముందే ఊహించి చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణ ప్రారంభించినట్లు వెల్లడించారు. 'నిజాం హయాంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇచ్చిన ప్రణాళిక ఆధారంగానే ఇప్పుడు మూసీని అభివృద్ధి చేయనున్నాం. నగరంలోని ఎమ్మెల్యేలు వారివారి పరిధిలో మూసీతోపాటు బఫర్‌జోన్‌లో నివసిస్తున్న పేదల వివరాలు సేకరించండి. వారందరికీ ప్రభుత్వం న్యాయం చేస్తుంది. హైడ్రా పెట్టినప్పుడు కొందరికి అర్థం కాలేదు. అర్థమైన కబ్జాకోరులు బురద చల్లాలని చూశారు. ఓర్పు, సహనం, సమయస్ఫూర్తితో ముందుకు వెళ్లాం. గుంటూరు, గుడివాడ, అమెరికాలో చదివి వచ్చిన వాళ్లకు పేదరికం అంటే విహారయాత్ర లాంటిది. బెంజ్ కార్లలో తిరుగుతూ పేదల కష్టాలు చూస్తున్నం అంటారు. నేను చిన్నప్పటి నుంచి పేదల మధ్యలో, వారి కష్టాలను చూస్తూ పెరిగాను. మూసీని అభివృద్ధి చేసిన తర్వాత చుట్టుచుట్టి ఇంటికి పట్టుకుపోతానా? విదేశాలకు తరలించేస్తానా? అభివృద్ధి చేసి అనర్థాలు తగ్గించాలనే లక్ష్యంతో పని చేస్తున్నా. మూసీతోపాటు బఫర్‌జోన్‌లో నివసిస్తున్న వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తాం. దీనికోసం త్వరలో ప్రత్యేక సమీక్ష నిర్వహించి అధికారులను క్షేత్రస్థాయికి పంపిస్తాం. వాళ్లు ఇచ్చే నివేదిక ఆధారంగా పునరావాస చర్యలు తీసుకుంటాం. అంబర్‌పేటలో అన్ని విభాగాల కార్యాలయాలతో ఓ మినీ సెక్రటేరియట్ నిర్మి స్తాం. డిసెంబర్ 9 లోపే అనుమతులు, నిధులు మంజూరు చేస్తాం'అని ప్రకటించారు.

కబ్జా చేసిన వ్యక్తే ఆ నాయకుడికి పూలు చల్లాడు..

'బతుకమ్మ కుంటను ఓ వ్యక్తి కబ్జా చేశాడు. అతడే ఆ నాయకుడు (ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి) వస్తే ఆకాశం నుంచి పూలు చల్లాడు. బతుకమ్మ కుంటను చెర విడిపించి కేవలం 100 రోజుల్లో అభివృద్ధి చేశాం. తమ్మిడికుంటలో నిర్మించిన ఎన్ కన్వెన్షన్ యజమాని నాగార్జున నాకు మంచి మిత్రుడు. ఖాళీ చేయమని చెప్పినా వినకపోవడంతో మా అధికారులు దానిని కూల్చేశారు. ఇప్పుడు ఆయనే ముందుకు వచ్చి రెండు ఎకరాలు అప్పగించారు. ఎవరైనా తక్కువ రేటుకు ఇస్తున్నామని ప్రభుత్వ స్థలాలను అమ్మితే తీసుకోవద్దు. మూసీ నిర్వాసితులకు శాశ్వత ఇళ్లను నిర్మించి ఇస్తాం. ప్రగతి భవన్‌కు జ్యోతిరావు పూలే పేరు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వీహెచ్ సలహాలతో చేసినవే'అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు బతుకమ్మ కుంటకు పునరుజ్జీవం కల్పించడం ఆరంభం మాత్రమేనని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. చెరువు చుట్టూ ఉన్న పేదల ఇళ్లను కూల్చకుండానే చెరువును అభివృద్ధి చేశామని వివరించారు. అంబర్‌పేట నియోజకవర్గానికి రెండుసార్లు ప్రాతినిధ్యం వహించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.. ఇక్కడ చేసిన అభివృద్ధి ఏమీ లేదని కాంగ్రెస్ నేత వి. హనుమంతరావు విమర్శించారు.

నేడు స్థానిక నోటిఫికేషన్?

- ఎస్ఈసీ నోట్‌ఫైల్ సిద్ధం.. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు జిల్లాల రిజర్వేషన్ల జాబితాను అందజేసిన పీఆర్‌ఆర్‌డీ డైరెక్టర్
- జెడ్పీ సీఈవోలు, డీపీఓల నుంచి పీఆర్ కమిషనరేట్‌కు చేరిన రిజర్వేషన్లు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ సోమవారం విడుదల కానున్నట్టు తెలుస్తోంది. ఆదివారం సాయంత్రం స్టేట్ ఎలక్షన్ కమిషనర్‌కు స్థానిక సంస్థల్లో సీట్ల రిజర్వేషన్ల జాబితాను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ డా.జి.సృజన అందజేశారు. రాష్ట్రంలోని 31 జిల్లాలకు (హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ మినహాయించి) సంబంధించిన జిల్లా ప్రజా పరిషత్ (జెడ్పీ), ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, వార్డు సభ్యుల రిజర్వేషన్ల ఖరా రు నివేదికను సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా స్థానిక సంస్థల నిర్వహణకు ముందుకెళ్లాలంటూ ఎస్ఈసీకి 'కాన్సెంట్'చేరినట్టుగా చెబుతున్నారు. ఎస్ఈసీకి ప్రభుత్వం నుంచి బీసీ రిజర్వేషన్ల ఖరారు జీఓ, పంచాయతీరాజ్ శాఖ నుంచి స్థానిక సంస్థల్లో ఆయా స్థానాలకు రిజర్వేషన్ల ఖరారు జాబితా, రాబోయే 15 నుంచి 18 రోజుల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయా లంటూ ఆదేశాలు అందినట్టుగా అధికారవర్గాల్లో చర్చసాగుతోంది. ఈ పరిస్థితుల్లో సోమవారం నోటిఫికేషన్ విడుదల చేస్తే, వెంటనే మూడురోజుల్లో అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్లు సమాచారం. మొదట రెండు దశల్లో (గతంలో మూడు దశల్లో) ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పూర్తిచేసి, ఆ తర్వాత వారం, పదిరోజుల అంతరంలోనే మూడు దశల్లో (గతంలోనూ మూడు దశల్లో) గ్రామ పంచాయతీ ఎన్నికలు జరపాలని నిర్ణయించినట్టు తెలిసింది. సోమవారం ఎస్ఈసీ ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికలపై రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు పీఆర్ కమిషనరేట్ కార్యాలయంలో అన్ని జిల్లాలకు సంబంధించి మూడేసీ చొప్పున రిజర్వేషన్ల ఖరారు సైన్డ్ కాపీలు చేరాయి. వీటిని ఎన్నికల కమిషనర్‌కు పీఆర్ డైరెక్టర్ చేరవేశారు. జిల్లా పరిషత్‌ల స్థాయిలో జెడ్పీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు (సీఈఓ), మండల, గ్రామ పంచాయతీల పరిధిలోని స్థానాల రిజర్వేషన్లను జిల్లా పంచాయతీ అధికారులు (డీపీఓ)లు జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఖరారు చేసిన విషయం తెలిసిందే. పీఆర్ డైరెక్టర్ సమర్పించిన రిజర్వేషన్ల జాబితాలపై రాత్రి పొద్దుపోయే దాకా ఎస్ఈసీ అధికారులు, సిబ్బంది జిల్లాల వారీగా అందిన రిజర్వేషన్ల సమాచారాన్ని క్రోడీకరించినట్టు తెలుస్తోంది. ఈ డేటా ఆధారంగా మండల, జిల్లా పరిషత్, గ్రామపంచాయతీ ఎన్నికల స్థానాలు, ఎన్ని దశల్లో నిర్వహణ, తదితర అంశాలపై నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. దీనికి సంబంధించి ఎస్ఈసీ అధికారులు నోట్ ఫైల్ కూడా సిద్ధం చేసినట్టు తెలిసింది. ఈ ఫైల్‌పై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సంతకం కాగానే వెంటనే సోమవారం నోటిఫికేషన్ జారీ చేయనున్నట్టు సమాచారం. అయితే 31 జిల్లాల నుంచి రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి స్కాన్డ్ కాపీలను ఎస్ఈసీ కోరడంతో...అర్ధరాత్రి దాకా ఈ పనిలో పీఆర్ అధికారులు నిమగ్నమైనట్టు సమాచారం .నోటిఫికేషన్ జారీకి ముందే ఎస్ఈసీ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి. దీనిపై లేదు. స్పష్టత కొరవడింది.

'నాకు పిల్లలు కావాలని అనిపిస్తోంది. దత్తత తీసుకునే ఆలోచన లేదు. కచ్చితంగా ఒక బిడ్డ అయితే ఉంటుంది. అది ఎప్పుడైనా జరగొచ్చు. నాకు పిల్లలు పుడితే వారి ఆలనాపాలనా చూసుకునేందుకు నా కుటుంబం ఉంది' అని 59 ఏళ్ల బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ వ్యాఖ్యానించడం చర్చనీయాంశంగా మారింది. సరే, పిల్లలు ఎప్పుడు పుట్టినా సల్మాన్‌కు వచ్చిన ఇబ్బందేమీ లేదు. కానీ, సామాన్యుల విషయంలో అలా కాదు. పిల్లలు తప్పనిసరిగా కావాలనుకున్నవాళ్లకి మాత్రం.. ఒక వయసు దాటాక పిల్లలు పుడితే వాళ్ల పెంపకం, భవిష్యత్తు పెద్ద సమస్యగా మారతాయి.



లేటు వయసులో.. పెళ్లి, పిల్లలా?

ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులో జరగాలని పెద్దలు అంటుంటారు. చదవాల్సిన వయసులో చదవకపోతే.. ఉద్యోగం రావాల్సిన వయసులో రాదు. ఉద్యోగం రానంతవరకు.. జరగాల్సిన వయసులో ఆ మూడు ముళ్ల తంతు కూడా కాదు. పెళ్లయిన వెంటనే పిల్లలు పుట్టేస్తారన్న గ్యారంటీ ఈ రోజుల్లో లేదు.

- సాక్షి, స్పెషల్ డెస్క్

ఒకప్పుడు అలా..: ఓ రెండు దశాబ్దాల కిందటి వరకూ.. అబ్బాయిలకు 25–26 ఏళ్లు వచ్చేటప్పటికి.. పెళ్లిళ్లు అయిపోయేవి. 30 ఏళ్లలోపు.. పిల్లలు పుట్టేసేవారు. పిల్లల కోసం, తమ కోసం ఆర్థిక ప్రణాళికలు కూడా వేసుకునే అవకాశం ఉండేది. 50 ఏళ్లలోపే.. పుట్టిన పిల్లలకు ఉద్యోగాలు రావడం, పెళ్లిళ్లు కూడా అయిపోయేవి. అక్కడి నుంచి ఒక రకంగా ఫ్రీబర్డ్‌లా ఉండేవారు. రిటైర్మెంట్ కూడా సాఫీగా జరిగిపోయేది. కానీ, అదే పెళ్లి ఏ 30 ఏళ్లకో, 35 ఏళ్లకో జరిగితే ఏంటి పరిస్థితి?

- భార్యాభర్తల మధ్య వయసు అంతరంతో సమస్యలు
- ఛాలెంజ్‌గా మారే పిల్లల ఆలనాపాలనా, పెంపకమూ
- రిటైరైపోయినా.. ఇంకా స్థిరపడని పిల్లలతో టెన్షన్

పిల్లలు పుడతారో పుట్టరో!

సాధారణంగా మహిళల్లో 30 ఏళ్లు దాటాక.. పిల్లలు పుట్టే అవకాశాలు తగ్గిపోతుంటాయి. ప్రస్తుత జీవనశైలి సమస్యలు, ఒత్తిడి, పర్యావరణ కాలుష్యం ఇవన్నీ.. అగ్నికి ఆజ్యం పోసినట్టు పిల్లలు పుట్టే అవకాశాలను మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. అందువల్ల మూడు పదుల దాటాక మూడుముళ్లు వేస్తే.. వాళ్ల మధ్యలోకి ముచ్చటగా మూడోవ్యక్తి రావడం అంత సులభం కాదు. ఒకవేళ పుట్టినా.. తరవాత అనేక సమస్యలు సిద్ధంగా ఉంటాయి.

పిల్లల పెంపకం

30–35 ఏళ్ల తరవాత పిల్లలు పుడితే.. 45 దాటిన తరవాత నుంచీ వాళ్ల చదువు కోసం టెన్షన్ మొదలవుతుంది. ముఖ్యంగా వృత్తి ఉద్యోగాల్లో బిజీగా ఉండేవాళ్లు పిల్లలను చూసుకోవడం కాస్త ఇబ్బందవుతుంది. ఇద్దరూ ఉద్యోగులైతే.. ఇక చెప్పనక్కర్లేదు. 25–30లలో ఉండే ఓపిక, సహనం.. 40లలో ఉండవు. ప్రతి చిన్న విషయానికీ చిర్రుబుర్రులాడుతుంటే ఆ చిన్నారుల మనసుల మీద ప్రభావం పడుతుంది.

శారీరక, మానసిక ఆరోగ్యం

35 దాటాక.. అనేక శారీరక, మానసిక అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. ఒకవైపు వీటితో సతమతమవుతూనే పిల్లల పెంపకమూ చూడటం కాస్త ఇబ్బందికరంగా ఉంటుంది. సౌత్ ఈస్ట్ ఏషియన్ జర్నల్ ఆఫ్ హెల్త్ ప్రొఫెషనల్‌లో ఇటీవల ప్రచురితమైన ఓ అధ్యయనం ప్రకారం.. 35 ఏళ్ల వరకు పెళ్లికాని వాళ్లలో హైపర్‌టెన్షన్, గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువ ఉందట. సినిమాల్లో వ్యంగ్యంగా చెప్పినట్టు.. పెళ్లయ్యాక ఇవి రావడం కాదు, వీటితోనే పెళ్లి మండపం మీదకు అడుగుపెట్టాల్సి రావచ్చన్నమాట.

వాళ్ల సెటిల్మెంట్.. మీ రిటైర్మెంట్

పిల్లలు ఒక ఉద్యోగం లేదా వ్యాపారంలో స్థిర పడేసరికి తండ్రి వయసు 55 దాటిపోతుంది. దాదాపు రిటైర్మెంట్ దగ్గరకు వచ్చేస్తారు లేదా రిటైరయ్యాక వాళ్లు స్థిరపడవచ్చు. మీరు రిటైరైపోయిన తరవాత కూడా పిల్లలు సెటిల్ కాకపోతే అదో పెద్ద సమస్య. శారీరక, మానసిక ఆరోగ్యాలు సహకరించకపోయినా అయిష్టంగా, అవిశ్రాంతంగా పనిచేయాల్సి వస్తుంది. ఈ మధ్యలో 'మీవాడు ఇంకా సెటిల్ కాలేదా?' అంటూ బంధుమిత్రుల విచారణలు మరింత చికాకు తెప్పిస్తాయి.

వైవాహిక జీవితంలోనూ..

ఆలస్యంగా పెళ్లి చేసుకునే సందర్భంలో.. భార్యాభర్తల మధ్య వయసు అంతరం ఎక్కువ ఉంటే భాగస్వామి మనసును అర్థం చేసుకోవడం కష్టమవుతుంది. వారి ఆశలు, ఆకాంక్షలు ఒకలా ఉంటాయి.. వీరి ఆలోచనలూ, నిర్ణయాలూ మరోలా ఉంటాయి. ఇది దీర్ఘకాలంలో ఇద్దరి మధ్యా అగాథాన్ని పెద్దది చేస్తుంది. కలిసి ఉంటున్నా భాగస్వామిలో అశాంతి రాజ్యమేలుతుంటుంది.

ఆలోచనల్లో అంతరాలు

లేటు వయసులో పుట్టే పిల్లలకు, తల్లిదండ్రులకు మధ్య ఆలోచనల్లో చాలా అంతరం ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నాయి. పిల్లల స్పీడును వీళ్లు అందుకోలేరు.

ఆర్థిక సమస్యలు

పిల్లల భవిష్యత్తు, సొంతిల్లు కొనుగోలు.. ఇలాంటి ప్రణాళికలపైనా ప్రభావం పడుతుంది. ద్రవ్యోల్బణం పెరగడం వల్ల ఖర్చులు పెరిగిపోతుంటాయి. భవిష్యత్ ప్రణాళికల వ్యయమూ తడిసిమోపెడవుతుంది. ఆ సంపాదన కోసం అదనంగా కష్టపడాల్సి వస్తుంది.

పెళ్లికాని ప్రసాదులు 39 శాతం

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (2019-2021) ప్రకారం.. మనదేశంలో 45-49 ఏళ్లున్న స్త్రీలలో ఒక శాతం.. పురుషుల్లో 3 శాతం పెళ్లికాకుండా ఉన్నారు. 15-49 ఏళ్ల పురుషుల్లో పెళ్లయిన వారు 60 శాతం మందే. మహిళల విషయంలో ఇది 72 శాతం. మహిళల్లో పెళ్లి కాని వారు 24 శాతం కాగా.. పురుషుల్లో ఇది 39 శాతం.

క్లుప్తంగా...

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వ నిర్లక్ష్యం

బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: గురుకుల పాఠశాలలకు నిత్యావసర సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు ఆరు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి గురుకుల విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. ఆదివారం గురుకుల కాంట్రాక్టర్లు హరీశ్ రావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉంచితే కాంట్రాక్టర్లు ఆహార పదార్థాలను ఎలా సరఫరా చేస్తారని ప్రశ్నించారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఎలా అందుతుందన్నారు. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

రైతులకు ఉపయుక్తం మనీ లెండింగ్ యాక్ట్

రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల నుంచి రైతులను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మనీ లెండింగ్ యాక్ట్ ఎంతో ఉపయుక్తమైందని రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయ పెట్టుబడుల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోతున్నారని, వారికి మేలు చేసేందుకు ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్న తమ విజ్ఞప్తికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రైవేటు వ్యాపారులు వసూలు చేసే వడ్డీలు కట్టలేక కొంత మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలున్నాయని గుర్తు చేశారు. రైతు కమిషన్ సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం మనీ లెండింగ్ యాక్ట్ ను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసిందన్నారు.

అక్టోబర్ 3న అలయ్ బలయ్

ముఖ్య అతిథులుగా గవర్నర్, సీఎం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహిస్తున్న అలయ్ బలయ్ కార్యక్రమాన్ని అక్టోబర్ 3న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసినట్లు ఆహ్వాన కమిటీ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి తెలిపారు. అలయ్ బలయ్ కార్యక్రమ ఏర్పాట్లపై ఆహ్వాన కమిటీ సభ్యులతో కలిసి ఆదివారం ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ జేఏసీ ఏర్పాటుకు అలయ్ బలయ్ వేదిక అయిందని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా చేపట్టే ఈ కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతి, కళలు, సంప్రదాయాలు ఉట్టిపడేలా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతారని, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రులు పాల్గొంటారని తెలిపారు. అలాగే కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, నిర్మలాసీతారామన్, బండి సంజయ్‌తో పాటు ఏపీ ఉపముఖ్యమంత్రి, మంత్రులు, హరియాణా స్పీకర్, వివిధ ప్రాంతాలకు చెందిన పార్లమెంటు సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. అన్ని రాజకీయ పార్టీలను ఈ కార్యక్రమానికి ఆహ్వానించామన్నారు. ఎంఐఎం పార్టీని కూడా ఆహ్వానించినట్లు తెలిపారు. సినీ పరిశ్రమ నుంచి ప్రముఖ నటులు నాగార్జున, బ్రహ్మానందను ఆహ్వానించామన్నారు.

ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తును ఆపుతావా?

- కృష్ణానదిపై కర్ణాటక కుట్రను నిలువరించే దమ్ముందా?
- నల్లమల పులిగా చెప్పుకునే సీఎం రేవంత్ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలి
- రాహుల్‌గాంధీ తనను ఎప్పుడు తీసేస్తాడోనన్న భయంలో ఉన్నాడు
- ఇది కాంగ్రెస్ ప్రభుత్వం కాదు.. కాంగ్రెస్, బీజేపీ జాయింట్ వెంచర్ ప్రభుత్వం
- సీఎం సొంత గడ్డ నుంచే స్థానిక ఎన్నికల శంఖారావం
- అచ్చంపేటలో బీఆర్ఎస్ జనగర్జన బహిరంగ సభలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



జనగర్జన సభలో అభివాదం చేస్తున్న కేటీఆర్

సాక్షి, నాగర్‌కర్నూల్: కృష్ణానదిపై ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచేందుకు కర్ణాటక ప్రభుత్వం కుట్ర చేస్తోందని, నల్లమల పులిగా చెప్పుకునే సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే ఆల్మట్టి పనులు ఆపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో బీఆర్ఎస్ రోడ్‌షో నిర్వహించిన అనంతరం జరిగిన జనగర్జన బహిరంగసభలో మాట్లాడారు. ఆల్మట్టి నిర్మాణంపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటి నుంచే పోరాటం సాగిందన్నారు. ఇప్పుడు కర్ణాటక ప్రభుత్వం రూ.70వేల కోట్లతో ఆల్మట్టి ఎత్తును 5 మీటర్లు పెంచేందుకు నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఇదే జరిగితే కృష్ణానది నుంచి పాలమూరుకు ఒక్క చుక్కనీరు కూడా రాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒప్పించి పనులు ఆపాలని కోరారు. నల్లమల పులిగా గర్జిస్తారా? లేక పిల్లిలా ఇంట్లో కూర్చుంటారా? సీఎం రేవంత్ తేల్చుకోవాలన్నారు. అప్పుడే ఆయన నల్లమల పులో లేక నక్కో తేలుతుందని చెప్పారు. రాహుల్‌గాంధీ తనను సీఎం పదవి నుంచి ఎప్పుడు తీసేస్తాడోనన్న భయంతో రేవంత్ గడుపుతున్నారన్నారు.

కేసీఆర్‌కు పేరొస్తదనే పాలమూరు ముట్టుకోవడం లేదు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు కింద చేపట్టిన నార్లాపూర్, ఏదుల, వట్టెం, కర్వెన, ఉద్దండాపూర్ రిజర్వాయర్లు పూర్తయ్యాయని కేటీఆర్ చెప్పారు. ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తి కాగా, మిగిలిన 10 శాతం పనులను సీఎం రేవంత్ రెండేళ్లు గడిచినా పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పేరు వస్తుందనే ఈ ప్రాజెక్టును ముట్టుకోవడం లేదన్నారు.

చరిత్రలో ఏ సీఎం ఇంత హీనంగా మాట్లాడలేదు

గతంలో ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్సార్, రోశయ్య, కిరణ్ కుమార్‌రెడ్డి, కేసీఆర్ వంటి నాయకులు ముఖ్యమంత్రులుగా పనిచేసినా ఏనాడూ సీఎం రేవంత్ తరహాలో హీనంగా మాట్లాడలేదని కేటీఆర్ చెప్పారు. గుడ్లతో గోటీలాడుతా.. పేగులు తీసి మెడలో వేసుకుంటానంటూ గలీజు మాటలు మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. రాష్ట్రం దివాలా తీసిందని, కేన్సర్ పేషెంట్‌లా ఉందంటూ, తనను కోసినా రూపాయి రాదంటూ మాట్లాడటం ఆయన చిల్లర బుద్ధికి నిదర్శనమన్నారు.

స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి

అచ్చంపేటలో ఎమ్మెల్యే ఓడినా కేసీఆర్ గెలుస్తారని ఇక్కడి ప్రజలు అనుకున్నారని, రాష్ట్రమంతా ఇలాగే అనుకుని మోసపోయారని కేటీఆర్ చెప్పారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. గత ఏడాది మంత్రి పొంగులేటి ఇంట్లో ఈడీ దాడులు చేసి నోట్ల కట్టలు దొరికాయని వార్తలు వచ్చాయని, ఇప్పుడు ఈడీ, మంత్రి ఎవరూ నోరు విప్పడం లేదని చెప్పారు. దీనిని బట్టి కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒక్కటేనని తెలుస్తోందన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం కాదని.. కాంగ్రెస్, బీజేపీ జాయింట్ వెంచర్ ప్రభుత్వమని వ్యాఖ్యానించారు. సభలో ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామిరెడ్డి నవీన్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వరరెడ్డి, జైపాల్‌యాదవ్, పట్నం నరేందర్‌రెడ్డి తోపాటు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపు ఎన్నికల వ్యవస్థపై నమ్మకాన్ని తగ్గిస్తుంది

- బిహార్ వ్యవహారంపై సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్



మాట్లాడుతున్న సుప్రీం కోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): దేశాన్ని శాస్త్రీయ దృక్పథంతో కాకుండా పూర్తిగా అంధ విశ్వాసాలతో నడిపిస్తున్నారని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బిహార్‌లో జరిగిన ఓట్ల తొలగింపు, ఓటు దోపిడీ ఘటనలు ఎన్నికల వ్యవస్థపై నమ్మకాన్ని తగ్గిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన మతానికి మద్దతు ఇవ్వడం ద్వారా, మతతత్వాన్ని ప్రోత్సహించడం ద్వారా దేశ వ్యవస్థాపక సూత్రాలను దెబ్బతీస్తోందన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ స్టేట్ డెమోక్రటిక్ ఫోరం, జాగో నవతెలంగాణ ఆధ్వర్యంలో 'న్యాయవ్యవస్థ, ఎన్నికల కమిషన్ స్వతంత్రతను కాపాడాలి' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ... ఎన్నికల కమిషనర్ నియామక విధానం పారదర్శకంగా ఉండాలన్నారు. జడ్జీలు రిటైర్మెంట్ తరువాత పదవులు పొందడం వల్ల స్వతంత్రతను కాపాడలేకపోతున్నామన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోతుందని జాతీయ నిరుద్యోగ ఉద్యమం రావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా వ్యవహరించాలని కోరారు. దేశంలో రెండు వ్యవస్థలు ఉన్నాయని ఒకరు పాలించే వారైతే మరొకరు దోచుకునేవారని అన్నారు. పాలించే వారిలో మోదీ, అమిత్‌షా ఉంటే.. దోచుకునే వారిలో అంబానీ, అదానీ ఉన్నారని ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను తన గుప్పిట్లో పెట్టుకొని రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర చేస్తోందని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ... గోద్రా కేసులో జైలుకు పోయి వచ్చిన వ్యక్తి దేశాన్ని శాసిస్తున్నారని విమర్శించారు. ఓటు చోరీదారులు బాబ్రీ మసీదును కూల్చిన వారు ప్రధానమంత్రిగా, హోంమంత్రిగా ఉన్నారని దుయ్యబట్టారు. సభకు అధ్యక్షత వహించిన హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ... ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం న్యాయవాదులు, మేధావులు సామాజిక ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. లేబర్ చట్టాల్లో జరుగుతున్న ప్రతికూల మార్పులు కార్మికుల హక్కులను దెబ్బతీస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు.

స్థానిక ఎన్నికలపై ఏం చేయబోతున్నారో చెప్పండి

బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే ఎవరు అడ్డుకుంటారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్ల పెంపుదల, ఇతర అంశాలపై ప్రభుత్వపరంగా సమగ్రమైన నివేదిక అందించకుండా, కోర్టులను చట్టబద్ధంగా ఒప్పించకుండా.. ఎన్నికలు జరుపుతామంటే ఎలా? అని నిలదీశారు. ఆదివారం ఈటల మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇప్పటికైనా డ్రామాలు ఆపి, ఈ ఎన్నికల విషయంలో ఏం చేయబోతున్నదో చెప్పాలని, వెంటనే స్థానిక ఎన్నికలు జరిపేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జారీచేసిన జీవోపై ఆయన స్పందిస్తూ.. ఈ ప్రక్రియ అంతా కేవలం ప్రజలను మోసం చేయడానికి, ఎన్నికలు వాయిదా వేయడానికి వేసిన ఎత్తుగడ అని చెప్పారు. న్యాయస్థానాలు రాజ్యాంగానికి లోబడి పనిచేస్తాయే తప్ప సీఎం రేవంత్‌రెడ్డి వంటి వారు పైరవీ చేయడానికి ఇది భూముల పంచాయతీ కాదని అన్నారు. తమిళనాడులో 69% రిజర్వేషన్లు ఎలా అమలు అవుతున్నాయో సమగ్రంగా అధ్యయనం చేసి అమలు చేయాలే తప్ప, మిడి మిడి జ్ఞానంతో చేయొద్దని సూచించారు.

అనర్హతపై నేడే విచారణ

- నేడు, అక్టోబర్ 1న విచారణకు నలుగురు ఎమ్మెల్యేలు
- విచారణ నేపథ్యంలో అసెంబ్లీ ప్రాంగణంలో ఆంక్షలు
- మీడియా, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలకు నో ఎంట్రీ
- విచారణ హాలులోకి మొబైల్ ఫోన్లు నిషేధం
- అక్టోబర్ 6వ తేదీ వరకు ఆంక్షలు కొనసాగింపు
- మీడియా సమావేశాలకు అనుమతి రద్దు

సాక్షి, హైదరాబాద్: పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లను అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సోమవారం నుంచి విచారించనున్నారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం జరగనున్న ఈ విచారణకు సోమవారం నలుగురు ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు. వచ్చే నెల ఒకటో తేదీన కూడా ఈ నలుగురిని ప్రత్యక్షంగా విచారించాలని స్పీకర్ నిర్ణయించారు. ఆ షెడ్యూల్‌ను ఇప్పటికే అసెంబ్లీ వర్గాలు అధికారికంగా విడుదల చేశాయి. ఒక్కో ఎమ్మెల్యే విచారణ గంటపాటు జరగనుంది. ఎమ్మెల్యే, ఆయన తరఫు న్యాయవాది, అనర్హత పిటిషన్ దాఖలు చేసిన ఎమ్మెల్యే, ఆయన తరఫు న్యాయవాది సమక్షంలో అసెంబ్లీ స్పీకర్ ట్రిబ్యునల్ ఈ విచారణ నిర్వహిస్తుంది. సోమవారం ఈ విచారణకు ఎమ్మెల్యేలు టి.ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, గూడెం మహిపాల్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరవుతారు.

కఠిన ఆంక్షలు

అనర్హత పిటిషన్లపై ప్రత్యక్ష విచారణ నేపథ్యంలో అసెంబ్లీ ప్రాంగణంలో కఠిన ఆంక్షలు విధించారు. ఈ ఆంక్షలు సోమవారం నుంచి వచ్చే నెల ఆరో తేదీ వరకు అమల్లో ఉంటాయని ఆదివారం అసెంబ్లీ కార్యదర్శి వి.నర్సింహాచార్యులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం...

- ముందస్తు అనుమతి లేకుండా అసెంబ్లీ ప్రాంగణంలోకి సందర్శకులకు అనుమతి ఉండదు.
- మీడియా ప్రతినిధులకు ప్రవేశం లేదు. మీడియా పాయింట్‌తో పాటు అసెంబ్లీ భవనాల్లో ఎక్కడా ప్రెస్ మీట్ నిర్వహించకూడదు.
- మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు కూడా అసెంబ్లీ ప్రాంగణంలోకి ప్రవేశం ఉండదు. ప్రస్తుత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వచ్చినా వారి శాసనసభాపక్ష కార్యాలయాలకు మాత్రమే పరిమితం కావాల్సి ఉంటుంది.
- విచారణ జరిగే హాలులోకి పిటిషనర్లు, వారి న్యాయవాదులు, విచారణ ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు, వారి న్యాయవాదులెవరూ మొబైల్ ఫోన్లను తీసుకెళ్లకూడదు. ఎవరైనా విచారణ ప్రక్రియను రికార్డు చేసేందుకు ప్రయత్నించినా, ఫొటోలు తీసినా ఆ ఉపకరణాలను అసెంబ్లీ వర్గాలు స్వాధీనం చేసుకుంటాయి. ఇందుకు బాధ్యులైన వారి న్యాయవాదులను విచారణ ప్రక్రియలో పాల్గొనేందుకు కూడా అనుమతించరు.

ఏ ఎమ్మెల్యే ఎప్పుడంటే..! (29-09-2025)

ఎమ్మెల్యే	పిటిషనర్	సమయం
టి. ప్రకాశ్‌గౌడ్	కల్వకుంట్ల సంజయ్	ఉదయం 11–12 గంటల వరకు
కాలె యాదయ్య	చింతా ప్రభాకర్	12 నుంచి ఒంటిగంట వరకు
గూడెం మహిపాల్‌రెడ్డి	చింతా ప్రభాకర్	మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు
బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి	పల్లా రాజేశ్వర్‌రెడ్డి	3 నుంచి నాలుగు గంటల వరకు

(అక్టోబర్ ఒకటో తేదీన కూడా ఇదే సమయాల్లో ఆయా ఎమ్మెల్యేలను మరోమారు విచారించనున్నారు)

ఫిబ్రవరిలో హైదరాబాద్-విజయవాడ హైవే పనులు : మంత్రి కోమటిరెడ్డి



చిట్యాల: అరవై అయిదో నంబర్ హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని 2026 లోపు ప్రమాదరహితంగా మార్చేందుకు.. టెండర్ ప్రక్రియను పూర్తి చేసి ఫిబ్రవరిలో నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో నిర్మించిన ఒక హోటల్‌ను ఆదివారం ప్రారంభించేందుకు వచ్చిన ఆయన హైవే అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి విజయవాడకు రెండు గంటల్లో ప్రయాణికులు చేరుకునేలా ప్రమాదరహిత ప్రయాణం సాగించేలా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఎనిమిది వరుసల ప్రమాదరహిత రహదారి నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ 65వ నంబర్ రహదారి నిత్యం రద్దీతో దేశవ్యాప్తంగా ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న రహదారుల్లో ఒకటని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ రహదారిపై 17 బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించి ఫ్లైఓవర్ నిర్మాణ పనులను చేపడుతున్నామని తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వరకు 230 కిలోమీటర్ల దూరాన్ని గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించినట్లు ఆయన చెప్పారు. గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణ పనులకు త్వరలోనే డీపీఆర్ పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

కోర్టు నిర్ణయాన్ని ప్రభుత్వం స్వాగతిస్తుంది

మంత్రి పొన్నం ప్రభాకర్



మిర్యాలగూడ: బీసీ రిజర్వేషన్లపై కోర్టు నిర్ణయాన్ని ప్రభుత్వం స్వాగతిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన మంత్రి పొన్నం...ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌లతో కలిసి మీడియాతో మాట్లాడారు. బీసీల రిజర్వేషన్ల అమలుతో ఇతర వర్గాలకు ఎంతమాత్రం అన్యాయం జరగదన్నారు. ప్రకృతి వైపరీత్యాన్ని సైతం రాజకీయం చేయడం బీఆర్ఎస్ పార్టీకి అలవాటు ఉందని, పదేళ్లపాటు మంత్రిగా పనిచేసిన కేటీఆర్‌కు కొంచెం తెలివి ఉందనుకున్నా కానీ, తెలివి లేదని తేలిపోయిందని చెప్పారు. బీఆర్ఎస్ ఇకనైనా బురద రాజకీయాలను మానుకొని ప్రజా సంక్షేమం కోసం ఆలోచించాలన్నారు. ఊహించని వరదతో ఎంజీబీఎస్ నీటి ప్రవాహంలో మునిగినా, యుద్ధ ప్రాతిపదికన నివారణ చర్యలు చేపట్టి పరిస్థితిని చక్కదిద్దామని చెప్పారు. క్లౌడ్ బరస్ట్‌లు జరుగుతూ ఆపత్కాలంలో ఉన్న ప్రజలను ఆందోళనకు గురిచేయడం పద్ధతి కాదన్నారు.

మోదీ పిలుపు అందరికీ ఆదర్శం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: స్వదేశీ వస్తువులను ఉపయోగించాలని, వాటి కొనుగోలుకే ప్రాధాన్యం ఇవ్వాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు అందరికీ ఆదర్శనీయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పేర్కొన్నారు. దేశంలో స్థానికంగా తయారవుతున్న వస్తువులకు ప్రోత్సాహం ఇవ్వాలని అన్నారు. ఆదివారం బీజేపీ కార్యాలయంలో పార్టీ నాయకులు.. ప్రధాని ప్రసంగించే 'మన్ కీ బాత్'కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా స్వదేశీ వస్తువుల కొనుగోలు, హస్తకళలకు ప్రోత్సాహం, రైతులకు చేదోడు వాదోడుగా నిలవడం, ఇంట్లో భారతీయ భాషలు మాట్లాడతామని నేతలు ప్రతిజ్ఞ చేశారు. ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

30న 'మేరా దేశ్ పహలే..

ఈ నెల 30న కొండాపూర్ హైటెక్స్‌లో నిర్వహిస్తున్న 'మేరా దేశ్ పహలే – ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ నరేంద్ర మోదీ జీ'కార్యక్రమ ఏర్పాట్లను కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సమీక్షించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో.. నిర్వహించిన సమావేశంలో రాంచందర్‌రావు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో భారత్ ముందుండే విధంగా ప్రధాని మోదీ పలు నిర్ణయాలు తీసుకున్నారన్నారు.

దుబాయ్‌లో బతుకమ్మ..: దుబాయ్‌లో ఇండియన్ పీపుల్స్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎంపీలు డీకే అరుణ, ధర్మపురి అర్వింద్, ఎం.రఘునందన్ రావు, ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డి, రాష్ట్రపార్టీ కోశాధికారి దేవకి వాసుదేవరావు, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ పాల్గొన్నారు.



నేను పేద కుటుంబం నుండి వచ్చాను. నాలుగో తరగతి ఉద్యోగిగా నా కెరీర్ ప్రారంభించాను. నాకున్న ఏకైక ఆస్తి నిజాయతీ!

– జస్టిస్ ఎస్.హెచ్. కపాడియా

సాక్షి

సోమవారం, 29 సెప్టెంబర్ 2025

జయీభవ... విజయీభవ...

'ఏదయా మీ దయా మా మీద లేదు... ఇంత నిర్లక్ష్యమా ఇది మీకు తగదు' అని స్కూలు పిల్లలు... అయ్యవార్లు తమవెంట రాగా ఇంటింటి ముందు పాడటం ముగించి, 'జయీభవ... విజయీభవ' అని గార్తిగా నినదించి, సిద్ధంగా ఉంచుకున్న బాణాలను వాకిలి మీదకు సంధిస్తారు. ఆ బాణాలకు ఆకులు, పువ్వులు కట్టి ఉండటం వల్ల అవన్నీ రాలి వాకిలి ఆకుపచ్చటి కాంతులీనుతుంది. ఏ ఇల్లయినా పచ్చగా బతకడానికి మించిన విజయం ఏముంటుంది సంఘంలో? దసరా ఆకాంక్ష అది.

తెలంగాణలో పండగనాడు ఆకులు నిండిన జమ్మికొమ్మను ఊరిలోకి తెచ్చి, నాటి, పూజ చేస్తారు. పూజ చాలాసేపు సాగినా ప్రజలు ఓపికగా ఉండి, ముగిశాక భక్తి ప్రపత్తులతో జమ్మి ఆకులను తీసుకుని, ఒకరికొకరు ఇచ్చుకుని అలాయి బలాయి చెప్పుకుంటారు. ఎంతో సంతోషభరితమైన సన్నివేశం అది. జమ్మి ఆకును 'జమ్మి బంగారం' అంటారు. పాండవులు తమ ఆయుధాలను దాచడానికి యోగ్యంగా భావించిన జమ్మిచెట్టు, జమ్మి ఆకు విజయానికీ, శుభానికీ చిహ్నం. జీవితంలో ఎదురయ్యే అపజయాలను ఎదుర్కొని జయం పొందడం, చెడును తరిమి శుభానికి స్వాగతం చెప్పడం దసరా ఆకాంక్ష.

మనిషి పర్యావరణాన్ని కాపాడుకుంటే అది మనిషిని కాపాడుతుంది. భూతలం మీద ఇద్దరిదీ కదా హక్కు. దసరానాడు ఆకాశవాసం చేసే పక్షులకు కృతజ్ఞత చెప్పే ఆనవాయితీ ఉంది. తెలంగాణలో పాలపిట్టను దర్శించడం అత్యంత శుభసూచకం. పండుగ రోజు ఊరి యువకులు ఊరి చుట్టూ తిరుగుతూ, వాగులూ వంకల్లో, అడవుల వరకూ వెళ్లి కొమ్మలపై గుట్టుగా ఉన్న పిట్టలను 'పాలా.. పాలా.. ' అని పిలుస్తూ చప్పట్లు చరిచి ఎగిరేలా చేస్తారు. ఆ ఎగిరిన పక్షుల్లో పాలపిట్టను పోల్చి, దర్శించుకుని సంతోషపడతారు. కాని పాలపిట్ట కనపడటం అంత సులభం కాదు. విజయం మాత్రం సులభంగా దక్కుతుందా? ప్రయత్నం సాగించాలి. ఆశావహ దృక్పథంతో ప్రయత్నం సాగించమని చెప్పేది కూడా దసరా ఆకాంక్ష. తీరొక్క పూలతో బతుకమ్మను అలంకరిస్తే ఆ పూల అమరికలోని సౌందర్యమే కడు శుభసూచకం. పూలు పూసే చెట్లున్నాయంటే ఊరిలో సజీవత, వర్షాలు ఉన్నట్టే. ఇక బతుకమ్మ చుట్టూ తిరిగి పాటలు పాడటం జీవన భ్రమణాన్ని అంగీకరించి కొనసాగించడం. బృందం లేకుండా భ్రమణం సాగదు. సాటి మనిషిని తోడు చేసుకుని జీవనాన్ని జయించమనడం దసరా ఆకాంక్షే.

'స్త్రీలతో నాకు భయం లేదు. పురుషుడి చేతిలో మరణం లేని వరమివ్వు' అని కోరాడు మహిషాసురుడు. ఈ పురుష అహమే మహిషత్వం. పశుత్వం. అందుకే శక్తి స్వరూపిణి అయిన జగన్మాత తొమ్మిది రోజులు పద్దెనిమిది బాహువులతో మహిషాసురుడిపై విరుచుకుపడింది. మహిషారుసురుడిని అంతమొందించడం అంటే పురుషాహంకారాన్ని అంతమొందించడం. కాని మనిషి గుణంలో మరుపు ఉంటుంది. వెనుకటి పాఠాలను మరచి పాత పాటనే పాడుతుంటుంది. అందుకే ప్రతి ఏటా నవరాత్రులు వస్తాయి. ప్రతి ఏటా స్త్రీ శక్తిని చాటుతాయి. ప్రతి ఏటా మనిషిలోని సకల అహాలను హెచ్చరిస్తాయి. ప్రకృతి ముందు మనిషి శక్తి ఏపాటి? కాస్తంత వినమ్రుడవై ఉండటం కూడా విజయమే అని చాటడం దసరా ఆకాంక్ష.

పిల్లా పాప, చెట్టూ చేమా, గొడ్డూ గోదాలతో ఆకాశం నుంచి కురిసే వాన, భూమిన పండే పంట... వీటితో సుఖంగా బతకవలసిన మనిషి... అలా బతికేందుకు విశ్వగతులు, ప్రకృతి శక్తులు సకల సహకారాలు అందిస్తుండగా తల ఎగరేస్తూ తనకు తానే ఎన్నో మహిషాసురులను సృష్టించుకుంటున్నాడు. గిల్లికజ్జాలు, తకరార్లు, ఆధిపత్య ధోరణి, ఈర్ష్య, అసూయ, ఆడంబరం, విద్వేషం, తీవ్ర వ్యసనాలు, మూఢ విశ్వాసాలు, మూక స్వభావం... ఎన్నెన్ని ఇవాళ పచ్చటి ఇంటికి నిప్పు పెడుతున్నాయో, స్వీయ మనోదేహాలకు ఖేదం కలిగిస్తున్నాయో నిత్యం ప్రసార మధ్యమాలు చూపుతూనే ఉన్నాయి. అయినా సరే దున్నపోతు మీద వర్షం కురిసినట్టే ఉంటోంది.

వివేచన లేని చోట అసురత్వం, అసురత్వం వెంట చీకటి, చీకటి నుంచి ఓటమి, ఓటమి నుంచి దుఃఖం ఈ జీవన భ్రమణమా? తీరొక్క పూల బతుకమ్మ పాట వంటి జీవన భ్రమణమా? ఏది కావాల్సింది? హేతువు కలిగిన హితంలోకి, వికాసానికి పాదుకొలిపే జ్ఞానంలోకి మనిషి జాగరూకుడై నడిచిననాడు, పుస్తకాన్ని జమ్మి బంగారంలా పంచుకున్ననాడు... ప్రతి జాతి ముంగిట్లోకి, ప్రతి ఇంటి వాకిట్లోకి విజయాలు పిల్లల నవ్వుల్లా వచ్చి పడతాయి. ధ్వానాలు వెల్లువెత్తుతాయి. జయీభవ... విజయీభవ!

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.సప్తమి ప.12.06 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** మూల రా.3.23 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ఉ.9.58 నుండి 11.42 వరకు, తదుపరి రా.1.38 నుండి 3.23 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.21 నుండి 1.10 వరకు, తదుపరి ప.2.47 నుండి 3.36 వరకు, **అమృత ఘడియలు:** రా.8.14 నుండి 10.02 వరకు.

సూర్యోదయం : 5.53
సూర్యాస్తమయం: 5.50
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

సోషల్ టాక్

మగ బిడ్డ



నా వ్యక్తిగత అనుభవాలు ఈ సినిమాలో చాలా ఉన్నాయి. ఉదాహరణకు, నేను ఒక దళిత కుటుంబంలో పెరిగాను. నేను మగ బిడ్డను అయినందుకు ఇంట్లో నన్ను ఎంతో ముద్దుగా చూసుకున్నారు. అది నాకు సిగ్గుగా అనిపిస్తుంటుంది.

– నీరజ్ ఘైవాన్, 'హోమ్‌బౌండ్' చిత్ర దర్శకుడు

బయటి వ్యక్తి



నేను పద్మశ్రీ మనోజ్ బాజ్‌పేయిని కాదు. మనోజ్ బాజ్‌పేయిని! కలలు కన్న బయటి వ్యక్తిని. ఊరిని, ఇంటిని వదిలి వచ్చిన వాడిని. ముంబై శివార్లలో ఉండి పని కోసం పగలూ రాత్రి తిరిగినవాడిని. జీవితంతో కొట్లాడి నన్ను నేను నెగ్గించుకున్నవాడిని.

– మనోజ్ బాజ్‌పేయి, నటుడు

ఒకే ఒక దారి



'అంతా మంచికే' అని ముందుకు సాగిపోవటమే ఏ పరిస్థితుల్లోనైనా మన మనుగడకు ఏకైక మార్గం అని నేను నమ్ముతాను. మనం చేయగలిగేది ఏమిటంటే, మన పనిని మనం చేసుకునేలా మనల్ని మనం జాగ్రత్త పరచుకోవటమే!

– అక్షయ్ ఒబెరాయ్, అమెరికన్ నటుడు

మొదటే రానివ్వరు!



ఏ ప్రాంతం వారూ నిన్ను రానివ్వరు. నిన్ను చేర్చుకోరు. నిన్ను అంగీకరించరు. నిన్ను ఉండనివ్వరు. మొదట నువ్వు నీ ప్రతిభతో నీ ప్రాంతం గొప్పతనం ఏమిటో వారికి చూపించు. తర్వాత వారే నీ పట్ల సానుకూలత చూపుతారు.

– జుబీన్ గార్గ్, అస్సామీ సంగీత విద్వాంసుడు

ఒకే ఒక్కడు



మీరు ఒక 10,000 మందిని తీసుకుంటే, వారిలో 9,999 మందికి ఒకే రకమైన ఆసక్తులు ఉంటాయి. వారి ఆలోచనలు భూమి ఉపరితలం పైన ఉంటాయి. ఇక మిగిలిన ఆ ఒక్క విచిత్రమైన వ్యక్తి ఖగోళ శాస్త్రవేత్త. నేను ఆ వింత జాతికి చెందినవాడిని.

– మార్టిన్ రీస్, ఖగోళ భౌతిక శాస్త్రవేత్త

ఇల్లు మారండి!



కెరీర్‌లో వెనుక పడినప్పుడు జీవితంలో కొన్ని మార్పులు చేసుకోవటం వల్ల మళ్లీ రీఛార్జ్ అవుతాం. ఆ మార్పు ఇల్లు మారటమైనా కావచ్చు. లేదంటే మునుపటిలా భార్య, పిల్లలతో కాసేపు గడపటం, కొత్త మనుషులతో కలవటం అయినా కావచ్చు.

– ర్యాన్ క్రౌజర్, అమెరికన్ అథ్లెట్

మనసులను వేరు చేసి చూడలేం!

కామెంట్



కరణ్ థాపర్


నిజాయతీపరుడైన, ఉన్నతమైన భారతీయుడు ఎవరూ పాకిస్తాన్‌ను సొంత ఇంటిగా భావించడం ఇక ఎంత మాత్రం అంగీకార యోగ్యమైన విషయం కాదా? మనలో కోట్లాది మంది నేడు పాకిస్తాన్‌గా భావిస్తున్న రాష్ట్రాలలో పుట్టినవాళ్లమే. ఆ రోజుల్లో, మాకు తెలిసిన సొంత ప్రాంతం అదే. నా తల్లితండ్రులు, సోదరీమణులు, నా దగ్గరి బంధువులలో చాలా మంది అక్కడే జన్మించారు. మా అమ్మ తొంభై ఏళ్ల వయసులో సొంతూరు వెళ్లాలని కోరుకున్నప్పుడు లాహోర్ పేరు చెప్పింది కానీ, జీవించిన ఛతర్‌పుర్ కాదు. ఛతర్‌పుర్‌లో పొలాలు గట్రా ఉన్నా ఆమెకు ఠక్కున లాహోర్ గుర్తుకొచ్చింది.

పిట్రోడా మాటలపై వివాదం

పాకిస్తాన్‌లో ఉండగా తనకు సొంత ఇంటిలోనే ఉన్నట్లు అనిపించిందని శామ్ పిట్రోడా ఇటీవల మనసులో మాట చెప్పేసినప్పుడు, పిట్రోడాకు దేశభక్తి లేదంటూ ఎన్డీటీవీ ఆయనపై విమర్శలతో ఊదరగొట్టేసింది. ''నేను ఈమధ్య పాకిస్తాన్ వెళ్లొచ్చాను. నాకు అక్కడ నా సొంత ప్రాంతంలో ఉన్నట్లు అనిపించిందని నేను మీకు చెప్పి తీరాలి'' అని ఆయన అన్నారు. ''నేను బంగ్లాదేశ్ వెళ్లాను. నేపాల్ కూడా వెళ్లొచ్చాను. రెండు చోట్లా సొంత ప్రదేశంలో ఉన్నట్లే అనిపించింది'' అని కూడా ఆయన చెప్పుకొచ్చారు. ఆ టీవీ ఛానల్‌లో ప్రసారమైన ఇరవై ఐదు నిమిషాల న్యూస్ బులెటిన్‌లో పదిహేను నిమిషాలకు పైగా సమయాన్ని హానికరం కాని, భంగకరం కాని ఆ వ్యాఖ్యను తూర్పారబట్టడానికే కేటాయించారు. బి.జె.పి అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఆయనను పరుషమైన పదజాలంతో నిందించారు. నేపాల్, బంగ్లాదేశ్‌లలో కూడా సొంతూరులో ఉన్నట్లుగానే ఉందన్న శామ్ పిట్రోడా మాటలను పూనావాలా సమయానుకూలంగా విస్మరించారు.

మనసులను తాకిన అద్వానీ

వాస్తవం ఏమిటంటే, ఎల్.కె. అద్వానీ సొంత ప్రాంతం కూడా పాకిస్తానే! ఆయన పుట్టింది, చదువుకుంది కరాచీలోనే! పాకిస్తాన్ విదేశాంగ మంత్రిగా 2005లో ఖుర్షీద్ కసూరీ ఉన్నపుడు పాకిస్తాన్ సందర్శనకు రావాల్సిందిగా అద్వానీని ఆహ్వానించారు. అద్వానీకి ఆ ఆహ్వానం సంగతి చెప్పి, ఆయన స్పందన ఏమిటో తెలుసుకుని చెప్పవలసిందిగా నన్ను కోరారు. ''దానిదేముంది? సంతోషంగా వెళ్లి రావచ్చు. నాకు నా కుటుంబ సభ్యులను కూడా వెంట బెట్టుకుని వెళ్లాలని ఉంది'' అని అద్వానీ అన్నారు. అలాగే, అద్వానీ వెంట ఆయన కుటుంబ సభ్యులందరూ వెళ్లారు. పాకిస్తాన్‌కు బయలుదేరేటపుడు అద్వానీ చేసిన ప్రకటన, తాను జరపబోయే ఆ పర్యటన తనకు ఎంత ముఖ్యమైనదో స్పష్టంగా వెల్లడించింది. ''వ్యక్తిగత స్థాయిలో ఈ పర్యటన నాకు ప్రగాఢమైన ప్రాధాన్యం కలిగినది. కరాచీలో పుట్టి పెరిగినవాడిని కనుక, ఈ సందర్శన, నాకు మూలాలకు తిరిగి వెళ్లటం లాంటిది. ఈ రెండు దేశాలు సుస్థిరమైన శాంతితో సాగే మార్గాన్ని ఆ పరమాత్మ చూపాలని నేను ఆ దైవాన్ని ప్రార్థిస్తున్నాను'' అని ఆయన అన్నారు. అయితే, లాహోర్‌లో అద్వానీ అన్న మాటలను నేను ఎన్నటికీ మరచిపోను. ''ప్రతి భారతీయుడి మనసులో కొద్దిపాటి పాకిస్తాన్, ప్రతి పాకిస్తానీ హృదయంలో కొద్దిపాటి ఇండియా ఉంటాయని నేను ఎప్పుడూ విశ్వసిస్తాను'' అని ఆయన అన్నారు. అది మనసును తాకే వాస్తవం. ముఖ్యంగా పంజాబీలు, బెంగాలీలకు సంబంధించినంత వరకు కాదనలేనిది. ఈరోజుల్లో అయితే, ఎన్డీటీవీ, అద్వానీని కూడా ఏకిపారేసి ఉండేది. దాని జాతీయతావాద చెవులకు ఆ మాటలు దేశద్రోహంతో సమానంలా అనిపించేవి. అదృష్టవశాత్తూ, ప్రణయ్ రాయ్ ఆధ్వర్యంలో 2006లో అది చాలా భిన్నమైన ఛానల్‌లా ఉండేది.



ఎల్.కె. అద్వానీ పాక్ పర్యటన (2005)

> ◆ లాహోర్‌లో అద్వానీ అన్న మాటలను నేను ఎన్నటికీ మరచిపోను. "ప్రతి భారతీయుడి మనసులో కొద్దిపాటి పాకిస్తాన్, ప్రతి పాకిస్తానీ హృదయంలో కొద్దిపాటి ఇండియా ఉంటాయని నేను ఎప్పుడూ విశ్వసిస్తాను" అని ఆయన అన్నారు. అది మనసును తాకే వాస్తవం.

ఒకేలా అనిపించటం సహజమే!

నా సంగతి కూడా చెప్పనివ్వండి. నేను 1980లో మొదటిసారి పాకిస్తాన్ సందర్శించాను. ఆ తర్వాత చాలాసార్లు వెళ్లివచ్చాను. వెళ్లిన ప్రతిసారీ నాకు పూర్తిగా సొంత ఇంటిలోనే ఉన్నట్లే అనిపించింది. వారి పంజాబ్‌లో భాష, ఆహారం, సంప్రదాయాలు, ఆచారాలు, ఇళ్లు, ప్రజా జీవనవిధానానికి మనకు తేడా ఏమీ లేదు. రెండింటినీ వేరు చేసి చూడలేం. అవే రకమైన మాటలతో శపిస్తాం లేదా అక్కున చేర్చుకుంటాం. అదే వైచిత్రి. తమిళులు, మలయాళీలు లేదా కన్నడిగులు సగటు పాకిస్తానీయులకు అపరిచితులుగా కనిపించవచ్చు. ఢిల్లీ, శ్రీనగర్‌లలో ఉన్నవారు కూడా అలానే అనిపించవచ్చు. కానీ, అమృత్‌సర్, లూధియానాలలో ఉన్నవారు మాత్రం కాదు. పాకిస్తాన్ గురించి భారతీయుల తలపులు కూడా కొంత వరకు అదే రకంగా ఉంటాయని చెప్పవచ్చు. వారు మన దేశంలోని ఏ ప్రాంతానికి చెందినవారు అనే దానిపైనే అది ఆధారపడి ఉంటుంది. ఇటానగర్‌లో ఉండేవారికి కనిపించే సారూప్యం చాలా తక్కువ. అలీగఢ్‌లో ఉండేవారికి పెద్దగా తేడా ఏమీ ఉండదు.

అర్థం చేసుకోవచ్చు... కానీ!

ఇటీవల దుబాయ్‌లో భారతీయ క్రికెట్ జట్టు ప్రవర్తన చిన్నపిల్లల మాదిరిగా, క్రీడా స్ఫూర్తి కొరవడినదిగా కనిపించింది. ముఖ్యంగా నన్ను వేదనకు గురి చేసింది. పాకిస్తాన్ జట్టుతో కరచాలనం చేసేందుకు వారు తిరస్కరించడం క్రికెట్ అనిపించుకోదు. కరచాలనం అనే బ్రిటిష్ పదబంధానికి అర్థం ఏమైనా ఉందీ అంటే, తప్పకుండా దానిలోకి, రీతి రివాజులకు సంబంధించిన తేలికపాటి మర్యాదలు, సత్ప్రవర్తన కూడా రాకుండా ఉంటాయా? తప్పక పాటించవలసిన చక్కని నడవడికను పక్కన పెట్టాలని భారత జట్టు తీసుకున్న నిర్ణయంతో మన విజేతలు చిన్నవాళ్లుగా కనిపించారు. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం పాకిస్తాన్‌తో ఆడకూడదని కోరుకోవడాన్ని నేను అర్థం చేసుకోగలను. మైదానంలో అవతలి జట్టు ఎదురుగా నిలవడం ఇష్టం లేక ఒక ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనడానికి భారత్ తిరస్కరించడం ఇది మొదటిసారేమీ కాదు. దక్షిణాఫ్రికాతో ఆడడం ఇష్టం లేక 1974లో డేవిస్ కప్‌లో ఏకంగా ఫైనల్స్‌నే త్యజించడం ఇందుకు కలకాలం గుర్తుండే ఉదాహరణ. కానీ, ఒకసారి ఆడడానికి అంగీకరించిన తర్వాత, ప్రత్యర్థులతో కరచాలనం చేయడం ఆచారమే కాదు, నాగరికత అని కూడా అనిపించుకుంటుంది.

మనసులో ఉన్నది నిర్మొహమాటంగా చెబుతున్నా, ఆ అంశంపై ఎవరూ దృష్టి సారించకపోవడం నన్ను ఆశ్చర్యపరచింది. అలాగే, పాక్‌లో ఉన్నపుడు సొంత ఇంటిలోనే ఉన్నట్లుగా అనిపించిందని శామ్ పిట్రోడా అన్నందుకు, ఆయనని ఏకిపారేయడం కూడా నన్ను అంతే ఆశ్చర్యపరచింది. నిజం చెప్పాలంటే, నా దేశస్థుల గురించి నేను తెలుసుకుంటున్న కొద్దీ నాలో ఆశ్చర్యం పాలు ఎక్కువ అవుతోంది!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

పాటతల్లికి పెద్దకొడుకు

గోరటి వెంకన్న సుప్రసిద్ధ వాగ్గేయకారుడు. పరిచయం అక్కర లేని పేరు. ఆట పాటలతో తెలుగువాళ్లందరినీ తన్మయీభూతంగా అలరిస్తున్న ప్రజాకవి. 'హంస' అవార్డు గ్రహీత. 'కాళోజీ పురస్కార' సన్మానితులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు గౌరవం ఇనుమడింపజేసిన లిటరరీ లెజెండ్. తెలుగుజాతి గర్వంగా చెప్పుకోదగిన పాటలు రాశారు, రాస్తున్నారు. 'అల సెంద్రవంక', 'వల్లంకి తాళం', 'ఏకునాదం మోత', 'రేల పూతలు', 'పూసిన పున్నమి' వంటి పాటల సంపుటాల్లో దేన్ని చదువుకున్నా గోరటి వెంకన్న పాటకళ, పాటకథ కాంతులీనుతూ రసరంజకంగా మన కళ్లముందు సాక్షాత్కరించగలవు.

ముఖ్యంగా గ్లోబలైజేషన్‌ను తీవ్రస్వరంతో నిరసిస్తూ వెంకన్న రాసిన 'పల్లె కన్నీరు పెడుతుందో' పాట మాస్ పాపులారిటీ చెప్పనక్కర లేదు. 2004 సార్వత్రిక ఎన్నికల్లో అప్పటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ఘోరంగా ఓడిపోయేలా తెలుగు ఓటర్లు తెలివిడిని ప్రదర్శించడానికి కారణభూతమైన ఒక హిస్టారికల్ సాంగ్ అది. 'వాగు ఎండిపాయెరో', 'నల్లతుమ్మ', 'సంత', 'అద్దాల అంగడి', 'కంచెరేగి తీపివోలె', 'యలమంద', 'గల్లీ సిన్నది గరీబోల్ల కత పెద్దది', 'ఇద్దరం విడిపోతె', 'తరమెల్లిపోతున్నదో'... ఇత్యాది పాటలన్నీ ప్రతి శ్రోతకూ కంఠోపాఠం. ఆద్య కళలో పురుడు పోసుకుని తాత ముత్తాతల నుంచి వ్యాప్తమవుతూ తనదాకా వచ్చిన వాగ్గేయకార సంప్రదాయాన్ని సామాజికం చేసిన పాటల కథకుడు, పాటతల్లి పెద్దకొడుకు వెంకన్న! దళిత బహుజన స్పృహ, తెలంగాణ అస్తిత్వచైతన్యం, మార్క్స్ – అంబేడ్కర్ తాత్విక ధార, గ్రామీణ వాదం కలగలసిన శోభాయమాన గేయకవిత్వం వెంకన్నది.



ఆటపాటలతో అలరిస్తూ గోరటి వెంకన్న

అమెరికన్ సంగీతవేత్త, పాటల కూర్పరి డేనియల్ జి. బ్రౌన్ వ్యాఖ్యానించినట్టు ఆయన పాటలు లాక్షణికత పాదపాదాన ఉట్టిపడుతూ కథాప్రధానం, సహజత్వం, జాను తెనుగు, నిర్దిష్ట వస్తువుతో కూడుకున్న విశిష్ట వస్తుగీతాలు. **'ఎంత సల్లనిదమ్మ కానుగ నీడ/ ఎండ సెగనే ఆపె పందిరి చూడ/ తలపైన తడికోలె అల్లుకున్నాకులు/ తడిలేని వడగండ్ల తలపించు పూతలు/ నిలువు నాపరాయి తనువుల తనమాను/ ఇరిసిన విరగని పెళుసులేని మేను'** అంటూ వెంకన్న వర్ణించిన 'కానుగ నీడ' మనకో వైద్యోపనిషత్తు. **'నోట మోదుగు సుట్ట నొసట నామంబొట్టు/ తలకు తుండు గుడ్డ మెడకు తులసి మాల/ ఏకుతారొక చేత సిరుతలింకొక చేత/ వేదాల చదువకున్న ఎరుక కలిగుండు/ రాగి బిత్తం లేని రాజయోగిలా ఉండు / అది చెన్నుడి అంశ మా నాయిన/ అపర దసుర్దాసు మా నాయన'** అంటూ పితృభక్తిని చాటుకున్న వెంకన్న పాట యువతకో జీవన నైపుణ్య పాఠం.

తాను పుట్టి పెరిగిన పాలమూరు, దాపున్న దుందుభి, కాలు కొద్ది అలుపు సొలుపెరుగక తిరిగిన ప్రదేశాలు, ప్రాపంచికానుభవం నుండి 'క్వాట్రైన్స్' రూపుదిద్దుకుంటవి. ఇందుకు **'ధరాంతమున ధ్వనించె నాదం/ దిగంతాలకే తాకిన వాదం/ తెలంగాణ జయశంఖారావం/ దాశరథి ఘన కవనపు యాగం/ ఎందరో వీరుల ఆశల స్వప్నం'** అంటూ ఎత్తుకున్న తెలంగాణ 'వైభవ గీతిక' ఒక ప్రబల సాక్ష్యం. కాళోజీ సాహిత్య వారసుడిగా వెంకన్న తెలుగువాళ్లకు తెలంగాణకు చాలినంత రాజకీయ ప్రబోధ చేశారు.


అమెరికన్ పాటల సంప్రదాయంలో కొత్త కవితా వ్యక్తీకరణను సృష్టించినందుకు బాబ్ డిలన్‌కు స్వీడిష్ అకాడమీ నోబెల్ బహుమతినిచ్చింది. మరి, ఇంటా బయటా ఇరవై ఇరవై ఐదు కోట్లమంది ఆస్వాదించే తెలుగుపాటకు నూతన అభివ్యక్తితో పాటు సరికొత్త వస్తువునూ జోడించి, ఎపిక్ హోదా కల్పించిన వెంకన్నకు ఎన్ని నోబెల్స్ బాకీపడ్డాయో!

– డా॥ బెల్లి యాదయ్య । 98483 92690

(గోరటి వెంకన్న రేపు అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నుండి 'గౌరవ డాక్టరేట్' అందుకుంటున్న సందర్భంగా)

పీ4 పేరిట నయవంచన

రాష్ట్రంలో జీరో పావర్టీ (పూర్తి పేదరిక నిర్మూలన) లక్ష్యాన్ని సాధించటానికి పీ4 (పీ ఫోర్) పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్భాటంగా ప్రారంభించారు. పీ4 అంటే... 'పబ్లిక్ – ప్రైవేట్ – పీపుల్ – పార్ట్‌నర్‌షిప్' అని అర్థం చెప్పారు. చంద్రబాబు విజన్‌లో ముఖ్యమైన 'స్వర్ణాంధ్ర 2047 విజన్'లో భాగంగా రాష్ట్రంలో పేదరికాన్ని 2029 నాటికి పూర్తిగా నిర్మూలించడానికి ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు ప్రకటించారు. 'మార్గదర్శి', 'బంగారు కుటుంబాల'ను ఎంపిక చేసే బాధ్యతలను జిల్లా కలెక్టర్లకు అప్పజెపుతున్నట్లు ప్రకటించారు. ఒక పక్క ఇది 'స్వచ్ఛంద' కార్యక్రమం అని ప్రకటిస్తూ ప్రభుత్వ అధికారులకు బాధ్యతలు అంట గట్టడం గమనార్హం.



సమాజంలో పేదరికం పెరగటానికి గల మూలకారణాల్లోకి వెళ్లకుండా... చిట్కా వైద్యంతో పేదరికం అనే రోగాన్ని పోగొడతాం అనడం చంద్రబాబుకే చెల్లింది. తాను ఒక 'విజన్' ప్రకారం అద్భుతాలను సృష్టిస్తున్నాననీ, దానిలో భాగంగా తాను కనుగొన్న 'విజన్ 2020' ప్రకారం హైదరాబాదులో హైటెక్ సిటీని సృష్టించి అభివృద్ధి సాధించాననీ; ఇప్పుడు 'విజన్ 2047' ప్రకారం పేదరికాన్ని నిర్మూలించి రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా చేస్తాననీ పెద్ద ఎత్తున ప్రచారం సాగిస్తున్నారు బాబు.

2029 నాటికి పేదరికాన్ని రాష్ట్రం నుంచి తొలగించడం ఎలా సాధ్యం అవుతుంది? ఈ 'పీ ఫోర్' పిచ్చి నుంచి చంద్రబాబు త్వరగా బయటపడాలనీ, లేకుంటే గతంలో లాగా అసలు అధికారానికే ముప్పు వస్తుందనీ చంద్రబాబు శ్రేయోభిలాషులు హెచ్చరిస్తున్నారు.

అయినా ఆయన ముందుకే వెళ్లడానికి కారణం – ప్రజల బలహీనతలను తమ రాజకీయలబ్ధి కోసం వాడుకోచూడడమే! అనాదిగా భక్తి భావాలు పెరిగి 'జీవ కారుణ్య సిద్ధాంతం' బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఉన్నవాడు లేనివాడికి సహాయం చేయటం అనేది ఈ జీవకారుణ్య సిద్ధాంతంలోని ముఖ్య విషయం. గాంధీ ప్రబోధించిన 'ధర్మకర్తృత్వ సిద్ధాంతం' దీనినుంచే పుట్టింది. దీని ప్రకారం సహాయం పొందిన పేదవారు ఎల్లకాలం కృతజ్ఞతా భావంతో ఉండిపోతారు. 'పీ ఫోర్' పథకం కింద సహాయం చేసిన మార్గదర్శుల పట్ల పేదలకు చెందిన 'బంగారు కుటుంబాలు' సహజంగా కృతజ్ఞతా భావంతో ఉంటాయి. ఆ కృతజ్ఞతను ఓట్ల రూపంలో చూపించి రుణం తీర్చుకుంటారన్నది ఆయన ప్లాన్. దీనికంటే ముఖ్యమైనది పేదరికంతో ప్రజల్లో అసంతృప్తి పెరిగి ఉద్యమాల వైపు ఆకర్షితులు కాకుండా చూడడం మరో ఎత్తుగడ. అటు పూర్తిగా చావకుండా, ఇటు ఉన్నతంగా బతకకుండా ఉంచేందుకు చూపుతున్న ఈ వ్యవహారం పచ్చి నయవంచన!

– ముప్పాళ్ళ భార్గవ శ్రీ । సీపీఐ ఎంఎల్ నాయకులు

డేటా పాయింట్

'స్మార్ట్' రేసులో రయ్ రయ్!



ఆధారం: కౌంటర్ పాయింట్ రీసెర్చ్

ప్రపంచ స్మార్ట్‌ఫోన్ల మార్కెట్లో మన దేశం మూడో స్థానాన్ని ఆక్రమించింది. విలువ పరంగా మొదటి ఆరు నెలల్లో (జనవరి – జూన్) టాప్ – 5 దేశాల వాటా శాతాల్లో...

దేశం	2024	2025
చైనా	29	28
అమెరికా	16.6	16.9
భారత్	7.7	7.9
జపాన్	4.2	4.9
యూకే	4.5	4.4

కోరి తెచ్చుకున్న యుద్ధం!

జ్యోతిర్మయం

కొడుకైన కుమారస్వామిని శంకరుడు ముద్దాడడాన్ని చూసిన బాణాసురుడు, కుమారస్వామి అదృష్టానికి ఈర్ష్యపడ్డాడు. తండ్రి లేని కారణం చేత తనకు ఆ అదృష్టం కలగకపోవడాన్ని గురించి బాధపడి, శంకరుడు తనకు తండ్రి వంటివాడు కాబట్టి, శంకరుడి నుండి ఆ ప్రేమను పొందాలని నిర్ణయించుకున్నాడు. తలచినదే తడవుగా కఠోరమైన తపస్సు చేసి శివుని నుండి, తాను శివపార్వతులకు పుత్రుడు కావాలనే వరం కోరాడు. శంకరుడు సరే అన్నాడు. అగ్నిదేవుడు పాలించే శోణిత నగరానికి పక్కనే ఒక నగరాన్నీ, నెమలి టెక్కెమునూ బాణుడికి ఇచ్చాడు. ముల్లోకాలను, అష్టదిక్కులలోని రాజులను అవలీలగా జయించి, గణాధిపత్యాన్ని కూడా సాధించి ప్రమథులకు నాయకుడయ్యాడు బాణుడు. కొంతకాలం యుద్ధాలు లేకపోవడంతో ఏమీ తోచక యుద్ధానికి అవకాశాన్ని కల్పించమని శంకరుడినే కోరాడు. మనసులో నవ్వుకున్న శంకరుడు, 'నీ రథానికి ఉన్న నెమలి టెక్కెము విరిగి నేలపై పడడాన్ని నీవు నీ కన్నులతో ఎప్పుడు చూస్తావో అప్పుడు యుద్ధం జరుగుతుంది' అన్నాడు. ఆనందంతో మంత్రి కుంభాండునికి జరిగినదంతా చెప్పాడు బాణుడు. అలా చెబుతూండగానే బాణుడి రథపు నెమలి టెక్కెము సగానికి విరిగి పడింది. ఆనందంలో తేలిపోతున్న బాణుడి విపరీతపు మనఃస్థితిని నాచన సోమన 'ఉత్తర హరివంశము', పంచమాశ్వాసంలో, ఇలా వర్ణించాడు:

విఱిగిన బొంగె నద్దనుజ వీరవరుండు మనంబు లోపలన్/వెఱపును ఖేదము న్వెఱగు విస్మయముం బొదమంగ మంత్రియు/ట్లెఱిగి యెఱింగి మారి దనయింటికి రమ్మను వాని కేమియుం/గఱపిన నొప్పునే, విధి వికారము దప్పునె, యిట్లు ద్రిప్పునే. తెలిసి తెలిసి మృత్యువును తన ఇంటికి రమ్మని పిలిచేవాడికి ఏం చెప్పి మనసు మళ్ళించగలం? దైవవశంగా జరగవలసిన కీడు జరగకుండా ఆగదు కదా! పరిస్థితులు ఒక్కసారిగా ఇలా మారిపోయాయి కదా! – అని బాణుడి మూర్ఖత్వాన్ని తలుచుకుని మంత్రి కుంభాండుడు బాధపడడం ఈ పద్యం భావం.

– భట్టు వెంకటరావు



విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఆదివారం అమ్మవారు మహా చండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. - సాక్షి ప్రతినిధి, విజయవాడ



బాసర శ్రీజ్ఞాన సరస్వతీదేవి ఆదివారం కాళరాత్రి అలంకరణలో దర్శనమిచ్చారు. - బాసర



వరంగల్ భద్రకాళి అమ్మవారు ఆదివారం భవానీమాతగా దర్శనమిచ్చారు. - హనుమకొండ కల్చరల్



అలంపూర్ జోగుళాంబ అమ్మవారు ఏడోరోజు ఆదివారం కాళరాత్రి దేవిగా దర్శనమిచ్చారు. - అలంపూర్



మహబూబ్‌నగర్ బ్రాహ్మణవాడిలోని శ్రీవాసవి ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మి దేవిగా రూ.7,77,77,777 కరెన్సీ నోట్లతో అలంకరించారు. - స్టేషన్ మహబూబ్‌నగర్



మోహినీ అలంకారంలో మలయప్ప దర్శనం. పక్కన తిరుచ్చిపై శ్రీకృష్ణుడు

గరుడుడిపై విశ్వపతి దివ్యదర్శనం

గోవిందనామాలతో మార్మోగిన తిరుమల గిరులు

తిరుమల: విశ్వపతి శ్రీవేంకటేశ్వరుడు గరుడునిపై ఆదివారం అంగరంగ వైభవంగా ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిస్తూ సాక్షాత్కరించారు. సాయంత్రం 6 గంటలకు ఆరంభమైన వాహన సేవ అర్ధరాత్రి వరకు సాగింది. లక్షలాది మంది భక్తులు ఉత్సవమూర్తిని దర్శించుకుని ఆనంద పరవశులయ్యారు. దాదాపు 2 లక్షల మందికిపైగా భక్తులు గ్యాలరీల్లో వేచి ఉన్నారు. ఈ గరుడ వాహన సేవలో గర్భాలయ మూలమూర్తికి అలంకరించే మకరకంఠి, లక్ష్మీహారం, సహస్ర నామ కాసులమాల, సుదర్శన చక్రమాల, మూలవిరాట్టు పురాతన చేతి కంకణంవంటి ఎన్నెన్నో విశేష ఆభరణాలు, శ్రీవిల్లి పుత్తూరు ఆండాళ్ తులసి, పుష్పమాల, చెన్నై నూతన ఛత్రాలు (గొడుగులు) అలంకరించారు. గరుత్మంతుడిపై దేవదేవుడు ఊరేగుతూ దర్శనమిచ్చారు. వాహన సేవ అర్ధరాత్రి దాటాకా కూడా సాగింది. ఉదయం మోహినీ వాహన సేవలో పాల్గొన్న భక్తులే గరుడవాహన సేవకోసం నిరీక్షించారు. 2 లక్షల మంది కూర్చునే విధంగా సిద్ధం చేసిన గ్యాలరీల్లో భక్తులు కిక్కిరిసి పోయారు. మధ్యాహ్నం 1 గంటకే దాదాపుగా అన్ని గ్యాలరీలు నిండిపోయాయి. కాగా, తిరుమలలో సోమవారం శ్రీవారిని స్వర్ణరథోత్సవంపై (రథరంగ డోలోత్సవం) ఊరేగించనున్నారు.



అమ్మవారి విగ్రహాన్ని తయారు చేసిన కళాకారుడు బస్వరాజ్

కళ్లకు గంతలు కట్టుకొని భవానీ మాత విగ్రహం తయారీ

న్యాల్‌కల్ (జహీరాబాద్): రెండు కళ్లకు గంతలు కట్టుకొని ఇటీవల వినాయక విగ్రహాన్ని తయారు చేసిన ప్రముఖ కళాకారుడు బస్వరాజ్ తాజాగా భవానీ మాత విగ్రహాన్ని కూడా అలాగే తయారు చేసి ఔరా.. అనిపించాడు. సంగారెడ్డి జిల్లా, న్యాల్‌కల్‌కు చెందిన ప్రముఖ కళాకారుడు హోతి బస్వరాజ్ గత కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటూ శిల్పకళా వర్క్‌షాప్ నడుపుతున్నాడు. ప్రస్తుతం గిన్నిస్ బుక్ రికార్డు కోసం ప్రయత్నం చేస్తున్న బస్వరాజ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భవానీ మాత విగ్ర హాన్ని తయారు చేయాలని నిర్ణయించుకున్నాడు. కళ్లకు గంతలు కట్టుకొని కేవలం 70 నిమిషాల్లో 3 అడుగుల అమ్మవారి విగ్రహాన్ని తయారు చేశాడు. కళ్లతో చూడకుండా స్పర్శ ఆధారంగా అమ్మవారి విగ్రహాన్ని తయారు చేయడం పట్ల పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టుల మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లాలో ఆదివారం జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. జిల్లాలోని దాంతరి పోలీస్ స్టేషన్ పరిధిలోని చింద్‌ఖరక్ గ్రామ సమీపంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారం మేరకు.. కాంకేర్, గరియాబంద్ జిల్లాల డీఆర్‌జీ, బీఎస్‌ఎఫ్ బలగాలు సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో తారసపడిన మావోయిస్టులు పోలీసులపైకి కాల్పులు జరపగా బలగాలు సైతం ఎదురుకాల్పులకు దిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారని, వారిలో ఏరియా కమిటీ సభ్యుడు సర్వాన్ మడకం అలియాస్ విశ్వనాథ్, ఎల్‌వోఎస్ కమాండర్ రాజేశ్ అలియాస్ రాకేశ్ హేమ్లా, కుంజం బసంతి అలియాస్ అడిమే ఉన్నారని పోలీస్ అధికారులు వెల్లడించారు. ఘటనా ప్రాంతం నుంచి మృతదేహాలతో పాటు రెండు 303 రైఫిళ్లు, ఒక 12 బోర్ తుపాకీ, భారీగా మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి



బొంగరాల సతీశ్

గుర్రంపోడు: పొలం వద్ద మోటారు ఆన్ చేస్తుండగా.. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై యువ రైతు మృతి చెందాడు. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామంలో ఆదివారం జరిగిన ఈ సంఘటనపై గ్రామస్తులు తెలిపిన వివరాలివి. కొప్పోలు గ్రామానికి చెందిన బొంగరాల సతీశ్ (26) తనకున్న రెండెకరాల్లో వరి సాగు చేస్తున్నాడు. ఆదివారం ఉదయం వరి చేనుకు నీళ్లు పెట్టేందుకు పొలం వద్దకు వెళ్లి విద్యుత్ మోటారు స్టార్టర్ ఆన్ చేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

పాలమూరుకు నిజాముద్దీన్ మృతదేహం



మృతదేహాన్ని తీసుకెళ్తున్న బంధువులు

మహబూబ్‌నగర్ క్రైం: ఈ నెల 3న అమెరికా పోలీసుల కాల్పుల్లో మృతి చెందిన మహ్మద్ నిజాముద్దీన్ మృతదేహం ఆదివారం ఉదయం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది. అక్కడినుంచి అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ రామయ్యబౌలిలోని మృతుని ఇంటికి తీసుకువచ్చారు. దాదాపు 25 రోజుల తర్వాత మృతదేహం స్వస్థలానికి చేరుకోగా.. కుటుంబ సభ్యులతోపాటు బంధువులు స్థానికులు నివాళులర్పించిన తర్వాత అంత్యక్రియలు నిర్వహించారు.

ఉగ్ర గోదారి.. మహోగ్ర కృష్ణా

నారాయణపూర్, తుంగభద్ర డ్యాంల దిగువన కృష్ణా బేసిన్‌లో విస్తారంగా వర్షాలు

- ఉప నదులైన మూసీ, హంద్రీ, బీమా, తుంగభద్ర ఉధృతితో కృష్ణాకు పెరిగిన వరద
- శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 5,18,650 క్యూసెక్కులు, సాగర్ నుంచి 6.25 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు
- మంజీర, ప్రాణహిత, ఇంద్రావతి, ప్రధాన పాయతో గోదావరికి పోటెత్తిన వరద



కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద వరద ఉధృతి



ఎస్సారెస్పీ వరద గేట్ల ద్వారా దిగువకు వెళుతున్న గోదావరి జలాలు, ప్రాజెక్టుపై పర్యాటకులు



హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఎగువన వివిధ జలాశయాల గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేస్తుండటంతో మూసీకి వరద ఉధృతి పెరిగింది. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లి వద్ద పరవళ్లు తొక్కుతోంది.

సాక్షి, హైదరాబాద్/నాగార్జునసాగర్/బోధన్/బాల్కొండ/కాళేశ్వరం/దోమలపెంట/ధరూర్: నదీ పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు తోడు ఉప నదులు ఉప్పొంగి కృష్ణమ్మ మహోగ్రరూపం ..గోదావరి ఉగ్రరూపం దాల్చాయి. ప్రధానంగా నారాయణపూర్, తుంగభద్ర డ్యాం దిగువన కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కృష్ణా ఉపనదులు మూసీ, హంద్రీ, తుంగభద్ర, బీమా వరదెత్తుతున్నాయి. దీనికి ప్రధాన పాయ నుంచి వస్తున్న వరద తోడుకాగా, ఆదివారం సాయంత్రం 6 గంటలకు జూరాల ప్రాజెక్టులోకి 5.10 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా గేట్లన్నీ ఎత్తేసి 5.39 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలేస్తున్నారు. తుంగభద్ర, సుంకేశుల బరాజ్‌ల నుంచి తుంగభద్ర ద్వారా 79,268 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 27 వేల క్యూసెక్కులు కృష్ణా ప్రధాన పాయలోకి చేరుతున్నాయి. దీంతో శ్రీశైలం ప్రాజెక్టులోకి 5,93,680 క్యూసెక్కుల ప్రవాహం చేరుతోంది. ప్రాజెక్టు 10 గేట్లు ఎత్తి 5,18,650 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలేస్తున్నారు. దీంతో నాగార్జునసాగర్‌లోకి 6,25,511 క్యూసెక్కుల ప్రవాహం చేరుతుండగా, 26 గేట్లు ఎత్తి అంతే పరిమాణంలో దిగువకు వదిలేస్తున్నారు.

- హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో మూసీనది కూడా మహోగ్రరూపం దాల్చింది. కృష్ణా వరదకు మూసీ ఉధృతి తోడవుతుండటంతో పులిచింతల ప్రాజెక్టులోకి 6,86,906 క్యూసెక్కుల నీరు చేరుతోంది. పులిచింతల ప్రాజెక్టు గేట్లు ఎత్తి 6.50 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలేస్తున్నారు. దీంతో ఏపీలోని ప్రకాశం బ్యారేజీకి వరద ప్రవాహం గంట గంటకూ పెరుగుతోంది. దీంతో 6,39,737 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు.

శ్రీరాంసాగర్ నుంచి ధవళేశ్వరం వరకూ

గోదావరి ప్రధాన పాయతోపాటు ఉప నదులు మంజీర, మానేరు, ప్రాణహిత, ఇంద్రావతి వరదెత్తుతున్నాయి. తెలంగాణలో మంజీరపై నిర్మించిన నిజాంసాగర్ నుంచి 1.50 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదలేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 3.15 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా, ఎగువ నుంచి కూడా వరద వస్తుండంతో 19 గేట్లు ఎత్తి 4.59 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలేస్తున్నారు. దిగువన ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 5.72 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా, 6.65 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలేస్తున్నారు. దీనికి ప్రాణహిత, ఇంద్రావతి వరద తోడవుతుండటంతో కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బరాజ్‌లోకి 8.03 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా అంతే స్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. దాని దిగువన ఉన్న సీతమ్మ సాగర్‌లోకి 8.94 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా అంతే స్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. ఈ వరదకు శబరి ప్రవాహం తోడవుతుండటంతో పోలవరం ప్రాజెక్టులోకి 10 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా అంతే స్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం బరాజ్‌లోకి భారీ వరద రాగా, 10,09,208 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు.

అంతర్రాష్ట్ర రవాణా నిలిపివేత

బోధన్ మండలంలోని ఖండ్‌గాం వద్ద మంజీర వంతెన మీదుగా మహారాష్ట్ర ప్రాంతానికి రవాణాను నిలిపివేశారు. కందకుర్తి వద్ద గోదావరి నది వంతెన మీదుగా వరద నీరు ప్రవహించడంతో కందకుర్తి - ధర్మాబాద్ (మహారాష్ట్ర) మధ్య రవాణాను అధికారులు నిలిపివేశారు.

- గోదావరి నదిలో పెరుగుతున్న వరద ఉధృతికి నిజామాబాద్–పండరీపూర్ ఎక్స్‌ప్రెస్ రైలును అధికారులు ఆదివారం తాత్కాలికంగా రద్దు చేశారు. నవీపేట మండలంలోని యంచ శివారులో గల గోదావరి నదిపై రైల్వే బ్రిడ్జికి మూడడుగుల వ్యత్యాసంలో నది ప్రవహిస్తోంది.



వనదుర్గమ్మ ఆలయం ఎదుట మంజీరా ప్రవాహం

ఏడుపాయలను ముంచెత్తిన వరద

పాపన్నపేట(మెదక్): మంజీరా జోరు పెరిగింది. వరద ఉధృతికి ఘనపురం ఆనకట్ట పొంగి పొర్లుతోంది. ఆదివారం 1,24,598 క్యూసెక్కుల నీరు దిగువకు పయనిస్తోంది. దీంతో ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం ఎదుట గల క్యూలైన్లు, షెడ్డు రేకులు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. ఆలయాన్ని ముంచెత్తుతూ సమీపంలో గల యాగశాల నుంచి వరద పోటెత్తుతోంది.

కృష్ణా బేసిన్‌లోని ప్రధాన ప్రాజెక్టులలో వరద ప్రవాహం వివరాలు.. సాక్షిప్లస్ ఈ పేపర్‌లో..



భక్తజనం నడుమ తరలుతున్న అమ్మవారి ఆభరణాలు

వైభవంగా గంగనీళ్ల జాతర

దిలావర్‌పూర్: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం అడెల్లి మహాపోచమ్మ గంగనీళ్ల జాతర వైభవంగా జరిగింది. శనివారం అమ్మవారి ఆభరణాలను దిలావర్‌పూర్ మండలం సాంగ్వి పోచమ్మ ఆలయానికి తీసుకొచ్చారు. రాత్రంతా పోచమ్మ ఆలయ పరిసరాల్లో అమ్మవారి నామస్మరణ చేస్తూ జాగరణ చేశారు. ఆదివారం వేకువజామున గ్రామ పెద్దలు, అమ్మవారి ఆలయ పూజారులు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు స్థానిక నాయకుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా శుద్ధిచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్ర గోదావరి జలాలను గడ ముంతల్లో తీసుకుని.. అమ్మవారి ఆభరణాలను తిరిగి అడెల్లి మహాపోచమ్మ ఆలయానికి తీసుకెళ్లారు. అమ్మవారికి అలంకరించి.. పూజల అనంతరం దర్శనానికి భక్తులను అనుమతించారు.

లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

భద్రాచలంలో ఆదివాసీల ‘ధర్మయుద్ధం’

భద్రాచలం: రాజ్యాంగ విరుద్ధంగా ఎస్టీ జాబితాలో ఉన్న లంబాడాలను అందులో నుంచి తొలగించాలని ఆదివాసీ సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ, ధర్మయుద్ధం పేరిట సభ నిర్వహించగా, అటవీ శాఖ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, మాజీ ఎంపీ సోయం బాబురావు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడారు. ఆర్టికల్ 342 (1), (2)లకు విరుద్ధంగా లంబాడా కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చారని ఆరోపించారు. లంబాడా, బంజారాలను ఎస్టీ జాబితాలోకి తీసుకోవాలంటే రాష్ట్రపతి ఆమోదంతో ఆనాటి రాష్ట్ర ప్రభుత్వ నోటిఫికేషన్, ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ తీర్మానం ఉండాలని తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణకు అనుగుణంగా రాష్ట్ర శాసనసభ ఆమోదం, రాష్ట్ర ప్రభుత్వ కమిషన్ రిపోర్టులు ఉండాలన్నారు. ఈ ప్రక్రియ జరగకుండానే లంబాడా, బంజారాలను ఎస్టీ జాబితాలో కలిపారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ, న్యాయ సూత్రాలకు ఇది విరుద్ధంగా ఉన్నందున హైకోర్టు, సుప్రీంకోర్టుల ద్వారా న్యాయపోరాటం చేస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల జేఏసీ చైర్మన్ చుంచు రామకృష్ణ, సంక్షేమ పరిషత్ రాష్ట్ర ముఖ్య సలహాదారులు కొర్స వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

1న బంగాళాఖాతంలో అల్పపీడనం

- మరోవైపు ఈశాన్య అరేబియన్ సముద్రంలోనూ అల్పపీడనం ఏర్పడే అవకాశం
- దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మూడురోజుల పాటు వర్షాలు



సాక్షి, హైదరాబాద్: ఉత్తర బంగాళాఖాతం, దానికి సమీపంలోని మధ్య బంగాళాఖాతంలో అక్టోబర్ 1వ తేదీన ఒక అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. మంగళవారం నాటికి అదే ప్రాంతంలో ఉపరితల చక్రవాత ఆవర్తనం ఏర్పడుతుందని, ఆ తర్వాత ఉత్తర, మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనంగా మారుతుందని వాతావరణ శాఖ వివరించింది. ఉత్తర, మధ్య మహారాష్ట్ర, దక్షిణ గుజరాత్, సౌరాష్ట్ర ప్రాంతంలో అల్పపీడనం కొనసాగుతోందని, మంగళవారం నాటికి ఈశాన్యం అరేబియన్ సముద్ర ప్రాంతంలో మరో అల్పపీడనంగా ఏర్పడే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ద్రోణి ఒకటి పశ్చిమ విదర్భ, దాని సమీపంలోని మధ్య మహారాష్ట్ర ప్రాంతంలోని అల్పపీడన కేంద్రం నుంచి దక్షిణ ఛత్తీస్‌గఢ్, ఉత్తర కోస్తా ఆంధ్రా నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు కొనసాగుతోందని, ఇది సముద్ర మట్టం నుంచి సగటున 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉందని వివరించింది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ వివరించింది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయి.

రెండ్రోజుల్లో ముగియనున్న నైరుతి సీజన్

నైరుతి రుతు పవనాల సీజన్ మరో రెండు రోజుల్లో ముగియనుంది. జూన్1వ తేదీ నుంచి సెప్టెంబర్ 30 వరకున్న మధ్య కాలాన్ని నైరుతి రుతు పవనాల సీజన్‌గా పరిగణిస్తారు. ప్రస్తుతం నైరుతి రుతు పవనాల ఉపసంహరణ ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఇప్పటికే పలు ఉత్తరాది రాష్ట్రాల నుంచి నైరుతి రుతు పవనాల ఉపసంహరణ పూర్తి కాగా, వచ్చేనెల రెండో వారం చివరి నాటికి భారత భూభాగం నుంచి పూర్తిగా తిరోగమిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈసారి నైరుతి రుతు పవనాల సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురిశాయి. తొలి అర్ధభాగం తీవ్ర వర్షాభావ పరిస్థితులు నమోదైనా, ఆ తర్వాత రుతు పవనాల కదలికలు అత్యంత చురుగ్గా ఉండడంతో వానలు జోరందుకున్నాయి. నైరుతి సీజన్‌లో రాష్ట్రంలో సగటున 74.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటికే 98.48 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సాధారణ వర్షపాతం కంటే దాదాపు 35 శాతం అధిక వర్షపాతం నమోదైంది. మరో రెండు రోజుల్లో రాష్ట్రంలో కురిసే వర్షాలతో సీజన్ వర్షపాతం 100 సెంటీమీటర్లు దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సీజన్‌లో రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా, 18 జిల్లాల్లో అధిక వర్షపాతం, ఏడు జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా పరిశీలిస్తే... 147 మండలాల్లో అత్యధిక వర్షపాతం, 291 మండలాల్లో అధిక వర్షపాతం, 181 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. 2 మండలాల్లో లోటు వర్షపాతం ఉన్నట్టు వాతావరణ శాఖ వెల్లడించింది.

దేశంలోనే మోడల్ విలేజ్ కొండారెడ్డిపల్లి

మంత్రి దామోదర రాజనర్సింహ



పనులు ప్రారంభిస్తున్న జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి

సాక్షి, నాగర్‌కర్నూల్: ఇంటింటా సోలార్ విద్యుత్ వెలుగులతో దేశంలోనే మోడల్ విలేజ్‌గా సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి నిలుస్తోందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో కలిసి ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లిలో ఇంటింటా సోలార్ విద్యుత్‌తో పాటు గ్రామంలో రూ.134 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి ఉచిత సోలార్ విద్యుత్ సౌకర్యం ఏర్పాటుతో కొండారెడ్డిపల్లి గ్రామం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించడంలో భాగంగా ఉచిత సోలార్ విద్యుత్ సదుపాయం ఏర్పాటుకు కొండారెడ్డిపల్లిని పైలట్ ప్రాజెక్టుగా ఎంపికచేసినట్టు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో తమ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేరుస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ఇళ్లను నిర్మించి ఇస్తామన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, రాష్ట్ర డెయిరీ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్తి సౌర విద్యుత్ గ్రామంగా కొండారెడ్డిపల్లి

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిని పూర్తి సౌర విద్యుత్ గ్రామంగా తీర్చి దిద్దారు. తెలంగాణ రాష్ట్ర సంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీరెడ్కో) నేతృత్వంలో ఈ ప్రాజెక్టును చేపట్టారు. దీనితో కొండారెడ్డిపల్లి దేశంలోనే రెండో సౌర విద్యుత్ గ్రామంగా, దక్షిణ భారత దేశంలో మొదటి గ్రామంగా గుర్తింపు సాధించింది. రూ. 10.53 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. దీనికింద మొత్తం 514 ఇండ్లతో పాటు 11 ప్రభుత్వ భవనాలకు సౌర విద్యుత్ సదు పాయాన్ని కల్పిస్తున్నారు. తొలుత ప్రతి ఇంటికి 3 కేవీ స్థాపిత సామర్థ్యంతో 480 ఇండ్లకు సౌర విద్యుత్ వసతిని కల్పించారు. అలాగే 60 కేవీ సామర్థ్యంతో 11 ప్రభుత్వ భవనాలకు సౌర విద్యుత్ పరికరాలు బిగించారు. మొత్తం సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 1,500 కేవీ వరకూ ఉంటుంది.

రెయిన్‌బో అథ్లెటిక్ హార్ట్ క్లినిక్‌ప్రారంభం



రెయిన్‌బో అథ్లెటిక్ హార్ట్ క్లినిక్ ప్రారంభోత్సవంలో భారత బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ దినేష్ చిర్ల తదితరులు

సాక్షి, హైదరాబాద్: వరల్డ్ హార్ట్‌డేను పురస్కరించుకొని రెయిన్‌బో చిల్డ్రన్స్ హార్ట్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ‘రెయిన్‌బో అథ్లెటిక్ హార్ట్ క్లినిక్’ ప్రారంభమైంది. దీనిని ఆదివారం భారత బ్యాడ్మింటన్ కోచ్ గోపీచంద్ పుల్లెల ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ డైరెక్టర్ డా. దినేష్ చిర్ల మాట్లాడుతూ పిల్లలు చురుకైన జీవనశైలిని కొనసాగించేందుకు అత్యున్నత రోగ నిర్ధారణ, నివారణ సేవలను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. జాతీయ ఉత్తమ బాలనటి పురస్కార గ్రహీత సుకృతివేణి బండ్రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల గుండె ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు, సమతుల్య ఆహారం, చురుకైన ఆటలు దీర్ఘకాలిక ఆరోగ్యానికి కీలకమని చెప్పారు. క్రీడాకారుల పిల్లల కోసం అత్యాధునిక గుండె సంరక్షణ సేవలను అందించడానికి ఈ ప్రత్యేక సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ప్యూర్ లిటిల్ హార్ట్స్ (పీఎల్‌హెచ్‌ఎఫ్) ఫౌండేషన్ 500 మంది పిల్లలకు ప్రాణరక్షక గుండె చికిత్సలు అందించిన సేవలను గోపీచంద్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీఎల్‌హెచ్‌ఎఫ్ ఇంపాక్ట్, ఇన్‌సైట్స్ డాక్యుమెంట్ విడుదల చేయగా, కార్డియోపల్మనరీ ఎక్సర్‌సైజ్ టెస్టింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. పిల్లలు, తల్లిదండ్రులు, వైద్యులు, దాతలతో సహా 150 మంది హాజరై, గుండె ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో లారస్ ల్యాబ్స్ సీఈఓ చావా సత్యనారాయణ, ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ యుగంధర్ మేక, యూనివర్సిటీ ఆఫ్ కొలంబో (శ్రీలంక) స్పోర్ట్స్ అండ్ ఎక్సర్‌సైజ్ మెడిసిన్ ప్రొఫెసర్ డా. చతురంగ రణసింగే పాల్గొన్నారు.

4,500 ఏళ్ల నాటి ఆభరణం

తుర్కియేలో తవ్వకాల్లో దొరికింది



ఇస్తాంబుల్: తుర్కియే(టర్కీ)లో వేలాది సంవత్సరాల క్రితం నాటి అరుదైన బంగారు ఆభరణం, విలువైన పచ్చరాయి(జేడ్) తవ్వకాల్లో బయటపడ్డాయి. ప్రాచీన నగరం 'ట్రోయ్'లో పురావస్తు పరిశోధకులు తవ్వకాలు సాగిస్తుండగా, ఇవి బహిర్గతమయ్యాయి. గత శతాబ్ద కాలంలో తవ్వకాల్లో వెలుగు చూసిన అత్యంత విలువైన నిధి ఇదేనని అంచనా వేస్తున్నారు. ఈ రెండు వస్తువులు ప్రపంచ పరిశోధకుల దృష్టిని ఆకర్శిస్తున్నాయి. 'ట్రోయ్'లో గత 160 ఏళ్లుగా తవ్వకాలు జరుగుతుండడం విశేషం. తాజాగా బయటపడిన బంగారు ఆభరణం క్రీస్తుపూర్వం 2,500 ఏళ్ల నాటిదని, కంచు యుగంలో అప్పటి ప్రజలు ఛాతీపై ధరించి ఉంటారని పరిశోధకులు చెబుతున్నారు. ఇది ఒక తీగకు అతికించిన నాలుగు వలయాల ఆకారంలో ఉంది. ఈ ఆభరణం 4,500 ఏళ్ల క్రితం నాటిది కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అప్పట్లో బంగారం వినియోగం అధికంగానే ఉన్నట్లు తెలుస్తోంది.



ట్రోయ్‌లో జరిగిన తవ్వకాల్లో ఆ ఆభరణంతోపాటు ఒక లోహపు పిన్ను, పచ్చరాయి కూడా బయటపడ్డాయి. ఈ రాయి కూడా 4,500 సంవత్సరాల క్రితం నాటిదని గుర్తించినట్లు తుర్కియే పర్యాటక శాఖ మంత్రి మెహ్‌మెట్ నూరీ ఎర్సో చెప్పారు. దీన్ని ఆ కాలంలో అత్యంత విలాసవంతమైన వస్తువుగా భావించేవారని, ధనవంతులు ఉంగరంలాగా ధరించేవారని పేర్కొన్నారు. తవ్వకాల్లో దొరికిన విలువైన ఈ నిధిని ట్రోయ్ మ్యూజియంలో ప్రదర్శిస్తామని, ప్రజలు తిలకించవచ్చని చెప్పారు. ప్రస్తుత వీటి విలువ తేల్చే పనిలో నిపుణులు నిమగ్నమయ్యారు. ట్రోయ్ నగరానికి ఘనమైన చరిత్రే ఉంది. కంచు యుగంలో ఇక్కడ వ్యాపారం బాగా జరిగేది. విదేశాల నుంచి వర్తకులు వచ్చేవారు. విలువైన వస్తువుల క్రయవిక్రయాలు జోరుగా సాగేవి. ట్రోయ్ భూగర్భంలో అత్యంత విలువైన నిధి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

ఆకాశయానానికి మహా బ్రిడ్జి

ప్రపంచంలోనే ఎత్తయిన వంతెనగా రికార్డు



బీజింగ్: ఇంజనీరింగ్, నిర్మాణ రంగాల్లో అద్భుతాలు సృష్టించడంలో డ్రాగన్ దేశం చైనా ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుంది. ఇప్పుడు మరో అద్భుతాన్ని ఆవిష్కరించింది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన వంతెనను ఆదివారం అధికారికంగా ప్రారంభించింది. వాహనాల రాకపోకలు మొదలయ్యాయి. నైరుతి చైనాలోని గిజౌ ప్రావిన్స్‌లో 'హుజియాంగ్ గ్రాండ్ కెన్యాన్ బ్రిడ్జి' పేరిట ఈ భారీ వంతెన నిర్మించారు. ఈ బ్రిడ్జి ఎత్తు 625 మీటర్లు. అంటే ప్రపంచ ప్రఖ్యాత ఈఫిల్ టవర్ కంటే రెండు రెట్లు ఎక్కువ. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన వంతెనగా హుజియాంగ్ బ్రిడ్జి రికార్డుకెక్కింది. మొత్తం పొడవు 2,890 మీటర్లు. రెండు ఆధార స్తంభాల మధ్య(స్పాన్) వంతెన పొడవు 1,420 మీటర్లు. ప్రపంచంలోనే అత్యంత పొడవైన స్పాన్ బ్రిడ్జిగా మరో రికార్డు సృష్టించింది. కొండ ప్రాంతంలో దీన్ని నిర్మించారు. 2022లో నిర్మాణ పనులు మొదలయ్యా యి. మూడేళ్లలోనే పూర్తయ్యాయి. ఇదొక ఇంజనీరింగ్ అద్భుతం అని నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. నిర్మాణంలో ఇంటెలిజెంట్ కేబుల్ హోస్టింగ్ సిస్టమ్‌తోపాటు 2,000 ఎంపీకే హై–స్ట్రెంత్ స్టీల్ వైర్ ఉపయోగించారు. ఈ మహా వంతెనకు 21 పేటెంట్లు దక్కడం గమనార్హం. మారుమూల ప్రాంతంలో ఇది అందుబాటులోకి రావడంతో ఇతర ప్రాంతాలతో అనుసంధానం పెరుగుతుందని, స్థానికంగా అభివృద్ధి వేగం పుంజుకుంటుందని, నూతన ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పులు రాబోతున్నాయని, అధికారులు చెప్పారు. వంతెన ప్రారంభోత్సవానికి వేలాది మంది జనం హాజరయ్యారు. సంబరాల్లో మునిగిపోయారు. పరస్పరం తమ ఆనందం పంచుకున్నారు. ప్రపంచంలోనే ఎత్తయిన బ్రిడ్జి తమ ప్రాంతంలో అందుబాటులోకి రావడం చాలా గర్వంగా ఉందని చెప్పారు. నాటు పడవలపై ప్రయాణించే అగత్యం ఇక తప్పిపోయిందని, కొత్త వంతెనపై రయ్‌రయ్ అంటూ దూసుకెళ్తామని అన్నారు.


మాజీ ప్రధాని ఓలి పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకోండి

కమిషన్ సిఫారసు

కఠ్మాండు: పదవీచ్యుత ప్రధాని కేపీ శర్మ ఓలిసహా నలుగురి పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకోవాలని జ్యుడీషియల్ కమిషన్ నేపాల్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ నెలారంభంలో నేపాల్‌లో జరిగిన జెన్ జడ్ ఆందోళనలను అప్పటి కేపీ శర్మ ఓలి ప్రభుత్వం అణచివేసేందుకు తీసుకున్న చర్యలపై దర్యాప్తునకు ఉన్నతస్థాయి జ్యుడీషియల్ కమిటీ ఏర్పాటవడం తెల్సిందే. ఓలితోపాటు మాజీ హోం మంత్రి రమేశ్ లేఖక్, మాజీ హోం శాఖ కార్యదర్శి గోకర్ణ మణి దువాడి, జాతీయ దర్యాప్తు శాఖ మాజీ చీఫ్ హుతరాజ్ థాప, కఠ్మాండు జిల్లా మాజీ అధికారి ఛాబి రిజాల్‌లు ఇతర దేశాలకు వెళ్లాలనుకుంటే ముందుగా ప్రభుత్వం నుంచి అనుమతి పొందాలని కూడా కమిషన్ పేర్కొంది. దర్యాప్తు సజావుగా సాగేందుకు ఇదెంతో అవసరమని కమిటీ సభ్యుడు బిగ్యాన్ రాజ్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. జెన్ జడ్ ఆందోళన కారులపై కాల్పులకు తాను ఆదేశించ లేదంటూ ఓలి ఖండించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ నెల 8వ తేదీన జరిగిన కాల్పుల్లో 19 మంది చనిపోవడం తెల్సిందే.

కాల్పుల విరమణ కుదరదు

- మావోయిస్టులు ఆయుధాలు వదిలేసి లొంగిపోవాలి
- ఆయుధాలు వదిలేస్తే ఒక తూటా కూడా పేల్చం
- లొంగిపోయే వారికి రెడ్ కార్పెట్ స్వాగతం పలుకుతాం
- అమిత్ షా స్పష్టీకరణ



న్యూఢిల్లీ: మావోయిస్టులతో కాల్పుల విరమణ ప్రతిపాదనను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తిరస్కరించారు. వారిపై దాడుల ఆపే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్'ను నిలిపివేయాలని, కాల్పుల విరమణకు తాము సిద్ధంగా ఉన్నామని మావోయిస్టులు 15 రోజుల క్రితం ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. దీనిపై అమిత్ షా ప్రతిస్పందించారు. వారు ఆయుధాలు వదిలేసి లొంగిపోతామంటే కచ్చితంగా స్వాగతిస్తామని అన్నారు. ఆయుధాలు విడిచిపెట్టిన వారిపై భద్రతా బలగాలు ఒక్క తూటా కూడా పేల్చబోవని స్పష్టం చేశారు. మావోయిస్టుల ప్రతిపాదనపై అమిత్ షా మాట్లాడడం ఇదే మొదటిసారి. ఆదివారం జరిగిన 'నక్సల్ ముక్త్ భారత్' సదస్సులో అమిత్ షా ప్రసంగించారు. ఆయుధం చేతపట్టిన తీవ్రవాదులపై కాల్పులు ఆపాలన్న ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టంచేశారు. కాల్పుల విరమణ ఉండదని అన్నారు. నిజంగా లొంగిపోవాలని కోరుకుంటే కాల్పుల విరమణతో సంబంధం లేదని సూచించారు. ఇటీవలి కాలంలో మావోయిస్టుల పేరుతో రకరకాల లేఖలు విడుదల చేస్తూ ప్రజలను గందరగోళ పరుస్తున్నారని ఆక్షేపించారు. కాల్పుల విరమణతో సంబంధం లేకుండా లొంగిపోవచ్చని పేర్కొన్నారు. లొంగిపోయే మావోయిస్టులకు రెడ్ కార్పెట్‌తో స్వాగతం పలుకుతామని, ఆకర్శణీయమైన పునరావాస ప్యాకేజీ ఇస్తామని వెల్లడించారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న రెడ్ టెర్రర్

దేశంలో వామపక్ష తీవ్రవాదానికి కమ్యూనిస్టు పార్టీలు సైద్ధాంతిక మద్దతు ఇస్తున్నాయని అమిత్ షా ఆరోపించారు. ప్రభుత్వాలు దేశ అభివృద్ధిపై దృష్టి పెట్టకపోవడం వల్లే మావోయిస్టులు పుట్టుకొస్తున్నారంటూ కమ్యూనిస్టులు చేస్తున్న వాదనను ఖండించారు. నిజానికి మావోయిస్టుల హింసాకాండ కారణంగానే అభివృద్ధి ఫలాలు దేశంలో కొన్ని ప్రాంతాలకు దశాబ్దాలుగా చేరడం లేదని ఆరోపించారు. అభివృద్ధిని రెడ్ టెర్రర్ అడ్డుకుంటోందని మండిపడ్డారు. నక్సలైట్లు హత్యలు చేయకుండా, హింసకు పాల్పడకుండా కఠిన చర్యలు తీసుకుంటే నక్సలిజం అంతమవుతుందని కొందరు చెబుతున్నారని, అందులో ఎంతమాత్రం వాస్తవం లేదని ఉద్ఘాటించారు. సమాజంలోని వ్యక్తులు తెరపైకి తీసుకొచ్చిన సిద్ధాంతం వల్లనే నక్సలిజం పెరిగిందని గుర్తుచేశారు.

నక్సల్స్ బాధితుల హక్కుల సంగతేమిటి?

వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ నాటికి నక్సలిజం నుంచి దేశానికి విముక్తి కల్పిస్తామని అమిత్ షా ప్రకటించారు. ఆయుధాలతో అడవుల్లో సంచరిస్తున్న వ్యక్తులకు గిరిజనుల బతుకుల గురించి ఎలాంటి పట్టింపు లేదని ఆక్షేపించారు. దేశ ప్రజలు ఇప్పటికే తిరస్కరించిన వామపక్ష సిద్ధాంతాన్ని బతికించుకోవడానికి మావోయిస్టులు ఆరాటపడుతున్నారని ఎద్దేవా చేశారు. నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్‌ను వెంటనే ఆపాలంటూ సీపీఐ, సీపీఎం లేఖలు రాయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నక్సల్స్ బాధితుల హక్కుల గురించి వీరు ఎందుకు మాట్లాడడం లేదని మండిపడ్డారు. 1960వ దశకం నుంచి వామపక్ష తీవ్రవాదం వల్ల ప్రాణాలు కోల్పోయినవారికి అమిత్ షా నివాళులర్పించారు. పశుపతినాథ్ నుంచి తిరుపతి దాకా అంటూ నక్సలైట్లు జపం చేస్తున్నారని, అది చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని చెప్పారు. జమ్మూకశ్మీర్‌ను కాపాడాలన్న లక్ష్యంతో ఆర్టికల్ 370ని రద్దుచేశామని, ఆ తర్వాత అక్కడ భద్రతా సిబ్బంది మరణాలు 65 శాతం, సాధారణ పౌరుల మరణాలు 77 శాతం తగ్గిపోయాయని అమిత్ షా స్పష్టంచేశారు.

ఢిల్లీలోని 300 స్కూళ్లు, సంస్థలకు బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని 300కు పైగా స్కూళ్లు, సంస్థలతోపాటు పలు విమానాశ్రయాలకు ఆదివారం బాంబు బెదిరింపులు వచ్చాయి. సంబంధిత విభాగాలు, భద్రతా సిబ్బంది అప్రమత్తమై తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లేవని, బెదిరింపులు వట్టివేనని తేల్చారు. ఇంతకుముందు హెచ్చరికలు పంపిన 'Terrorizers111' అనే గ్రూప్ నుంచే తాజా ఈమెయిల్ హెచ్చరికలు వచ్చినట్లు అధికారులు గుర్తించారు. ఆదివారం ఉదయం 6.08 గంటల సమయంలో ఇవి ఢిల్లీలోని విమానాశ్రయంతోపాటు పలు స్కూళ్లు, ఇతర సంస్థలకు అందాయి. 'మీ భవనం చుట్టూ బాంబులు అమర్చాం. 24 గంటల్లోగా స్పందిస్తారా విధ్వంసాన్ని ఎదుర్కొంటారా' అని అందులో ఉంది. ఢిల్లీలోని ద్వారకాలో ఉన్న సీఆర్‌పీఎఫ్ పబ్లిక్ స్కూల్, కుతుబ్ మినార్ వద్దనున్న సర్వోదయ విద్యాలయకు ఇలాంటి బెదిరింపే అందిందని పోలీసులు తెలిపారు. ఇటీవల కాలంలో ఢిల్లీలోని పలు సంస్థలకు బాంబు హెచ్చరికలు అందుతుండటం, అవన్నీ వట్టిదేనని అధికారులు సోదాల అనంతరం ప్రకటిస్తుండటం తెల్సిందే.



పండుగలకు స్వదేశీ శోభ

- దసరా, దీపావళికి స్వదేశీ ఉత్పత్తులే కొనుగోలు చేయండి
- గాంధీ జయంతి రోజు ఖాదీ వస్త్రాలు ధరించండి
- 'మన్ కీ బాత్'లో ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

సాక్షి, న్యూఢిల్లీ: స్వదేశీ ఉత్పత్తులతో పండుగలకు కొత్త శోభ తీసుకురావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. స్వదేశీ స్ఫూర్తితో యువత ముందడుగు వేయాలని, స్థానిక ఉత్పత్తులనే కొనుగోలు చేసి 'వోకల్ ఫర్ లోకల్' ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. ఆదివారం 'మన్ కీ బాత్' 126వ ఎపిసోడ్‌లో ప్రధాని మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి రేడియోలో ప్రసంగించారు. రానున్న పండుగల వేళ స్వదేశీ వస్తువులనే ఉపయోగించుకోవాలని సూచించారు. స్వాతంత్య్ర సమరయోధుడు షహీద్ భగత్ సింగ్, గానకోకిల లతా మంగేష్కర్‌లకు వారి జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు. అలాగే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) సేవలను ప్రధానమంత్రి కొనియాడారు. మోదీ ప్రసంగం ఆయన మాటల్లోనే...

'వోకల్ ఫర్ లోకల్'కు పెద్దపీట

అన్ని రంగాల్లో మనం స్వయం సమృద్ధి సాధించాలి. ఆత్మనిర్భరతే మన మంత్రం. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క ఖాదీ ఉత్పత్తి అయినా కొనుగోలు చేసి ధరించాలి. ఇది స్వదేశీ ఉత్పత్తి అని ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పుకోవాలి. గత 11 ఏళ్లలో ఖాదీ ఉత్పత్తుల అమ్మకాలు గణనీయంగా పెరగడం మన ఆత్మనిర్భరతకు నిదర్శనం. యువ పారిశ్రామికవేత్తలు సంప్రదాయ నైపుణ్యాలకు ఆధునికతను జోడించి అద్భుతాలు సృష్టిస్తున్నారు.

ఛట్ మహాపర్వ్‌కు అంతర్జాతీయ గుర్తింపు!


రాబోయే ఛట్ పూజ, విజయదశమి, దీపావళి పండుగల సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. కోల్‌కతా దుర్గా పూజ మాదిరిగా ఛట్ మహాపర్వ్‌ను కూడా యునెస్కో సాంస్కృతిక వారసత్వ జాబితాలో చేర్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. తద్వారా ఈ పండుగకు అంతర్జాతీయ గుర్తింపు లభించనుంది. పండుగల సమయంలో ప్రతి ఒక్కరూ కేవలం స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలి. తద్వారా స్థానిక చేతివృత్తుల వారికి, పారిశ్రామికవేత్తలకు చేయూతనివ్వాలి.

భగత్‌సింగ్, లతా మంగేష్కర్‌కు నివాళులు

ఈ రోజు ఇద్దరు గొప్ప వ్యక్తుల జయంతి. ఒకరు షహీద్ భగత్ సింగ్, మరొకరు మనందరి ప్రియమైన లతా దీదీ. భగత్ సింగ్ గుండెనిబ్బరం, ధైర్య సాహసాలు, దేశభక్తి మన యువతకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమే. ఉరిశిక్షకు ముందు కూడా తనను, తన సహచరులను యుద్ధ ఖైదీలుగా పరిగణించి, తుపాకీతో కాల్చి చంపాలని బ్రిటిష్ వారికి లేఖ రాయడం భగత్‌సింగ్ అకుంఠిత ధైర్యానికి నిదర్శనం. లతా మంగేష్కర్ పాటలు భారతీయ సంస్కృతి, సంగీతానికి జీవనాడి. దేశభక్తి గీతాలతో ప్రజల్లో ఆమె ఎంతో స్ఫూర్తిని రగిలించారు.

సంఘ్ వందేళ్ల ప్రయాణం స్ఫూర్తిదాయకం

రానున్న విజయదశమి నాటికి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్)ను స్థాపించి 100 ఏళ్లు



పూర్తి కానుండడం చాలా ప్రత్యేకం. నిస్వార్థ సేవ, క్రమశిక్షణ సంఘ్ అసలైన బలాలు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలకు దేశమే ప్రథమం. దేశ సేవకే వారు తొలి ప్రాధాన్యం ఇస్తారు. సంఘ్ వందేళ్ల ప్రయాణం నిజంగా స్ఫూర్తిదాయకం'' అని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు.

సాహస నారీమణుల సముద్ర యానం

భారత నౌకాదళానికి చెందిన ఇద్దరు సాహస మహిళా ఆఫీసర్లతో ప్రధానమంత్రి ఫోన్‌లో మాట్లాడారు. లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా, లెఫ్టినెంట్ కమాండర్ రూప.. వీరిద్దరూ తెరచాప పడవపై సముద్రంలో ఎనిమిది నెలల పాటు ఏకధాటిగా 47,500 కిలోమీటర్లు ప్రయాణించి ప్రపంచాన్ని చుట్టివచ్చారు. 'నావిక సాగర్ పరిక్రమ' యాత్రను విజయవంతంగా పూర్తిచేశారు. ''ఈ యాత్ర మా జీవితాలను మార్చేసింది. 238 రోజుల పాటు మేమిద్దరమే పడవలో ఉన్నాం. మూడు అంతస్తుల భవనం అంత ఎత్తున ఎగసిపడే అలలను, అంటార్కిటికా వద్ద 1 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రతను, గంటకు 90 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులను తట్టుకున్నాం'' అని వారు తమ అనుభవాలను మన్ కీ బాత్ ద్వారా దేశ ప్రజలతో పంచుకున్నారు. వారి సాహసాన్ని, టీమ్‌వర్క్‌ను ప్రధానమంత్రి అభినందించారు.

కీవ్‌పై రష్యా భీకర దాడి

595 డ్రోన్లు, 48 క్షిపణులతో విధ్వంసం • నలుగురు మృతి, 42 మందికి గాయాలు

కీవ్: ఉక్రెయిన్ రాజధాని కీవ్ లక్ష్యంగా రష్యా మరోసారి పెద్ద సంఖ్యలో క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కొనసాగిన దాడుల్లో భారీ నష్టం వాటిల్లింది. కీవ్‌తోపాటు జపోరిఝియా ప్రాంతాల్లో జరిగిన విధ్వంసంతో 12 ఏళ్ల బాలిక సహా నలుగురు చనిపోగా, 42 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఈ దాడిని పౌరులపై జరుగుతున్న యుద్ధంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అభివర్ణించారు. రష్యా గత నెలలో కీవ్‌పై చేపట్టిన భారీ దాడిలో కనీసం 21 మంది మృత్యువాత పడ్డారు. ఆ తర్వాత జరిగిన మొదటి భారీ దాడి ఇది. తాజా దాడిలో రష్యా 595 డ్రోన్లు, 48 బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులను ప్రయోగించినట్లు ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది. వీటిలో చాలా వరకు డ్రోన్లను, 43 క్షిపణులను మధ్యలోనే అడ్డుకున్నామంది. రాజధానిలోని సిటీ సెంటర్ సమీపంలో సంభవించిన భారీ పేలుడుతో దట్టమైన పొగలు ఆ ప్రాంతాన్నంతా కమ్మేశాయి. పలు నివాస భవనాలు, మౌలిక వసతులు, మెడికల్ ఫెసిలిటీ, కిండర్‌గార్టెన్ దెబ్బతిన్నాయి. డ్రోన్ల దాడిలో బహుళ అంతస్తుల నివాస భవనం ఒకటి తీవ్రంగా దెబ్బతింది. పై అంతస్తుల్లో మంటలు చెలరేగగా, కిటికీల అద్దాలు ధ్వంసమయ్యాయి. ఎక్కడ చూసినా శిథిలాలే కనిపించాయి. ఫైర్ ఫైటర్లు, అత్యవసర సేవల సిబ్బంది ఎలక్ట్రిక్ రంపాలతో శిథిలాలను తొలగించారు. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు కమ్ముకోవడంతో, జనం భయకంపితులయ్యారు. రాజధాని వ్యాప్తంగా 20కుపైగా ప్రాంతాల్లో నష్టం వాటిల్లింది. సైరన్ల మోతలతో జనం కీవ్‌లోని సెంట్రల్ రైల్వే స్టేషన్‌లోకి పరుగున చేరుకున్నారు. హెచ్చరికలు నిలిచాక బయటకు వచ్చారు. ఇలా ఉండగా, ఉక్రెయిన్‌పై రష్యా దాడుల నేపథ్యంలో ఆదివారం వేకువజామున పొరుగునున్న పోలండ్ తన సైన్యాన్ని అప్రమత్తం చేసి, యుద్ధ విమానాలను సరిహద్దుల్లో మోహరించి ఉంచింది. ముందు జాగ్రత్తగా ఈ మేరకు రక్షణ చర్యలు చేపట్టామని పోలండ్ మిలటరీ పేర్కొంది. కీవ్‌పై చేపట్టిన దాడుల గురించి రష్యా రక్షణ శాఖ స్పందించలేదు. కానీ, శనివారం రాత్రి నుంచి ఉక్రెయిన్ ఆర్మీ ప్రయోగించిన 41 డ్రోన్లను తమ గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయని రష్యా తెలిపింది. అమెరికాతో భారీ ఆయుధ కొనుగోలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ శనివారం ప్రకటించిన నేపథ్యంలో ఈ దాడులు జరపడం గమనార్హం. ఈ ప్యాకేజీలో అమెరికా నుంచి ఉక్రెయిన్ 90 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను కొనుగోలు చేయడం, ఉక్రెయిన్ తయారీ క్షిపణులను అమెరికా నేరుగా కొనుగోలు చేయడం ఉన్నాయి.

భారత్‌ను దారికి తీసుకురావాలి

- మా ఉత్పత్తులకు మీ మార్కెట్లు తెరవాల్సిందే
- అమెరికా వాణిజ్య శాఖ మంత్రి హోవార్డ్ లుట్నిక్ స్పష్టీకరణ



న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సన్నిహితుడు, వాణిజ్య శాఖ మంత్రి హోవార్డ్ లుట్నిక్ ఇండియా, బ్రెజిల్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ రెండు దేశాలను దారికి తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. అమెరికా ప్రయోజనాలను దెబ్బతీసే చర్యలకు దూరంగా ఉండాలని ఇండియా, బ్రెజిల్ దేశాలకు హితవు పలికారు. అమెరికా ఉత్పత్తులకు మార్కెట్లు తెరవాల్సిందేనని బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. బ్రెజిల్, ఇండియా, స్విట్జర్లాండ్, తైవాన్ వంటి దేశాల వ్యవహార శైలి తమకు తీవ్ర అసంతృప్తి కలిగిస్తోందని అన్నారు. అమెరికా పట్ల నిజంగా స్నేహపూర్వకంగా ఉండాలనుకుంటే సరిగ్గా ప్రతిస్పందించాలని స్పష్టంచేశారు. అమెరికా ప్రయోజనాలను దెబ్బతీసేలా పని చేస్తుండడం వల్లనే ఇండియా వంటి దేశాలతో తాము కఠినంగా ఉండాల్సి వస్తోందని లుట్నిక్ తేల్చిచెప్పారు. ''మీ ఉత్పత్తులు అమెరికన్లకు విక్రయించుకోవాలని కోరుకుంటే మా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడుకోండి. సంధి చేసుకోండి'' అని సూచించారు. ఇండియా సహా పలుదేశాలతో వాణిజ్య చర్చలు చురుగ్గా ముందుకు సాగడం లేదని తెలిపారు. ఆయా దేశాల మొండి పట్టుదల వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఆక్షేపించారు. వివాదాలను త్వరలో పరిష్కరించుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అమెరికా

రష్యా నుంచి ముడి చమురు కొంటున్నందుకు భారత ఉత్పత్తులపై ట్రంప్ ప్రభుత్వం 50 శాతం టారిఫ్‌లు విధించిన సంగతి తెలిసిందే. రష్యా నుంచి కొనుగోళ్లు ఆపాలని అమెరికా డిమాండ్ చేస్తోంది. భారత్ అందుకు అంగీకరించడం లేదు. తమ అవసరాల కోసమే రష్యా నుంచి చమురు కొంటున్నామని, ఇందులో దురుద్దేశం ఏమీ లేదని చెబుతోంది. భారత్ వాదనను అమెరికా నమ్మడం లేదు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి మీరే నిధులు ఇస్తున్నారంటూ మండిపడుతోంది. మరోవైపు భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అమెరికా కావడం గమనార్హం. 2024–25లో రెండు దేశాల మధ్య 131.84 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరిగింది. ఇందులో 86.5 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను అమెరికాకు భారత్ ఎగుమతి చేసింది.

అమెరికా చర్చిలో కాల్పులు ఒకరు మృతి 9 మందికి గాయాలు

మిషిగన్: అమెరికాలోని మిషిగాన్ రాష్ట్రం గ్రాంట్‌బ్లాంక్‌లోని ఓ చర్చిలో కాల్పుల ఘటన చోటుచేసుకుంది. స్థానిక మొర్మోన్ చర్చిలో ప్రార్థనలు జరుగుతున్న సమయంలో గుర్తు తెలియని దుండగుడు(40) తన వాహనంతో చర్చిలోకి దూసుకొచ్చాడు. వచ్చీ రావడంతోనే అసాల్ట్ రైఫిల్‌తో కాల్పులకు దిగాడు. కాల్పుల్లో కనీసం 9 మంది గాయపడ్డారు. వెంటనే స్పందించిన పోలీసులు అతడిని కాల్చి చంపారు. కాల్పుల తీవ్రతకు చర్చి ముందు గోడ బీటలు వారింది. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని చెబుతున్నారు. పోలీసుల కాల్పుల్లో బర్టన్‌కు చెందినట్లుగా భావిస్తున్న దుండగుడు చనిపోయాడని, ఆ ప్రాంత ప్రజలకు ఎలాంటి ముప్పు లేదని జెనెసీ కౌంటీ షరీఫ్ కార్యాలయం తెలిపింది. కాల్పులతో చర్చిలో మంటలు వ్యాపించాయని, వాటిని వెంటనే అదుపులోకి తెచ్చామని పేర్కొంది. కాల్పుల ఘటనకు కారణాలు తెలియాల్సి ఉంది.

ఢిల్లీ బాబా ఆగ్రాలో అరెస్ట్

- చైతన్యానంద సరస్వతిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 17 మంది విద్యార్థినులను లైంగికంగా వేధించినట్లు ఆరోపణలు

న్యూఢిల్లీ/ఆగ్రా: ఢిల్లీలోని ఓ ప్రైవేట్ సంస్థకు చెందిన 17 మంది విద్యార్థినులను వేధించిన ఆరోపణలను ఎదుర్కొంటున్న బాబా చైతన్యానంద సరస్వతి(62) జాడను ఢిల్లీ పోలీసులు ఎట్టకేలకు కనిపెట్టారు. ఆగ్రాలోని ఓ హోటల్‌లో బస చేసిన అతడిని ఆదివారం వేకువజామున అరెస్ట్ చేశారు. అతడి నుంచి ఒక ఐపాడ్, మూడు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక ఫోన్‌లో ఢిల్లీలోని విద్యాసంస్థ క్యాంపస్, హాస్టల్‌లోని సీసీటీవీ ఫుటేజీని యాక్సెస్ చేసే సౌకర్యం ఉండటం గమనార్హం. ఈ ఫోన్ ద్వారానే విద్యార్థినుల కదలికలను చైతన్యానంద గమనించేవాడని పోలీసులు తెలిపారు. ప్రధానమంత్రి కార్యాలయంలో తనకు పరిచయస్తులున్నారని చెప్పుకుంటూ చైతన్యానంద, అతడి శిష్యులు అరెస్టుల నుంచి తప్పించుకుంటున్నారని పోలీసు ఉన్నతాధికారులు వివరించారు. కేసు నమోదు కావడంతో అరెస్ట్ భయంతో ఆగస్టు 4వ తేదీన ఢిల్లీని దొంగచాటుగా వదిలిన చైతన్యానంద, ఇతడి శిష్యులు పోలీసుల కళ్లలో పడకుండా ట్యాక్సీల్లో ప్రయాణిస్తూ, చౌక హోటళ్లలో బస చేస్తూ బృందావన్, ఆగ్రా, మథుర తదితర ప్రాంతాల్లో తిరుగుతున్నారన్నారు. చైతన్యానంద వద్ద ఐక్యరాజ్యసమితి రాయబారిని, బ్రిక్స్ కమిషన్ సభ్యుడని చెప్పుకుంటూ ముద్రించిన రకరకాల నకిలీ విజిటింగ్ కార్డులు ఇతడి వద్ద స్వాధీనం చేసుకున్నారు. ఆగ్రా హోటల్‌లో ఈ నెల 27వ తేదీన సాయంత్రం 4 గంటలకు పార్థసారథి అనే పేరుతో చైతన్యానంద గది తీసుకున్నాడన్నారు. వేర్వేరు పేర్లతో ఇతడు తీసుకున్న రూ.8 కోట్ల బ్యాంకు అకౌంట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లను పోలీసులు స్తంభింపజేశారు. ఢిల్లీలోని మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌కు గతంలో చైర్మన్‌గా ఉన్న చైతన్యానంద మహిళా విద్యార్థినులను రాత్రి వేళ గత క్వార్టర్‌కు పిలిపించుకునే వాడు. రాత్రిళ్లు వారికి అసభ్యకర సందేశాలను పంపించేవాడు. తన ఫోన్‌లో వారి కదలికలను గమనించేవాడు. కేసు నమోదైనట్లు తెలిసిన తర్వాత బ్యాంకు నుంచి రూ.50 లక్షలను విత్‌డ్రా చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది.

ఐదు రోజుల పోలీస్ కస్టడీ

చైతన్యానంద సరస్వతిని ఢిల్లీ కోర్టు ఆదివారం ఐదు రోజుల పోలీసు కస్టడీకి అనుమతించింది. చైతన్యానంద పలువురు విద్యార్థినులను వేధించాడని, తన కోరిక తీర్చాలని ఒత్తిడి చేసేవాడని పలువురు బాధితులకు పోలీసులకిచ్చిన వాంగ్మూలంలో ఆరోపించారు. విద్యార్థినుల బాత్‌రూంలలోనూ ఇతడు సీసీటీవీ కెమెరాలను అమర్చాడని బాధితుల తరఫు లాయర్లు ఆరోపించారు. సుమారు 16 మంది పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇతడి బారిన 16 నుంచి 20 మంది విద్యార్థినులు పడ్డారన్నారు. వీరందరి స్టేట్‌మెంట్లు పోలీసులు రికార్డు చేశారని తెలిపారు. పోలీసుల విచారణకు సహకరించడం లేదని, ఐపాడ్, ఐక్లౌడ్ పాస్‌వర్డులను వెల్లడించడం లేదని ఆరోపించారు. అయితే, పోలీసులు తనను వేధించేందుకే కస్టడీ కోరుతున్నారని, నిజంగా తనతో ప్రమాదముంటే జ్యుడీషియల్ కస్టడీకి పంపించాలని చైతన్యానంద తరఫు లాయర్ వాదించారు. వాదనలు విన్న డ్యూటీ మేజిస్ట్రేట్ రవి ఐదు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేశారు.



చైతన్యానంద

సాక్షి హైదరాబాద్

సోమవారం । 29 । సెప్టెంబర్ । 2025



అక్రమాలకు రాచబాట

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో భూదందా యథేచ్ఛగా సాగుతోంది. కంచే చేను మేసిన చందంగా ప్రభుత్వ భూములను అధికారులు, రాజకీయ పెద్దలే కబ్జా చేస్తున్నారు. -8లో



చిత్తూ చిత్తుల బొమ్మ..

చిత్తూ చిత్తుల బొమ్మ.. శివుని ముద్దుల గుమ్మ.. అంటూ సాగే తెలంగాణ బతుకమ్మ పాటలు.. సంస్కృతిని ప్రతిబింబించడంలో ప్రశస్తిని చాటుతూనే ఉన్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 25.0/22.0

నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశముంది. గరిష్ఠంగా 25, కనిష్ఠంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

అబద్ధపు హామీలతో కాంగ్రెస్ మోసం

– బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



టోలిచౌకీ సమతా కాలనీలో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

గోల్కొండ: అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఆదివారం ఆయన షేక్‌పేట్ డివిజన్ టోలిచౌకీ సమతా కాలనీలో కాలనీ బాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రజలకు పంచిపెట్టారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు జ్ఞాపక శక్తి తక్కువ అనే భ్రమలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రి వర్గం ఉందన్నారు. అబద్ధపు హామీలు ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికల రూపంలో తెలంగాణ ప్రజలకు మంచి అవకాశం వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు కోతలు కోస్తున్నారే తప్ప పనులు చేయడం లేదన్నారు. అరచేతిలో స్వర్గం చూపించి ఓట్లు దండుకున్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 700 రోజులు అయినా ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. ఆడబిడ్డలకు ప్రతి నెలా రూ.2,500 ఇస్తామని మొండిచేయి చూపించారని, ఒక్కో ఆడబిడ్డకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.55 వేలు బాకీ పడిందని గుర్తు చేశారు. వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.44 వేల పెన్షన్ బాకీ పడ్డారని, విద్యార్థినులకు స్కూటీ ఇవ్వలేదన్నారు. అందువల్లే తాము కాంగ్రెస్ బాకీ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించామన్నారు. ఫ్యూచర్ సిటీ కడతామని సీఎం రేవంత్ ఓ వైపు చెబుతూ మరోవైపు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. జూబ్లీహిల్స్‌లో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భార్య సునీతను గెలిపించాలని ఆయన కోరారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్, రహీముల్లాఖాన్ నియాజీ, ఆజామ్ అలీ తదితరులున్నారు.

జంట జలాశయాలకు తగ్గిన వరద ఉధృతి



నెమ్మదించిన మూసీ

మణికొండ: ఉస్మాన్‌సాగర్ (గండిపేట), హిమాయత్ సాగర్‌లకు వరద ఉధృతి తగ్గిపోవటంతో గేట్లను తగ్గించారు. దీంతో మూసీ నదిలో నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఆదివారం ఉదయం నుంచి జంట జలాశయాల గేట్లను మూస్తూ వచ్చారు. మధ్యాహ్నం తర్వాత గండిపేట నుంచి 4 గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 920 క్యూసెక్కుల నీటిని మాత్రమే వదిలారు. పూర్తి స్థాయి నీటి మట్టం 1790 అడుగులకు గాను 1789.15అడుగులుగా నీటి మట్టం ఉండగా ఎగువ నుంచి 1300 క్యూసెక్కుల వరద వస్తోందని అధికారులు తెలిపారు. హిమాయత్ సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 1763.50కి గాను ప్రస్తుతం 1762.35 అడుగుల నీరు ఉందని, పై నుంచి 2600 క్యూసెక్కుల వరద వస్తోందన్నారు. రెండు గేట్లను 3 అడుగుల మేర ఎత్తి 1981 క్యూసెక్కుల నీటిని మూసీ నదికి వదులుతున్నామన్నారు.

తెరుచుకున్న రోడ్లు...

శనివారం రాత్రి వరకు మూసీ నదిలో పెద్ద ఎత్తున నీరు రావటంతో నార్సింగిలోని ఔటర్ సర్వీసు రోడ్లతో పాటు నార్సింగి నుంచి మంచిరేవుల గ్రామానికి వెళ్లే రోడ్లను మూసివేసిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం నుంచే గండిపేట గేట్లను తగ్గించటంతో మూసీలో వరద తగ్గిపోయింది. తిరిగి వర్షం కురిసి, వరద వస్తుందనే ఉద్దేశంతో సాయంత్రం వరకు రోడ్లను అలాగే మూసి ఉంచారు. సాయంత్రానికి వర్షం వచ్చే అవకాశం, పరీవాహకం నుంచి చెరువులోకి వరద తగ్గిపోవటంతో నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో మూసిన అన్ని రోడ్లనూ తెరిచి రాకపోకలను పునరుద్ధరించారు.





బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బతుకమ్మలతో బతుకమ్మ కుంట వద్దకు వస్తున్న సీఎం, మేయర్ తదితరులు



నీళ్లలో బతుకమ్మను వదులుతున్న సీఎం

సీఎం సుడిగాలి పర్యటన

పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం నగరంలో పర్యటించారు. శివారు రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట వేదికగా ఎఫ్‌సీడీఏ భవనం సహా రావిర్యాల నుంచి ఆమనగల్ వరకు నిర్మించతలపెట్టిన రేడియల్ రోడ్లకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం నగరంలో వందశాతం మురుగు శుద్ధి కార్యక్రమంలో భాగంగా నిర్మించిన సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)లను ప్రారంభించారు. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ పునరుజ్జీవం కల్పించిన అంబర్‌పేటలోని బతుకమ్మకుంటను ప్రారంభించి నగర ప్రజలకు అంకితం చేశారు. సీఎం వెంట పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి తదితరులు ఉన్నారు.

–సాక్షి, సిటీబ్యూరో

- 6 ఎస్టీపీలను ప్రారంభించిన రేవంత్‌రెడ్డి
- అమృత్ 2.0 కింద మరో 39 ఎస్టీపీలకు శంకుస్థాపన
- బతుకమ్మ కుంటను ప్రజలకు అంకితం చేసిన ముఖ్యమంత్రి

ఎస్టీపీలను పరిశీలించిన సీఎం

- ఆదివారం అంబర్‌పేట మురుగు శుద్ధి కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుమారు రూ.539.23 కోట్లతో నిర్మించిన 332.5 మిలియన్ లీటర్స్‌పర్ డే (ఎంఎల్‌డీ) సామర్థ్యం గల ఆరు ఎస్టీపీలను సీఎం ప్రారంభించారు. మరో పదేళ్లలో నగరంలో మురుగు ఉత్పత్తి 2,815 ఎంఎల్‌డీలకు చేరుతుందని అంచనా వేస్తున్నట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. హైదరాబాద్ అర్బన్ పరిధిలో 1,950 ఎంఎల్‌డీ ఉత్పత్తి అవుతుందని చెప్పారు. ఇందులో జీహెచ్ఎంసీ పరిధిలోనే 1,650 ఎంఎల్‌డీ ఉంటుందని వివరించారు. ఇప్పటికే 37 ఎస్టీపీల ద్వారా 1,444 ఎంఎల్‌డీ మురుగు నీటిని శుద్ధి చేస్తున్నామని, కొత్తగా అందుబాటులో వచ్చిన ఆరు ఎస్టీపీలతో మరో 332 ఎంఎల్‌డీల మురుగును శుద్ధి చేయవచ్చని తెలిపారు. మరోరెండు ఎస్టీపీలు నిర్మాణంలో ఉన్నాయని, అవి పూర్తయితే దాదాపు 1,878 ఎంఎల్‌డీ మురుగు శుద్ధికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అమృత్ 2.0 పథకం కింద 39 ఎస్టీపీల నిర్మాణాలు పూర్తయితే 2,850 ఎంఎల్‌డీ మురుగును శుద్ధి చేసే అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీపీల గురించి ముఖ్యమంత్రికి వివరిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

- కేంద్ర ప్రభుత్వ అమృత్ 2.0 పథకం కింద సుమారు రూ.3,849.10 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న దాదాపు 972 ఎంఎల్‌డీ సామర్థ్యంగల 39 ఎస్టీపీల నిర్మాణానికి కూడా సీఎం శంకుస్థాపన చేశారు. వీటిలో ఒకటి పీపీపీ విధానంలో, మిగిలిన 38 హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) విధానంలో నిర్మించనున్నారు. ప్యాకేజీ–1లో రూ.1,878.55 కోట్లతో దాదాపు 493.50 ఎంఎల్‌డీ సామర్థ్యం గల 16 ఎస్టీపీలు, ప్యాకేజీ–2లో రూ.1,906.44 కోట్లతో 471.5 ఎంఎల్‌డీ సామర్థ్యం గల 22 ఎస్టీపీలు, పటాన్‌చెరులో రూ.64.11 కోట్లతో పీపీపీ మోడ్‌లో 7 ఎంఎల్‌డీ సామర్థ్యం గల ఒక ఎస్టీపీని నిర్మించనున్నారు. గుత్తేదారు సంస్థ ఎస్టీపీలను నిర్మించి 15 ఏళ్లపాటు నిర్వహిస్తుంది. మొత్తం వ్యయంలో ఎస్టీపీల నిర్మాణానికి రూ.2,569.81 కోట్లు, 15 ఏళ్లపాటు నిర్వహణకు రూ.1,279.29 కోట్లు కేటాయించారు. ఈ ప్రాజెక్టు వ్యయంలో కేంద్రం 30 శాతం, రాష్ట్రం 30 శాతం, నిర్మాణ సంస్థ 40 శాతం నిధులు సమకూర్చనున్నాయి.



ఫ్యూచర్ సిటీలో..

ఎస్టీపీలు, సామర్థ్యం, ఖర్చు

ఎస్టీపీ	సామర్థ్యం (ఎంఎల్‌డీ)	ఖర్చు (రూ.కోట్లలో)
అంబర్‌పేట్	212.50	319.43
అత్తాపూర్	64	109.24
ముల్ల కత్వా	25	44.46
శివాలయనగర్	14	34.13
వెన్నెలగడ్డ	10	13
పాలపిట్ట	7	18.97

పల్లెకు చలో..

- సద్దుల వేడుక, దసరా సంబరాలకు వేళాయే..
- సొంతూళ్లకు తరలిన నగర వాసులు
- ఎంజీబీఎస్ నుంచి బస్సుల పునరుద్ధరణ



ఎల్బీ నగర్‌లో ప్రయాణికుల సందడి

సాక్షి, సిటీబ్యూరో: దసరా, సద్దుల బతుకమ్మ వేడుకల కోసం నగరవాసులు ఆదివారం సొంతూళ్లకు భారీగా తరలివెళ్లారు. దీంతో నగరం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే రైళ్లు, బస్సులు, ప్రైవేట్ వాహనాలు ప్రయాణికుల రద్దీతో కిక్కిరిశాయి. ప్రధాన రహదారులు కిలోమీటర్ల కొద్దీ వాహనాలతో స్తంభించాయి. తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో సోమవారమే సద్దుల బతుకమ్మ వేడుకలు జరగనున్న దృష్ట్యా చాలామంది ఆదివారం సొంత ఊరికి పయనమయ్యారు. వరదలు తగ్గుముఖం పట్టడంతో మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ నుంచి ఆర్టీసీ సేవలను పునరుద్ధరించారు.

కిక్కిరిసిన జనరల్ బోగీలు..

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణమధ్య రైల్వే ఈసారి వందకు పైగా ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. సికింద్రాబాద్ స్టేషన్‌లో కొనసాగుతున్న పునరభివృద్ధి పనుల రీత్యా చాలా వరకు చర్లపల్లి, నాంపల్లి, కాచిగూడ, మల్కాజిగిరి, హైటెక్‌సిటీ, లింగంపల్లి, తదితర స్టేషన్‌ల నుంచి రైళ్లను నడుపుతున్నారు. ఆదివారం ప్రయాణికుల రద్దీ కారణంగా చర్లపల్లి, లింగంపల్లి, సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్‌లు కిక్కిరిశాయి. అన్ని రైళ్లలోనూ స్లీపర్, ఏసీ బోగీల్లో బెర్తులు లభించని ప్రయాణికులు సాధారణ బోగీలను ఆశ్రయించారు. సాధారణ బోగీల్లో బయలుదేరే ప్రయాణికులు టికెట్‌ల కోసం పడిగాపులు కాయాల్సిన అవసరం లేకుండా యూటీఎస్ మొబైల్ యాప్ సదుపాయాన్ని స్టేషన్‌లోని వివిధ చోట్ల అందుబాటులో ఉంచినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు.



జూబ్లీ బస్టాండ్‌లో కిక్కిరిసి..

అదనపు చార్జీలు.. అడ్డగోలు వసూళ్లు..

పండగ రద్దీని దృష్టిలో ఆర్టీసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో 25 శాతం నుంచి 50 శాతం వరకు అదనపు చార్జీలను వసూలు చేస్తుండగా ప్రైవేట్ బస్సులు, ఇతర ట్రావెల్స్ వాహనాల్లో అడ్డగోలు వసూళ్లకు పాల్పడడం గమనార్హం. నిర్ణీత చార్జీల కంటే ఎక్కువ చార్జీలు తీసుకొనే ప్రైవేట్ బస్సులపైన కేసులు నమోదు చేయనున్నట్లు జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం.చంద్రశేఖర్ గౌడ్ హెచ్చరించారు.



ఎంజీబీఎస్‌లో..

లీజు చెల్లింపులు ఇక ఈజీ

- ఈఎంఎస్ అప్లికేషన్‌తో ఆన్‌లైన్ ద్వారా..
- జీహెచ్ఎంసీ ఎస్టేట్స్ దుకాణదారులకు ఊరట
- అధికారులకు పర్యవేక్షణ సులభం



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ ఎస్టేట్స్ విభాగానికి నగరంలోని 80కి పైగా ప్రాంతాల్లో షాపింగ్ కాంప్లెక్సులు, మున్సిపల్ మార్కెట్లు, మోడల్ మార్కెట్లు ఉన్నాయి. వీటిలో దాదాపు మూడువేల దుకాణాలున్నాయి. ఇవి కాక లీజుకిచ్చిన భూములు వందకు పైగా ఉన్నాయి. వీటి ద్వారా ఏటా ఎంతో ఆదాయం రావాల్సి ఉన్నప్పటికీ, జీహెచ్ఎంసీ ఖజానాకు రావడం లేదు. అందుకు అనేక కారణాలున్నాయి. ఆయా దుకాణాల్లోని వారు నెలనెలా సరిగ్గా అద్దె చెల్లించకపోవడం ఇందుకు ఒక కారణం కాగా, జీహెచ్ఎంసీ జోనల్ ,సర్కిల్ కార్యాలయాలకు చెందిన సిబ్బంది దుకాణదారుల నుంచి అద్దెలు వసూలు చేస్తున్నప్పటికీ, వాటిని జీహెచ్ఎంసీ ఖజానాలో వేయడం లేదు. వాటిని దారి మళ్లిస్తున్నారు. ఇలా లక్షలాది రూపాయలు దారి మళ్లిన విషయం గతంలో వెలుగు చూసింది.

నిధులు దారి మళ్లకుండా..

- ఈ నేపథ్యంలో ఎస్టేట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎంఎస్)పేరిట జీహెచ్ఎంసీ అందుబాటులోకి తెచ్చిన డిజిటల్ ప్లాట్‌ఫామ్‌తో దుకాణదారులు నేరుగా ఆన్‌లైన్ ద్వారానే తమ అద్దెలు చెల్లించవచ్చు. లీజు భూముల వారు సైతం చెల్లించవచ్చు. తద్వారా నెలనెలా ఏ కాంప్లెక్స్, ఏ మార్కెట్‌లోని ఎన్ని దుకాణాల వారు సరిగ్గా అద్దెలు చెల్లిస్తున్నారో సంబంధిత అధికారులకు తెలుస్తుంది. సక్రమంగా చెల్లించని వారిపై తగిన చర్యలు తీసుకునేందుకు వీలవుతుంది. ముఖ్యంగా, నిధులు దారి మళ్లకుండా జీహెచ్ఎంసీ ఖజానాకే చేరతాయి. అంతేకాదు. పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుంది. ప్రతి దుకాణానికి సంబంధించి ఎంత కాలంగా ఎంత మొత్తం అద్దె బకాయిలున్నాయి.. ఎంత చెల్లించారు.. ఇంకా చెల్లించాల్సింది ఎంత? తదితర వివరాలు రియల్‌టైమ్‌లో కనిపిస్తాయి. ఫీల్డ్‌స్థాయిలోని అధికారి నుంచి ప్రధాన కార్యాలయంలోని ఉన్నతాధికారుల వరకు పర్యవేక్షణకు దోహదపడుతుంది. వీటికి సంబంధించిన మొబైల్ యాప్‌ను ఇటీవలే మేయర్ ప్రారంభించారు. తద్వారా జీహెచ్ఎంసీ ఆస్తులను సమర్థవంతంగా నిర్వహించవచ్చని కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పేర్కొన్నారు.

ఖాళీగానే 954 దుకాణాలు

మూడువేలకు పైగా దుకాణాల్లో 954 దుకాణాలు ఖాళీగానే ఉన్నాయి. వీటిల్లో మున్సిపల్ కాంప్లెక్సుల్లోని దుకాణాలు, మున్సిపల్ మార్కెట్లు, మోడల్ మార్కెట్లలోని దుకాణాలు ఉన్నాయి. వీటిని లీజుకిచ్చే యోచనలో ఉన్న యంత్రాంగం అందుకు ఏర్పాట్లు చేస్తోంది. గత ఆరేడేళ్లుగా ఇవి ఖాళీగానే ఉండటంతో కొన్ని మోడల్ మార్కెట్లను స్కిల్ ట్రెయినింగ్ కోసం ఇప్పటికే ప్రైవేటు సంస్థలకు అప్పగించారు. వాటి పనితీరును బట్టి పొడిగింపునిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈఎంఎస్ ద్వారా వేటి పరిస్థితి ఏమిటో తెలుసుకోవడం ద్వారా ఆదాయం పెంచుకునేందుకు వీలవుతుందంటున్నారు. ఖాళీగా ఉన్నవాటిని లీజులకివ్వడం ద్వారానూ ఆదాయం పెరుగుతుందని చెప్పారు.

ఖాళీగా ఉన్న దుకాణాలు

వేటిలో	ఎన్ని
మున్సిపల్ కాంప్లెక్సులు	105
మున్సిపల్ మార్కెట్లు	481
మోడల్ మార్కెట్లు	368
మొత్తం	954





ఆనందమే.. ఆరోగ్యం..

నగరంలోని పీపుల్స్ ప్లాజా వేదికగా ఆదివారం నిర్వహించిన పింక్ పవర్ రన్ ఉత్సాహాన్ని నింపింది. ఈ మారథాన్‌లో ప్రపంచ సుందరీమణులు, సినీ ప్రముఖులు, అధికారులు, చిన్నారులు పాల్గొన్నారు. రన్‌లో పాల్గొన్న ఔత్సాహికులతో నెక్లెస్ రోడ్డు గులాబీ వర్ణంగా మారిపోయింది. - వివరాలు సిటీప్లస్‌లో

సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి సైబర్ నేరగాళ్ల టోకరా

పోచారం: ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు మోసం చేసిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. పెద్దపల్లి జిల్లా, హనుమాన్‌నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిణి వల్లపురెడ్డి సుశ్రుత పోచారంలోని సింగపూర్ టౌన్‌షిప్‌లో నివాసం ఉంటోంది. ఈ నెల 24న ఆమె సోదరి వాట్సాప్ నుంచి రూ. 4600 కావాలని మెసేజ్ రావడంతో డబ్బు పంపింది. మళ్లీ రూ. 20 వేలు కావాలని మెసేజ్ రావడంతో రూ. 10 వేలు పంపిన తర్వాత సోదరికి ఫోన్ చేయగా తన వాట్సాప్ హ్యాక్ అయిందని చెప్పింది. దీంతో సైబర్ నేరగాళ్లు తనను మోసం చేసినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గ్యాస్ సిలిండర్ పేలి గృహోపకరణాలు దగ్ధం



అల్విన్‌కాలనీ: గ్యాస్ సిలిండర్ పేలి గృహోపకరణాలు దగ్ధమైన సంఘటన ఎల్లమ్మబండ, అంబేడ్కర్ నగర్‌లో చోటు చేసుకుంది. అంబేడ్కర్ నగర్‌కు చెందిన బోయరాజు అనే వ్యక్తి కొన్నేళ్లుగా కమర్షియల్ సిలిండర్లను తెచ్చి చిన్న సిలిండర్లలో నింపి విక్రయిస్తున్నాడు. ఆదివారం ఉదయం శివ అనే వ్యక్తి అతడి వద్ద సిలిండర్ తీసుకెళ్లాడు. ఇంట్లో వంట చేసుకునేందుకు స్టవ్ వెలిగించడంతో ఒక్కసారిగా సిలిండర్ పేలి మంటలు చెలరేగడంతో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అన్న చేతిలో తమ్ముడి దారుణ హత్య


షేక్ ముక్తార్ (ఫైల్)

సంతోష్‌నగర్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి సొంత తమ్ముడిని హత్య చేసిన సంఘటన కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కమల్ కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హఫీజ్‌బాబానగర్ బి–బ్లాక్ ప్రాంతంలో అన్నదమ్ములు షేక్ ముక్తార్ (36), షేక్ ఈసా నివాసం ఉంటున్నారు. గత కొన్నాళ్లుగా వారి కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి కుటుంబ సభ్యులందరూ కలిసి మాట్లాడుకుంటున్నారు. మాటల మధ్య ఆగ్రహానికి లోనైన షేక్ ఈసా తమ్ముడు షేక్ ముక్తార్‌పై కత్తితో దాడి చేయడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం ఓవైసీ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి ఆయేషా ఫిర్యాదు మేరకు కంచన్‌బాగ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమాలకు రాచబాట

ప్రైవేట్ వెంచర్‌కు ప్రభుత్వ భూమిలో రోడ్డు



- దుండిగల్ పురపాలికలో హెచ్‌ఎండీఏ అనుమతి కోసం యత్నాలు
- కలెక్టర్‌కు స్థానికుల ఫిర్యాదు ..
- విచారణ చేపట్టిన మల్కాజిగిరి ఆర్డీఓ
- కొర్రెముల్లో ప్రభుత్వ పార్కు స్థలం ఆక్రమించి వెంచర్
- మేడ్చల్ జిల్లాలో పలు పురపాలికల్లో అదే తంతు
- పట్టించుకోని తహసీల్దార్లు ..
- కలెక్టరేట్‌కు ఫిర్యాదుల వెల్లువ

సాక్షి,మేడ్చల్ జిల్లా: నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో భూ దందా యథేచ్ఛగా సాగుతోంది. కంచె చేను మేసిన చందంగా ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన అధికారులు ,రాజకీయ పెద్దలే దళారులుగా మారి అందినకాడికి దోచుకుంటున్నారు. చిన్న స్థలంలో పేదలు గుడిసె వేసుకుంటేనే నానా హంగామా చేసే అధికారులు ... ప్రభుత్వ స్థలాల పరిరక్షణలో మాత్రం నిసిగ్గుగా వహిస్తున్నారు. బడాబాబులు, రాజకీయ నేతల అనుచరులు ఏకంగా ఎకరాల కొద్దీ భూములు ఆక్రమిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఒకవేళ ఎవరైనా అధికారి అడ్డుకుంటే నాయకులే వారిపై ఒత్తిడి తెస్తున్నారు. ఇదీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఖాళీ స్థలాలు, ప్రభుత్వ భూముల పరిస్థితి. జిల్లాలో అధికారులు ప్రైవేట్ వ్యక్తుల కోసం ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టటం... వారి వెంచర్ల కోసం ప్రభుత్వ, అసైన్డ్ భూములు, చెరువు, కుంటల బఫర్ జోన్, శిఖం భూములను ఫణంగా పెడుతున్నారన్న ఆరోపణలు వెల్లుతున్నాయి. ప్రభుత్వ స్థలాల్లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు, లే అవుట్లపై అధికార యంత్రాంగ ఉదాసీనత భూ కబ్జాదారులకు వరంగా మారుతోంది

◆ దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేట ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు సమీపంలో బౌరంపేట రెవెన్యూలో సిల్వర్ ఓక్స్ స్కూల్ నుంచి ప్రైవేట్ పట్టా ,అసైన్డ్ భూములలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఆదేశాలను లెక్క చేయకుండా ప్రైవేటు వెంచర్ కోసం ప్రభుత్వ నిధులతో రోడ్డు వెడల్పు పనులు చేపట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సదరు రోడ్డులో ప్రైవేట్ ,అసైన్డ్ భూములను కలిగి ఉన్న రైతులకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం ఇప్పించడంతో పాటు రోడ్డు పనులకు అయ్యే వ్యయాన్ని వెంచర్ నిర్వాహకులే భరించేలా దళారులు ఒప్పందం కుదిర్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక రోడ్డు నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత బిల్లులను సంబంధిత అధికారులు డ్రా చేసుకునేలా మాస్టర్ ప్లాన్ కూడా రూపొందించినట్లు సమాచారం.

బండ్ల బాట విస్తరణ..

బౌరంపేట సర్వే నంబరు 166లో ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు సిల్వర్ ఓక్స్ స్కూల్ నుంచి గతంలో బండ్ల బాట ఉండేది. ఈ రోడ్డు సిల్వర్ ఓక్స్ స్కూల్ నుంచి కుడి వైపు వెళ్లే దారిలో హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో 100 ఫీట్ల రోడ్డు ప్రతిపాదన ఉంది. కానీ ఎడమ వైపు వ్యవసాయ పొలాలకు వెళ్లే బండ్ల బాటను మాస్టర్ ప్లాన్‌లో ఉన్నట్లుగా చూపించి 40 ఫీట్ల రోడ్డు వేస్తున్నారు. దాదాపు అరకిలో మీటరు పైగా రోడ్డు పనుల కోసం ఇరు వైపులా ఉన్న చెట్లను తొలగించారు.



నిర్మాణ సంస్థ కోసమేనా..

రోడ్డు వేస్తే మంచిదేనని కొందరు వాదిస్తుండగా,... దాని వెనుక ఓ పెద్ద మతలబు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ రోడ్డులో కొంత భాగం పట్టా భూమి, మరి కొంత అసైన్డ్ భూమి ఉంది. ఈ రోడ్డు ద్వారానే ఓ బడా నిర్మాణ సంస్థ రైతుల నుంచి సుమారు 50 ఎకరాలు కొనుగోలు చేసి వెంచర్ వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం సదరు నిర్మాణ సంస్థ హెచ్‌ఎండీఏ నుంచి అనుమతులు పొందటానికి 40 ఫీట్ల రోడ్డును చూపించాల్సి ఉండటంతో ప్రభుత్వ స్థలం నుంచి రోడ్డు వేసేలా సంబంధిత అధికారులతో బేరం కుదుర్చున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు..

దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో ప్రైవేట్ వెంచర్ కోసం, పంట పొలాలు, ప్రభుత్వ భూముల నుంచి రోడ్డు విస్తరణ పనులు చేపట్టడంపై విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఇటీవల కలెక్టరేట్ ప్రజావాణిలో స్థానికులు ఫిర్యాదు చేయడంతో స్పందించిన కలెక్టర్ మల్కాజిగిరి ఆర్డీఓను విచారణ చేపట్టాలని ఆదేశించారు. దీనిపై విచారణ చేపట్టిన ఆర్డీఓ సదరు స్థలం పరిశ్రమల స్థాపన కోసం తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీఎస్‌ఐఐసీ)కు కేటాయించినట్లుగా పేర్కొంటూ ..జిల్లా అధికార యంత్రాంగానికి నివేదిక సమర్పించినట్లు తెలుస్తోంది.



పురపాలికల్లో ఆక్రమణలు ఇలా..

◆ పోచారం మున్సిపాలిటీ పరిధిలోని కొర్రెములలోని సర్వే నెం.739 నుంచి 749 వరకూ 147 ఎకరాల్లో 1985లో ఏకశిలానగర్ పేరుతో లే ఔట్ చేశారు. అందులోని 47 ఎకరాలను 2006లో వ్యవసాయ భూమిగా మార్చేసిన ఓ వ్యక్తి లే ఔట్ స్వరూపాన్నే మార్చారని ప్లాట్ల యజమానులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఇదే లే ఔట్‌లో రెండు బడా రియల్ ఎస్టేట్ సంస్థలు ప్రహరీలు నిర్మించి కొంతమేర కబ్జా చేశారని పేర్కొన్నారు. అన్నోజిగూడలోని సర్వే నెంబర్లు 9,10లోని పదెక రాల లే ఔట్‌లో ఎకరం విస్తీర్ణంలో ఉన్న పార్కును ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అన్నోజిగూడ సర్వే నెంబర్ 14లో రెండెకరాల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టి విక్రయించగా, రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చి వదలివేశారు.

◆ దమ్మాయిగూడ మున్సిపాలిటీ, కీసరలోని సర్వేనంబర్ 131లో 105.26 ఎకరాల ఫారెస్టు భూమి ఉండగా, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి 2 ఎకరాల స్థలంలో బండరాళ్లను పగులగొట్టి స్థలాన్ని చదును చేసి, భవన నిర్మాణ పనులు పారంభించారు. చీర్యాల గ్రామంలోని సర్వేనంబర్ 7,8లలో 12.5 గుంటల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించారు. ఇదే రెవెన్యూ పరిధిలో సర్వేనంబర్ 152/2లో ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిని ప్లాట్లు చేసి విక్రయించారు.

◆ జీహెచ్‌ఎంసీ పరిధిలోని అల్వాల్ మండలం జొన్నబండలోని వజ్ర ఎన్‌క్లేవ్లో 900 గజాల పార్కు స్థలం కబ్జాకు గురైందని, దీంతో 236 ప్లాట్లకు పార్కు లేకుండా అవుతోందని స్థానికులు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. .జీహెచ్‌ఎంసీ పరిధిలోని కాప్రా సర్కిల్ పరిధిలోని సర్వేనంబర్199/1 జమ్మిగడ్డలోని స్టేడియానికి చెందిన ప్రభుత్వ భూమిని ఆక్రమించి, ప్లాట్లు చేసి ఇళ్లు నిర్మించి, విక్రయిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు.

ఉరేసుకుని విద్యార్థి బలవన్మరణం


నవీన్‌కుమార్ మృతదేహం

హయత్‌నగర్: ఫ్యాన్‌కు ఉరేసుకుని ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కొహెడ గ్రామానికి చెందిన నవీన్‌కుమార్(19) మంగల్‌పల్లిలోని శ్రీ ఇందూ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై సమాచారం అందడంతో సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య


అబుబాకర్ సిద్దిఖీ (ఫైల్)

సంతోష్‌నగర్: ఆర్థిక ఇబ్బందుల నేపథ్యం ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్మకు పాల్పడిన సంఘటన ఆదివారం ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... ఓల్డ్ సంతోష్‌నగర్ కాలనీకి చెందిన మహ్మద్ అబుబాకర్ సిద్దిఖీ (21) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. నాలుగు నెలల క్రితమే అతడికి వివాహం జరిగింది. పెళ్లి తర్వాత కుటుంబ పోషణ భారం ఎక్కువ కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో మనస్తాపానికి లోనైన అతను ఆదివారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిని గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఎస్సై వెంకటేశ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: పట్టాలపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రం, సమస్తిపూర్ జిల్లా, దౌలత్‌పూర్ గ్రామానికి చెందిన హీరా కుమార్(31) మల్లాపూర్‌లోని ఎఫ్‌సీఐ గోదాములో హమాలీగా పని చేస్తున్నాడు. ఈ నెల 27న తన స్నేహితుడు అభిషేక్ అనే వ్యక్తిని రైలు ఎక్కించేందుకు చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లి దర్భంగా ఎక్స్‌ప్రెస్ రైలెక్కించాడు. మల్లాపూర్‌లోని తన రూమ్‌కు తిరిగి వెళ్లేందుకు పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన రైలు హీరా కుమార్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం తెల్లవారుజామున సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

ఎర్త్ సెంటర్‌ను సందర్శించిన స్వీడన్ దేశస్తులు

కడ్తాల్: మండల పరిధిలోని అన్మాస్‌పల్లి సమీపంలోని ఎర్త్‌సెంటర్‌ను ఆదివారం స్వీడన్ దేశస్తులు జాన్‌బుచ్ అండర్సన్, డాక్టర్ ఒయింకస్ పీటర్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఈస్ట్ సెంటర్ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎర్త్ సెంటర్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. పర్యావరణ పరిరక్షణకు సీజీఆర్ సంస్థ చేస్తున్న సేవలు బాగున్నాయని ప్రశంసించారు. అనంతరం స్థానిక వీరాంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీజీఆర్ చైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి, సీజీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఈస్ట్ సెంటర్ అధ్యక్షుడు సీతారావు, కార్యదర్శి నరసింహన్, వీరనారి చాకలి ఐలమ్మ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ప్రియాకుమారి తదితరులు పాల్గొన్నారు.



ఔటర్‌పై కారు బోల్తా: ఐటీ ఉద్యోగి దుర్మరణం


అశోక్ కుమార్ మృతదేహం

శంషాబాద్: ఔటర్‌పై అదుపు తప్పి కారు బోల్తా పడటంతో ఐటీ ఉద్యోగి మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లాకు చెందిన అశోక్‌కుమార్(35) నగరంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. శనివారం రాత్రి అతను భార్య జానకమ్మతో పాటు ఆమె సోదరుడు ఉదయ్ భాస్కర్‌రెడ్డి పిల్లలతో కలిసి ప్రకాశం జిల్లా నుంచి కారులో మణికొండకు బయలుదేరారు. తెల్లవారు జామున శంషాబాద్ సమీపంలోని తొండుపల్లి వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడటంతో తీవ్రంగా గాయపడిన అశోక్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతని కుమార్తె నితిష, ఉదయ్ భాస్కర్‌రెడ్డిలకు తీవ్ర గాయాలు కావడంతో పోలీసులు వారిని సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నటికి కాబోయే భర్త ఆత్మహత్య


సవాయ్ సింగ్ (ఫైల్)

బంజారాహిల్స్: నేను జీవితంలో చాలా తప్పులు చేశాను... ఇక మళ్లీ అలాంటి తప్పులు చేయను అంటూ సెల్ఫీ వీడియో పోస్ట్ చేసిన ఓ నటికి కాబోయే భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... రాజస్థాన్‌కు చెందిన సోహాని బాలీవుడ్, టాలీవుడ్‌తో పాటు పలు భాషల్లో సినిమాల్లో నటిస్తోంది. ఇటీవల ఆమెకు రాజస్తాన్‌కు చెందిన సవాయ్ సింగ్ అనే యువకుడితో ఇన్‌స్టాలో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ఇద్దరి మధ్య ప్రేమకు దారి తీసింది. గత జూలైలో ఇద్దరు నిశ్చితార్థం కూడా చేసుకున్నారు. జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లోని ఓ ఫ్లాట్‌ను అద్దెకు తీసుకున్న సోహాని కుమారి అక్కడే ఉంటూ సినిమాల్లో నటిస్తోంది. శనివారం ఉదయం సవాయ్ సింగ్ ప్రశాసన్‌నగర్‌లోని ఆమె ఇంటికి వచ్చాడు. తర్వాత ఇద్దరూ కలిసి గచ్చిబౌలిలోని ఎవరి కార్యాలయాలకు వారు వెళ్లి పోయారు. సాయంత్రం సోహాని ఇంటికి వచ్చి తాళం తీసి లోపలికి వెళ్లి చూడగా డైనింగ్ హాల్‌లో సవాయ్ సింగ్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టగా ఆత్మహత్య చేసుకునే ముందు అతను సెల్ఫీ వీడియో తీసుకున్నట్లు గుర్తించారు. సోహాని కుమారితో పరిచయానికి ముందు సవాయ్ సింగ్‌కు మరో యువతితో స్నేహం ఉండేదని ఆమెను మర్చిపోలేకపోవడం, ఆర్థిక సమస్యల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సోహాని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలించగా శుక్రవారం ఉదయం 11.47 గంటలకు సవాయ్ సింగ్ ఆమె ఉంటున్న ఫ్లాట్ వెనుక డోర్ ద్వారా ఇంట్లోకి వెళ్ళి ఆత్మహత్య చేసుకున్నట్లుగా నిర్ధారించారు. కేసు నమోదు చేసుకునిని దర్యాప్తు చేపట్టిన పోలీసులు క్లూస్ టీమ్ సహాయంతో ఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్నారు. ఆయన మాజీ స్నేహితురాలిని కూడా విచారిస్తున్నారు.

విద్యుదాఘాతంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

విజయనగర్‌కాలనీ: మేకలకు ఆకులు తెంపడానికి వెళ్లి ఓ వ్యక్తి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన ఆదివారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ దయానంద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం ఆసిఫ్‌నగర్ సయ్యద్‌అలీగూడలోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న రావిచెట్టు ఆకులు తెంపడానికి ప్రహరీ పైకి ఎక్కాడు. ఆకులు తెంపే క్రమంలో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై కింద పడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఆసిఫ్‌నగర్ పోలీసులు 108కు సమాచారం అందించారు. అతడిని పరీక్షించిన అంబులెన్స్ సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుని సంబంధికులు ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎన్-ఓల్ పబ్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్: నిబంధనలు ఉల్లంఘించి పోలీసుల కళ్లుగప్పి తెల్లవారుజాము వరకు పబ్ నిర్వహిస్తున్న యజమానిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-36లోని పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఎన్-ఓల్ అనే పబ్ రాత్రి ఒంటి గంటకు కార్యకలాపాలు ముగించాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా ఆదివారం తెల్లవారుజామున 3 గంటల వరకు కస్టమర్లకు లిక్కర్ సరఫరా చేయడమే కాకుండా డీజే సౌండ్‌తో న్యూసెన్స్ క్రియేట్ చేశారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు తనిఖీలు చేపట్టగా పబ్‌లో కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు గుర్తించారు. దీంతో ఎన్-ఓల్ పబ్ యజమాని చిలంకుర్తి శంకర్, మేనేజర్ వీరగోని వంశీ, బౌన్సర్లు మహమూద్, సూర్య కిరణ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలులో ప్రయాణికుడి మృతి


అన్సారీ మృతదేహం

సికింద్రాబాద్: రైలులో ప్రయాణిస్తున్న యువకుడు మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పరిధిలో జరిగింది. రైల్వే కానిస్టేబుల్ పండరి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జార్ఖండ్‌కు చెందిన ఆలమ్ అన్సారి(27) అనే యువకుడు హౌరా నుంచి సికింద్రాబాద్‌కు ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్నాడు. ఆదివారం ఉదయం అతను కోచ్ నంబర్ 5లోని సీట్ నెం. 32లో మృతి చెంది ఉన్నాడు. విధుల్లో ఉన్న రైల్వే టీటీఐ ద్వారా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గాంధీ మార్చురీకి తరలించారు.

యువకుడి ఆత్మహత్య..

జీడిమెట్ల: మానసిక ఒత్తిడి తాళలేక ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. షాపూర్‌నగర్‌కు చెందిన యలగందుల నవమోమన్ కుమారుడు శరణ్‌దీప్(24) ప్రైవేట్ ఉద్యోగం చేసేవాడు. శనివారం రాత్రి భోజనం చేసిన తర్వాత అతను ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం ఉదయం హెచ్‌ఎంటీ సమీపంలోని ఖాళీ స్థలంలో ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకుని ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పంచనామా నిర్వహించి మృతుడిని శరణ్‌దీప్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి నవమోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అవన్నీ తప్పుడు 'మార్గాలు'

- సీఎం ఆస్తుల విలువ పెంచుకొనేందుకే ఆ రోడ్లు
- అందుకే గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు, ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్పు
- రైతులకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుంది
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న కేటీఆర్

కడ్తాల్: సీఎం రేవంత్‌రెడ్డి తన కుటుంబం, బంధువుల ఆస్తుల విలువ పెంచుకోవడానికే గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటు చేయడంతో పాటు ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చడం జరిగిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కడ్తాల్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల మీదుగా ఏర్పాటు చేస్తున్న 765 హైటెన్షన్ విద్యుత్‌లైన్ అలైన్‌మెంట్‌కు వ్యతిరేకంగా బాధిత రైతులు చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం 21వ రోజుకు చేరుకున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగర్జన సభకు వెళ్తున్న కేటీఆర్ దీక్ష శిబిరం వద్దకు చేరుకుని వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగా సొంత భూముల విలువ పెంచుకోవడానికి ఎవరికీ అవసరం లేని గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. రోడ్డు నిర్మాణం కోసం 1,200 ఎకరాల పట్టా భూములను రైతుల నుంచిడి సేకరిస్తుండంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. సొంత ఆస్తుల విలువను పెంచుకోవడంతో పాటు అనుయాయులకు దోచిపెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటామని, రైతులకు అండగా ఉంటామన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో పేదల కడుపుకొట్టకుండా, వారికి నష్టం కలుగకుండా అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తు చేశారు. హైటెన్షన్ విద్యుత్‌లైన్ బాధిత రైతులు కలిసి వస్తే న్యాయస్థానంలో వారి పక్షాన పోరాడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు వెంకటేశ్‌గుప్తా, రజనీ సాయిచంద్, పరమేశ్, దశరథ్‌నాయక్, లక్ష్మీనర్సింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నేడు బతుకమ్మ సంబురాలు

వెంగళరావునగర్: వెంగళరావునగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న అయ్యప్ప గ్రౌండ్‌లో బతుకమ్మ సంబురాలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు చిలకల వెంకటేశ్వరరావు ఆదివారం తెలియజేశారు. సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి ఈ వేడుకలు ప్రారంభమవుతాయని అన్నారు. మహిళలు అందంగా బతుకమ్మలను తీర్చిదిద్ది తీసుకుని సకాలంలో రావాలని కోరారు. బదుకమ్మ వేడుకల్లో భాగంగా కోలాటం, ఆటపాటలు, నృత్యాలు తదితర భక్తి గీతాలతో అమ్మవారిని పూజలు చేయడం జరుగుతుందని అన్నారు.

సర్వభూపాల వాహన సేవలో శ్రీవారు



వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారిని సర్వభూపాల వాహన సేవలో, సాయంత్రం గజ వాహన సేవ అనంతరం ఎదుర్కోళ్ళ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, పూర్ణాహుతి, బలిహరణ; తీర్థప్రసాద వితరణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన స్వామివారి ఎదుర్కోళ్ళ ఉత్సవం కనుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సిపిరి అర్జున్ యాదవ్, ఈవో శ్రీనివాస శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం చుట్టూ కంచె



ఫెన్సింగ్, బోర్డును ఏర్పాటు చేసిన హైడ్రా సిబ్బంది

వెంగళరావునగర్: కోట్లాది రూపాయల ఖరీదు చేసే ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులు రక్షించారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని టీ-జంక్షన్‌లో 60 ఏళ్ళ క్రితం అప్పటి ప్రజల దాహార్తిని తీర్చడానికి దాదాపు వెయ్యి గజాల స్థలంలో ఓవర్‌హెడ్ ట్యాంకును నిర్మించారు. అది శిథిలావస్థకు చేరడంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించి జేసీబీ ద్వారా ఇటీవల కూల్చివేశారు. కోట్లాది రూపాయల ఖరీదు చేసే ప్రభుత్వ స్థలం కబ్జా కాకుండా ఉండేందుకుగాను చుట్టూ పెన్సింగ్ నిర్మించారు. అనంతరం ఈ స్థలం ప్రభుత్వానికి చెందినది, ఆక్రమిస్తే శిక్షింపబడతారని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

అమ్మవారికి జూనియర్ సివిల్ జడ్జి ప్రత్యేక పూజలు



వెంగళరావునగర్: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వెంగళరావునగర్ డివిజన్‌లోని జీటీఎస్ దేవాలయంలో జూనియర్ సివిల్ జడ్జి వి.శ్రావణి యాదవ్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గుమ్మడిదల సుధాకర్, సత్యం యాదవ్, బీవీఎస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల బతుకమ్మ సంబరం



హిమాయత్‌నగర్: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని చైతన్య హబ్ జూనియర్ కళాశాల, శ్రీ మేధా డిగ్రీ కళాశాల చైర్మన్ వి.వి.హనుమంతరావు అన్నారు. హిమాయత్‌నగర్ లోని కళాశాలల్లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ పాల్గొన్నారు.

అమ్మవారిని పూజిస్తే సకల శుభాలు

రహమత్‌నగర్ : అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవాని శంకర్ నేత అకాంక్షించారు.డివిజన్‌లోని హెచ్ఎఫ్ నగర్,సుబాష్ చంద్రబోసనగర్ బస్తీల్లో నిర్వహిస్తున్న దేవిశవన్నవ రాత్రి ఉత్సవాల్లో ఆదివారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని పూజిస్తే సకల శుభాలు చేకూరుతాయని గుర్తు చేశారు.



స్కంద మాత అలంకారంలో పెద్దమ్మతల్లి...



మాగంటి కాలనీలోమహా లక్ష్మీ దేవిగా విజయ కనకదుర్గా దేవి



బంజారాహిల్స్‌లో శ్రీ కాత్యాయని దేవిగా కనక దుర్గా దేవి



విజయ గణపతి స్వామి ఆలయంలోమహా చండీ దేవిగా..



దైవసన్నిదానంలో మహాలక్ష్మి దేవిగా రాజరాజేశ్వరి దేవి



శ్రీనగర్ కాలనీలో స్కంద మాతగా శ్రీ భ్రమరాంబికా దేవి

తల్లీ..కరుణించవా..!

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

బంజారాహిల్స్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అమ్మవారి ఆలయాల్లో వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి స్కందమాతగా భక్తులకు దర్శనమివ్వగా ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫిలింనగర్ దైవసన్నిదానంలో చండీ హోమం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో హోమంలో పాల్గొన్నారు. బంజారాహిల్స్‌లోని కనక దుర్గా దేవి అమ్మవారు కాత్యాయని దేవిగా, విజయగణపతి స్వామి ఆలయంలోని అమ్మవారు మహా చండీ దేవిగా, దైవసన్నిదానంలోని అమ్మవారు మహాలక్ష్మిదేవిగా, శ్రీనగర్ కాలనీలోని శ్రీ భ్రమరాంబికా దేవి అమ్మవారు స్కంద మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఎన్టీటీనగర్‌లో అమ్మవారిని వివిధ రూపాల్లో ఏర్పాటు చేసిన మండపం



దైవసన్నిదానంలో చండీ హోమం



వినాయకనగర్ బస్తీలో అన్నదాన కార్యక్రమం



ఎన్‌బీటీ నగర్‌లో..

3 నుంచి జీటో కనెక్ట్ ఎగ్జిబిషన్



బంజారాహిల్స్: జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్(జీటో) ఆధ్వర్యంలో అక్టోబర్ 3నుంచి 5వ తేదీ వరకు హెచ్ఐసీసీ హైటెక్స్‌లో జీటో కనెక్ట్-2025 ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు జీటో కనెక్ట్ చైర్మన్ రోహిత్ కొఠారి వెల్లడించారు. తాజ్ దక్కన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ది పవర్ ఆఫ్ వన్ అనే థీమ్‌తో నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో పలువురు వ్యాపారవేత్తలతో పాటు, ఆధ్యాత్మిక గురువులు, రాజకీయ ప్రముఖులు, ఆర్థిక నిపుణులు, సినీ క్రీడా రంగ ప్రముఖులు పాల్గొంటారని వెల్లడించారు. కేంద్ర రక్షణ శాఖామంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారని తెలిపారు.

సందడిగా దాండియా



పంజగుట్ట: దసరా నవరాత్రులు పురస్కరించుకుని ఆనంద్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆనంద్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దాండియా ఉత్సాహంగా నిర్వహించారు.స్థానిక కాలనీకి చెందిన బాలికలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దాడియా ఆడారు.

దివ్యాంగులపై కేంద్రం ప్రత్యేక శ్రద్ధ : కిషన్ రెడ్డి



మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డిగూడ నాగార్జుననగర్ కమ్యూనిటీహాల్‌లో ప్రధాన మంత్రి మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమం పాల్గొని వీక్షించిన అనంతరం దివ్యాంగులకు సుమారు 2 కోట్ల ఉచిత పరికరాలను అందించారు. 36 బ్యాటరీ మూడు చక్రాల వాహనాలు, ప్రత్యేక సెల్ ఫోన్స్, వినికిడి పరికరాలను అందించారు. దివ్యాంగుల కొరకు అక్టోబర్ గాంధీ జయంతి వరకూ దివ్యాంగులకు, మహిళలకు, నిరుపేదలకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలీవ్కో సంస్థ ప్రతినిధి డిజి విజయ్‌సింగ్, బీజేపీ సెంట్రల్‌జిల్లా అధ్యక్షులు లంకల దీపక్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగబద్ధంగా లంబాడీలు ఎస్టీలే



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్ నాయక్

పంజగుట్ట: లంబాడీలు రాజ్యాంగబద్ధంగా ఎస్టీలే అని, ఎస్టీ జాబితా నుండి లంబాడీలను తొలగించాలనే అప్రజాస్వామిక, రాజ్యాంగ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఆదివాసీ నాయకులు సోయం బాపురావు, తెల్లం వెంకట్రావుల వైఖరి తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ మంత్రి, మాజీ ఎంపీ రవీంద్ర నాయక్ అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో లంబాడీ జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. జేఏసీ నాయకుడు రమావత్ లాలు నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి హాజరైన రవీంద్ర నాయక్ మాట్లాడుతూ.. ఎస్టీ జాబితాలో ఉన్న తెగలలో ఉన్న వారందరు కూడా ఆదివాసులే అని ఆదివాసీ అనే పదం రాజ్యాంగం ఉందన్నారు. ఎస్టీ జాబితా నుండి లంబాడీలను తొలగించడం అనేది ఆసాధ్యమని, కొంతమంది రాజకీయ నిరుద్యోగులు చేస్తున్న కుట్రలు అని ఆయన అన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరాలు ప్రారంభించిన మాజీ ఎంపీ



వైద్య శిబిరంలో అంజన్‌కుమార్ యాదవ్ ఫసియుద్దీన్

రహమత్‌నగర్: బోరబండలోని పలు బస్తీలో ఏకేవై ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాలను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ ఆదివారం ప్రారంభించారు. ఎంతో మంది నిరుపేదలు కంటి చికిత్సలు చేయించులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారికి వైద్యం అందించడం అభినందనీయమన్నారు. ఏకేవై సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని వైద్య సేవలు, రాష్ట్ర వ్యాప్తంగా అందించాలని నిర్ణయించామని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని వెంటనే సవరించాలి

హిమాయత్‌నగర్: మాలలకు తీవ్ర అన్యాయం చేస్తున్న ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సీఎం రేవంత్ రెడ్డి వెంటనే సవరించాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ మాందాల భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జేఏసీ చైర్మన్ బేర బాలకిషన్, జేఏసీ గౌరవాధ్యక్షులు చెరుకు రాంచందర్ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర మాల సంఘాల విస్తృతస్థాయి సమావేశంలో కీలక తీర్మానాలు చేసి రాష్ట్ర ప్రభుత్వం ముందు ముఖ్యమైన డిమాండ్లను ఉంచారు. జీవో 99 వల్ల అన్యాయానికి గురవుతున్న 58 కులాలకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో జేఏసీ నాయకులు నల్లాల కనకరాజు, మంత్రి నరసింహయ్య, మాదాసు రాహుల్, పీవీ స్వామి పాల్గొన్నారు.

పంజగుట్ట ఇన్‌స్పెక్టర్‌గా రామకృష్ణ బాధ్యతల స్వీకరణ

పంజగుట్ట: పంజగుట్ట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా రామకృష్ణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన శోభన్ ఎస్‌బీకి బదిలీపై వెళ్లగా, కామాటిపూర బాధ్యతలు నిర్వహించిన రామకృష్ణ బదిలీపై పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. 2004 బ్యాచ్‌కు చెందిన రామకృష్ణ వివిధ పోలీస్‌స్టేషన్‌లల్లో ఎస్సైగా, ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు.

తలసేమియా పిల్లల కోసం రక్తదానం



బంజారాహిల్స్: తలసేమియా వ్యాధిగ్రస్తు చిన్నారుల కోసం అశ్వ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సేఫ్ లైఫ్ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రతి నెలా ఇటువంటి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని సేవ్ లైఫ్ ప్రాజెక్ట్ లీడర్ వినయ్ మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో అశ్వ ప్రతినిధులు 57 మంది రక్తదానం చేశారు. అశ్వ సంస్థ ఆధ్వర్యంలో 14 సంవత్సరాలుగా తలసేమియా చిన్నారుల కోసం పని చేస్తున్నామని సంస్థ ప్రతినిధులు జగన్, భార్గవి, కృష్ణ కుమార్ తెలిపారు.

తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘానికి గుర్తింపు ఇవ్వండి

హిమాయత్‌నగర్: తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం(టీడీసీఏ)కు గుర్తింపు ఇవ్వాలని బీసీసీఐ పెద్దలను టీడీసీఏ అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి కోరారు. ఐసీసీ చైర్మన్ జైషా, బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, కార్యదర్శి దేవజిత్ సైకియా, కోశాధికారి ప్రభుతేజ్ సింగ్ భాటియాకు వినతి పత్రాలను అందజేశామన్నారు. ఆదివారం బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ కేంద్రంగా దాదాపు 220 క్లబ్ టీమ్‌లు ఉంటే, మిగిలిన 32 జిల్లాలకు 9 ఉమ్మడి జిల్లా జట్లే ఉన్నాయని, ఈ విధానంతో తెలంగాణ గ్రామీణ క్రికెటర్లకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. తెలంగాణ క్రికెటర్లకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలంటే తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘానికి గుర్తింపు ఇవ్వాలని వెంకటేశ్వర్ రెడ్డి కోరారు.

మున్నూరు కాపులకే జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న పూటం పురుషోత్తం పటేల్

పంజగుట్ట: జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభ్యర్థులుగా మున్నూరు కాపులకే కాంగ్రెస్, బీజేపీ టిక్కెట్లు కేటాయించాలని మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పూటం పురుషోత్తం పటేల్, రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షుడు చందు జనార్ధన్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ .. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటినుండి, తెలంగాణ రాష్ట్రంలో కూడా మున్నూరు కాపు లేని మంత్రివర్గం లేదని ఇదే మొదటి సారి అన్నారు. బీజేపీ కూడా రాష్ట్ర అధ్యక్షునిగా బండి సంజయ్‌ని తొలగించారని, ఆంధ్రప్రదేశ్‌లో కూడా సోము వీర్రాజును తొలగించారని ఇప్పుడు వారు కూడా మున్నూరు కాపులకు టిక్కెట్ ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించి వాటని తప్పకుండా అమలయ్యేలా చూస్తామని హామీ ఇవ్వడంపట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

జనాభా ప్రాతిపదికన వాటా కల్పించాలి



మాట్లాడుతున్న ప్రొ.ఎం.బాగయ్య, చిత్రంలో ఎం.ఎస్.నరహరి

హిమాయత్‌నగర్: బీసీలకు స్థానిక సంస్థల కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 42 శాతం రిజర్వేషన్లలో బీసీ 'ఎ' కులాలకు జనాభా ప్రాతిపదికన వాటా కల్పించాలని తెలంగాణ బీసీ 'ఎ' హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.భాగయ్య, రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎస్.నరహరి డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. స్వాతంత్ర్యం సిద్ధించి 78 ఏళ్ళు గడుస్తున్నప్పటికీ బీసీ 'ఎ' లోని 73 కులాలకు రిజర్వేషన్లలో అన్యాయం జరుగుతోందన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన జాబితాను బహిర్గతం చేసి, వారి కులాల వారిగా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

దసరా నుంచి మరింత షేర్ పెంచుతాం

సనత్‌నగర్: బంజారాహిల్స్ రోడ్ నెంబర్-12లోని ఎన్‌బీటీనగర్‌లో ఆదివారం కల్లు గీత సహకార సంఘం బంజారాహిల్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బంజారాహిల్స్ టీసీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బాలరాజు, జనరల్ సెక్రటరీ వేణుగోపాల్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ హాజరై 186 మంది టాపర్లు, నాన్ టాపర్లు, సభ్యులకు షేర్ అమౌంట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌గౌడ్ మాట్లాడుతూ గత రెండు నెలల నుంచి సభ్యులకు దసరా నుంచి మరింత పెంచుతామని వెల్లడించారు. ఈ సమావేశానికి ముగ్గురు డైరెక్టర్లు కూడా హాజరయ్యారని పేర్కొన్నారు. కల్లు దుకాణాలను వెంటనే తెరిపించాలని, ఇప్పటి నుంచి తమ కల్లు దుకాణాలు తామే నడిపించుకుంటామని వెల్లడించారు.

ఆర్థిక సాయం అందజేత

వెంగళరావునగర్ : పేదవారికి సాయం చేయడంలోనే ఆనందం ఉంటుందని కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకుడు వి.నవీన్‌యాదవ్ తెలియజేశారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని లక్ష్మీనరసింహానగర్‌కు చెందిన రాకేష్ అనారోగ్యంగా ఉండటంతో, అతనికి ఆసుపత్రి చికిత్స నిమిత్తం ఆర్థిక సాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరారు. దీనికి స్పందించిన నవీన్‌యాదవ్ అప్పటికప్పుడు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు.

3న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో అలయ్ బలయ్



సమావేశంలో పాల్గొన్న అలయ్ బలయ్ కమిటీ చైర్మన్, సభ్యులు

అమీర్‌పేట: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 3న అలయ్ బలయ్ వేడుక నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ విజయలక్ష్మి తెలిపారు. ఆదివారం అమీర్‌పేట ఆదిత్యపార్క్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఉదయం 9.30 గంటలకు వేడుక ప్రారంభమవుతుందని చెప్పారు. 2005లో 200 మందితో ప్రారంభమైన అలయ్ బలయ్‌లో ఇపుడు 20 వేల మంది పాల్గొంటారన్నారు. తెలంగాణ సంస్కృతి, గొప్పతనాన్ని చాటిచెబుతూ నిర్వహించే కార్యక్రమాలు విశేషంగా అకట్టుకుంటాయన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ సీజేఐ ఎన్వీరమణ, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, నిర్మలా సీతారాం, స్పీకర్ గడ్డం ప్రసాద్ తదితర ప్రముఖులు హాజరవుతారన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, గౌతంరావు, శ్యామ్‌సుందర్‌గౌడ్, మల్లేశ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

సీపిగెట్ మొదటి దశలో 20,467 మందికి సీట్లు

లాలాపేట: తెలంగాణ స్టేట్ లెవల్ కామన్ పోస్టు గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీజీ సీపీగెట్-2025)లో ర్యాంకులు సాధించి వివిధ కోర్సుల్లో చేరడానికి 28,145 మంది అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్ ఇచ్చారు. వీరికి మొదటి ఫేజ్‌లో 20,467 సీట్లు కేటాయించినట్లు కన్వీనర్ ఆదివారం తెలిపారు. మొదటి దశలో సీట్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా నిర్ణీత ఫీజు చెల్లించి, ఆయా కళాశాలలో వచ్చే నెల 8 లోపు రిపోర్టు చేయాలని సూచించారు.

పెద్దమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

బంజారాహిల్స్: జూబ్లిహిల్స్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయానికి భక్తులు పోటెత్తారు. దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలతో పాటు ఆదివారం కూడా రావడంతో నగర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి విచ్చేశారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులతో ఆలయంతో పాటు ఆలయ పరిసరాలన్నీ జన సందోహంతో కిక్కిరిసి పోయాయి. ఆలయానికి దారితీసే మార్గాలన్ని వాహనాలతో నిండిపోయాయి.







పర్యాటక ప్రచారంలో భాగస్వాములు కండి



ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

గన్‌ఫౌండ్రీ: బతుకమ్మ సంబరాల్లో భాగంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఎల్బీ స్టేడియం నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు నిర్వహించిన బైక్, సైకిల్, స్కూటర్ ర్యాలీని మంత్రి జూపల్లి కృష్ణారావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించి టూరిజం ప్రమోషన్లలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సంప్రదాయ వస్త్రధారణతో హైదరాబాద్ మహిళలు నిర్వహించిన బుల్లెట్ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో పర్యాటక శాఖ ఎండీ క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

'బతుకమ్మ' పుస్తకావిష్కరణ



గన్‌ఫౌండ్రీ: బతుకమ్మ పండుగ తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక అని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో ప్రముఖ రచయిత్రి తిరునగరి దేవకీదేవి రచించిన బతుకమ్మ పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగలలో కుటుంబ సంబంధాలు, మహిళల ఐక్యతను రచయిత్రి చక్కగా వివరించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి జూపాక సుభద్ర, సాహిత్య పరిశోధకులు సంగిశెట్టి శ్రీనివాస్, సాహితీవేత టి.ఉదయవర్లు, పైడిమర్రి గిరిజ, గణపురం దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

అందరూ భాగస్వాములు కావాలి: నాగేశ్వరరావు



సాక్షి, సిటీబ్యూరో: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని మల్టీపర్పస్ అవేర్నెస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బి.నాగేశ్వరరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సొసైటీ వాలంటీర్లతో కలిసి చెట్లు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లు పెంచడం వల్ల వచ్చే ఆక్సిజన్ ఆరోగ్యకరమైన జీవితానికి పునాది వేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం, వాటిని సంరక్షించుకోవడం అలవాటుగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. పర్యావరణ ఆరోగ్యం, వ్యర్థాల నిర్వహణ, స్థిరమైన జీవన విధానాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఇస్కాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్ కంపెనీల ఉద్యోగులు, సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో దేనాదబ్రహ్మోత్సవ్ 2025ను పురస్కరించుకుని సాయంత్రం 5.30 నుంచి 8.30 గంటల వరకు ప్రముఖ కళాకారులచే అన్నమాచార్య సంకీర్తనలతో నాదనైవేద్యం కార్యక్రమం జరుగుతుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఉద్యానవన శాఖ గ్రాండ్ నర్సరీ మేళా పేరుతో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హార్టీకల్చర్ షో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ హాల్‌లో దసరా పండుగ ప్రత్యేకంగా హ్యాండ్‌లూమ్ ఇండియా పేరిట స్వచ్ఛమైన ఫైబర్ సిల్క్ ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు పెన్సిల్ డ్రాయింగ్స్, స్కల్ప్చర్స్, స్టేకిడ్ స్టోరీస్ , డీప్ ఇంటీరియల్స్ చిత్ర ప్రదర్శనలు అందుబాటులో ఉంటాయి.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ గఫార్ ఖాన్ కాలనీలోని లేబుల్స్ ది పాప్ అప్ స్పేస్‌లో ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఖిజార్ స్కిల్స్ సోలో ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

ఫ్లైఓవర్‌కు చోటు.. 183 చెట్లపై వేటు

- జేవీఆర్ పార్కు నుంచి టీవీ 9 జంక్షన్ వైపు ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతిపాదన
- ఎన్ని చెట్లు తొలగించాలనే దానిపై అధికారుల సర్వే



ట్రీ ప్రొటెక్షన్ ప్రతినిధులతో సర్వే చేస్తున్న ఫారెస్ట్, యూబీడీ, ప్రాజెక్ట్స్ విభాగం అధికారులు...

బంజారాహిల్స్: బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లోని ట్రాఫిక్ సిగ్నల్స్, జంక్షన్లపై ఒత్తిడి తగ్గించడంతోపాటు వాహనాలు సాఫీగా ముందుకు వెళ్లేందుకుగాను ఫ్లై ఓవర్ల నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. గతంలో ఎస్ఆర్‌డీపీ కింద మల్టీలెవల్ ఫ్లై ఓవర్లు నిర్మించాలని భావించింది. తాజాగా ఒకవైపు ఫ్లైఓవర్, మరోవైపు అండర్‌పాస్‌ల నిర్మాణానికి ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఆ దిశగా ఇప్పటికే ప్రణాళికలతోపాటు ఈ రోడ్డు నిర్మాణంలో కోల్పోయే ఆస్తుల గుర్తింపును సైతం సంబంధిత శాఖల అధికారులు గుర్తించారు. తాజాగా జలగం వెంగళరావు(జేవీఆర్) పార్కు వైపు నుంచి బంజారాహిల్స్‌లోని టీవీ 9 వైపు చేపట్టే ఫ్లై ఓవర్ నిర్మాణంలో కోల్పోనున్న చెట్లు, అందులో రీలొకేట్ చేయడానికి ఎన్ని చెట్లకు అవకాశం ఉందన్న అంశాలపై సర్వే చేస్తోంది. ప్రాజెక్ట్స్ విభాగం అధికారులు యూబీడీతోపాటు ఫారెస్ట్, ట్రీ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులతో కలిసి బంజారాహిల్స్ రోడ్ నెం.2లో సర్వే నిర్వహించారు. జలగం వెంగళరావు పార్కు వైపు నుంచి టీవీ 9 వైపునకు ఒక ఫ్లైఓవర్ నిర్మిస్తున్నందున ఈ ప్రాజెక్ట్‌లో రోడ్డుకు రెండు వైపులా సుమారు 183 చెట్లు తొలగించాల్సి వస్తుందని అధికారులు అంచనాకు వచ్చారు. ఆ చెట్లను గుర్తించి ఇప్పటికే వాటిపై నెంబర్లు వేశారు. త్వరలోనే మరోసారి సర్వే చేసి ఇందులో ఎన్ని చెట్లు రీలొకేట్ చేయడానికి అవకాశం ఉందన్న విషయాన్ని గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు.

నిత్యం రద్దీ.. వేలాదిగా వాహనాలు

ఈ ఫ్లైఓవర్ల ప్రాజెక్ట్‌లో భాగంగా జేవీఆర్ పార్కు నుంచి టీవీ 9 మీదుగా, సాగర్ సొసైటీ, కేబీఆర్ పార్కు, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, బాలకృష్ణ నివాసం, తెలంగాణ భవన్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రుల చుట్టూ ఉన్న సుమారు 1,900 చెట్లు తొలగించాల్సి వస్తుందని గతంలోనే అధికారులు నివేదిక సమర్పించారు. బంజారాహిల్స్ రోడ్ నెం.2 మీదుగా నిత్యం వేలాది వాహనాలు జూబ్లీహిల్స్, మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి వైపునకు వెళ్తుంటాయి. ఒకవైపు చిన్న రోడ్లతో పాటు జంక్షన్ల వద్ద ఎక్కువసేపు వాహనాలు నిలపాల్సి వస్తుండటంతో ట్రాఫిక్ రద్దీ నిత్యకృత్యమవుతున్నది. ఈ నేపథ్యంలో అధికారులు జంక్షన్లతో సంబంధం లేకుండా రోడ్డులోకి వచ్చే వాహనాలు ఫ్లైఓవర్ల పై నుంచి జంక్షన్లు దాటే విధంగా ప్రణాళికలు రూపొందించారు.

నగరంలో తగ్గిన నేరాలు

- సమష్టి కృషి ఫలితంగానే సాధ్యమైందన్న కొత్వాల్
- నేర సమీక్ష సమావేశంలో సీవీ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు కమిషనరేట్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమష్టి కృషి ఫలితంగా హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని కొత్వాల్ సీవీ ఆనంద్ అన్నారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆదివారం ఆయన నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. 2023 సెప్టెంబర్–2024 ఆగస్టు మధ్య నమోదైన గణాంకాలను గత ఏడాది సెప్టెంబర్–ఈ ఏడాది ఆగస్టు మధ్య నమోదైన వాటితో పోలిస్తే స్పష్టమైన తగ్గుదల కనిపించిందని, ఇది పోలీసుల నిబద్ధతకు నిదర్శనమన్నారు. సైబర్ నేరాల నియంత్రణలోనూ హైదరాబాద్ పోలీసులు ఉత్తమ పనితీరు కనబరిచారు. కేసుల నమోదు సంఖ్య తగ్గడమే కాకుండా, నిందితులను అరెస్టు చేసే రేటు కూడా పెరిగిందని చెప్పారు. గత ఏడాది (2023 సెప్టెంబర్–2024 ఆగస్టు మధ్య) అరెస్టు రేటు 40 శాతం ఉండగా, ఈ ఏడాది (2024 సెప్టెంబర్–2025 ఆగస్టు మధ్య) రెండు శాతం పెరిగి 42 శాతానికి చేరుకుందని పేర్కొన్నారు.

- 'హైదరాబాద్ సిటీ పోలీసులు టీమ్‌గా పనిచేసి శాంతిభద్రతలను కాపాడటంలో అద్భుతమైన ఫలితాలను సాధించారని సీవీ ఆనంద్ కొనియాడారు. నగరంలో పండుగలు, ఊరేగింపులు, సభలు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ హైదరాబాద్‌ను 'నేర రహిత నగరం'గా మార్చాలి'అని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమీక్ష అనంతరం అదనపు, సంయుక్త సీపీలు, డీసీపీలతో గ్రూప్ ఫొటో దిగిన సీవీ ఆనంద్ టీజీఐసీసీసీలో ఏర్పాటు చేసిన హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్(హెచ్‌సీఎస్సీ) భవనాన్ని ప్రారంభించారు.

ప్రధాన నేరాల నమోదు ఇలా...

నేరం	గత ఏడాది	ఈ ఏడాది	తగ్గుదల (శాతం)
హత్యలు	85	73	14
హత్యాయత్నం	259	185	29
దాడి	2,409	2,037	15
కిడ్నాప్	698	616	12
సైబర్ నేరాలు	4,348	3,745	14
అత్యాచారం	632	485	23
మహిళల కిడ్నాప్	265	239	10
వేధింపులు	1,358	1,351	1
మొత్తం కేసులు	38,206	31,533	17

'ఆర్ట్ ఆఫ్ లివింగ్' నవరాత్రి ఉత్సవాలు



సత్సంగ్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి, సిటీబ్యూరో: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం శరన్నవరాత్రుల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం, ధ్యానం, సత్సంగ్ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మహిళలు కంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణంలో పెద్దఎత్తున పాలు పంచుకున్నారు.

నేడు మెట్రో శిలాఫలకానికి పాలాభిషేకం



కార్తీక్‌రెడ్డి

మణికొండ: శేరిలింగంపల్లి నియోజకవర్గం మైండ్ స్పేస్ నుంచి శంషాబాద్ వరకు ఏర్పాటు కావాల్సిన మెట్రోరైల్ ప్రాజెక్టును అర్ధాంతరంగా నిలిపివేయటంతో రాజేంద్రనగర్ నియోజకర్గ ప్రజలకు తీరని అన్యాయం చేశారని, దాన్ని నిరసిస్తూ సోమవారం నిరసన చేపట్టనున్నామని బీఆర్‌ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.కార్తీక్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో వేసిన శిలాఫలకానికి పాలాభిషేకం చేసి అక్కడే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిరసన చేపడతామని పేర్కొన్నారు. దేశంలోనే శరవేగంగా విస్తరిస్తున్న మణికొండ, నార్సింగి, బండ్లగూడ మున్సిపాలిటీల మీదుగా శంషాబాద్ వరకు మెట్రో రైల్ ప్రాజెక్టు వస్తే అనేక మందికి ఉపయోగపడుతుందని, అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందన్నారు. ఆదివారం భూమిపూజ చేసిన ఫ్యూచర్‌సిటీకి అప్పుడే మెట్రోను వేయాలని నిర్ణయించి ఇప్పటికే టెండర్‌లు పూర్తయిన రాజేంద్రనగర్ మెట్రోను పక్కన పెట్టడం ప్రభుత్వం చేసిన అతి పెద్ద తప్పు అని అన్నారు. సోమవారం నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి నిరసనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నేడు ఇందిరమ్మ క్యాంటీన్లు ప్రారంభం

బంజారాహిల్స్: నగరంలోని పేదలు, కూలీలు, ఆటోడ్రైవర్లు, విద్యార్థులు వంటి వర్గాల భోజన భద్రతను మరింత బలోపేతం చేస్తూ సోమవారం ఇందిరమ్మ క్యాంటీన్ కేంద్రాలు కొత్తగా ప్రారంభం కానున్నాయి. మోతీనగర్, ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లో ఏర్పాటు చేసిన క్యాంటీన్లను మంత్రి పొన్నం ప్రభాకర్ , మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించనున్నారు. భోజనం కేవలం రూ.5కే అందించే ఈ ప్రత్యేక పథకం ఇప్పటికే వేలాది మందికి ఆపన్నహస్తంగా నిలుస్తోంది. జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రస్తుతం 150 ఇందిరమ్మ క్యాంటీన్లు నడుస్తుండగా, రోజుకు సగటున 30 వేల మంది లబ్ధిపొందుతున్నారు. ఇప్పటి వరకు 12.3 కోట్ల భోజనాలు పంపిణీ చేయగా, రూ.254 కోట్లకుపైగా వెచ్చించారు. ఈ కొత్త క్యాంటీన్లలో ఆధునిక ఫుడ్ కంటైనర్లు, కూర్చునే సదుపాయం, తాగునీటి ఆర్వో ప్లాంట్, చేతులు శుభ్రం చేసుకునే వసతి, డ్రైనేజీ , ఎలక్ట్రిసిటీ కనెక్షన్లు కల్పించబడ్డాయి. లబ్ధిదారులకు రుచి, శుచితో కూడిన భోజనం అందించడం వీటి ప్రధాన లక్ష్యం. ప్రతిరోజూ బ్రేక్‌ఫాస్ట్ కూడా అందించే ప్రణాళికలు త్వరలో అమలులోకి రానున్నాయి. ఇందిరమ్మ క్యాంటీన్ల ప్రారంభోత్సవం ఆకలిలేని హైదరాబాద్ దిశగా మరొక అడుగుగా నిలుస్తుందని అధికారులు భావిస్తున్నారు.

'చిత్రపురి' సభ్యులందరికీ న్యాయం చేస్తాం

- సొసైటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్



సమావేశంలో పాల్గొన్న సొసైటీ కార్యవర్గ సభ్యులు

మణికొండ: చిత్రపురి హౌసింగ్ సొసైటీలోని 4,500 మంది సభ్యులను సమాన దృష్టితో చూస్తామని, అందులో ఆరుగురు సొసైటీకి నష్టం కలిగించే పనులు చేపడుతున్నారని, వారిని సస్పెండ్ చేస్తున్నామని అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన అధ్యక్షతన జరిగిన సొసైటీ సమావేశంలో 1,500 మందికిపైగా సభ్యులు పాల్గొని వారి సమస్యలను వివరించటంతోపాటు సొసైటీ నిర్వహణ, ఇబ్బందులపై చర్చించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ చిత్రపురి హౌసింగ్ సొసైటీ రూ.170 కోట్ల నష్టాల్లో ఉందని, దాని నుంచి బయటపడి సభ్యులంతా సుఖ సంతోషాలతో జీవించేందుకు కొత్త ప్రాజెక్టు మొదలు పెడుతున్నామన్నారు. ఫైవ్ మెన్ కమిటీ ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించి అందరికీ మేలు చేసేలా చూస్తామన్నారు. సొసైటీపై కొందరు 132 కేసులు వేశారని, వాటన్నింటికీ న్యాయ పరంగానే సమాధానం చెపుతున్నామని పేర్కొన్నారు. అలాంటి పనులు చేసి సొసైటీకి నష్టం కలిగిస్తున్న ఆరుగురు సభ్యులను సస్పెండ్‌కు ప్రతిపాదించగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. 2025–2030 సొసైటీ ఎన్నికలను డిసెంబర్‌లోపు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా చిత్రపరిశ్రమలోని కార్మికుల సమస్యలు, ఆడిట్ రిపోర్టు ధ్రువీకరణ, సర్‌చార్జి, పాత, కొత్త ప్రాజెక్టుల వివరాలు, సొసైటీ ఆర్థిక పరిస్థితి, సొసైటీ రీఫండ్ చేసిన అడ్వాన్స్‌ల వివరాలపై చర్చించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి పీఎస్‌ఎన్ దొర, కమిటీ సభ్యులు రఘు, లత, అలహరి, రామకృష్ణ ప్రసాద్, అనిత, వేణుగోపాలరావు, రమేష్‌బాబు పాల్గొన్నారు.

'నిరుద్యోగుల బతుకమ్మ' నిరసనకు ప్రతీక

పోలీసులకు, నిరుద్యోగులకు మధ్య వాగ్వాదం



అశోక్‌నగర్‌లో నిరుద్యోగుల బతుకమ్మ..



నిమజ్జనానికి తీసుకువెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు

చిక్కడపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రాత్రి అశోక్‌నగర్ సమీపంలో నిరుద్యోగులు బతుకమ్మ ఆడుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. 'బతుకమ్మా.. నువ్వే మమ్మల్ని బతికించు'అంటూ వేడుకొన్నారు. ఈ సందర్భంగా పలువురు నిరుద్యోగులు మాట్లాడుతూ నిరుద్యోగుల వల్ల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం జాబ్ కేలండర్ విడుదల చేసి రెండు లక్షల ఉద్యోగాలిస్తామని గప్పాలు కొట్టిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అయినా నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతిని అందిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రభుత్వాన్ని నిలదీశారు.

బతుకమ్మను అడ్డుకున్న పోలీసులు...

నిరుద్యోగులు బతుకమ్మను హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేయడానికి బయలుదేరిన నిరుద్యోగులను పోలీసులు అడ్డుకున్నారు. బతుకమ్మ ఆడిన చోటే నీటి తొట్టిలో నిమజ్జనం చేయాలని పోలీసులు చెప్పారు. దీంతో నిరుద్యోగులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చివరికి అశోక్‌నగర్ హుస్సేన్ సాగర్ నాలాలో నిమజ్జనం చేశారు. తాము బ్యానర్ పెట్టకుండా అడ్డుకోవడం దారుణమని, రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోందని మండిపడ్డారు.

నిమ్స్ పరిశోధనలకు అంతర్జాతీయ గుర్తింపు

- డాక్టర్ ఉషారాణి కృషి ప్రశంసనీయం



లక్డీకాపూల్ : నిజామ్స్ వైద్య విజ్ఞాన సంస్థ(నిమ్స్) నిర్వహించిన అనేక పరిశోధనలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప అన్నారు. ఈ గుర్తింపు నిమ్స్ ప్రతిష్టను మరింత పెంచిందని పేర్కొన్నారు. నిమ్స్ ఆడిటోరియంలో నిమ్స్ క్లినికల్ ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.ఉషారాణి పదవీ విరమణ వీడ్కోలు సభ జరిగింది. ఆమెను ఘనంగా సత్కరించిన అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ క్లినికల్ ఫార్మకాలజీ విభాగం ద్వారా నిమ్స్ చేసిన అనేక క్లినికల్ పరిశోధనలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయన్నారు. అందుకు ఆ విభాగాపతిగా 30 ఏళ్లపాటు వ్యవహరించిన డాక్టర్ ఉషారాణి సేవలు ఎనలేనివని కొనియాడారు. ఇందుకు దాదాపు 150 క్లినికల్ ట్రయల్స్, 130 అంతర్జాతీయ పబ్లికేషన్, ఐసీఎంఆర్ పరిశోధనలే నిదర్శనమన్నారు. ఆ విభాగానికి సంబంధించి పీజీ సీట్లను ఏటేటా పెంపొందించడంలో కూడా ఆమె కృషి ఎంతో ఉందని చెప్పారు. అంతేకాకుండా కార్యక్రమంలో నిమ్స్ డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతివీర్, క్లినికల్ ఫార్మకాలజీ విభాగం సైంటిస్ట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, డా. విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంలోనూ ఉత్సాహంగా..



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

చిక్కడపల్లి: తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ ఉత్సవాలు గాంధీనగర్‌లో ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా మహిళలు ఉత్సాహంగా ఆడిపాడి సందడి చేశారు. బుల్లితెర నటి అశ్విని, ప్రముఖ యాంకర్‌లు త్రిపుర నిమ్మగడ్డ, ప్రఖ్యాత గాయని మహేశ్వరి పాల్గొని అందరినీ ఉత్సాహపరిచారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, నవీన్‌కుమార్, రత్నసాయిచంద్, వీఎస్టీ రాజు, శ్రీకాంత్, దామోదర్, పి.నర్సింగ్‌రావు, ఉమేష్, మహిళా మోర్చా నాయకులు సంధ్యారాణి, మంగమ్మ, విజయలక్ష్మీ, సంయుక్తరాణి పూర్ణ, స్వప్న, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

తగ్గిన మూసీ ఉధృతి

చార్మినార్: మూసీలో వరద ఉధృతి తగ్గింది. మూసీ శాంతించడంతో మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. కిషన్‌బాగ్ నుంచి పురానాపూల్ వరకు గల మూసీ పరీవాహక బస్తీల్లోకి వరద నీరు చేరడంతో పడరాని పాట్లు పడ్డారు. ప్రస్తుతం వరద నీరు తగ్గడంతో వారి వారి ఇళ్లల్లోకి చేరుకుని సామాన్లు సర్దుకుంటున్నారు. ఇక వరద ఉధృతికి నీట మునిగిన పురానాపూల్‌లోని శివాలయం చుట్టూ పేరుకుపోయిన బురదను క్లీన్ చేశారు. ఆదివారం ఉదయం నుంచి భక్తులు యథావిధిగా స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలోని షాబాద్ ఫ్లోరింగ్‌తో పాటు సిమెంట్ ఫ్లోరింగ్ వరద నీటిలో కొట్టుకుపోయింది.



శివాలయం చుట్టూ షాబాద్, సిమెంట్ ఫ్లోరింగ్ కొట్టుకుపోయిన దృశ్యం

బతుకమ్మ ఆడిపాడిన ఇతర రాష్ట్రాల మహిళలు



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అఖిల భారత విశ్వకర్మ మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. నగరానికి చెందిన మహిళలతో పాటు కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన మహిళలు సైతం పాల్గొని బతుకమ్మ ఆడటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల మహిళల భాగస్వామ్యం అంతర్జాతీయ సాంస్కృతిక సమైక్యతకు ప్రతీకగా నిలిచిందన్నారు. బతుకమ్మ వేడుకలు సరిహద్దులు దాటి తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, అఖిల భారత విశ్వకర్మ మహాసభ ప్రతినిధులు పాల్గొన్నారు.

'బోల్డ్ మూవ్స్ దట్ మ్యాటర్' పుస్తకావిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ రచయిత్రి సూర్యకాంతం రావి రచించిన 'బోల్డ్ మూవ్స్ దట్ మ్యాటర్'పుస్తకాన్ని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈస్ట్–వెస్ట్ సీడ్స్ సంస్థ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ హెడ్ యూవీఎల్ ఆనంద, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ ఎం.వి.రఘు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు మాట్లాడుతూ మనదేశంలో అపారమైన నైపుణ్యం ఉందని, దానిని వెలికి తీసి సద్వినియోగం చేసుకొనేందుకు సరైన విధానాలను అమలు చేయవలసి ఉందని పేర్కొన్నారు. ఈ పుస్తకం కొంతమంది సాధారణ వ్యక్తుల అసాధారణమైన అద్భుత విజయాలను ఆవిష్కరిస్తుందని చెప్పారు.

ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డుల ప్రదానం



తరుణి సంస్థ ప్రతినిధికి ఎన్జీవో అచీవర్ అవార్డును అందజేస్తున్న దృశ్యం

మాదాపూర్: వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వ్యక్తులకు, ప్రతిభావంతులను ఘనంగా సత్కరించారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఆదివారం నిర్వహించిన ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డ్స్ 6వ ఎడిషన్‌ను రౌండ్‌టేబుల్ ఇండియా సంస్థ ఏర్పాటు చేసింది. ట్రిబ్యూట్, అచీవర్, స్పెషల్ జ్యూరీ అవార్డు, ఎమర్జింగ్ టాలెంట్ అవార్డులను అందజేశారు. కళలు, సాంస్కృతిక రంగం, విద్య, ఎంటర్‌టైన్‌మెంట్, ఫుడ్, బెవరేజేస్, హెల్త్‌కేర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎన్జీవో, పబ్లిక్ సర్వీసెస్, రిటైల్, క్రీడలు, స్టార్‌కిడ్, స్టార్ ఉమెన్, స్టార్టప్ కేటగిరీలకు అవార్డులను అందజేశారు. అనంతరం శివాంశ్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ విద్యార్థులు క్లాసికల్ ఫ్యూజన్ ప్రదర్శనతో అలరించారు. ఒగ్గు రాజశేఖర్ బృందం ఒగ్గుడోలు ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. 2024 ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డ్స్ ద్వారా సమకూర్చిన నిధులతో నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదులను నిర్మించినట్టు నిర్వాహకులు తెలిపారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 29, సెప్టెంబర్, 2025







ఒక్కేసి పువ్వేసి చందమామ.. ఒక్క జాములాయే చందమామ.., రెండేసి పువ్వేసి చందమామ.. రెండు జాములాయే చందమామ.. అంటూ 9 రోజుల పాటు కొనసాగిన పూల పండుగ ముగింపుకు చేరుకుంది. బతుకమ్మ పండుగంటే ప్రకృతిని దేవతలా కొలిచే పండుగ. సాధారణంగా దేవుళ్లని పూలతో పూజిస్తారు. అలాంటి పూలనే దేవతల్లా పూజించే ఏకైక సాంస్కృతిక పండుగ మన బతుకమ్మ. నగరంలో పూల కొరత ఎంత ఉన్నా కొనుగోలు చేసి మరి బతుకమ్మని పేర్చుతారు. రవీంద్రభారతి, శిల్పారామం వంటి ప్రదేశాల్లో ఊర్లను సైతం మైమరిపించే విధంగా బతుకమ్మ ఉత్సవం జరుగుతుంది అంటే అతిశయోక్తి కాదేమో. కారణాలు ఏమైనప్పటికీ నగరంలో అతిపెద్ద పండుగ సందర్భాల్లో బతుకమ్మే ప్రధానమైనది.



చిన్నా పెద్దా కలసి, మెలసి..

హైదరాబాద్ అంటే ఉరుకుల పరుగుల జీవితం.. అలాంటి బిజీ షెడ్యూల్‌కు చెక్ పెట్టి.. మగువలంతా కలిసి.. చిన్నా పెద్దా తేడా లేకుండా పూలతో, సంప్రదాయ అలంకరణతో నగరానికి సాంస్కృతిక హంగులను అద్దుతున్నారు. బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదు, తెలంగాణ స్త్రీ శక్తి గౌరవం, ఆత్మీయతకు ప్రతిబింబం. వీటిని ప్రతిబింబించేలా హుస్సేన్ సాగర్ ట్యాంక్ బండ్ వద్ద మహిళలు పెద్ద ఎత్తున చేరి బతుకమ్మ ఆడుతున్నారు. ఇందిరా పార్క్, ఎన్‌టీఆర్ గార్డెన్స్, లిబర్టీ ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చార్మినార్, శాలిబండ, కూకట్‌పల్లి, ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, మియాపూర్ ప్రాంతాల్లో స్థానిక కాలనీల్లో ఉత్సాహంగా వేడుకలు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి మున్సిపల్ వార్డులో, కాలనీ పార్కుల్లో బతుకమ్మ వేదికలు ఏర్పాటు చేశారు. పండుగలో ఉపయోగించే పూలు.. తంగేడు, గునుగు, చామంతి, బంతి, గుమ్మడి, పట్టికుచ్చులు, తామర, చంద్రకాంతం, నందివర్ధనం, గడ్డి పువ్వు, కట్ల పువ్వు, నేల గులాబీ, బీరపువ్వు, కాశిరత్నం, చల్లగుత్తి, కనకాంబరం, మల్లె, మందారం ఇలా చెప్పుకుంటూ పోతే తెలంగాణలో దొరికే ప్రతి పువ్వునూ బతుకమ్మలో పేర్చవచ్చు. వీటి వెనుక ప్రత్యేక ఔషధ, పర్యావరణహిత శాస్త్రీయ అంశాలు దాగున్నాయి. సహజ పూలతో చేసే బతుకమ్మ పర్యావరణాన్ని పరిరక్షిస్తుంది.

చిత్తూ చిత్తుల బొమ్మ.. శివుని ముద్దుల గుమ్మ.. బంగారు బొమ్మ దొరికేనమ్మో ఈ వాడలోన.. రాగిబింద తీసుక రమణి నీళ్లకు వోతే.. రాములోరు ఎదురయ్యేనమ్మో ఈ వాడలోన.. వెండి బింద తీసుక వెలది నీళ్లకు వోతే.. వెంకటేశుడెదురాయే నమ్మో.. అంటూ సాగే తెలంగాణ బతుకమ్మ పాటలు వింటే.. ఎన్ని తరాలు మారినా బతుకమ్మ పండుగ సంస్కృతిని ప్రతిబింబించడంలో తన ప్రశస్తిని చాటుకుంటూనే ఉంది. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో అత్యంత వైభవంగా జరిగే బతుకమ్మ.. క్రమంగా భాగ్యనగరంలో తన ఘనతని చాటుకుంటూ.. ప్రకృతి పండుగ ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటోంది. నగరంలో బతుకమ్మ అంటే ప్రతి పువ్వూ, ప్రతి ఆకూ.. ఊరి నుంచే తరలి రావాలి.. అంటే పల్లెకూ.. పట్నానికీ మధ్య సాంస్కృతిక వారధిగా మన బతుకమ్మ నిలుస్తోంది.

- సాక్షి, సిటీబ్యూరో

చిత్తూ చిత్తుల బొమ్మ.. శివుని ముద్దుల గుమ్మ..

- నగరానికి బతుకమ్మ సంప్రదాయ శోభ
- పల్లెకు, పట్నానికి సాంస్కృతిక వారధి
- తీరొక్క పూలు.. పట్టు పరికిణీతో పట్నం
- బతుకమ్మ ముగింపుకు రావడంతో పెరిగిన సందడి
- రవీంద్రభారతి, శిల్పారామం తదితర ప్రాంతాల్లో హుషారు
- సోషల్ మీడియాలో రీల్స్.., సెలబ్రిటీల హడావుడి
- ఈసారి బతుకమ్మ వేడుకల్లో మిస్ వరల్డ్ విజేత..







మారుతున్న కాలానికి అనుగుణంగా నగరం బతుకమ్మ సంస్కృతిని తనలో ఇముడ్చుకుంది. ఇక్కడి విభిన్న సంస్కృతులు, ప్రాంతాలకు చెందిన వారు బతుకమ్మ సంబరాల్లో పాల్గొంటూ బతుకమ్మ పాటలకు శృతి కలుపుతున్నారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ అధికారులే కాకుండా సినీతారలు, ఇతర రంగాల ప్రముఖులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. ఈ సారి వేడుకల్లో మిస్ వరల్డ్ విజేత ఓపల్ సుచాత బతుకమ్మ ఆడడం విశేషం. ఈ పండుగ ముగింపుకు చేరడంతో సోషల్ మీడియా కూడా పూలు, పట్టు పరికిణి కట్టుకున్నట్టుగానే కలర్‌ఫుల్ సందడి కనిపిస్తోంది. బతుకమ్మ ఆటల వీడియోలు, రీల్స్ సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తున్నాయి. గేటెడ్ కమ్యూనిటీల్లో, విల్లాల్లో అంగరంగ వైభవంగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఒకప్పటిలా నగరం మూగబోకుండా సాంస్కృతిక సందడిని భవిష్యత్తు తరాలకు అందించడం ప్రపంచవ్యాప్తంగా ఆకర్షిస్తోంది.

నృత్యం నయనానందకరం..

శిల్పారామంలో ఆకట్టుకుంటున్న దసరా మేళా

అలరించిన భరతనాట్య, కూచిపూడి ప్రదర్శనలు

అన్నమయ్యపురంలో నాదబ్రహ్మోత్సవ్-2025

మాదాపూర్ : కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. మాదాపూర్‌లోని శిల్పారామంలో దసరా ఉత్సవాల్లో భరతనాట్యం, కూచిపూడి నృత్యప్రదర్శనలు ఆదివారం ఆకట్టుకుంటున్నాయి. ఇందులో భాగంగా రష్మీ సచిదానంద శిష్యబృందంచే భరతనాట్య ప్రదర్శనలో భాగంగా పుష్పాంజలి, గణపతిస్తుతి, అంబస్తవం, దేవికృతి తదితర అంశాలను ఆకాంక్ష, సాయినేహ, సంభవి, వేదాంశీ, సిరి అలరించారు. బాలత్రిపుర సుందరి శిష్యబృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనలో భాగంగా పాహి పాహి బాలగణపతి, కామాక్షిస్తుతి, భావయామి రామలింగేశ్వరం, కామాక్షి స్వరజతి, నటరాజస్తుతి, దేవీస్తుతి వంటి అంశాలను యజ్ఞశిక, ప్రియసిని, సంజన, అనురిత, చైత్రహాసిని అలరించారు. శిల్పారామం సిబ్బంది, సందర్శకులు బతుకమ్మ ఆడారు.



అన్నమయ్యపురంలో గాన కచేరీ..

సినీ నేపథ్య గాయకుడు వేము శ్రీరంగం సుమధర గాత్రంతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న నాదబ్రహ్మోత్సవ్-2025లో భాగంగా సంకీర్తన గానంతో ఆదివారం ఆకట్టుకున్నారు. ఇందులో నారాయణతే నమోనమో, హరి నామము కడు ఆనందకరము, ఆది మూలమే, ఏమని పొగుడుదుమే, అంతము నీవే, చూడరమ్మ సతులారా వంటి కీర్తనలను ఆలపించి సందర్శకులను ఆకట్టుకున్నారు. కీబోర్డు రాజు, తబలా అజయ్ వాయిద్య సహకారాన్ని అందించారు. అనంతరం కళాకారులను పద్మశ్రీ డాక్టర్ శోభరాజు సత్కరించారు.

బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన కల్పిస్తూ నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజా వేదికగా పింక్ పవర్ రన్ ఆదివారం నిర్వహించారు. ఈ మారథాన్‌లో ప్రపంచ సుందరీమణులు, సినీ ప్రముఖులు, అధికారులు, వృద్ధులు, చిన్నారులు పాల్గొన్నారు. 10కే, 5కే, 3కే విభాగాల్లో రన్ నిర్వహించారు. రన్‌లో పాల్గొనే వారికి అంతర్జాతీయ ఫిట్నెస్ నిపుణులు మెళకువలు నేర్పించారు. గత సంవత్సరం 10వేల మంది పాల్గొనగా.. ఈ యేడాది 20వేల మంది పింక్ పవర్ రన్‌లో పాల్గొన్నారు. - ఖైరతాబాద్

జంక్ ఫుడ్ మానేసి.. వ్యాయామం చేయండి..

కేబీఆర్ పార్కు వద్ద వాకథాన్ | రెయిన్ బో ఆస్పత్రిలో 'అథ్లెటిక్ హార్ట్' క్లినిక్ | ప్రపంచ హార్ట్ డే సందర్భంగా పుల్లెల గోపీచంద్





బంజారాహిల్స్ : జంక్ ఫుడ్ మానేయడంతో పాటు ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం కోసం వ్యాయామం చేయాలని అర్జున అవార్డు గ్రహీత, పద్మభూషణ్, పద్మశ్రీ పుల్లెల గోపీచంద్ అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా కార్డియలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కేబీఆర్ పార్కు వద్ద ఆదివారం వాకథాన్ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన గోపీచంద్ ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం ప్రతి ఒక్కరూ నడకకు సమయం కేటాయించాలని సూచించారు. శరీరానికి అవసరమైన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని, అవసరం లేని ఆహారం ఆరోగ్యానికి చేటు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు గోకల్‌రెడ్డి, రామకృష్ణ జనపాటి, సందీప్ పాల్గొన్నారు.

రెయిన్ బో ఆస్పత్రిలో..

బంజారాహిల్స్ రెయిన్ బో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్ హార్ట్ క్లినిక్‌ను పుల్లెల గోపీచంద్ ఆదివారం ప్రారంభించారు. ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దీన్ని నిర్వహిస్తామని ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ దినేష్ చిర్ల తెలిపారు. అత్యాధునిక ప్రమాణాలతో, అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో ఈ సెంటర్ కొనసాగుతుందని వారు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, అప్పుడే శరీరంలో ఏం జరుగుతుందనేది తెలుస్తుందని గోపీచంద్ అన్నారు. జాతీయ ఉత్తమ బాల పురస్కార గ్రహీత సుకృతి వేణి బండ్రెడ్డి పాల్గొన్నారు.

ఆనందమే.. ఆరోగ్యం..

- ఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పింక్ పవర్ రన్
- మారథాన్‌లో పాల్గొన్న ప్రముఖులు



బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

మూడు విభాగాల్లో నిర్వహించిన ఈ పింక్ పవర్ రన్‌ను మిస్ వరల్డ్ -2025 ఓపల్ సుచాత, మిస్ ఆసియా కృష్ణ, ఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మపర్సన్ సుధారెడ్డి పలువురు ప్రముఖులతో కలిసి జెండా ఊపి రన్ ప్రారంభించారు. కేన్సర్ మహమ్మారిపై అవగాహన కల్పించేందుకు రన్ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. పది కిలోమీటర్ల పరుగును అతి తక్కువ సమయంలో పూర్తిచేసిన ముగ్గురు మహిళలకు ట్రోఫీలతో పాటు ప్రైజ్ మనీ అందజేశారు. బ్రెస్ట్ కేన్సర్ అవగాహన రన్‌లో పాల్గొన్న ఏడు సంవత్సరాల పార్వతి, ఐదు కిలోమీటర్ల విభాగంలో ఐదు సంవత్సరాల కబీర్ సింగ్, వీల్ చైర్‌తో పాల్గొన్న నంద కిషోర్ అనే యువకుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రన్‌లో పాల్గొన్న వారితో నెక్లెస్ రోడ్డు గులాబీ వర్ణంతో నిండిపోయింది.





ప్రముఖుల సందడి..

మెగా ఇంజినీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, సుధారెడ్డి ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన పింక్ మారథాన్‌లో అంతర్జాతీయ మాజీ టెన్నిస్ క్రీడాకరుడు లియాండర్ ఫేస్, ప్రముఖ సినీ నటుడు బ్రహ్మానందం, పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్, సీనియర్ ఐపీఎస్ అధికారి తరుణ్ జోషి, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ చైర్ పర్సన్ జూలియా, పీవీ కృష్ణారెడ్డితో పాటు అధికారులు, ప్రముఖులు రన్‌లో పాల్గొన్నారు.

కారులో టచ్ స్క్రీన్.. కాకూడదు పరేషాన్!

బ్రాండ్, కారు పనితీరు, ఎక్స్‌టీరియర్, ఇంటీరియర్ డిజైన్ మాత్రమే కాదు.. కారు లోపల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ కూడా కారు కొనుగోలు సమయంలో కీలక పాత్ర పోషిస్తోంది. కొత్త మోడళ్లు హైటెక్, ఫ్యూచరిస్టిక్ స్క్రీన్‌తో వస్తున్నాయి. ఖుషీఖుషీగా కారులో ప్రయాణిస్తూ.. ఈ టచ్ స్క్రీన్ల వాడకంలో కొందరు బిజీ అయిపోతున్నారు. అదిగో, అదే మంచిది కాదు, అని హెచ్చరిస్తున్నారు నిపుణులు. ఒక్క మనదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా 'టచ్‌స్క్రీన్' చర్చనీయాంశంగా మారింది.



ఫోన్ కాల్స్, ఏసీ, నావిగేషన్, సంగీతం, 360 డిగ్రీ వ్యూ.. ఇలా ఎన్నో ఫీచర్లను డ్రైవర్ ముందున్న టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ నియంత్రిస్తోంది. ఫ్యాక్టరీ ఫిట్టింగ్ లేనప్పటికీ కొందరు తమ కార్లలో వీడియోలు ప్లే అయ్యేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బైక్ డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ఫోన్ వాడటం ప్రమాదకరం. అలాగే, కారులో కూడా టచ్ స్క్రీన్ వాడకం.. డ్రైవింగ్ మీద దృష్టిని మరల్చే పెద్ద సమస్యగా పరిణమిస్తోందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి.

సులభమేమీ కాదు



సాధారణంగా డ్రైవర్లు.. దృష్టి మరల్చకుండానే స్టీరింగ్‌కు, డ్రైవింగ్ సీటుకు సమీపంలో ఉన్న బటన్లను సులభంగా ఉపయోగిస్తారు. ఇటీవలి కాలంలో ముఖ్యమైన బటన్లను కంపెనీలు స్టీరింగ్ వీల్‌పై అమర్చుతున్నాయి. కానీ, టచ్‌స్క్రీన్ ఉపయోగించడం అంత సులభం కాదు. ఒక నిర్దిష్ట సెట్టింగ్‌ను కనుక్కోవాలంటే ఒక విండో నుంచి మరొక విండోకు వెళ్లాల్సి ఉంటుంది. ఏ ఫీచర్‌ను వినియోగించాలన్నా సమయం తీసుకుంటుంది.

'వీ బుల్లరీ' అధ్యయనంలో..



2022లో స్వీడిష్ మోటరింగ్ మ్యాగజైన్ 'వీ బుల్లరీ' ఓ అధ్యయనం చేపట్టింది. గంటకు 110 కిలోమీటర్ల వేగంతో డ్రైవింగ్ చేస్తున్నప్పుడు రేడియో స్టేషన్ మార్చడం, ఉష్ణోగ్రతను అడ్జస్ట్ చేయడం వంటి పనులకు డ్రైవర్లకు ఎంత సమయం పట్టిందో పరిశీలించారు. ఇందులో వినియోగించిన 12 కార్లలో 11 కార్లకు టచ్‌స్క్రీన్స్ ఉన్నాయి. బటన్లతో కూడిన ఒకే ఒక పాత కారు ఉపయోగించారు. పాత కారులో డ్రైవర్లు నిర్దేశించిన పనులను 10 సెకన్లలోపు చేయగలిగారు. కానీ ఆధునిక మోడళ్లలో అవే పనులకు సుమారు 45 సెకన్లు పట్టింది. డ్రైవర్ల దృష్టిని టచ్‌స్క్రీన్లు ఎంతలా మరల్చుతున్నాయో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

టచ్ స్క్రీన్స్ వాడేటప్పుడు జాగ్రత్త

డ్రైవర్ దృష్టిని మరల్చుతున్నాయ్

హంగుల కంటే భద్రతే ప్రధానం

- సాక్షి, స్పెషల్ డెస్క్

మరో రెండు అధ్యయనాల్లో..

ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్‌పై వేర్వేరు పనులు చేస్తున్నప్పుడు డ్రైవర్లు ఎంతసేపు పరధ్యానంగా ఉన్నారో తెలుసుకోవడానికి నార్వేకు చెందిన కాంట్రాక్ట్ పరిశోధన సంస్థ 'సింటెఫ్' 2024లో ఓ అధ్యయనం నిర్వహించింది. ఇందుకోసం కంటి చూపును పసిగట్టే ట్రాకింగ్ కెమెరాలను ఉపయోగించారు. రోడ్డు వైపు చూడకుండా ఉష్ణోగ్రతను మార్చడానికి డ్రైవర్లకు సగటున మూడున్నర సెకన్లు పట్టింది. రేడియో స్టేషన్ మార్చడానికి 11 సెకన్లు, నావిగేషన్ టూల్‌లో కొత్త చిరునామాను చేర్చడానికి 16 సెకన్ల సమయం తీసుకున్నారు. 2020లో బ్రిటిష్ సంస్థ 'ట్రాన్స్‌పోర్ట్ రీసెర్చ్ ల్యాబొరేటరీ' ప్రచురించిన ఒక విశ్లేషణ ప్రకారం.. పరిమితికి మించి ఆల్కహాల్ సేవించి నడిపే డ్రైవర్లలో డ్రైవింగ్ కంటే టచ్ స్క్రీన్లే రియాక్షన్ టైమ్‌ని ఎక్కువ ప్రభావితం చేస్తున్నాయి. దేనికైనా స్పందించే రేటు.. డ్రైవింగ్ వల్ల కంటే టచ్‌స్క్రీన్ ఆపరేట్ చేయడం వల్లే తక్కువగా ఉంటోందన్నమాట.

స్విచ్‌ల ద్వారా..

'యూరో ఎన్‌సీఏపీ',, యూరప్‌లో కార్లకు భద్రతా రేటింగ్స్ ఇచ్చే సంస్థ. నిజానికి ఇది చట్టబద్ధమైన సంస్థ కాదుగానీ, ఇది ఇచ్చే రేటింగ్స్‌ని కార్ల కంపెనీల ప్రామాణికంగా భావిస్తాయి. వచ్చే జనవరి నుండి విక్రయించే కార్లకు ఈ సంస్థ కొత్త నియమాలు నిర్దేశించింది. దీని ప్రకారం విండ్‌స్క్రీన్ వైపర్ల వంటి ముఖ్యమైన ఫంక్షన్లు టచ్‌స్క్రీన్ల ద్వారా కాకుండా ఫిజికల్ స్విచ్‌ల ద్వారా నియంత్రించేలా ఏర్పాటు చేయకపోతే ఏ కారుకూ ఫైవ్ స్టార్ స్కోర్ ఇవ్వరు. మన దేశంలో కార్లను విక్రయించే కంపెనీలు స్టీరింగ్‌పై అనువుగా కొన్ని బటన్స్‌ను పొందుపరుస్తున్నాయి. ఎందుకంటే.. టచ్‌స్క్రీన్లతో పోలిస్తే ఫిజికల్ బటన్లు వాడటమే డ్రైవర్లకు సులభంగా ఉంటుంది. అయితే ఈ బటన్లు కూడా వాడటం కష్టమనుకునే వారికోసం చాలా వాహన తయారీ సంస్థలు వాయిస్ కంట్రోల్‌తో పనిచేసేలా ఫీచర్లను జోడిస్తున్నాయి. ఎంత గొప్ప కారు అయినా.. ముందు భద్రత ప్రధానం.. తరవాతే ఎన్ని హంగులైనా!

ఇలా చేయండి..

- డ్రైవ్ చేసే ముందు లేదా సురక్షితమైన స్థలంలో వాహనం ఆపి రేడియో, జీపీఎస్, ఏసీ వంటి సర్దుబాట్లు చేసుకోండి.
- ఇన్‌కమింగ్ కాల్స్, నోటిఫికేషన్స్ వచ్చినప్పుడు దృష్టి మరలుతుంది. కాబట్టి మీ ఫోన్‌ను వాహనం బ్లూటూత్‌కు అనుసంధానించవద్దు.
- వాహనంలో ప్రత్యామ్నాయ బటన్లు ఉంటే వాటిని ఉపయోగించండి.
- మీ పక్క సీటులో ఎవరైనా ఉంటే.. వారికి టచ్‌స్క్రీన్ బాధ్యతలు అప్పగించండి.



క్లుప్తంగా...

హైదరాబాద్ చేరుకున్న చిరంజీవి



శంషాబాద్ (హైదరాబాద్): ఇటీవల ఏపీ అసెంబ్లీ వేదికగా జరిగిన చర్చలో సినీనటుడు బాలకృష్ణ చేసిన తప్పుడు వ్యాఖ్యలపై విదేశాల నుంచి స్పందించిన సినీనటుడు చిరంజీవి ఆదివారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్నారు. అమెరికా నుంచి వచ్చిన ఆయన శంషాబాద్ విమానాశ్రయంలో మీడియా పలు ప్రశ్నలు సంధించినా.. ఏ మాత్రం స్పందించ కుండా వెళ్లిపోయారు. అభిమానులకు మాత్రం సెల్ఫీలు ఇచ్చుకుంటూ ముందుకు సాగారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయానికి మరోసారి బాంబు బెదిరింపు మెయిల్ రావడం కలకలం రేపింది. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో ఆర్‌జీఐఏ కస్టమర్ సపోర్ట్ మెయిల్‌కు ఓ మెయిల్ వచ్చింది. అందులో విమానాశ్రయంలోని భవనంలో బాంబులు పెట్టినట్లు పేర్కొన్నారు. దీంతో అప్రమత్తమైన సీఐఎస్‌ఎఫ్, ఇతర భద్రతాధికారులు వెంటనే తనిఖీలు చేపట్టారు. తర్వాత బాంబులేదని తేల్చుకుని ఊపిరి పీల్చుకున్నారు. ఈవిల్‌టెర్రరైజర్111 అన్న ఐడీతో మెయిల్ చేసిన ఆగంతకుడు తాను టెర్రరిస్టుల గ్రూప్‌కు లీడర్‌ను అంటూ అందులో పేర్కొన్నాడు. తనను ఎవరూ టచ్ చేయలేరంటూ అందులో రాసుకొచ్చాడు. ఇదిలా ఉండగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో పాటు ఇదే విధమైన మెయిల్‌ను అనేక పాఠశాలలకు కూడా పంపాడు.

రిటర్నింగ్ అధికారుల శిక్షణ వాయిదా వేయండి

ఎస్‌ఈసీకి వీహెచ్‌పీ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: బతుకమ్మ, సద్దుల బతుకమ్మ పండుగల నేపథ్యంలో.. ఈనెల 29న ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు తలపెట్టిన శిక్షణ కార్యక్రమం వాయిదా వేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) విజ్ఞప్తి చేసింది. సద్దుల బతుకమ్మ ఉత్సవాలు సోమ, మంగళవారాల్లో జరుగుతున్నందున.. ఈ రోజుల్లో ఆర్వోల శిక్షణ కార్యక్రమం రద్దుచేసి మరో రోజు నిర్వహించాలని సూచించింది.

రిజర్వేషన్ల చట్టాన్ని గవర్నర్ ఆమోదించాలి: జాజుల



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వెంటనే ఆమోదించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఆయన ఆదివారం సచివాలయంలోని మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. బీసీ బిల్లులను గవర్నర్ ఆమోదించినప్పుడే వారికి న్యాయం జరుగుతుందన్నారు. జీవో 9ని సవాల్ చేస్తూ రెడ్డి జాగృతికి చెందిన నాయకులు హైకోర్టులో పిటిషన్ వేసి అడ్డుకోవాలని చూశారన్నారు. హైకోర్టులో బీసీ రిజర్వేషన్ల అంశం నిలబడాలంటే.. బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని తక్షణమే రాష్ట్ర గవర్నర్ ఆమోదించాలన్నారు.

ఈపీసీవోఏ గౌరవాధ్యక్షునిగా మహేశ్



సాక్షి, హైదరాబాద్: ఈ-పంచాయత్ కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్ తెలంగాణ స్టేట్ (ఈపీసీవోఏ-టీఎస్) గౌరవాధ్యక్షునిగా టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ కొనగాల మహేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఆయన రెవెన్యూ శాఖలోని ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ (ఎఫ్‌టీఎస్) అసోసియేషన్ గౌరవాధ్యక్షునిగా కూడా వ్యవహరిస్తున్నారు. కాగా, పంచాయతీరాజ్ శాఖ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని ఆదివారం ఒక ప్రకటనలో మహేశ్ వెల్లడించారు.

మెగాస్టార్‌కు ఇంత అవమానమా?

రగిలిపోతున్న చిరంజీవి అభిమానులు, కాపు సామాజికవర్గ నేతలు

- చిరంజీవిని బాలకృష్ణ అవమానించినప్పుడు సభలోనే ఉన్న చంద్రబాబు.. మాట మాత్రంగా కూడా నిలువరించకుండా మౌనం
- స్వయంగా చిరంజీవి స్పందించి లేఖ విడుదల చేసినా మౌనం వీడని సోదరుడు పవన్
- పవన్ గతంలో పలుమార్లు అనారోగ్యానికి గురైనా ఎప్పుడూ పరామర్శించని చంద్రబాబు
- ఇప్పుడు చంద్రబాబు రాగానే స్వయంగా స్వాగతం పలికిన పవన్



సాక్షి, అమరావతి: కేంద్ర మాజీమంత్రి, మెగాస్టార్ చిరంజీవిని ఉద్దేశిస్తూ టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శాసనసభ సాక్షిగా ఇటీవల చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ తమ రాజకీయ డ్రామాలో భాగంగానే ఆదివారం హైదరాబాద్‌లో ఇరువురూ కలుసుకున్నట్లు రాజకీయ వర్గాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. బాలకృష్ణ వ్యాఖ్యలపై చిరంజీవి అభిమానులు, కాపు సామాజికవర్గీయుల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమవుతుండడంతో దానిని కవర్ చేసుకునేందుకు, రాజీ కుదుర్చుకునేందుకే చంద్రబాబు పరామర్శ పేరుతో హైదరాబాద్‌లోని పవన్ కళ్యాణ్ ఇంటికి వెళ్లినట్లు జోరుగా చర్చ నడుస్తోంది. అసెంబ్లీ సమావేశాల్లోనే బాలకృష్ణ ఈ వ్యాఖ్యలు చేసినప్పుడు సభలోనే ఉన్న చంద్రబాబుగానీ, జనసేన ఎమ్మెల్యేలుగానీ కనీసం స్పందించలేదు. పవన్‌కళ్యాణ్ అయితే.. చిరంజీవికి జరిగిన తీవ్ర అవమానంపై ఇప్పటివరకూ నోరువిప్పకపోగా ఆదివారం తన ఇంటికొచ్చిన చంద్రబాబుకు పుష్పగుచ్ఛంతో ఎదురేగి ఘనంగా స్వాగతం పలికారు. ఇదంతా చూస్తుంటే చిరంజీవిని ఉద్దేశపూర్వకంగా అవమానించినట్లుగా ఉందని చిరు అభిమానులు, కాపు సంఘాల నేతలు బలంగా విశ్వసిస్తున్నారు. నిజానికి.. ఈ ఏడాది రెండు, మూడుసార్లు పవన్ అనారోగ్యానికి గురైనప్పటికీ అప్పుడెప్పుడూ ఆయన ఇంటికి వెళ్లి మరీ పరామర్శించని చంద్రబాబు ఈసారి హైదరాబాద్‌కు ప్రత్యేకంగా వెళ్లి మరీ పలకరించడాన్ని చూస్తుంటే ఇదంతా రాజకీయ డ్రామానేని వారు ఆరోపిస్తున్నారు.

పవన్‌పై చిరు అభిమానులు, కాపు వర్గీయుల్లో అసంతృప్తి..

ఇదిలా ఉంటే.. బాలకృష్ణ వ్యాఖ్యల ఎపిసోడ్‌లో పవన్‌కళ్యాణ్ వ్యవహారశైలిపై చిరంజీవి అభిమానులు, కాపు సామాజికవర్గీయుల్లో అసంతృప్తి వెల్లువెత్తుతోంది. చంద్రబాబుకు రాజకీయంగా ఇబ్బందికర పరిస్థితులు వచ్చినప్పుడల్లా పవన్‌కళ్యాణ్ ఆయనకు ఏదో విధంగా అండగా ఉంటున్నారన్న వ్యాఖ్యలు ఆ వర్గీయుల నుంచే వస్తున్నాయి. ఎందుకంటే.. బాలకృష్ణ కామెంట్లపై ఎక్కడో విదేశాల్లో ఉన్న చిరంజీవి స్పందిస్తూ మీడియాకు ప్రకటన విడుదల చేశారుగానీ పవన్‌కళ్యాణ్ ఇప్పటి వరకు ఈ అంశంపై కనీసం నోరువిప్పలేదని.. ఇది పరోక్షంగా బాబుకు మేలు చేయడమేనని వారు గుర్తుచేస్తున్నారు. జ్వరంతో బాధపడుతున్నందున పవన్‌కళ్యాణ్ స్పందించలేదని అనుకున్నా.. డీఎస్సీ నియామకాల అంశంలో లోకేశ్‌ను అభినందిస్తూ పవన్ ప్రకటన జారీచేశారు. తమిళనాడులో విజయ్ సభలో జరిగిన తొక్కిసలాట ఘటనపైనా విచారం వ్యక్తంచేశారు. కానీ చిరంజీవిపై బాలకృష్ణ వ్యాఖ్యల అంశంలో మౌనం దాల్చడంపై ఆ వర్గీయుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు.. ఎమ్మెల్సీ కాకముందు వరకు చిరంజీవిపై ఎవరు విమర్శలు చేసినా విరుచుకుపడే నాగబాబు కూడా టీడీపీ మద్దతుతో ఎమ్మెల్సీ అయ్యాక ఆయన కూడా తన నోటికి తాళాలు వేసుకోవడంపై సామాజిక మాధ్యమాల్లో సెటైర్లు పేలుతున్నాయి.

టీడీపీపై కాపుల్లో వ్యతిరేకత పెరగకుండా ఉండేందుకే..

బాలకృష్ణ తాజా వ్యాఖ్యలతో చిరంజీవి అభిమానులు, కాపు సామాజికవర్గాల్లో టీడీపీపై వ్యతిరేకత పెరగకుండా ఉండేందుకే చంద్రబాబు పవన్‌కళ్యాణ్‌ను పరామర్శించారన్న చర్చ కూడా జరుగుతోంది. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న పవన్‌కళ్యాణ్ ఇందుకు తనవంతుగా బాబుకు తోడ్పాటు అందిస్తున్నారని చర్చించుకుంటున్నారు. అలాగే, చంద్రబాబే స్వయంగా వచ్చి తనను పరామర్శించారన్న సానుభూతి కాపు సామాజికవర్గంలో కలిగించాలన్నది వీరిరువురి వ్యూహమని వారంటున్నారు.

6-10 తరగతులకు లేబొరేటరీ మాన్యువల్స్

పాఠశాల విద్యా శాఖ విడుదల

సాక్షి, హైదరాబాద్: పాఠశాల విద్యార్థుల బోధన విధానాలను మరింత మెరుగుపరిచేందుకు ప్రయోగాలకు పదును పెట్టాలని పాఠశాల విద్య డైరెక్టరేట్ నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రయోగశాలల నిర్వహణ విధానాలకు మార్గదర్శకాలను రూపొందించింది. ఆరు నుంచి పదో తరగతి వరకూ అన్ని స్థాయిల ప్రభుత్వ పాఠశాలల్లో విధిగా లేబొరేటరీ మాన్యువల్స్‌ను అనుసరించాలని పాఠశాల విద్య డైరెక్టర్ డాక్టర్ ఈ.నవీన్ నికోలస్ జిల్లా అధికారులకు జారీ చేసిన ఆదేశాలను ఆదివారం విలేకరులకు విడుదల చేశారు. థియరీతో పాటు ప్రాక్టికల్స్ సక్రమంగా నడిచినప్పుడే విద్యార్థులు పాఠశాలను ప్రయోగాత్మకంగా తెలుసుకునే వీలుంది. గణితం, జనరల్ సైన్స్, ఫిజిక్స్, బయొలాజికల్ సైన్స్‌లో లేబొరేటరీ తరగతులు నిర్వహిస్తారు. ఏ చాప్టర్‌లో ఏయే ప్రయోగాలు చేయాలి? వీటిని ఎలా? ఎప్పుడు చేయాలనే వివరాలను ప్రతీ ఉపాధ్యాయునికి పంపుతారు. ఇందులో అన్ని వివరాలు ఉంటాయని అధికారులు తెలిపారు.



పుస్తకావిష్కరణలో చిరంజీవులు ఈటల, జస్టిస్ ఈశ్వరయ్య బండా ప్రకాశ్ తదితరులు

బీసీలు రాజ్యాధికార సాధనకు పోరాడాలి

మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్‌ముదిరాజ్

సనత్‌నగర్ (హైదరాబాద్): బీసీలు రాజ్యాధికార సాధన పోరాటానికి నడుం బిగించాలని రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌ముదిరాజ్ అన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు రచించిన హిస్సా ఇజ్జత్ హుకుమత్ బీసీ రాజ్యాధికార సిద్ధాంత పుస్తకాన్ని ఆదివారం ఐఏఎస్ ఆఫీసర్స్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బండ ప్రకాశ్ మాట్లాడుతూ రాజకీయ రంగంలో బీసీలు అణిచివేతకు గురవుతున్నారనే వివరాలను గణాంకాలతో సహా ఈ పుస్తకంలో పొందుపరిచారని తెలిపారు. శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ బీసీలు చైతన్యం తెచ్చుకుని అధికారం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాల్లో కులంతో పాటు డబ్బు ప్రధాన పాత్ర పోషిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ బీసీలకు రాజ్యాంగ రచన సమయం నుంచి.. ఇప్పటివరకు కూడా అన్యాయం జరుగుతూనే ఉందని అన్నారు. మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు ఉన్నవిధంగా రాజ్యాంగంలో రిజర్వేషన్లు లేకపోవడం వల్ల చాలా నష్టపోయామని పేర్కొన్నారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ బీసీలు రాజ్యాంగపరమైన పరిజ్ఞానం పెంచుకుని చట్టబద్ధమైన రిజర్వేషన్లు సాధించేందుకు పోరాటాలు చేయాలని సూచించారు. పుస్తక రచయిత చిరంజీవులు మాట్లాడుతూ తాను ఎంతో అధ్యయనం చేసి ఈ పుస్తకాన్ని రాశానని, బీసీలు ఈ పుస్తకాన్ని అధ్యయనం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి పూర్ణచందర్‌రావు, బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగొని బాలరాజ్‌గౌడ్, గౌడ సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అయిలి వెంకన్నగౌడ్, ప్రముఖ రచయిత సంగిశెట్టి శ్రీనివాస్, వకుళాభరణం కృష్ణమోహన్, దాసు సురేశ్, జూలూరు గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఒకేసారి 3 గ్రూప్స్ ఉద్యోగాలు

గ్రూప్-2, 3, 4 కొలువులు సాధించిన మహిళ



అయిజ: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్స్ ఫలితాల్లో జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని చిన్నతాండ్రపాడు గ్రామానికి చెందిన ఎం.జ్యోత్స్న ఒకేసారి గ్రూప్-2, 3, 4 ఉద్యోగాలు సాధించింది. జ్యోత్స్న ఇంటర్ చదువుతున్న సమయంలో 2017లో తల్లి, తండ్రి ఇద్దరూ రోడ్డు ప్రమాదంలో ఒకేసారి మృతిచెందారు. అమ్మమ్మ గ్రామమైన మల్దకల్ మండలం ఎల్కూరులో 9వ తరగతి వరకు, 10వ తరగతి ఉలిందకొండలో, డోన్‌లో ఇంటర్ చదివింది. ఇంటర్‌లో 970 మార్కులు సాధించిన జ్యోత్స్న ఢిల్లీలో అంబేడ్కర్ యూనివర్సిటీలో ఓపెన్ కేటగిరిలో సీటు రావడంతో 2021 వరకు అక్కడ చదివింది. చిన్నతాండ్రపాడు గ్రామానికి చెందిన రవితో వివాహమైంది. ఎలాంటి కోచింగ్ తీసుకోకుండానే గ్రూప్స్‌కు ప్రిపేరయ్యింది. ముందుగా గ్రూప్-4లో బీసీ వెల్ఫేర్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా జాబ్ వచ్చింది. అనంతరం గ్రూప్-3లో, గ్రూప్-2లో పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖలో మండల పంచాయతీ ఆఫీసర్ (ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్)గా ఉద్యోగం సాధించింది.

కుటుంబ సభ్యుల సహకారంతోనే..

నేను ఈ స్థాయిలో ఉండేందుకు మా కుటుంబ సభ్యుల సహకారం చాలా ఉంది. ఏడాది వయస్సున్న బాబును ఇంటి వద్ద వదిలి హైదరాబాద్‌కు వెళ్లి చదువుకున్నాను. దీని వెనక నా కృషి, పట్టుదల ఎంతో ఉంది. ముఖ్యంగా భర్త రవి సహకారంతోపాటు అత్త, మామ, బావ, తోటికోడలు సహకరించారు. - ఎం.జ్యోత్స్న, చిన్నతాండ్రపాడు

గ్రూప్-2 తుది ఫలితాలు విడుదల

- 18 కేటగిరీల్లో 783 ఉద్యోగాలకుగాను 782 భర్తీ
- పోస్టుల వారీగా ఎంపిక జాబితా ప్రకటించిన టీజీపీఎస్సీ
- 2 రోజుల్లో సీఎం రేవంత్ చేతుల మీదుగా నియామకపత్రాలు



ఫలితాలు విడుదల చేస్తున్న బుర్రా వెంకటేశం తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-2 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఆదివారం విడుదల చేసింది. 18 కేటగిరీల్లో 783 ఖాళీలకుగాను 782 ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయగా... ఒక పోస్టును విత్‌హెల్డ్‌లో పెట్టింది. గత మార్చి 11న విడుదల చేసిన జనరల్ ర్యాంకింగ్స్ జాబితా ఆధారంగా అభ్యర్థుల ఎంపిక చేపట్టినట్లు కమిషన్ వెల్లడించింది. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థి హాల్‌టికెట్ నంబర్, పోస్టుకోడ్, ఎంపికైన జోన్ వివరాలను జాబితాలో పొందుపర్చింది. ఈ జాబితాను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈ ఫలితాలు రిట్ పిటిషన్ 35015/2024, 36518/2024, 35418/2024, 18544/2024, 15546/2024, 22332/2024, 821/2025లో హైకోర్టు తుది తీర్పునకు లోబడి ఉంటాయని టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. ఆదివారం టీజీపీఎస్సీ కార్యాలయంలో చైర్మన్ బుర్రా వెంకటేశం అధ్యక్షతన జరిగిన సమావేశంలో తుది ఫలితాల విడుదల నిర్ణయం తీసుకున్న అనంతరం జాబితాను ప్రకటించారు. గ్రూప్-2 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు సమర్పించిన సమాచారం, ధ్రువపత్రాల వివరాల ఆధారంగా ఎంపిక జరిగిందని, అభ్యర్థులు ఇచ్చిన వివరాల్లో ఏవేనీ పొరపాట్లు ఉన్నట్లు తేలితే తక్షణమే వారి నియామక ప్రక్రియను రద్దు చేయడంతోపాటు అన్ని ప్రయోజనాలను కోల్పోతారని కమిషన్ కార్యదర్శి ప్రియాంక ఆల ఓ ప్రకటనలో చెప్పారు. తెలంగాణ గెజిట్ నం. 60, తేదీ. 28/12/2015లో పొందుపర్చిన నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. టాప్ 31 మందిలో ఒక్కరు కూడా మహిళా అభ్యర్థి లేకపోవడం గమనార్హం. టాపర్లలో తొలి అభ్యర్థి ఏఎస్‌ఓ పోస్టును ఎంపిక చేసుకోగా... మిగిలిన నలుగురు సబ్‌రిజిస్ట్రార్ పోస్టులకు ఎంపికయ్యారు.

ప్రక్రియ అత్యంత వేగవంతంగా ...

టాప్-5	ర్యాంకర్లు వీరే..
1	నాడు వెంకట హర్షవర్ధన్‌రెడ్డి
2	వడ్లకొండ సచిన్
3	బి.మనోహర్రావు
4	శ్రీరామ్ మధు
5	చింతలపల్లి ప్రీతమ్ రెడ్డి

గ్రూప్-2 ఉద్యోగ నియామక ప్రక్రియ అత్యంత వేగవంతంగా జరిగింది. పరీక్షలు నిర్వహించిన పదినెలల్లోపే తుది ఫలితాలను విడుదల చేసి కమిషన్ రికార్డు సృష్టించింది. వివిధ శాఖల్లో గ్రూప్-2 సర్వీసులకు సంబంధించి 18 కేటగిరీల్లో 783 ఉద్యోగాల భర్తీకి 2022, డిసెంబర్ 29న కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. 5,51,855 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. మూడుసార్లు వాయిదా పడ్డ ఈ పరీక్షలు ఎట్టకేలకు గత డిసెంబర్ 15, 16 తేదీల్లో జరిగాయి. దరఖాస్తు చేసుకున్న వారిలో 2,49,964 మంది మాత్రమే మొత్తం నాలుగు పేపర్లు రాశారు. ఈ ఏడాది మార్చి 11న విడుదల చేసిన జనరల్ ర్యాంకింగ్స్ లిస్టు(జీఆర్‌ఎల్)లో 2,36,649 మంది చోటు దక్కించుకున్నారు. 13,315 మంది అభ్యర్థులు అనర్హతకు గురయ్యారు. అనంతరం ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేసిన టీజీపీఎస్సీ... పరిశీలన ప్రక్రియ గత వారం వరకు వివిధ దశల్లో నిర్వహించగా... ఆదివారం తుది ఫలితాలను ప్రకటించింది. ప్రభుత్వ శాఖల వారీగా గ్రూప్-2 పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఒకట్రెండు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

ప్రమాదమా.. కుట్రా?

- తమిళనాడులోని కరూర్ ఘటనలో 40కి చేరిన మరణాలు
- ఘటనపై 24 గంటల్లో నివేదిక సమర్పించాలని గవర్నర్ ఆదేశం
- ఘటనకు భద్రతా వైఫల్యమే కారణమన్న అన్నాడీఎంకే
- బాధిత కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన విజయ్

సాక్షి, చెన్నై: తమిళనాడులోని కరూర్‌లో తమిళగ వెట్రిక కళగం (టీవీకే) పార్టీ అధినేత విజయ్ ప్రచార కార్యక్రమంలో చోటుచేసుకున్న తొక్కిసలాట ప్రమాదమా.. లేక ఏదైనా కుట్ర జరిగిందా? అనే అనుమానాలు తీవ్రమవుతున్నాయి. ఈ ఘటనపై సీబీఐ లేదా సిట్ విచారణ కోరుతూ ఆ పార్టీ న్యాయవాద విభాగం మధురై ధర్మాసనంలో పిటిషన్ దాఖలు చేసేందుకు సిద్ధమైంది. తొక్కిసలాట ఘటనతో తమిళనాడు సీఎం స్టాలిన్, డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్‌తో పాటు పలువురు మంత్రులు రాత్రికి రాత్రే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఏడీజీపీ డేవిడ్సన్ దేవాశీర్వాదంతో పాటు ఐదుగురు ఐజీలు, డీజీఐలు ఘటనా స్థలంలో విచారణను వేగవంతం చేశారు. ఈ ఘటనలో మొత్తం 40 మంది మరణించినట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో 14 మంది పురుషులు, 17 మంది మహిళలు, 9 మంది చిన్నారులు ఉన్నారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని, మరో వంద మందికి పైగా చికిత్స పొందుతున్నట్టు తెలిపింది. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్ష నేత పళనిస్వామితో పాటు డీఎండీకే, బీజేపీ, తదితర పార్టీల నేతలంతా కరూర్‌కు చేరుకుని బాధితులను పరామర్శించారు. ఈ ఘటన ప్రభుత్వ భద్రతా వైఫల్యమే కారణమని పళనిస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. జనం పెద్దఎత్తున తరలి వస్తున్నారన్న విషయాన్ని గ్రహించడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. విజయ్ సైతం ముందస్తు ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేసుకుని ఉండాల్సిందని హితవు పలికారు. కాగా.. ఈ ఘటనపై 24 గంటల్లో నివేదిక సమర్పించాలని తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి డీఎంకే ప్రభుత్వాన్ని ఆదేశించారు.

సీబీఐ దర్యాప్తునకు టీవీకే డిమాండ్

కరూర్‌లో బాధితుల సమాచారం, మరికొందరు వైరల్ చేస్తున్న వీడియోల ఆధారంగా ఈ ఘటన ప్రమాదమా? లేక కుట్ర జరిగిందా..? అన్న అనుమానాలకు దారితీసింది. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ టీవీకే న్యాయవాది విభాగం బృందం చెన్నైలో న్యాయమూర్తి దండపాణిని కలిసి సుమోటోగా కేసు నమోదు చేయాలని కోరారు. ప్రచారంలో రాళ్లు విసిరినట్టు, లాఠీచార్జ్ జరిగినట్టు వైరల్ అవుతున్న వీడియోల ఆధారంగా ఈ ఘటన పథకం ప్రకారం జరిగిన కుట్రగా న్యాయమూర్తికి వివరించారు. కేసును సీబీఐ లేదా సిట్ ద్వారా విచారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పిటిషన్ దాఖలు చేస్తే సోమవారం మధ్యాహ్నం విచారణకు స్వీకరిస్తామని న్యాయమూర్తి సూచించగా.. ఆ దిశగా మద్రాసు హైకోర్టు మధురై ధర్మాసనంలో పిటిషన్ దాఖలుకు చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనలో మృతి చెందిన కుటుంబాల వారికి రూ.20 లక్షల చొప్పున విజయ్ ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడ్డ వారికి రూ.2 లక్షల చొప్పున ప్రకటించారు. తాను సైతం కరూర్ వెళ్లేందుకు సిద్ధమైనా, పోలీసుల నుంచి అనుమతి రాలేదు. కాగా.. విజయ్ ఇంటివైపు కొన్ని విద్యార్థి సంఘాలు దూసుకెళ్లడంతో ఆ పరిసరాలన్నీ సీఆర్‌పీఎఫ్ భద్రతా వలయంలోకి తీసుకున్నారు. ఈ ఘటన నేపథ్యంలో విజయ్ ప్రచారాలపై నిషేధం విధించాలని కోరుతూ సెంథిల్ కన్నన్ అనే బాధితుడు హైకోర్టులో పిటిషన్ వేశాడు. ఇదిలావుండగా కరూర్ ఘటనకు బాధ్యులుగా టీవీకే పార్టీ కరూర్ పశ్చిమ జిల్లా కార్యదర్శి మది అళగన్, ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, సీనియర్ నేత నిర్మల్‌కుమార్‌తో పాటు ఇతరులు అని పేర్కొంటూ మొత్తం నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు ఈ ఘటనపై జస్టిస్ అరుణా జగదీశన్ నేతృత్వంలో ఏక సభ్య కమిషన్ విచారణ ప్రారంభించింది. వేలుస్వామిపురంలో పరిశీలన, విచారణ జరిగింది. ఘటన సమయంలో విద్యుత్ సరఫరా ఆపేశారంటూ కొందరు, ఒక్కసారిగా జనం తోసుకొచ్చారంటూ మరికొందరు, అంబులెన్స్‌లు వరుసగా రావడంతో వాటికి దారి ఇచ్చే సమయంలో తోపులాట జరిగిందంటూ మరికొందరు తెలిపారు.



మార్చురీ వద్ద మృతదేహాలకు నివాళులర్పించిన అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న సీఎం స్టాలిన్

కలెక్టరేట్ల వద్ద రేషన్ డీలర్ల నిరసన నేడు

సాక్షి, హైదరాబాద్: పెండింగ్ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద సోమవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలంగాణ రాష్ట్ర డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాయికోటి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ డీలర్లకు ఆరు నెలలుగా కమీషన్‌ను విడుదల చేయడం లేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ కార్డులకు కమీషన్ ఆరు నెలలుగా రాలేదని, సెప్టెంబర్ నెలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ కమీషన్ రాలేదని తెలిపారు.



ఒక ఆలోచనను స్వీకరించండి
దాని గురించే ఆలోచించండి
దాని గురించే కలగనండి
మీ నరనరాల్లో ఆ ఆలోచనను జీర్ణించుకుపోనీయండి
మిగతా ఆలోచనలను పక్కన పెట్టండి.
ఇలాచేస్తే విజయం మిమ్మల్ని తప్పక వరిస్తుంది.

మంచిమాట

మార్పు అనివార్యం.. అనవరతం

ఈ ప్రపంచంలో ఎప్పటికీ ఆగనిది ఒక్కటే: మార్పు. నిన్నటి సూర్యోదయం ఈ రోజు లేదు, ఈ రోజు విరిసిన పువ్వు రేపటికి ఉండదు. ప్రతి క్షణం విశ్వం తన రూపాన్ని మార్చుకుంటూనే ఉంటుంది. మనం పుట్టిన క్షణం నుండి, చివరి క్షణం వరకు, ప్రతి దశలోనూ మార్పు మనతోనే ప్రయాణిస్తుంది.



నవశ్చలతి జీవనం, నవశ్చలతి విశ్వం
నవం నవం నవాని నవాని నిత్యం
చలతి

జీవితం నిరంతరం కదులుతుంది, విశ్వం నిరంతరం కదులుతుంది. ప్రతి రోజు, ప్రతి క్షణం కొత్తదనంతో ముందుకు సాగుతూ ఉంటుంది. ఈ శ్లోకం మార్పు అనేది విశ్వంలో, జీవితంలో నిరంతరంగా జరిగే ప్రక్రియ అని సూచిస్తుంది. ఇది మార్పు నిత్యత్వాన్ని, దాని ద్వారా కొత్త అవకాశాలు, కొత్త ప్రారంభాలు ఎలా ఏర్పడతాయో తెలియజేస్తుంది. ఈ నిరంతర చలనం జీవితాన్ని సజీవంగా, శక్తిమంతంగా ఉంచుతుంది.

మార్పు అంటే భయపడాల్సిన ఒక గాలివాన కాదు, అది జీవితాన్ని సజీవంగా ఉంచే ఒక అనివార్యమైన శక్తి. మార్పు లేని జీవితం నిలచిపోయిన సరస్సులా మురికిగా మారుతుంది. మార్పును స్వాగతించినప్పుడే జీవితం ప్రవహించే నదిలా పవిత్రంగా, ఉల్లాసంగా ఉంటుంది.

ప్రకృతిలో చూస్తే, ప్రతిదీ మార్పుకు లోబడే ఉంటుంది. వసంతంలో చిగురించిన ఆకు, ఆ తర్వాత ఎండిపోయి, రాలిపోయి, తిరిగి కొత్త జీవితానికి దారి చూపిస్తుంది. భూమిలో ఉండే ఒక చిన్న విత్తనం తన రూపాన్ని మార్చుకోవడానికి భయపడితే, అది ఎప్పటికీ ఒక పెద్ద చెట్టుగా మారలేదు. అలాగే, ఒక చిన్న గొంగళి పురుగు తన రూపాన్ని పూర్తిగా మార్చుకొని, రెక్కలు విప్పుకున్న రంగుల సీతాకోకచిలుకగా మారే అద్భుతమైన మార్పు, మార్పులో ఉన్న శక్తిని తెలియజేస్తుంది. ఈ మార్పు కేవలం భూమిపై మాత్రమే కాదు, అనంతమైన విశ్వంలో కూడా జరుగుతుంది. మనం రోజూ చూసే చంద్రుడు కూడా పౌర్ణమి నుండి అమావాస్యకు, అమావాస్య నుండి పౌర్ణమికి తన ఆకారాన్ని మార్చుకుంటూనే ఉంటాడు. ప్రతి క్షణం గ్రహాలు తమ గమనాన్ని మార్చుకుంటూ ముందుకు కదులుతూ ఉంటాయి. ఈ విశ్వం కూడా నిరంతరం పెరుగుతూనే ఉంటుంది.

యది మార్గం న చలతి, కథం గమ్యతే లక్ష్యం
చలనం ఏవ జీవనం, చలనం ఏవ గతిః

మార్గం కదలకపోతే, గమ్యాన్ని ఎలా చేరుకోగలం? కదలడమే జీవితం, కదలడమే గమనం. ఈ శ్లోకం మార్పు అనేది కేవలం ఒక పరిస్థితి కాదు, అది జీవిత ప్రయాణమే అని చెబుతుంది. మార్పు లేకపోతే, మనం ఎక్కడికీ చేరుకోలేము. ఈ శ్లోకం మార్పును ఒక అవరోధంగా కాకుండా, మన గమ్యానికి చేర్చే ఒక మార్గంగా చూడాలని ప్రోత్సహిస్తుంది.

జీవితం ఒక నిరంతర ప్రవాహం. అందులో మార్పులు రావడం సహజం. వాటిని ఆనందంగా, ధైర్యంగా స్వీకరించాలి. ప్రతి మార్పు ఒక కొత్త ప్రారంభం. అది మనలోని సుప్తంగా ఉన్న శక్తులను, గుణాలను మేల్కొల్పి, మనల్ని ఉన్నత శిఖరాలకు చేర్చే మార్గం. మార్పు అంటే భయపడటం కాదు, అది భవిష్యత్తు వైపు సాగే మన ప్రయాణంలో మనం నడిచే మార్గమే. ఆ మార్గాన్ని మనం ఉత్సాహంగా అన్వేషించినప్పుడు, జీవితం ఒక మహోన్నతమైన కళాఖండంగా మారుతుంది.

– కె. భాస్కర్ గుప్తా
(వ్యక్తిత్వ వికాస నిపుణులు)

ఈ సృష్టిలోని ప్రతి అణువు, ప్రతి కణం మార్పుతోనే పుట్టి, పెరుగుతూ, నశిస్తూ ఉంటుంది. మానవ జీవితంలో జరిగే మార్పు కూడా అంతే శక్తివంతమైనది. బాల్యం నుండి వృద్ధాప్యానికి మన శరీరం మారినా, మనసు ఎన్నో పాఠాలను నేర్చుకుంటూ ముందుకు సాగుతుంది. మన కష్టాలు, సవాళ్లు మనల్ని బలహీనపరచవు, అవి మనల్ని మరింత బలంగా తయారు చేస్తాయి. మన ఆలోచనలలో, మన అలవాట్లలో వచ్చే మార్పులు మనల్ని నిన్నటి కంటే ఈ రోజు మెరుగైన మనిషిగా తయారు చేస్తాయి.

మహాసరస్వతీ దేవి

ఓం శ్రీ శారదాయై నమః

దుర్గాదేవి అలంకారాలన్నిటిలో మూలానక్షత్రం నాటి సరస్వతీదేవి అలంకారానికి ఎనలేని ప్రాముఖ్యత ఉంది. చదువుల తల్లి సరస్వతీదేవిగా భక్తులు ఈమెను ఆరాధన చేస్తారు. వాక్కు, బుద్ధి, విజ్ఞానం, కళలు... అన్నిటికీ ఈమే అధిష్ఠాన దేవత. ఋగ్వేదం, దేవీభాగవతం, బ్రహ్మవైవర్త పురాణాల్లో సర్వసతీదేవి గురించిన అనేక గాథలు విస్తారంగా వర్ణితమై ఉన్నాయి. కచ్ఛపి అనే వీణ; పుస్తకం, అక్షమాల, ధవళ వస్త్రాలు ధరించి, హంసను అధిరోహించిన రూపంలో ఈ తల్లి దర్శనమిస్తుంది.

సర్వశక్తి స్వరూపిణి, సర్వాంతర్యామిని, విజ్ఞానదేవత, వివేకధాత్రిగా శాస్త్రాలు, పురాణ, ఇతిహాసాలు సరస్వతీదేవిని వర్ణిస్తున్నాయి. సరస్వతీ ఉపాసనతో లౌకిక విద్యలతో పాటు అలౌకికమైన మోక్ష విద్య కూడా అవగతమవుతుంది. సకల చరాచరకోటిలో వాగ్రూపంలో ఉంటూ, వారిని చైతన్యవంతులుగా చేసే శక్తి ఈమెది.



సరస్వతీ ఉపాసన ద్వారా సకల విద్యలూ కరతలామలకం అవుతాయని పెద్దలు చెబుతారు. తెల్లని వస్త్రాలు ధరించి, తెల్లని పూలతో అమ్మను పూజించాలి.

శ్లోకం: యా కుందేందు తుషార హార ధవళా యాశుభ్ర వస్త్రాన్వితా, యా వీణా వరదండ మండితకరా యా శ్వేత పద్మాసనా, యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభృతి భిర్దేవైస్సదా పూజితా, సామాంపాతు సరస్వతీ భగవతీ నిశ్శేష జాడ్యాపహా.

మంత్రం: 'ఓం శ్రీం హ్రీం క్లీం మహా సరస్వత్యై నమః' అనే మంత్రాన్ని ఉపాసన చేయాలి. సరస్వతీదేవి ప్రీతిగా ఈ రోజున పుస్తకదానం చేయాలి. సరస్వతీ ద్వాదశ నామాలు, స్తోత్రాలు పారాయణ చేయాలి.

నైవేద్యం: దధ్యాన్నం అంటే పెరుగన్నం, చక్కెర పొంగలి నివేదన చేయాలి.

విశేషం: బెజవాడ కనకదుర్గమ్మకు నేడు సరస్వతీ అలంకారం

తాత్త్వికథ

చివరి గంట

ఒక యువకుడు తన జీవితం పట్ల తీవ్రమైన నిరాశకు గురయ్యాడు. పరిష్కారం దొరుకుతుందేమోనని ఓ గురువును కలిశాడు. 'అందరి జీవితాల్లా నా జీవితం లేదు. కష్టాల కొలిమిలో కాపురం చేస్తున్నట్లు ఉంది. ఏ జన్మలో ఏ పాపం చేశానో...' అని బాధగా చెప్పాడు.



గురువు చిన్నగా అతడి భుజం తట్టి ''నీకు పిల్లలున్నారా?'' అని అడిగాడు. ఒకరికి ఇద్దరు బడికి వెళ్ళే పిల్లలు ఉన్నారని బదులిచ్చాడు ఆ యువకుడు.''వారు ఉదయం బడి మొదటి గంట మోగినప్పుడు ఎలా ఉంటారో , చివరి గంట మోగినప్పుడు ఎలా స్పందిస్తారో చూసి రేపు వచ్చి చెప్పు'' అన్నాడు గురువు.

''దానికి రేపటిదాకా ఎందుకు, రోజూ చూసేదే కదా, మొదటి గంట మోగితే బడికి పోవాల్సి వస్తోందని వారి ముఖం ఆముదం తాగిన ముఖంలా ఉంటుంది. చివరి గంట శబ్దం విన్నప్పుడు ఇంటికెళ్ళే సమయం వచ్చిందని వారి ముఖం నిండు పున్నమిలా మెరిసిపోతుంది'' అని వర్ణించాడు.

సరైన సమాధానం వచ్చిందని భావించిన గురువు ''గంట ఒకటే అయినా దాని శబ్దం వినే వారిని బట్టి, సందర్భాన్ని బట్టి మారుతుంది. దారిన పోయే వాడు ఒక్కసారి కాదు, వంద సార్లు ఆ గంట విన్నా దాన్ని పట్టించుకోడు. జీవితం కూడా అంతే. మనం చూసే దాన్నిబట్టి ఉంటుంది.

జీవితం కల లాంటిది. కాకుంటే దాని కాల వ్యవధి అరవై ఏళ్ళు కావచ్చు, తొంభై ఏళ్ళు కావచ్చు. ఆ కాల వ్యవధిలోని ప్రతి క్షణమూ మధురమైనదే. లేకుంటే ప్రతిదీ బాధాకరమే. కష్టాల గురించే ఆలోచిస్తూ కూర్చుంటే భారం మరింత పెరుగుతుంది తప్పితే సమస్య పరిష్కరింపబడదు. మనిషిని ఆశ బతికిస్తుంది. దురాశ నాశనం చేస్తుంది, నిరాశ చంపేస్తుంది. కాబట్టి ఆశావాదంతో ఆనందంగా ఉండటానికి ప్రయత్నించు'' అని చెప్పి పంపాడు.

గురువు మాటల లోతు తెలుసుకున్న ఆ యువకుడు 'నిజమే, మనం దేన్ని పట్టుకుంటే, దేన్ని ఎక్కువగా పట్టించుకుంటే అదే మనతో కొనసాగుతుంది. మనం ఆనందాన్ని పట్టుకుందాం' అని నిర్ణయం తీసుకుని అక్కడినుంచి కదిలాడు.

– ఆర్.సి.కృష్ణస్వామి రాజు

• బొమ్మల కొలువు



ఆళవందార్ పరిమళ, చౌదరి గూడ, పోచారం, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

మీరు బొమ్మల కొలువు పెట్టారా?

దసరాకు మీరు బొమ్మల కొలువు పెట్టారా? అయితే ఆ బొమ్మల కొలువుతో ఒక సెల్ఫీ తీసుకుని ఊరు, పేరు రాసి ఈ కింది చిరునామాకు మెయిల్ చేయండి. మాకు అందిన వాటిలో బాగున్న వాటిని ఫ్యామిలీలో ప్రచురిస్తాం.
sakshibommalakoluvu@gmail.com

సాక్షి సినిమా

ప్రేమ విహారం



• రష్మికా మందన్నా

ఇటలీ వీధుల్లో ప్రేమవిహారం చేస్తున్నారు హీరోయిన్ రష్మికా మందన్నా. షాహిద్ కపూర్, కృతీ సనన్, రష్మికా మందన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న యూత్‌ఫుల్ లవ్ అండ్ ఎమోషనల్ డ్రామా 'కాక్‌టైల్ 2'. హోమి అడజానియా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం ఇటలీలో జరుగుతోందని తెలిసింది. షాహిద్ కపూర్, రష్మికా మందన్నా, కృతీ సనన్ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. ముఖ్యంగా షాహిద్ కపూర్, రష్మికల మధ్య ప్రేమ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. అలాగే ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, సంజయ్ దత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారని బాలీవుడ్ సమాచారం. ఇటలీ షూటింగ్ షెడ్యూల్‌లో టాకీ పార్టుతో పాటు సాంగ్స్‌ని కూడా చిత్రీకరించాలని ప్లాన్ చేశారని తెలిసింది. విదేశాల్లోనే ఈ సినిమా మేజర్ షూటింగ్ జరుగుతుందని బాలీవుడ్ భోగట్టా. దినేష్ విజన్, లవ్ రంజన్ నిర్మిస్తున్న ఈ 'కాక్‌టైల్ 2' సినిమా వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో రిలీజ్ కానుంది. ఇక సైఫ్ అలీఖాన్, దీపికా పదుకోన్, డయానా పెంటీ ప్రధాన పాత్రధారులుగా హోమి అడజానియా దర్శకత్వంలో రూపొందిన సూపర్ హిట్ మూవీ 'కాక్‌టైల్ (2012)'కి సీక్వెల్‌గా 'కాక్ టైల్ 2' చిత్రం తెరకెక్కుతోంది.

ధన పిశాచి రాబోతోంది!



• సోనాక్షీ సిన్హా

సుధీర్‌బాబు హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియా సినిమా 'జటాధర'. వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సోనాక్షీ సిన్హా, దివ్య ఖోస్లా, శిల్పా శిరోద్కర్, ఇంద్ర కృష్ణ, రవిప్రకాశ్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ప్రేరణ అరోరా సమర్పణలో జీ స్టూడియోస్‌పై ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, శిల్పా సింఘాల్, నిఖిల్ నందా తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నవంబరు 7న విడుదల కానుంది. సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమా నుంచి 'ధన పిశాచి రాబోతోంది' అంటూ ఓ సాంగ్‌ని విడుదల చేయనున్నట్లు ప్రకటిస్తూ సోనాక్షీ సిన్హా పోస్టర్‌ని విడుదల చేశారు. ''సెప్టెంబర్ 30న ధన పిశాచి రాబోతోంది.. చెడు సయా అవతారాన్ని చూసేందుకు సిద్ధంగా ఉండండి'' అంటూ క్యాప్షన్‌ని జత చేశారు మేకర్స్. ఇక ఈ పోస్టర్‌ని బట్టి చూస్తే డబ్బు అంటే పిచ్చి ఉన్న పాత్రలో సోనాక్షి కనిపించనున్నారని తెలుస్తోంది. ఈ చిత్రానికి సహ నిర్మాతలు: అక్షయ్ కేజ్రీవాల్, కుసుమ్ అరోరా, క్రియేటివ్ ప్రొడ్యూసర్: దివ్యా విజయ్.

• రామ్‌చరణ్



18 ఇయర్స్ ఇండస్ట్రీ

హీరో చిరంజీవి వారసుడిగా 'చిరుత' సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చారు రామ్‌చరణ్. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ చిత్రం 2007 సెప్టెంబరు 27న విడుదలైంది. ఈ మూవీ రిలీజై 18 ఏళ్లయింది. టాలీవుడ్‌లో 18 ఇయర్స్ ఇన్ ఇండస్ట్రీ మైలురాయిని చేరుకున్నారు రామ్‌చరణ్. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ ప్రత్యేక పోస్టర్‌ని రిలీజ్ చేశారు 'పెద్ది' మూవీ మేకర్స్. ''మా 'పెద్ది' (రామ్‌చరణ్‌ని ఉద్దేశించి) 18 ఏళ్ల సినీ కెరీర్‌ను పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉంది. తెరపై ఎంతో ఘనమైన వారసత్వం కొనసాగిస్తూనే, బయట ఎంతో వినయ విధేయతలు కలిగి ఉండటమే కాకుండా, తనకంటూ ఓ ప్రత్యేకమైన పంథా ఏర్పాటు చేసుకున్నారు రామ్‌చరణ్. ఇక 'పెద్ది' చిత్రం నుంచి సర్‌ప్రైజ్‌లు మొదలు కాబోతున్నాయి'' అని యూనిట్ పేర్కొంది. కాగా బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తున్న 'పెద్ది'లో రామ్‌చరణ్ సరసన హీరోయిన్‌గా నటిస్తున్నారు జాన్వీ కపూర్. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ సినిమా 2026 మార్చి 27న విడుదల కానుంది.

తండ్రిగా ఎప్పుడూ గర్వపడుతుంటా: చిరంజీవి

టాలీవుడ్‌లో రామ్‌చరణ్ 18 ఏళ్ల ప్రస్థానం పూర్తయిన సందర్భంగా చిరంజీవి సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ షేర్ చేశారు. ''చరణ్ బాబు... 18 ఏళ్ల క్రితం 'చిరుత'తో మొదలైన నీ సినీ ప్రయాణం నేడు కోట్లాది అభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచినందుకు ఎంతగానో సంతోషిస్తున్నాను. నిన్ను తెరపై హీరోగా చూసిన ఆ క్షణాన్ని నాన్నగా నేను ఎప్పటికీ మరచిపోలేను. నీ క్రమశిక్షణ, కృషి, పట్టుదల, వినయం, అంకితభావం నిన్ను ఇండస్ట్రీలో మరింత ప్రత్యేకంగా నిలబెట్టాయి. తండ్రిగా నిన్ను చూసి ఎప్పుడూ గర్వపడుతుంటా. తెలుగు ప్రేక్షకుల అభిమానంతో, దేవుని దీవెనలతో మరెన్నో శిఖరాలు నువ్వు అధిరోహించాలి అని కోరుకుంటున్నా. విజయోస్తు'' అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

కాంతార చాప్టర్ 1 లాంటి సినిమా చేయడం సులభం కాదు

- ఎన్టీఆర్



• ప్రగతి శెట్టి, రిషబ్ శెట్టి, ఎన్టీఆర్, చలువె గౌడ, రుక్మిణీ వసంత్

“**న**న్ను ఉడిపి కృష్ణుడు గుడికి తీసుకుని వెళ్లాలని ఎప్పట్నుంచో మా అమ్మగారి ఆకాంక్ష. రిషబ్ సార్ లేకపోయి ఉంటే ఆ దర్శన భాగ్యం కలిగి ఉండేది కాదు. థ్యాంక్స్ చెప్పి, మా మధ్య దూరాన్ని పెంచలేను. మా అమ్మగారి ఆకాంక్షను నెరవేర్చినందుకు ఐ లవ్ యూ సార్. 'కాంతార: చాప్టర్ 1' సినిమా కోసం రిషబ్ ఎంత కష్టపడ్డారో చూశాను. ఈ సినిమా చేయడం అంత సులభం కాదు. రిషబ్ అరుదైన దర్శక–నటుడు. ఆయనలోని డైరెక్టర్ అతన్ని డామినేట్ చేస్తాడా? లేక యాక్టర్ డామినేట్ చేస్తాడా? అనే ఆలోచన నాకు ఉండేది. కానీ సినిమాలోని 24 క్రాఫ్ట్సుని రిషబ్ డామినేట్ చేస్తారు'' అని ఎన్టీఆర్ అన్నారు. రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'కాంతార: చాప్టర్ 1'. ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించారు. రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన 'కాంతార' సినిమాకు ప్రీక్వెల్‌గా 'కాంతార: చాప్టర్ 1' చిత్రం తెరకెక్కింది. హోంబలే ఫిలింస్ నిర్మించిన ఈ చిత్రం ఈ అక్టోబరు 2న తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, బెంగాలీ, ఇంగ్లిష్ భాషల్లో విడుదల కానుంది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన ఎన్టీఆర్ మాట్లాడుతూ– ''మాములుగా ప్రతిసారీ అరిచినట్లుగా ఈసారి మాట్లాడలేను. కొంచెం నొప్పిగా (ఈ మధ్య స్వల్ప గాయం అయింది) ఉంది. నాకు తెలిసి నా వయసు మూడేళ్లో, నాలుగేళ్లో అయ్యింటుంది. అప్పుడు మా అమ్మమ్మ నన్ను కూర్చోబెట్టి, కుందాపూర్ దగ్గరే మా ఊరు... అంటూ చిన్నప్పుడు ఆమె విన్న కొన్ని కథలు చెప్పింది. ఈ కథ నిజమేనా? ఇది జరిగి ఉంటుందా? అని అర్థమయ్యేది కాదు. కానీ ఆ కథలు ఆసక్తిగా ఉండేవి. ఒక్కసారైనా ఈ గుళిగ ఆట అనేది ఏంటి? ఈ బింజురుళి అంటే ఏమిటో చూడాలని నా చిన్నప్పుడే నాటుకుపోయింది. కానీ ఏ రోజూ అనుకోలేదు. నేను విన్న ఆ కథల నుంచి, నేను విన్న ఆ కథల గురించి ఒక దర్శకుడు ఒక సినిమా తీస్తాడని. ఆ దర్శకుడు ఎవరో కాదు... నా సోదరుడు రిషబ్ శెట్టి. నేను విన్న కథలను సిల్వర్ స్క్రీన్‌పై చూసినప్పుడు నాకు మాటలు రాలేదు. కథ తెలిసి నేనే ఇలా అయిపోతే ఈ కథ కొత్తగా తెలిసినవాళ్లు ఏమయ్యారో అదే 'కాంతార 1' సినిమా రిజల్ట్. ఈ 'కాంతార: చాప్టర్ 1' గొప్ప బ్లాక్‌బస్టర్ చిత్రంగా భారతీయ సినిమా చరిత్రలో ప్రస్ఫుటంగా కనపడాలని ఆ దేవుడిని కోరుకుంటున్నాను. ఈ సినిమాను అక్టోబరు 2న థియేటర్స్‌లో చూడండి. రిషబ్ కష్టాన్ని ఆశీర్వదించి, 'కాంతార: చాప్టర్ 1'ను విజయం బాటవైపు నడిపిస్తారని ఆశిస్తున్నాను'' అని అన్నారు.


''ఎన్టీఆర్‌గారితో మాట్లాడుతున్నప్పుడు నాకు ఒక బ్రదర్ ఫీలింగ్ కలుగుతుంది. ఈ సినిమాను మీరందరూ థియేటర్స్‌లో చూసి, ఆశీర్వదించి, పెద్ద విజయాన్ని అందించాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు రిషబ్ శెట్టి. హోంబలే ఫిలింస్ సహ వ్యవస్థాపకుడు చలువే గౌడ మాట్లాడుతూ– '''కాంతార: చాప్టర్ 1' మన సంస్కృతి, నమ్మకాలు, కథలు, మూలాలకు నివాళి'' అని చెప్పారు. ''ఈ సినిమా చూసిన ఓ నలుగురు పెద్దవాళ్లు 'ఈ సినిమా స్పెల్‌బౌండ్' అని చెప్పారు. 'కాంతార: చాప్టర్ 1' పెద్ద చిత్రం అవుతుంది. ఇక వచ్చే నెల ఎన్టీఆర్–ప్రశాంత్ నీల్ సినిమా కొత్త షెడ్యూల్ ప్రారంభమవుతుంది. ఈ సినిమా నెక్ట్స్ లెవల్లో ఉంటుంది'' అని మైత్రీ మూవీ మేకర్స్ రవిశంకర్ పేర్కొన్నారు. ''కాంతార' సినిమాల కోసం రిషబ్ ఐదేళ్ళుగా కష్టపడుతున్నారు'' అని కాస్ట్యూమ్ డిజైనర్, రిషబ్ భార్య ప్రగతి అన్నారు. ''కాంతార: చాప్టర్1' తెలుగు వెర్షన్‌లోనూ రెండు పాటలు రాశాను'' అని చెప్పారు రాంబాబు గోసాల. మైత్రీ డిస్ట్రిబ్యూటర్ శశి, ప్రొడక్షన్ డిజైనర్ బంగ్లన్ తదితరులు పాల్గొన్నారు.

లతా మంగేష్కర్‌కి నివాళిగా...

బాలీవుడ్ దర్శక–నిర్మాత, నటుడు ఫర్హాన్ అక్తర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా హిందీ చిత్రం '120 బహదూర్'. ఈ దేశభక్తి చిత్రానికి రజనీశ్ దర్శకత్వం వహించగా, రాశీ ఖన్నా కీలక పాత్రలో నటించారు. 1962లో జరిగిన భారత్–చైనా యుద్ధం నేపథ్యంలో మేజర్ షైతాన్ సింగ్ భాటీ జీవితం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో మేజర్ షైతాన్ సింగ్‌గా ఫర్హాన్ అక్తర్ నటిస్తున్నారు. రెజాంగ్ లా యుద్ధ సంఘటనలు ప్రధాన ఇతివృత్తంగా ఈ సినిమా సాగుతుంది. ఆదివారం ఈ సినిమా సెకండ్ టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇదిలా ఉంటే... భారత్–చైనా (1962) యుద్ధంలో వీరమరణం పొందిన భారత అమరవీరులను గౌరవించేందుకు 1963లో దివంగత ప్రముఖ గాయని లతా మంగేష్కర్ 'ఏ మేరే వతన్ కే లోగో' అనే పాటను ఆలపించగా, ఈ పాట అందరి హృదయాల్లో నిలిచిపోయింది. ఆదివారం (సెప్టెంబరు 28) లతా మంగేష్కర్ జయంతి. తాజాగా విడుదలైన '120 బహదూర్' సినిమా సెకండ్ టీజర్ బ్యాక్‌గ్రౌండ్‌లో 'ఏ మేరే వతన్ కే..' పాట వినిపించింది. ఈ విధంగా లతా మంగేష్కర్‌కు '120 బహదూర్' టీమ్ ప్రత్యేక నివాళిగా సెకండ్ టీజర్‌ను రిలీజ్ చేసింది. ఈ ఏడాది నవంబరు 21న ఈ చిత్రం థియేటర్స్‌లో రిలీజ్ కానుంది.



• '120 బహదూర్' పోస్టర్



తిలక్ వర్మ
పరుగులు 69
బంతులు 53
1 × 27
2 × 3
4 × 3
6 × 4
స్ట్రయిక్‌రేట్ 130.18

రూ. 21 కోట్ల నజరానా

ఆసియా కప్ గెలిచిన టీమిండియాకు బీసీసీఐ భారీ ప్రోత్సాహకం ప్రకటించింది. జట్టు సభ్యులతో పాటు సహాయ సిబ్బందికి కలిపి రూ. 21 కోట్ల నజరానా ఇస్తున్నట్లు పేర్కొంది. '3 దెబ్బలు, 0 స్పందన, ఆసియా కప్ చాంపియన్స్, కావాల్సిన సందేశం అందించాం' అని బీసీసీఐ ట్వీట్ చేసింది.

ట్రోఫీని స్వీకరించని భారత జట్టు

దుబాయ్: ఆసియా కప్ ఫైనల్ తర్వాత అనూహ్యం చోటు చేసుకుంది. మ్యాచ్ ముగిసి గంట సమయం దాటినా బహుమతి ప్రదానోత్సవం జరగలేదు. దాంతో ఏం జరిగిందనే అంశంపై చర్చ మొదలైంది. భారత జట్టు విజేత ట్రోఫీని స్వీకరించే విషయంలో వివాదం నెలకొనడమే అందుకు కారణమని తేలింది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు, పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చైర్మన్ అయిన మొహసిన్ నఖ్వీ చేతుల మీదుగా కప్‌ను అందుకునేది లేదని టీమిండియా స్పష్టం చేసింది. చివరకు నఖ్వీ నుంచి మాత్రమే కాదు...తాము అసలు ట్రోఫీని తీసుకునేది లేదని సమాచారం ఇచ్చింది. దాంతో నిర్వాహకులు ట్రోఫీ ప్రదానోత్సవం లేకుండానే కార్యక్రమాన్ని ముగించారు. తిలక్, దూబే, అభిషేక్ మాత్రం తమ వ్యక్తిగత బహుమతులు అందుకున్నారు.

'క్రీడా మైదానంలో ఆపరేషన్ సిందూర్... ఫలితం మాత్రం ఒక్కటే... భారత్ విజయమే... మన క్రికెటర్లకు అభినందనలు'.

-నరేంద్ర మోదీ, భారత ప్రధాని

భారత్‌కు విజయ తిలకం

ఆసియా కప్ టైటిల్ నిలబెట్టుకున్న భారత్

దాదాపు 18 ఏళ్ల క్రితం... టి20 వరల్డ్ కప్ ఫైనల్లో పాకిస్తాన్‌ను ఓడించి భారత్ జగజ్జేతగా నిలిచింది. ఇప్పుడు ఇన్నేళ్ల తర్వాత మరోసారి చిరకాల ప్రత్యర్థితో ఆఖరి సమరంలో గెలిచే అవకాశం వచ్చింది... వరల్డ్ చాంపియన్‌గా తమ స్థాయికి తగిన అంచనాలతో భారత్ మరోసారి ఫేవరెట్‌గా బరిలోకి దిగింది. గత రెండు మ్యాచ్‌ల ఫలితాలు చూస్తే టీమిండియాకు విజయం అతి సులువు అనిపించింది. పాక్ బ్యాటింగ్ ముగిసిన తర్వాత లక్ష్యం మరీ చిన్నదిగా కనిపించింది. కానీ అనూహ్యంగా మ్యాచ్‌లో మలుపులు, ఉత్కంఠ, ఉద్వేగాలు... అన్నీ కలగలిసి మ్యాచ్ ఆఖరి ఓవర్ వరకు వెళ్లింది. సంజు సామ్సన్, శివమ్ దూబేలు తలా ఓ చేయి వేయగా... హైదరాబాద్ ఆటగాడు నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ అసలైన హీరోగా అవతరించాడు. ఒత్తిడిని అధిగమించి అద్భుత షాట్లతో చివరి వరకు నిలిచిన తిలక్ చిరస్మరణీయ ఆటతో భారత జట్టును ఆసియా కప్ విజేతగా నిలిపాడు. ఎన్ని టైటిల్స్ గెలిచినా ఫైనల్లో పాకిస్తాన్‌ను ఓడించి సాధించే ట్రోఫీలో కిక్కే వేరు అని మరోసారి రుజువైంది.

టీమిండియాను గెలిపించిన తిలక్ వర్మ

- ఫైనల్లో పాకిస్తాన్ చిత్తు
- 5 వికెట్లతో సూర్యకుమార్ బృందం ఘనవిజయం
- కుల్దీప్ యాదవ్‌కు 4 వికెట్లు

దుబాయ్: ఆసియా కప్ టి20 టోర్నీలో భారత్ విజేతగా నిలిచింది. ఓవరాల్‌గా టోర్నీ చరిత్రలో 9వ సారి టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఆదివారం హోరాహోరీగా సాగిన ఫైనల్లో భారత్ 5 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ 19.1 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌటైంది. సాహిబ్‌జాదా ఫర్హాన్ (38 బంతుల్లో 57; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా, ఫఖర్ జమాన్ (35 బంతుల్లో 46; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. వీరిద్దరు తొలి వికెట్‌కు 58 బంతుల్లో 84 పరుగులు జోడించారు. పాక్ కేవలం 33 పరుగులకే చివరి 9 వికెట్లు కోల్పోయింది. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ (4/30) ఆకట్టుకోగా... బుమ్రా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి తలా 2 వికెట్లు తీశారు. అనంతరం భారత్ 19.4 ఓవర్లలో 5 వికెట్లకు 150 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' తిలక్ వర్మ (53 బంతుల్లో 69 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ అర్ధ సెంచరీ సాధించగా... శివమ్ దూబే (22 బంతుల్లో 33; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), సంజు సామ్సన్ (21 బంతుల్లో 24; 2 ఫోర్లు, 1 సిక్స్) అండగా నిలిచి విజయంలో కీలక పాత్ర పోషించారు.

రాణించిన ఓపెనర్లు...

భారత్‌తో ఆడిన సూపర్-4 మ్యాచ్ తరహాలోనే ఈసారి కూడా పాక్ ఇన్నింగ్స్ జోరుగా మొదలైంది. ఓపెనర్లు ఫర్హాన్, ఫఖర్ పదునైన షాట్లతో సరైన పునాది వేశారు. ముఖ్యంగా ఫర్హాన్ దూకుడు ప్రదర్శిస్తూ బుమ్రా ఓవర్లో ఫోర్, సిక్స్ కొట్టాడు. పవర్‌ప్లేలో 45 పరుగులు చేసిన జట్టు... తర్వాతి 4 ఓవర్లలో 42 పరుగులు రాబట్టడంతో 10 ఓవర్లు ముగిసేసరికి స్కోరు 87 పరుగులకు చేరింది. గత మ్యాచ్‌లో భారత్‌పై పాక్ తొలి 10 ఓవర్లలో వికెట్ నష్టానికి 91 పరుగులు సాధించింది. 35 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న ఫర్హాన్‌ను వరుణ్‌ను అవుట్ చేయడంతో పాక్ తొలి వికెట్ కోల్పోయింది. మూడో స్థానంలో వచ్చిన సయీమ్ అయూబ్ (14) ఈసారి రెండంకెల స్కోరు చేయగలిగాడు. 12.4 ఓవర్లలో జట్టు స్కోరు 113/1 వద్ద నిలిచింది. ఈ దశలో మరో 44 బంతులు మిగిలి ఉండగా పాక్ భారీ స్కోరు సాధించడం ఖాయమనిపించింది. అయితే భారత బౌలర్లు చెలరేగడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. పాక్ బ్యాటర్లు ఎవరూ కనీసం క్రీజ్‌లో నిలవలేక చెత్త షాట్లతో వరుసగా వికెట్లు సమర్పించుకున్నారు. వరుసగా నాలుగు ఓవర్లలో ఒక్కో వికెట్ చొప్పున అయూబ్, హారిస్ (0), ఫఖర్, తలత్ (1) వెనుదిరిగారు. ఆ తర్వాత ఒకే ఓవర్లో మూడు వికెట్లతో కుల్దీప్ పాక్ పని పట్టాడు. అతడిని ఎదుర్కోలేక సల్మాన్ (8), అఫ్రిది (0), ఫహీమ్ (0) అవుటయ్యారు. మిగిలిన రెండు వికెట్లు తీసేందుకు భారత్‌కు ఎక్కువ సమయం పట్టలేదు. 39 బంతుల వ్యవధిలో పాక్ చివరి 9 వికెట్లు చేజార్చుకుంది!



కుల్దీప్

కీలక భాగస్వామ్యాలు...

ఛేదనలో భారత్ ఆరంభంలో తడబడింది. అద్భుత ఫామ్‌లో ఉన్న అభిషేక్ శర్మ (5)ను నిలువరించడంలో పాక్ సఫలం కాగా... కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (1), శుబ్‌మన్ గిల్ (12) కూడా విఫలమయ్యారు. దాంతో స్కోరు 20/3కి చేరింది. ఈ దశలో తిలక్, సామ్సన్ కలిసి జట్టును ఆదుకున్నారు. వీరిద్దరు చక్కటి షాట్లతో ఇన్నింగ్స్‌ను నడిపించారు. నాలుగో వికెట్‌కు 50 బంతుల్లో 57 పరుగులు జత చేసిన అనంతరం సామ్సన్ వెనుదిరిగాడు. అయితే తిలక్, దూబే భాగస్వామ్యంలో జట్టు గెలుపు దిశగా పయనించింది. వీరిద్దరు 40 బంతుల్లోనే 60 పరుగులు జోడించడంతో జట్టు విజయం దాదాపుగా ఖాయమైంది. విజయానికి 10 పరుగుల దూరంలో దూబే అవుటైనా... తిలక్, రింకూ సింగ్ (4 నాటౌట్) కలిసి మ్యాచ్‌ను ముగించారు.



శివమ్ దూబే



బుమ్రా అలా...

భారత్‌తో గత మ్యాచ్‌లో పాక్ బౌలర్ రవూఫ్ యుద్ధంలో భారత విమానాలు నేలకూలినట్లుగా సైగలు చేస్తూ తమ దుర్బుద్ధిని ప్రదర్శించాడు. దీనిపై అతనికి ఐసీసీ జరిమానా కూడా విధించింది. ఫైనల్లో చక్కటి బంతితో రవూఫ్‌ను బుమ్రా బౌల్డ్ చేశాడు. వెంటనే బుమ్రా కూడా అదే తరహాలో విమానం నేలను ఢీకొట్టినట్లుగా సైగ చేస్తూ రవూఫ్‌ను సాగనంపడంతో స్టేడియం హోరెత్తిపోయింది.



స్కోరు వివరాలు

పాకిస్తాన్ ఇన్నింగ్స్: ఫర్హాన్ (సి) తిలక్ వర్మ (బి) వరుణ్ 57; ఫఖర్ (సి) కుల్దీప్ (బి) వరుణ్ 46; అయూబ్ (సి) బుమ్రా (బి) కుల్దీప్ 14; హారిస్ (సి) రింకూ (బి) అక్షర్ 0; సల్మాన్ (సి) సామ్సన్ (బి) కుల్దీప్ 8; తలత్ (సి) సామ్సన్ (బి) అక్షర్ 1; నవాజ్ (సి) రింకూ (బి) బుమ్రా 6; అఫ్రిది (ఎల్బీ) (బి) కుల్దీప్ 0; ఫహీమ్ (సి) తిలక్ వర్మ (బి) కుల్దీప్ 0; రవూఫ్ (బి) బుమ్రా 6; అబ్రార్ అహ్మద్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (19.1 ఓవర్లలో ఆలౌట్) 146. వికెట్ల పతనం:** 1-84, 2-113, 3-114, 4-126, 5-131, 6-133, 7-134, 8-134, 9-141, 10-146. **బౌలింగ్:** శివమ్ దూబే 3-0-23-0, బుమ్రా 3.1-0-25-2, వరుణ్ చక్రవర్తి 4-0-30-2, అక్షర్ పటేల్ 4-0-26-2, కుల్దీప్ యాదవ్ 4-0-30-4, తిలక్ వర్మ 1-0-9-0.

భారత్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (సి) రవూఫ్ (బి) ఫహీమ్ 5; గిల్ (సి) రవూఫ్ (బి) ఫహీమ్ 12; సూర్యకుమార్ (సి) సల్మాన్ (బి) అఫ్రిది 1; తిలక్ వర్మ (నాటౌట్) 69; సామ్సన్ (సి) ఫర్హాన్ (బి) అబ్రార్ 24; శివమ్ దూబే (సి) అఫ్రిది (బి) ఫహీమ్ 33; రింకూ సింగ్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (19.4 ఓవర్లలో 5 వికెట్లకు) 150. వికెట్ల పతనం:** 1-7, 2-10, 3-20, 4-77, 5-137. **బౌలింగ్:** షాహీన్ అఫ్రిది 4-0-20-1, ఫహీమ్ 4-0-29-3, నవాజ్ 1-0-6-0, రవూఫ్ 3.4-0-50-0, అబ్రార్ 4-0-29-1, అయూబ్ 3-0-16-0.

'ఠాకూర్' జితాదియా...

సాక్షి క్రీడా విభాగం

నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ... భారత క్రికెట్‌లో రాబోయే కొన్నేళ్లు ఈ పేరును ఎవరూ మర్చిపోలేరు. ఆసియా కప్ ఫైనల్లో అతని ఇన్నింగ్స్‌పై అభిమానుల్లో సుదీర్ఘ కాలం చర్చ సాగటం ఖాయం. టోర్నీ ఆసాంతం అసాధారణ ప్రదర్శనతో జట్టుకు వరుస విజయాలు అందించిన అభిషేక్ శర్మ ఆరంభంలోనే వెనుదిరిగాడు. సూర్య, గిల్ విఫలమయ్యారు. స్కోరు 20/3. ఇలాంటప్పుడు జట్టును గెలిపించేదెవరు అని భారత అభిమానుల్లో ఒక రకమైన ఆందోళన. ఈ స్థితిలో నేనున్నానంటూ తిలక్ నిలబడ్డాడు. తీవ్రమైన ఒత్తిడి, మరో వికెట్ పడితే మ్యాచ్ చేజారిపోయే ప్రమాదం ఉంది. క్రీజ్‌లో నిలబడి జాగ్రత్తగా ఆడాలా, లేక భారీ షాట్లకు పోవాలా అనే సందేహాల నడుమ అతని ఇన్నింగ్స్ ప్రారంభమైంది. కానీ తిలక్ ఏమాత్రం తడబడలేదు. సామ్సన్ వెనుదిరిగినా, జాగ్రత్తగా ఆడుతూ అవకాశం లభించగానే చెలరేగిపోయాడు. ఫహీమ్ ఓవర్లోనే వరుసగా ఫోర్, సిక్స్‌తో తన ఉద్దేశాన్ని చాటిన అతను, అబ్రార్ ఓవర్లో సిక్స్‌తో అందరిలో గెలుపు నమ్మకాన్ని పెంచాడు. రవూఫ్ బౌలింగ్‌లో భారీ సిక్స్‌తో స్కోరును 100 దాటించడంతో మ్యాచ్ నియంత్రణలోకి వచ్చేసింది. మరోవైపు దూబే దూకుడుగా ఆడిన సమయంలో తాను కాస్త సంయమనం పాటించాడు. 8 పరుగులు చేయాల్సిన దశలో డీప్ స్క్వేర్ లెగ్ వైపు కొట్టిన భారీ సిక్సర్ ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఆ తర్వాత గెలుపు సంబరాల గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంది.

దాదాపు పది నెలల క్రితం...దక్షిణాఫ్రికా గడ్డపై తిలక్ వర్మ వరుసగా రెండు టి20ల్లో సెంచరీలతో చెలరేగాడు. ఆ తర్వాత భారత్‌కు రాగానే ముస్తాక్ అలీ ట్రోఫీలో కూడా మరో శతకం బాది... టి20 క్రికెట్‌లో వరుసగా మూడు సెంచరీలు బాదిన ఏకైక ఆటగాడిగా కొత్త రికార్డు సృష్టించాడు. ఆ తర్వాత చెన్నైలో ఇంగ్లండ్‌పై అజేయంగా చేసిన 72 పరుగులు అతని సత్తాను మరోసారి చూపించాయి. అయితే కొద్ది రోజులకే ఐపీఎల్‌లో అతనికి అవమానకర స్థితి ఎదురైంది. మూడు సీజన్ల పాటు ముంబై విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఈ సీజన్‌లో లక్నోతో జరిగిన మ్యాచ్‌లో టీమ్ మేనేజ్‌మెంట్ అనూహ్య నిర్ణయం తిలక్‌ను షాక్‌కు గురి చేసింది. 23 బంతుల్లో 25 పరుగులు చేయడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా 'రిటైర్డ్ అవుట్'తో తిలక్‌ను బయటకు పంపించారు. అదృష్టవశాత్తూ ఐపీఎల్‌లో ప్రదర్శన అతని అంతర్జాతీయ కెరీర్‌పై ప్రభావం చూపించలేదు. గాయాల నుంచి కోలుకున్న తర్వాత సహజంగానే ఈ సారి ఆసియా కప్ టీమ్‌లో అతనికి స్థానం లభించింది. వరుసగా చక్కటి ఇన్నింగ్స్‌లతో తన ముద్ర చూపించిన అతను లంకతో చివరి మ్యాచ్‌లో త్రుటిలో అర్ధ సెంచరీ కోల్పోయాడు. అయితే తన విశ్వరూపం చూపించాల్సింది ఇక్కడ కాదు అన్నట్లుగా అత్యుత్తమ ప్రదర్శనను ఫైనల్ కోసం దాచి ఉంచినట్లున్నాడు. అసాధారణ షాట్లతో జట్టుకు ఆసియా కప్ అందించే వరకు ఆగకుండా తానేంటో నిరూపించుకొని తిలక్ సగర్వంగా నిలిచాడు.

ఫైనల్ మ్యాచ్‌కు ముందు తిలక్ కెరీర్‌లో 30 మ్యాచ్‌ల అంతర్జాతీయ టి20 కెరీర్‌లో 2 సెంచరీలు, 2 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఐపీఎల్‌లో ఎన్నో చెప్పుకోదగ్గ ప్రదర్శనలు కూడా ఉన్నాయి. కానీ ఈ మ్యాచ్‌లో ఆడిన ఆట అన్నింటికంటే శిఖరాన నిలుస్తుంది. ఇప్పటికే 49.61 సగటు, 150.84 సగటుతో దూసుకుపోతున్న తిలక్ ఈ ఫార్మాట్‌లో ముమ్ముందు మరిన్ని సంచలన ప్రదర్శనలు చూపించడం ఖాయం.



ఆసియా కప్ విజేతలు

ఏడాది	ఫార్మాట్	విజేత
1984	వన్డే	భారత్
1986	వన్డే	శ్రీలంక
1988	వన్డే	భారత్
1991	వన్డే	భారత్
1995	వన్డే	భారత్
1997	వన్డే	శ్రీలంక
2000	వన్డే	పాకిస్తాన్
2004	వన్డే	శ్రీలంక
2008	వన్డే	శ్రీలంక
2010	వన్డే	భారత్
2012	వన్డే	పాకిస్తాన్
2014	వన్డే	శ్రీలంక
2016	టి20	భారత్
2018	వన్డే	భారత్
2022	టి20	శ్రీలంక
2023	వన్డే	భారత్
2025	టి20	భారత్

మిథున్ మన్హాస్‌కే పట్టం

- బీసీసీఐ అధ్యక్షుడిగా ఏకగ్రీవ ఎంపిక
- సెలెక్టర్లుగా ప్రజ్ఞాన్ ఓజా, ఆర్పీ సింగ్



ముంబై: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కొత్త అధ్యక్షుడిగా మిథున్ మన్హాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఆదివారం జరిగిన బోర్డు 94 వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో మిథున్ మన్హాస్ ప్యానెల్ పోటీలేకుండానే విజయం సాధించింది. దీంతో 45 ఏళ్ల మన్హాస్... బీసీసీఐ 37వ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. 70 ఏళ్లు నిండిన కారణంగా రోజర్ బిన్నీ గత నెలలో అధ్యక్ష పదవికి రాజీనామా చేయగా... నూతన అధ్యక్షుడి పదవి కోసం మన్హాస్ మాత్రమే దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో వరుసగా మూడోసారి ఫస్ట్ క్లాస్ క్రికెటర్ బోర్డు పగ్గాలు చేపట్టాడు. బిన్నీ, సౌరవ్ గంగూలీ ప్రఖ్యాత అంతర్జాతీయ క్రికెటర్లు కాగా... ఢిల్లీ మాజీ కెప్టెన్ మిథున్ 157 ఫస్ట్‌క్లాస్, 130 లిస్ట్ 'ఎ', 55 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడాడు. గతంలో మన్హాస్ జమ్ము కశ్మీర్ రాష్ట్ర క్రికెట్ సంఘాన్ని గాడిన పెట్టేందుకు బీసీసీఐ నియమించిన ముగ్గురు వ్యక్తుల అడ్‌హాక్ కమిటీకి నాయకత్వం వహించాడు. దేవజిత్ సైకియా కార్యదర్శిగా కొనసాగుతుండగా... ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్‌గా అరుణ్ ధుమాల్ తిరిగి ఎన్నికయ్యాడు. కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు రఘురామ్ భట్ కోశాధికారిగా బాధ్యతలు తీసుకున్నారు. భారత మాజీ ఆటగాళ్లు ఆర్పీ సింగ్, ప్రజ్ఞాన్ ఓజా పురుషుల సెలెక్షన్ కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
29-9-2025

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	733	80,426
నిఫ్టీ ▽	236	24,655

విదేశీ సూచీలు		
నాస్‌డాక్	22,484	△ 99
డోజోన్స్	46,247	△ 300
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,285	△ 71
డాక్స్	23,739	△ 205
షాంఘై	3,828	▽ 25
నికాయ్	45,355	▽ 400

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.35	89.37
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	117.17	120.14
€	యూరో	ఎస్‌బీఐ	102.36	105.15
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.28	60.80
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.29	59.57
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.32	70.01
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.77	24.27
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.28	24.52
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.56	13.38

అప్పు చేసి 'ఈఎంఐ' కూడదు!



- అన్ని కొనుగోళ్లకూ ఈఎంఐ మంత్రమేనా..
- వీటిపై నియంత్రణ అవసరం
- లేదంటే సంపద సృష్టికి అవరోధం
- చెల్లించలేకపోతే భారీ వడ్డీ, చార్జీలు
- క్రెడిట్ స్కోర్‌కు విఘాతం
- ముందు పొదుపు.. తర్వాతే ఖర్చు

ఐఫోన్ 17ను మొదటి రోజే సొంతం చేసుకునేందుకు యాపిల్ స్టోర్ల ముందు బారులు తీరిన యువత.. కొన్ని చోట్ల తోపులాట. ప్రీమియం ఫోన్‌ను తొలిరోజే 'ఎక్స్‌పీరియెన్స్' చేయాలన్న ఆరాటం. రూ.1–2 లక్షల ఖరీదైన ఫోన్‌ను 6 సమాన వాయిదాల్లో (నో కాస్ట్ ఈఎంఐ) చెల్లించొచ్చంటూ యాపిల్ ప్రకటిస్తే.. కొన్ని రిటైల్ సంస్థలు 24 నెలల నో కాస్ట్ ఈఎంఐతోపాటు క్యాష్ బ్యాక్ ఆఫర్ల వల విసిరాయి. దీంతో స్పందన అదిరిపోయింది. ధర ఎంతైనా సరే గ్యాడ్జెట్లు, గృహోపకరణాలు, ప్రీమియం వాహనాలను ఈఎంఐపై సొంతం చేసుకునేందుకు నేటి తరం చూపిస్తున్న ఆసక్తికి ఇదొక నిదర్శనం. రుణంపై కొనుగోలు చేసే ఈ సంస్కృతికి అలవాటు పడిపోతే.. ఆర్థిక పరిస్థితులు తీవ్రంగా దిగజారొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

వేతన జీవులు తమ నెలవారీ ఆదాయంలో 33 శాతాన్ని రుణ ఈఎంఐల కోసం వెచ్చిస్తున్నారు. టెక్నాలజీపై అవగాహన కలిగిన వారు తమ సంపాదనలో 29 శాతం విచక్షణారహిత (అవసరం కానివి) కొనుగోళ్ల కోసం వ్యయం చేస్తున్నారు. ఆరంభ శ్రేణి ఉద్యోగుల వేతనంలో 34 శాతం నెలవారీ ఈఎంఐలకు వెళుతుంటే, అధిక ఆర్జనాపరులకు ఈ మొత్తం 46 శాతం ఉన్నట్టు 'పెర్ఫియోస్' అనే సాస్ ఫిన్‌టెక్ కంపెనీ, పీడబ్ల్యూసీ ఇండియాతో కలిసి చేసిన విస్తృత అధ్యయనంలో తెలిసింది. మన దేశంలో ఐఫోన్ యూజర్లలో 70 శాతం మంది ఈఎంఐపైనే కొంటున్నారు. మరొక అధ్యయనం ప్రకారం.. నెలవారీ రూ.50,000లోపు సంపాదించే వారిలో 93 శాతం మంది రోజువారీ అవసరాలను క్రెడిట్ కార్డులతో నెట్టుకొస్తున్నారు. ఏ అవసరానికైనా ఈఎంఐ మార్గంలో వెళుతుండడం నిజంగా ప్రమాదకరం. ఏటా దసరా, దీపావళి పండుగల సమయంలో ఈ–కామర్స్ సంస్థలే కాకుండా ఆఫ్‌లైన్‌లోనూ భారీ డిస్కౌంట్లు, ఆకర్షణీయమైన ఆఫర్లు ఊదరగొడుతుంటాయి. ఈ తరుణంలో ఈఎంఐపై చేసే కొనుగోళ్ల విషయంలో విచక్షణ తప్పనిసరి.

ముందు పొదుపు.. తర్వాతే ఖర్చు

'ముందు పొదుపు చేసి, మిగిలినదే ఖర్చు చేయి' అన్న ఆర్థిక నిపుణుల సూచనను ఆదర్శంగా తీసుకోవాలి. ఆదాయం ఎంతున్నా ఖర్చులపై నియంత్రణ లేకపోతే మిగులు ఏమీ ఉండదు. అందుకే వస్తున్న ఆదాయం నుంచే పొదుపు, పెట్టుబడులకు నిపుణుల సూచన మేరకు కేటాయింపులు చేయాలి. ప్రతి నెల ఆదాయం చేతికి అందిన వెంటనే ఆ మొత్తాన్ని పెట్టుబడులకు మళ్లించుకోవాలి. అప్పుడు మిగులు నిధుల నుంచి ఖర్చు చేయడం అలవాటు చేసుకుంటే వ్యయాలపై నియంత్రణ ఏర్పడుతుంది. అత్యవసరాలు తప్పించి జీవన అవసరాల కోసం ఉద్దేశించిన ఏ వస్తువు అయినా సరే ఈఎంఐ కొనుగోలు చేయడం మానుకోవాలి. కొనుగోలు ఏది అయినా, పెట్టుబడులు పోను మిగులు నిధుల నుంచే ఉండాలి. ఈ ఒక్క నియమానికి కట్టుబడితే చాలు.. ఆర్థిక పరిస్థితులు వాటంతట అవే మెరుగుపడతాయి. భవిష్యత్తు ఆదాయాన్ని ఇప్పుడే తాకట్టు పెట్టడం అస్సలు సూచనీయం కాదు.

అవసరాల కోసమే..

క్రెడిట్ కార్డు అన్నది సౌకర్యం, కొన్ని ప్రత్యేక ప్రయోజనాల కోసం. క్రమశిక్షణతో వినియోగిస్తే కార్డుపై ఎన్నో ప్రయోజనాలు పొందొచ్చు. చేసిన ఖర్చులను ఎలాంటి వడ్డీ లేకుండా చెల్లించేందుకు 45 రోజుల వరకు వ్యవధి ఉంటుంది. 1–5 శాతం మేర రివార్డులు లభిస్తాయి. కార్డుపై చేసే వ్యయాలు తదుపరి నెల ఆదాయం నుంచి చెల్లించే స్థాయిలోనే ఉండాలి. దీనివల్ల క్రెడిట్ స్కోరు బలపడుతుంది. అత్యవసర నిధి లేనప్పుడు.. వైద్య అత్యవసర పరిస్థితుల్లో ఒకరి వద్ద చేయి చాచకుండా, అప్పటికప్పుడు చెల్లింపులకు క్రెడిట్ కార్డు ఆధారంగా నిలుస్తుంది. బిల్లు చెల్లించేందుకు గడువు ఉంటుంది కనుక, ఆలోపు వ్యక్తిగత రుణం లేదంటే బంగారంపై రుణం తీసుకుని ఆ మొత్తాన్ని చెల్లించేయొచ్చు. క్రెడిట్ కార్డులపై డిస్కౌంట్ ఆఫర్లను వినియోగించుకుంటే అదనపు ప్రయోజనం పొందొచ్చు.

సంపద వినాశకారి..


ఎలాంటి వడ్డీ లేకుండా ఈఎంఐపై కొనుగోలు చేయడాన్ని మంచి ఆఫర్‌గా చాలా మంది భావిస్తుంటారు. కానీ, ఈఎంఐపై కొంటున్నామంటే.. భవిష్యత్ ఆదాయాన్ని ఇప్పుడు తనఖా పెడుతున్నట్టుగా భావించాలి. కొన్న తర్వాత నుంచి నిర్ణీత కాలం వరకు క్రమం తప్పకుండా ప్రతి నెలా బకాయి చెల్లింపులకు హామీ ఇచ్చినట్టు. ఇలాంటి ఈఎంఐలు ఒకటికి మించితే.. నెలసరి ఆదాయంలో ఇవన్నీ కలసి 40–50 శాతం చేరితే. అప్పుడు నెలకు రూ.లక్ష సంపాదించినా నికర మిగులు రూ.50 వేలు మించదు. నేటి జీవనశైలి ఖర్చుల మధ్య ఇక పొదుపు, మదుపునకు మిగులు ఎక్కడ? భవిష్యత్తు అవసరాలైన పిల్లల ఉన్నత విద్య, వివాహం, రిటైర్మెంట్, సొంతిల్లు వంటి లక్ష్యాలు ఏం కావాలి? వాటి కోసం కావాల్సిన నిధులను ఎలా సమకూర్చుకుంటారు? జీవితాంతం రుణగ్రస్థులై బతకడమేనా..? తమ చుట్టూ ఉన్నవారి మధ్య గొప్పతనం కోసం అప్పు చేసి పప్పు కూడు అవసరమా? ఒక్కసారి ఆలోచించాలి. రుణ భారం పెరిగిపోతే అప్పుడు మానసిక ఒత్తిడి అధికమవుతుంది. భవిష్యత్తులో ఎదురయ్యే అవసరాల కోసం మళ్లీ అప్పులు చేయాల్సి వస్తుంది. ఇదొక చైన్‌గా మారి అందులోంచి బయటకు వచ్చే మార్గం కనిపించదు. అప్పుల భారం పెరిగిపోవడంతో చేస్తున్న పనిపైనా శ్రద్ధ పెట్టలేరు. ఫలితంగా ఉత్పాదకత నష్టానికి, కెరీర్ పురోగతికి అడ్డుగా మారుతుంది.

కాంపౌండింగ్ ప్రయోజనం కోల్పోయినట్టే..



నెలకు రూ.5,000 చొప్పున మంచి పనితీరు చూపించే ఈక్విటీ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయడం మొదలు పెట్టి, 30 ఏళ్లపాటు కొనసాగించారని అనుకుందాం. 12 శాతం వార్షిక రాబడి ఆధారంగా రూ.1.54 కోట్లు సమకూరుతుంది. ఇందులో అసలు పెట్టుబడి రూ.18 లక్షలే. రూ.1.36 కోట్లు రాబడి. 30 ఏళ్లకు బదులు 20 ఏళ్లే ఇలా ఇన్వెస్ట్ చేశారనుకుంటే అప్పుడు సమకూరే మొత్తం అసలు, వడ్డీ కలిపి రూ.46 లక్షలే. 20 ఏళ్లలో రూ.46 లక్షలు సమకూరితే, అక్కడి నుంచి పదేళ్లలో రూ.కోటికి పైగా అదనంగా సమకూరింది. ఇది కాంపౌండింగ్ (వడ్డీపై వడ్డీ) కారణంగా ఏర్పడిందే. అందుకే సంపాదన మొదలైన నాటి నుంచే భవిష్యత్తు లక్ష్యాల కోసం క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేయాలి. దీనికి బదులు తొలి నాళ్లలో ఖరీదైన కొనుగోళ్లకు, విలాసాలకు ఈఎంఐపై ఖర్చు చేస్తూ.. పొదుపు పెట్టుబడులను నిర్లక్ష్యం చేస్తూ వెళితే సంపద సృష్టి కలగానే మిగిలిపోతుంది. ఆర్థిక స్వేచ్ఛకు శాశ్వతంగా దూరం కావాల్సి వస్తుంది.

చార్జీల భారం..



వడ్డీ లేకుండా సులభ చెల్లింపుల్లో అయినా సరే అసలు చార్జీలే ఉండవని కాదు. ఈఎంఐ సదుపాయాన్ని వినియోగించుకున్నందుకు క్రెడిట్ కార్డు కంపెనీ ప్రాసెసింగ్ చార్జీ విధిస్తుంది. ఈ మొత్తం రూ.200–500 వరకు ఉంటుంది. దీనిపై 18 శాతం జీఎస్టీ కూడా పడుతుంది. ఇక ప్రతి నెలా ఈఎంఐలో వడ్డీ భాగం కూడా ఉంటుంది. ఈ వడ్డీ భాగంపైనా 18 శాతం జీఎస్టీ పడుతుంది. నో కాస్ట్ ఈఎంఐ ఆఫర్ కింద కేవలం వడ్డీ వరకే డిస్కౌంట్ లభిస్తుంది. ఈ వడ్డీని ఉత్పత్తిని విక్రయించిన సంస్థ లేదా కంపెనీ లేదా ఇద్దరూ పంచుకుంటారు. ఆ వడ్డీపై జీఎస్టీ చెల్లించాల్సిన భారం వినియోగదారుడిపైనే పడుతుంది. ఇలా ఒకే సమయంలో ఒకటికి మించిన రుణాలు యాక్టివ్‌గా ఉండడం క్రెడిట్ స్కోరు పరంగా అనుకూలం కాదు. రుణాలు ఆదాయ పరిమితుల్లోనే ఉండాలి. ఒకటి రెండు ఈఎంఐలు చెల్లించలేకపోతే క్రెడిట్ స్కోరుపై ప్రతికూల ప్రభావం పడుతుంది.

చెల్లించలేకపోతే..



ఐఫోన్ కోసం ఒకేసారి రూ.80,000 –1,00,000 చెల్లించక్కర్లేకుండా నెలకు రూ.6,000 చెల్లించడం ఎంతో మందికి సులభంగా అనిపించొచ్చు. కానీ, చెల్లించలేని పరిస్థితి ఏర్పడితే? క్రెడిట్ కార్డు బకాయిలపై వడ్డీ నెలకు రూ.3 పైమాటే. ఏటా 45 శాతం వరకు వసూలు చేసే సంస్థలు కూడా ఉన్నాయి. రూ.50,000 బకాయిని తీర్చకుండా అలాగే కొనసాగిస్తే రెండేళ్లలో అది రూ.లక్షగా మారుతుంది. ప్రతి నలుగురు రుణ గ్రహీతల్లో ఒకరు తిరిగి చెల్లించలేకపోతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఒకప్పుడు రుణ ఈఎంఐ అన్నది ఇంటి కొనుగోలుకే పరిమితం. తర్వాత వాహన కొనుగోళ్లకు విస్తరించింది. ఇప్పుడు ఫోన్లు, టీవీలు, వాషింగ్ మెషీన్లు, ఏసీలు, వస్త్రాలు, విహార యాత్రల కోసం ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి ఖరీదైన కొనుగోలుకు క్రెడిట్ కార్డు ఈఎంఐ అలవాటుగా మారిపోయింది. చివరికి పెళ్లి వేడుక ఘనంగా చేసుకునేందుకు కూడా రుణం తీసుకుంటున్నారు. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు డిజిటల్‌గా ఇన్‌స్టంట్ రుణాలను ఇస్తుండటం ఈ ధోరణిని పెంచుతోంది. ఒకటికి మించి కార్డులు తీసుకుని, రుణంపై నెట్టుకొస్తున్న మధ్య తరగతి ప్రజలు ఎంతో మంది ఉన్నారు. రుణాలు ఆదాయంలో సగానికి చేరాక.. ఉన్నట్టుండి ఉద్యోగానికి/ఉపాధికి దూరమైతే అప్పుడు తీర్చేదెలా? 'సంపాదిస్తున్న దానికి మించి ఖర్చు చేస్తుంటే నువ్వు ఎప్పటికీ సంపన్నుడివి కాలేవు' అన్న వారెన్ బఫెట్ సూక్తిని ఇక్కడ చెవికెక్కించుకోవాలి. ఒకప్పుడు అవసరమైన కొనుగోళ్లకే పరిమితమయ్యే వారు. ఇప్పుడంతా డిజిటల్ కావడంతో.. అవసరం లేనివీ కొనుగోలు చేస్తున్న ధోరణి నెలకొంది.

ఒక్కసారి ప్రశ్నించుకోవాల్సిందే..



- పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్టు.. ఇతరుల ప్రభావంతో గొప్పకుపోయి అవసరం లేని ఖరీదైన కొనుగోళ్లు చేయడంలో ప్రయోజనం ఉండదు.
- ఖరీదైన వస్తువు ఈఎంఐ కారణంగా చౌకగా మారుతోంది. దీనివల్ల ఎవరికి లాభం, ఎవరికి నష్టమో ఒకసారి ఆలోచించాలి.
- అన్ని రుణాల్లోకి గృహ రుణం ఒక్కటే ప్రయోజనం. తక్కువ వడ్డీ రేటుతో, రుణం తీర్చే సమయానికి దాని విలువ ఎంతో కొంత పెరుగుతుంది. వినియోగ వస్తువులను ఈఎంఐపై కొంటే రుణం తీరే నాటికి వాటి విలువ సున్నా కావొచ్చు. మళ్లీ వాటి కొనుగోలుకు రుణాన్ని ఆశ్రయిస్తే రుణ ఊబిలోకి వెళుతున్నట్టే.
- నిపుణుల సూచన ప్రకారం ఒకరి ఆదాయంలో ఈఎంఐలు 40 శాతం మించకూడదు. మించితే ఆర్థిక పరిస్థితులు అదుపు తప్పినట్టు అవుతుంది. ఈ 40 శాతం ఈఎంఐలు అన్నవి వినియోగ రుణాల కోసం ఉద్దేశించిన సూత్రం కాదు. ముఖ్యమైన రుణాల కోసం ఉద్దేశించినది. అంటే గృహ, విద్యా రుణాలకే పరిమితం కావాలి. తప్పనిసరి అయితే ఏకకాలంలో ఒక వ్యక్తిగత రుణానికి పరిమితం కావాలి. లేదంటే జీవిత కాలం పాటు రుణానికి చెల్లింపులు చేస్తూ వెళ్లాల్సి వస్తుంది. దీంతో రిటైర్మెంట్ తర్వాతి అవసరాలకు కావాల్సిన ఫండ్ ఏర్పడదు.
- రుణ బకాయిలు సకాలంలో చెల్లించకపోవడం వల్ల క్రెడిట్ స్కోరు దెబ్బతింటుంది. దీనివల్ల భవిష్యత్తు రుణాలు మరింత ఖరీదుగా (అధిక వడ్డీ రేటుపై) మారతాయి.
- క్రెడిట్ కార్డులను కేవలం రివార్డుల కోసమే ఉపయోగించుకోవాలి. ఒకటి, రెండు మించి కార్డులు ఉండడం అనుకూలం కాదు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-9-2025	
విశాఖ	530–00
చిత్తూరు	543–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	550–00
హైదరాబాద్	500–00
వరంగల్	502–00

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఆర్‌బీఐ పాలసీపై మార్కెట్ దృష్టి
మరో పావు శాతం రేట్ల కోతకు చాన్స్!

ద వెల్త్ కంపెనీ నాలుగు ఎన్‌ఎఫ్‌వోలు

ఎథికల్ ఫండ్ పేరుతో కొత్త థీమ్

ముంబై: ద వెల్త్ కంపెనీ మ్యూచువల్ ఫండ్ (పాంటోమ్యాథ్ కంపెనీ).. నాలుగు యాక్టివ్ న్యూ ఫండ్ ఆఫర్లను (ఎన్‌ఎఫ్‌వోలను) ప్రకటించింది. ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) ప్లాట్‌ఫామ్‌పై ఎన్‌ఎఫ్‌వోలను ప్రారంభించిన తొలి కంపెనీగా రికార్డు నమోదు చేసింది. ద వెల్త్ కంపెనీ ఫ్లెక్సీక్యాప్ ఫండ్, ఆర్బిట్రేజ్ ఫండ్, ఎథికల్ ఫండ్, లిక్విడ్ ఫండ్ ఇందులో ఉన్నాయి. భిన్న రకాల ఇన్వెస్టర్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వీటిని తీసుకొచ్చింది. ఇందులో ఎథికల్ ఫండ్ అన్నది ఆల్కహాల్, పొగాకు, గ్యాంబ్లింగ్, నార్కోటిక్స్, తోలు, మాంసం, పౌల్ట్రీ ఉత్పత్తులు, పెస్టిసైడ్స్‌తోపాటు జంతువుల హింసకు కారణమయ్యే కంపెనీల్లో పెట్టుబడులకు దూరంగా ఉంటుంది. కనీసం రూ.1,000 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ రూపంలో అయితే కనీసం రూ.250 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. అక్టోబర్ 8 వరకు ఇవి అందుబాటులో ఉంటాయి. ఈ సంస్థను మధు లూనావత్ స్థాపించగా, ఎండీ, సీఈవోగా ఆమె వ్యవహరిస్తున్నారు.



కోటక్ నిఫ్టీ 200 మొమెంటం 30 ఈటీఎఫ్



కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ తాజాగా నిఫ్టీ 200 మొమెంటం 30 ఈటీఎఫ్‌ను ప్రవేశపెట్టింది. ఇది అక్టోబర్ 6 వరకు అందుబాటులో ఉంటుంది. స్టాక్స్ ధరల కదలికలపరమైన ప్రయోజనాలను అందిపుచ్చుకునే విధంగా ఈ ఫండ్ ఉంటుందని కోటక్ మహీంద్రా ఏఎంసీ ఎండీ నీలేశ్ షా చెప్పారు. ఓవరాల్ మార్కెట్ ట్రెండ్‌కి అనుగుణంగా పెరిగే సూచనలు కనపరుస్తున్న స్టాక్స్‌ని ఈ ఫండ్ లక్ష్యంగా పెట్టుకుంటుందని వివరించారు. ఈ ఈటీఎఫ్‌తో తమ ప్యాసివ్ ఫండ్స్ పోర్ట్‌ఫోలియో మరింత పటిష్టమవుతుందని పేర్కొన్నారు.

సంపద సృష్టికి మార్గం..!

ఎస్‌బీఐ కాంట్రా ఫండ్





వృద్ధి ఆధారిత పెట్టుబడుల విధానం మన మార్కెట్లలో ఎక్కువ సందర్భాల్లో ఫలితమిస్తుంటుంది. అదే సమయంలో వ్యాల్యూ ఆధారిత పెట్టుబడుల విధానాన్ని విస్మరించడానికి లేదు. ఓపిక పడితే దీర్ఘకాలంలో ఈ విధానంతోనూ మెరుగైన రాబడులను సొంతం చేసుకోవచ్చు. గత దశాబ్ద కాలంలో మన మార్కెట్లలో గ్రోత్ నమూనాది పైచేయిగా కనిపించినప్పటికీ.. వ్యాల్యూ ఇన్వెస్టింగ్ సైతం మంచి రాబడులను కురిపించింది. ప్రస్తుతం అంతర్జాతీయంగా ఆర్థిక పరిస్థితులు సజావుగా లేవు. పలు దేశాల మధ్య ఘర్షణాత్మక వైఖరి, అమెరికా ఏకపక్ష ప్రతీకారాత్మక సుంకాలు ఎన్నో అనిశ్చితులకు దారితీశాయి. ఈ సమయంలో అధిక వ్యాల్యూయేషన్ల వద్ద స్టాక్స్ కొనుగోలు రిస్క్‌తో కూడుకున్నదే. కనుక వ్యాల్యూ స్టాక్స్‌ను కూడా పోర్ట్‌ఫోలియోలో కలిగి ఉండడం కొంత రక్షణనిస్తుంది. మార్కెట్ల పతనాల్లో వ్యాల్యూస్టాక్స్ బలంగా నిలడడాన్ని గుర్తు చేసుకోవాలి. అందుకని వ్యాల్యూ, కాంట్రా ఫండ్స్‌కు పోర్ట్‌ఫోలియోలో చోటివ్వాలి. ఈ విభాగంలో రెండు దశాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన ఎస్‌బీఐ కాంట్రా ఫండ్ మంచి పనితీరు చూపిస్తోంది.

రాబడులు

ఈ పథకం బెంచ్ మార్క్, పోటీ పథకాలతో చూసుకున్నా దీర్ఘకాలంలో మెరుగైన రాబడులు అందించింది. గడిచిన ఏడాది కాలంలో 5 శాతం నష్టాలు కనిపిస్తున్నాయి. గత ఏడాది కాలంగా ఈక్విటీలు నికరంగా ఎలాంటి రాబడులు ఇవ్వని విషయాన్ని గమనించాలి. ఇక మూడేళ్ల పనితీరు గమనిస్తే ఏటా 21% రాబడులను ఇచ్చింది. ఐదేళ్లలో 31%, ఏడేళ్లలో 21 శాతం, పదేళ్లలో 17 శాతం చొప్పున వార్షిక రాబడులను ఇచ్చిన చరిత్ర ఈ పథకం డైరెక్ట్ ప్లాన్‌కు ఉంది.

పెట్టుబడుల విధానం

వ్యాల్యూ ఫండ్స్ అన్నవి అంతర్గత విలువ కంటే తక్కువకు ట్రేడవుతున్న స్టాక్స్‌ను గుర్తించి ఇన్వెస్ట్ చేస్తాయి. కాంట్రేరియన్ పథకాలు అలా కాదు. మార్కెట్లు విస్మరించే స్టాక్స్‌లో పెట్టుబడులు పెడుతుంటాయి. ఎస్‌బీఐ కాంట్రా ఫండ్ అయినప్పటికీ వ్యాల్యూ ఇన్వెస్టింగ్ విధానాన్ని సైతం అనుసరిస్తుంది. ఎస్‌బీఐ కాంట్రా ఫండ్ మల్టీక్యాప్ విధానానంలో.. లార్జ్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగాల నుంచి కంపెనీలను ఎంపిక చేసుకుంటుంది. ఏదో ఒక విభాగానికి పరిమితం కాబోదు.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్	
కంపెనీ	పెట్టుబడుల శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	8.25
రిలయన్స్ ఇండస్ట్రీస్	5.74
ఐటీసీ	2.72
కోటక్ బ్యాంక్	2.69
పీఎన్‌బీ	2.17
బయోకాన్	2.15
గెయిల్	1.93
టాటా స్టీల్	1.92
డాబర్ ఇండియా	1.92
టోరెంట్‌పవర్	1.71

పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో 46,654 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. పోర్ట్‌ఫోలియోలో 81 స్టాక్స్ ఉన్నాయి. పెట్టుబడుల్లో 73 శాతం మేర లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసింది. మిడ్‌క్యాప్ కంపెనీలకు 21 శాతం, స్మాల్‌క్యాప్ కంపెనీలకు 5 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించింది. తన నిర్వహణలోని మొత్తం పెట్టుబడుల్లో ప్రస్తుతం 86 శాతాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, 4.7 శాతం డెట్‌లో, 8 శాతం మేర నగదు రూపంలో కలిగి ఉంది. పెట్టుబడుల్లో 29 శాతాన్ని బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసింది. ఇంధన, యుటిలిటీ కంపెనీలకు 15 శాతం, టెక్నాలజీ కంపెనీలకు 12 శాతం, మెటీరియల్స్ కంపెనీలకు 12 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించింది.

హ్యాపీయెస్ట్ మైండ్స్ | బ్రోకరేజ్: యాక్సిస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 536 టార్గెట్: రూ. 690

ఎందుకంటే: ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత, సవాళ్లతో కూడిన వాతావరణం నెలకొన్నప్పటికీ హ్యాపీయెస్ట్ మైండ్స్ టెక్నాలజీస్ నిలకడైన నిర్వహణ పనితీరును ప్రదర్శించింది. ద్రవ్యోల్బణ, కరెన్సీ హెచ్చుతగ్గులు, రాజకీయ, భౌగోళిక ఆందోళనల మధ్య గత ఆర్థిక సంవత్సరం (2024–25)లో పటిష్ట ఫలితాలు సాధించింది. మొత్తం ఆదాయం వార్షిక ప్రాతిపదికన 26.5 శాతం ఎగసింది. ఇందుకు కంపెనీ సొంత వ్యూహాల ద్వారా సాధించిన వృద్ధి, బీఎఫ్‌ఎస్‌ఐ, హెల్త్‌కేర్ విభాగాల్లో పట్టున్న ప్యూర్‌సాఫ్ట్‌వేర్ కొనుగోలు అండగా నిలిచాయి. కంపెనీ ఏఐ, జనరేటివ్ఏఐ, క్లౌడ్, సైబర్‌సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ తదితర డిజిటల్ ఫస్ట్ సామర్థ్యాలపై పెట్టుబడులను కొనసాగిస్తోంది. తద్వారా విభిన్న ప్రాంతాలలోని, వివిధ పరిశ్రమల అవసరాలు తీర్చే ప్రాజెక్టులను ఎగ్జిక్యూట్ చేస్తోంది. ఇందుకు తక్కువ పెట్టుబడుల(అసెట్ లైట్ మోడల్) విధానాన్ని అవలంబిస్తూ అధిక మార్జిన్లు అందించే విభాగాలపై దృష్టిపెట్టి సాగుతోంది. దీర్ఘకాలిక వ్యూహాలకు అనుగుణమైన కార్యాచరణ కంపెనీ పటిష్ట పనితీరుకు మద్దతిస్తోంది. వీటిలో నిరంతరంగా లాభదాయకతను పెంచే, మెరుగైన ఎగ్జిక్యూషన్‌కు దారిచూపే ట్రాన్స్‌ఫార్మేషనల్ ప్రోగ్రాములను అమలు చేస్తోంది. గ్లోబల్ స్థాయిలో కస్టమర్ అవసరాలు, ప్రాధాన్యతలు తీర్చగల, బిజినెస్‌లకు దీర్ఘకాలిక విలువను చేకూర్చగల సొల్యూషన్లు అందించడంలో కంపెనీ కట్టుబాటును ప్రదర్శిస్తోంది. కాగా.. ప్యూర్‌సాఫ్ట్‌వేర్‌ను కంపెనీతో విజయవంతంగా ఏకీకృతం చేసుకోవడం, క్లయింట్లతో మెరుగైన సంబంధాలను కొనసాగించడం, స్థిర ధరల(ఫిక్స్‌డ్ ప్రైస్) ప్రాజెక్టులను అత్యుత్తమ స్థాయిలో ఎగ్జిక్యూషన్ చేయడం వంటి అంశాలు ఇకపై కంపెనీ దీర్ఘకాలిక వృద్ధిలో కీలక పాత్రను పోషించనున్నాయి.



ఎలెన్‌బరీ గ్యాసెస్ | బ్రోకరేజ్: మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 486 టార్గెట్: రూ. 680

ఎందుకంటే: గత ఐదు దశాబ్దాలుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఎలెన్‌బరీ ఇండస్ట్రియల్ గ్యాసెస్.. దేశీయంగా ఈ రంగంలోని అతిపురాతన కంపెనీలలో ఒకటిగా సుప్రసిద్ధమైంది. విభిన్న గ్యాస్‌ల తయారీ విభాగంలో కంపెనీ విస్తారిత పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది. ఆక్సిజన్, నైట్రోజన్, ఆర్గాన్, హైడ్రోజన్, హీలియం, కార్బన్ డయాక్సైడ్ తదితర పలురకాల గ్యాస్‌ల తయారీ, సరఫరాలను నిర్వహిస్తోంది. అత్యవసర వ్యవస్థలు, అప్లికేషన్లలో ఈ విభిన్న గ్యాస్‌లు కీలక పాత్రను పోషిస్తుంటాయి. ప్రధానంగా ఫార్మాస్యూటికల్స్, హెల్త్‌కేర్, స్టీల్, ఇంజినీరింగ్, రక్షణ(డిఫెన్స్), ఇంధనం, ఆహారం, పానీయాలు తదితర రంగాలలో వీటిని వినియోగిస్తారు. వీటికి ఎల్లవేళలా కొనసాగే డిమాండుకు తోడు.. కస్టమర్లతో దీర్ఘకాలిక సంబధాల పటిష్టతకు ఇవి దోహదం చేస్తాయి. ఈ నేపథ్యంలో కస్టమర్లను తిరిగి పొందడం, కొనసాగించడంలో కంపెనీ బిజినెస్ మోడల్ కీలక పాత్ర పోషిస్తోంది. క్లిష్టమైన ఈ రంగంలోకి ప్రవేశించడంలో ప్రత్యర్థి సంస్థలకు ఎదురయ్యే పలు సవాళ్లు కంపెనీకి లబ్దిని చేకూర్చుతున్నాయి. ఇండస్ట్రియల్ గ్యాసెస్ తయారీలో సంక్లిష్టతలు, దీర్ఘకాలిక పైప్‌లైన్ కాంట్రాక్టులను పొందడంలో కఠిన సవాళ్ల ప్రభావం చూపుతున్నాయి. దీంతో సరఫరాదారుల సంఖ్య పరిమితమవుతోంది. ప్రాంతాలవారీగా కార్యకలాపాలను పెంచుకునేందుకు ఎలెనబరీ అధిక ప్రాధాన్యతను ఇస్తోంది. ఈ బాటలో దేశవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరిస్తోంది. దీనిలో భాగంగా దేశ ఉత్తర, పశ్చిమ ప్రాంతాలలో పట్టు సాధించింది. ఇదే సమయంలో దేశ తూర్పు, దక్షిణ ప్రాంతాలలో తయారీ సామర్థ్యాలను పటిష్ట పరచుకుంటోంది. కీలక కస్టమర్లపై అధికంగా ఆధారపడటం, తయారీలో అవాంతరాలు, కొన్ని రంగాలలో డిమాండ్ క్షీణత రిస్కులుగా పరిగణించవచ్చు.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఎల్లలు దాటిన బతుకమ్మ

అమెరికా, ఆస్ట్రేలియా, దుబాయ్ దేశాల్లోని సంబురాలకు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: ఆస్ట్రేలియా, అమెరికా, దుబాయ్ దేశాల్లో జరిగిన బతుకమ్మ వేడుకలకు కాంగ్రెస్ నేతలు హాజరయ్యారు. గల్ఫ్ తెలంగాణ ఫోరం ఆధ్వర్యంలో శనివారం దుబాయిలో జరిగిన వేడుకలకు.. తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ జి.వెన్నెల గద్దర్‌తోపాటు అడువాల జ్యోతి లక్ష్మణ్, అల్లూరి కృష్ణవేణి అతిథులుగా హాజరయ్యారు. అమెరికాలోని పెన్సిల్వేనియాలో హారిస్‌బర్గ్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ పండుగ సంబురాలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో హారిస్‌బర్గ్ తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు కాకర్ల శ్రీనివాస్, కార్యదర్శి మునికుమార్ గిల్లా తదితరులు పాల్గొన్నారు. ఆస్ట్రేలియాలో జరిగిన బతు కమ్మ సంబురాలకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరయ్యారు.



దుబాయిలో జరిగిన వేడుకలకు హాజరైన తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ జి.వెన్నెల గద్దర్ తదితరులు

అన్నింటా.. అందరిలోనూ మైక్రోప్లాస్టిక్స్!



- పర్యావరణం, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు
- గాలి, నీరు, ఆహారం ద్వారా శరీరంలోకి చొరబాటు
- ఊపిరితిత్తులు, రక్తంలో కలిసి వాపు, మంట, హార్మోన్ల అసమతౌల్యతకు దారితీస్తున్న వైనం
- దీర్ఘకాలిక వ్యాధులను మోసుకొచ్చే వాహకాలుగానూ మారుతున్నట్లు వెల్లడి
- సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని వీలైనంత తగ్గించాలంటున్న వైద్య నిపుణులు

సాక్షి, హైదరాబాద్: ప్రజారోగ్యం, పర్యావరణ వ్యవస్థలపై అతిసూక్ష్మ ప్లాస్టిక్ కణాలైన మైక్రో ప్లాస్టిక్స్ పెనుప్రభావం చూపుతున్నాయి. గాలి, తాగునీరు, ఆహారం ద్వారా మనుషుల శరీరంలోకి చొరబడుతున్నాయి. ఊపిరితిత్తులు, రక్తం, మాయ కణజాలం (ప్లసెంటల్ టిష్యూ)లోకి చేరి వాపు, మంట (ఇన్‌ఫ్లమేషన్)కు, హార్మోన్ల అసమతౌల్యతకు కారణమవుతున్నాయి. దీర్ఘకాలిక రోగాలకు కారణమయ్యే విషపూరిత రసాయనాలు, వ్యాధికారకాలను మోసుకెళ్లే వాహకాలుగా పనిచేస్తున్నాయి.

అతిపెద్ద సవాళ్లలో ఒకటి...

మైక్రో ప్లాస్టిక్స్ పర్యావరణంలోకి ప్రవేశించాక వాటిని తొలగించడం కష్టసాధ్యంగా మారుతోంది. ఇవి ఒక మైక్రోమీటర్ నుంచి 5 మిల్లీమీటర్ల మధ్య పరిమాణంలో ఉండటమే అందుకు కారణం. ప్లాస్టిక్ పాలిమర్‌లు మన్నికైనవిగా, రసాయన విచ్ఛిన్నానికి నిరోధకతను కలిగి ఉండేలా రూపొందించడం వల్ల మైక్రోప్లాస్టిక్స్ వాతావరణంలో వందల, వేల సంవత్సరాలపాటు కొనసాగే గుణం కలిగి ఉన్నాయి. ముఖ్యంగా భౌతిక, రసాయన వాతావరణం (యూవీ రేడియేషన్, వేడి మొదలైనవి) కారణంగా ప్లాస్టిక్ బాటిళ్లు, ప్లాస్టిక్ బ్యాగ్‌ల వంటి పెద్ద ప్లాస్టిక్ వస్తువులు సూక్ష్మ ప్లాస్టిక్ కణాలుగా విచ్ఛిన్నమై వాతావరణంలో కలిసిపోతున్నాయి. దీంతో వాటిని భారీ స్థాయిలో శుభ్రపరిచే ప్రయత్నాలు దాదాపు అసాధ్యంగా మారాయి.

వివిధ అధ్యయనాల్లో వెల్లడి...

ప్రపంచంలో ఏటా 265 మిలియన్ మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని అంచనా. 2015 నాటి అంచనా ప్రకారం మహాసముద్రాల్లో 15 నుంచి 51 ట్రిలియన్ మైక్రోప్లాస్టిక్ కణాలు ఉన్నాయి. ఇవి దాదాపు 93 నుంచి 236 మిలియన్ టన్నుల మైక్రోప్లాస్టిక్‌లకు సమానం. మైక్రోప్లాస్టిక్‌లు ఆహార వ్యవస్థలోకి చొచ్చుకుపోవడం లేదా చర్మం ద్వారా కూడా మనుషుల్లోకి చేరుతాయి. ప్రపంచవ్యాప్తంగా ఏటా 11,845 నుంచి 1,93,200 మైక్రోప్లాస్టిక్ కణాలు మనుషుల్లోకి చేరుతున్నట్లు శాస్త్రవేత్తలు అంచనా వేశారు. 2021 నాటి అధ్యయనం ప్రకారం... యూరప్‌లోని 90% కంటే ఎక్కువ మంచినీటి సరస్సులు, నదులు మైక్రోప్లాస్టిక్‌లతో కలుషితమయ్యాయి. ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ 2020లో జరిపిన ఒక అధ్యయనం ప్రకారం ప్రతి హెక్టార్ వ్యవసాయ నేలల్లో 0.1 నుంచి 0.5 మిలియన్ల మైక్రోప్లాస్టిక్ కణాలు ఉండొచ్చని వెల్లడైంది. ఇది నేల ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేయడంతోపాటు పంటల ద్వారా ఆహార వ్యవస్థలోకి ప్రవేశించే అవకాశం ఉందని తేలింది. క్వీన్ మేరీ యూనివర్సిటీ ఆఫ్ లండన్ 2020 అధ్యయనం ప్రకారం పట్టణ ప్రాంతాల్లోని గాలి నమూనాల్లో నిత్యం చదరపు మీటర్‌కు 100 మైక్రోప్లాస్టిక్ కణాలు ఉంటాయని అంచనా. 2022లో ఎన్విరాన్‌మెంట్ ఇంటర్నేషనల్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనంలో 50% కంటే ఎక్కువ మంది (సర్వే చేసిన వారిలో) రక్తప్రవాహంలో మైక్రోప్లాస్టిక్ కణాలను గుర్తించారు.

ఊపిరితిత్తులు, రక్తం ద్వారా అవయవాల్లోకి మైక్రోప్లాస్టిక్స్ చేరడం వల్ల ఆయా అవయవాల్లో వాపు, మంట (ఇన్‌ఫ్లమేషన్) కలుగుతుంది. అలాగే హార్మోన్ల అసమతౌల్యతకు దారితీస్తుంది. విషపూరిత రసాయనాలు, వ్యాధికారకాలను మోసుకెళ్లే వాహకాలుగానూ మైక్రోప్లాస్టిక్స్ పనిచేస్తున్నాయి. ప్రజలు వ్యక్తిగత స్థాయిలో 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్'పై ఆధారపడడాన్ని వీలైనంత తగ్గించుకోవాలి.

– డాక్టర్ హరికిషన్ గోనుగుంట్ల, చీఫ్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్, యశోద ఆసుపత్రి

మైక్రోప్లాస్టిక్స్- వాటి రూపాలు ఇలా...

- ➤ వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు: టూత్‌పేస్ట్‌లు, స్క్రబ్‌లు, ఎక్స్‌ఫోలియెంట్లు, మైక్రోబీడ్స్ ఉన్న లోషన్లు.
- ➤ సింథటిక్ దుస్తులు: పాలిస్టర్, నైలాన్, యాక్రిలిక్‌తో తయారు చేసిన బట్టలు ఉతకడం వల్ల విడుదలవుతాయి.
- ➤ ప్లాస్టిక్ గుళికలు: ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీలో ఉపయోగించే చిన్న ప్లాస్టిక్ రెసిన్ గుళికలు (నర్డిల్స్)
- ➤ వ్యవసాయ రసాయనాలు: ఎరువులు, పురుగుమందుల్లో (ఉదా. ప్లాస్టిక్ పూత పూసిన ఎరువులు) ఉంటాయి.
- ➤ పెద్ద ప్లాస్టిక్ శిథిలాలు: కాలక్రమేణా చిన్నచిన్న ముక్కలుగా విరిగిపోయే ప్లాస్టిక్ సీసాలు, సంచులు, ప్యాకేజీలు.
- ➤ చేపలు పట్టే పరికరాలు: వలలు, లైన్లు, మైక్రోప్లాస్టిక్‌లుగా క్షీణించే ఇతర పరికరాలు.
- ➤ టైర్లు: వాహనాల టైర్లు అరిగిపోవడం వల్ల పర్యావరణంలోకి చిన్న ప్లాస్టిక్ కణాలు విడుదలవుతాయి.



మన బతుకమ్మ కార్నివాల్

- సరూర్‌నగర్ స్టేడియం వేదికగా నేడు గిన్నిస్ వరల్డ్ రికార్డు దిశగా సంబురాలు
- ప్రత్యేక ఆకర్షణగా 63 అడుగుల ఎత్తు బతుకమ్మ...ఆడిపాడనున్న 10 వేల మంది మహిళలు
- హాజరు కానున్న సీఎం రేవంత్‌రెడ్డి.. స్టేడియంలో భారీగా ఏర్పాట్లు

హుడాకాంప్లెక్స్ (హైదరాబాద్): 'బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో..., ఒక్కేసి పువ్వేసి సందమామా.. చిత్తూచిత్తూల బొమ్మ.. శివుని ముద్దుల గుమ్మ.. బంగారు బొమ్మ దొరికేనమ్మో ఈ వాడలోనా' అంటూ బతుకమ్మ పాటలతో సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం మార్మోగనుంది. బంతి, చేమంతి, గునుగు, గులాబీ, తంగేడు, గడ్డి పువ్వు వంటి తీరొక్క పూలతో తయారు చేసిన బతుకమ్మలు దర్శనమివ్వబోతున్నాయి. ఒకే వేదికపై పదివేల మంది మహిళలు బతుకమ్మ ఆడిపాడి కనువిందు చేయబోతున్నారు. మన బతుకమ్మ కార్నివాల్ పేరుతో నిర్వహించనున్న ఈ అద్భుత దృశ్య కావ్యానికి సరూర్ నగర్ స్టేడియం వేదిక కాబోతోంది.

'గిన్నిస్ వరల్డ్ రికార్డు'ఈవెంట్

నవరాత్రి వేడుకల్లో భాగంగా తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సరూర్‌నగర్ వేదికగా నిర్వహించ తలపెట్టిన 'గిన్నిస్ వరల్డ్ రికార్డు ఈవెంట్'కు భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఇండోర్ సహా అవుట్ డోర్ స్టేడియాల్లో 63 అడుగుల ఎత్తు బతుకమ్మను ఏర్పాటు చేస్తున్నారు. గ్రేటర్ జిల్లాలు సహా సరిహద్దు జిల్లాల నుంచి 200 బస్సుల్లో మహిళలను ఆదివారం ఉదయమే స్టేడియానికి రప్పించి, ఆయా పాటలకు శిక్షణ ఇప్పించారు. వేడుకలో భాగంగా పాడే పాటలు, ప్రదర్శనలపై ముందే రిహార్సల్స్ చేశారు. సోమవారం సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య నిర్వహించనున్న బతుకమ్మ ప్రదర్శనను గిన్నిస్ వరల్డ్ రికార్డులో సంస్థ ప్రతినిధులు నమోదు చేయనున్నారు.



క్రేన్ సాయంతో రూపొందిస్తున్న 63 అడుగుల ఎత్తు బతుకమ్మ

సీఎం సహా పలువురు మంత్రుల రాక

వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క, పలువురు మహిళా ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఎల్బీనగర్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వైపు వెళ్లే వాహనాలను దారి మళ్లించనున్నారు. ఈ మేరకు ఆదివారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ పంకజా, టూరిజం ఎండీ క్రాంతి, పలువురు అధికారులు స్టేడియానికి చేరుకొని ఏర్పాట్లను పరిశీలించారు.

గంజాయి రవాణాకు అడ్డుకట్ట!

- రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, ఎన్‌సీబీ సంయుక్త సోదాలకు నిర్ణయం
- ఈ సప్లై చైన్ అడ్డుకునేలా ప్రత్యేక వ్యూహం
- ఒడిశా ఏజెన్సీ ప్రాంతాల నుంచి ఉత్తర భారత్‌కు రైళ్లలో సరఫరా



సాక్షి, హైదరాబాద్: గంజాయి మహమ్మారి కట్టడికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. స్థానిక పోలీసులు, ప్రత్యేక దర్యాప్తు విభాగాలు, కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎంత నిఘా పెడుతున్నా ఈ ముఠాలు వారి కళ్లు గప్పి గంజాయి రవాణా చేస్తూనే ఉన్నాయి. ప్రధానంగా ఆంధ్రా–ఒడిశా సరిహద్దుతోపాటు ఒడిశా ఏజెన్సీ నుంచి దేశంలోని ఇతర ప్రాంతాలకు గంజాయి సరఫరా అవుతోంది. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు నుంచి వస్తున్న గంజాయి రోడ్డు మార్గంలో తెలంగాణ మీదుగా గోవా, బెంగళూరు, ముంబయి తోపాటు ఉత్తర భారత దేశంలోని పలు రాష్ట్రాలకు లారీలు, ట్రావెల్స్, క్యాబ్‌లలో తరలిస్తున్నారు. అయితే రోడ్డు మార్గాన గంజాయి తరలిస్తుంటే స్థానిక పోలీసులు, ఇతర దర్యాప్తు సంస్థలు నిఘా పెంచడంతో రైలు మార్గాన్ని ఈ ముఠాలు ఎంచుకుంటున్నాయి. విశాఖ ఏజెన్సీ నుంచి దేశంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి అక్రమ రవాణా చేస్తున్న కేసులు వెలుగులోకి రావడంతో అధికారులు దీనిపై ఫోకస్ పెంచారు. రైళ్లలో గంజాయి రవాణా చేస్తున్న సప్లై చైన్‌కు అడ్డుకట్ట వేసేలా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్), నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) అధికారులు కలిసి పనిచేయాలని నిర్ణయించారు. ఇటీవల ఆర్‌పీఎఫ్ డీజీ సోనాలి మిశ్రాతో ఎన్‌సీబీ డైరెక్టర్ జనరల్ అనురాగ్ గార్గ్ సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. దేశవ్యాప్తంగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బందితో కలిసి ఎన్‌సీబీ సంయుక్త దాడులు నిర్వహించాలని నిర్ణయించింది. 2047 నాటికి డ్రగ్ ఫ్రీ ఇండియానే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంతో ఆ దిశగా అధికారులు చర్యలు ముమ్మరం చేశారు.

మత్తు పదార్థాలు గుర్తించేందుకు జాగిలాల వినియోగం

రైళ్లలో రవాణా అవుతున్న గంజాయి, ఇతర మత్తు పదార్థాలను గుర్తించేందుకు అవసరం మేరకు జాగిలాలను వినియోగించాలని అధికారులు నిర్ణయించారు. ముఠాలు ఎంతో చాకచక్యంగా వ్యవహరిస్తూ గంజాయి వాసన బయటకు పొక్కకుండా జాగ్రత్తగా సీల్ చేసిన ప్యాకెట్లను తమ వద్ద పనిచేసే డీలర్లకు ఇచ్చి ఏసీ కోచ్‌లలో రవాణా చేయిస్తున్నట్టుగా కూడా అధికారులు ఇటీవల కొన్ని కేసుల్లో గుర్తించారు. కొన్నిసార్లు ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన మహిళలకు కొంత కమీషన్ ఇచ్చి వారి లగేజీ బ్యాగులలో దుస్తుల మధ్య ప్యాకెట్లు దాచి రాష్ట్రాలు దాటిస్తున్నారు. ఈ తరహాలో జరుగుతున్న గంజాయి కట్టడికి ఆకస్మిక తనిఖీలు, ఇన్‌ఫార్మర్ల ద్వారా సమాచారంతో దాడులు నిర్వహించే వ్యూహాలు అధికారులు సిద్ధం చేసుకుంటున్నారు. గంజాయితోపాటు ఇతర మత్తు పదార్థాల వాడకానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం రైల్వే స్టేషన్లు, రైళ్లలోని ఎలక్ట్రానిక్ బోర్డులలో సూచనలు వచ్చేలా చర్యలు తీసుకోనున్నారు. ప్రధానంగా గంజాయి రవాణా అవుతున్న మార్గాలు, రైల్వే స్టేషన్లకు సంబంధించిన సమాచార వినిమయం కోసం ఉమ్మడిగా బృందాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



పొగమంచు.. ప్రకృతి పరవశించు

తెలంగాణ కశ్మీరంగా పేరొందిన ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం సీతాగొంది అటవీ ప్రాంతంలో కురుస్తున్న పొగమంచు కనువిందు చేస్తోంది. అడవిని ఆనుకున్న పల్లెలు ప్రకృతి సోయగాలతో పరవశించిపోతున్నాయి.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



శతాబ్దాల చరిత్ర.. పాన్‌గల్ ఖిల్లా



గుట్టపై ఎత్తయిన నిర్మాణంపై ఫిరంగి

11వ శతాబ్దానికి ముందే కల్యాణి చాళుక్యులు నిర్మించినట్లు చరిత్ర

- అద్భుతమైన శిల్పకళా సంపద ఖిల్లా సొంతం
- సముద్ర మట్టానికి 1600 అడుగుల ఎత్తులో ఏడాది పొడవునా నీరుండే రామగుండం
- రెండు యుద్ధ ఫిరంగులు, 60కి పైగా ప్రాకారాలు, బురుజులు శిథిలావస్థలో..
- ఏటా తొలి ఏకాదశి నాడు అమ్మవారికి స్థానికుల ప్రత్యేక పూజలు



పాన్‌గల్ కోట నిర్మితమైన గుట్ట

వనపర్తి: శతాబ్దాల చరిత్ర, ఎన్నో వీరగాథల ఘనతకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన పాన్‌గల్ ఖిల్లాలో వెలుగులోకి రాని ఎన్నో రహస్యాలు నిక్షిప్తమై ఉన్నాయి. సుమారు 11వ శతాబ్దానికి ముందే కల్యాణి చాళుక్యుల కాలంలో ఈ దుర్గం నిర్మించినట్లు ఖిల్లాపై ఉన్న శాసనాలతో చరిత్రకారులు వెల్లడిస్తున్నారు. వనపర్తి జిల్లాకేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలోని పాన్‌గల్ ఖిల్లా ప్రస్తుత నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో ఉంది. శత్రువుల దాడుల నుంచి కాపాడుకునేందుకు నాటి రాజులు సముద్రమట్టానికి సుమారు 1600 అడుగుల ఎత్తయిన గుట్టపై కోట నిర్మించారు. గుర్రపునాడా ఆకారంలో తూర్పున ప్రధాన ముఖద్వారంతో చుట్టూ శత్రుదుర్భేద్యమైన రాతికట్టడం, బురుజులతో దుర్గం నిర్మించారు. ప్రస్తుతం చాలా వరకు శిథిలావస్థకు చేరినా.. ఏటా తొలి ఏకాదశినాడు ప్రజలు గుట్టపైకి చేరుకొని అక్కడి అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేస్తారు.

శిల్పకళా సంపద..

పాన్‌గల్ ఖిల్లా శిఖరాగ్రానికి, కోట ప్రాంతానికి వెళ్లేందుకు తూర్పు దిక్కున ప్రస్తుతం ఉన్న బాలపీర్ల సమీపంలో దారి ఉంది. గుట్టపైకి ఎక్కుతున్న సమయంలో ఏడు ప్రధాన ముఖద్వారాలను దాటాల్సి ఉంటుంది. ప్రతి ముఖద్వారం భారీ ఆకారంలో రాతి కట్టడంతో దర్శనమిస్తుంది. కట్టడంపై సింహాలను వేటాడుతున్న శిల్పాలు, ఎత్తయిన జంతువుల శిల్పాలను చూడవచ్చు.

శిథిలావస్థలో మసీదు, ఆలయ నిర్మాణాలు..

ఎంతో ఎత్తయిన పాన్‌గల్ ఖిల్లాపై పురాతన గణపతి, అమ్మవారి ఆలయాలతోపాటు మినార్‌లతో కనిపించే మసీదు నిర్మాణాలు శిథిలావస్థలో కనిపిస్తాయి. కల్యాణి చాళుక్యుల తర్వాత ముసునూరి నాయకులు, బహుమనీ సుల్తానులు, కుతుబ్‌షాహీలు, బరాద్ షాహీలు, మొఘలులు, అసఫ్ జహీల్ ఈ దుర్గాన్ని యుద్ధంలో సొంతం చేసుకుని పాలన సాగించినట్లు చరిత్ర చెబుతోంది.

1600 అడుగుల ఎత్తులో..

సముద్రమట్టానికి సుమారు 1600 అడుగుల ఎత్తులోని పాన్‌గల్ గుట్టపై రామగుండం బావిలో ఏడాది పొడవునా నీరు ఉంటుంది. గత 30, 40 ఏళ్ల క్రితం ఏటా తొలి ఏకాదశినాడు గుట్టపైకి వెళ్లే భక్తులు ఈ గుండంలో ఈత కొడుతూ.. స్నానాలు ఆచరించేవారు. ఇది ప్రస్తుతం ఉపయోగంలో లేదు. దేవిగుట్ట అనే ప్రాంతంలో కొలువైన అమ్మవారి పురాతన శిలా విగ్రహానికి భక్తులు నేటికీ ఏటా ఒకసారి గుట్టపైకి వెళ్లి పూజలు చేస్తారు.

చెక్కుచెదరని యుద్ధ ఫిరంగులు

శతాబ్దాల నాటి యుద్ధ ఫిరంగులు పాన్‌గల్ ఖిల్లాపై ఇప్పటికీ చెక్కు చెదరకుండా, కనీసం తుప్పు కూడా పట్టకుండా ఉన్నాయి. ఖిల్లాలో ఎత్తయిన ప్రాంతంలో ఒకటి, తూర్పు ద్వారం వైపు మరో ఫిరంగి ఉన్నాయి. పాన్‌గల్ గుట్టపై ముక్తరామేశ్వర ఆలయం ఉన్నట్లు శాసనాలు ఉన్నాయి. కుతుబ్‌షాల కాలంలో నిర్మించిన బావిని ఇటీవల కాలం వరకు పాన్‌గల్ గ్రామంలో కుమ్మరి వీధి ప్రాంత ప్రజలు ఉపయోగించినట్లు స్థానికులు చెబుతారు.

పులివేట వీరగల్లు ప్రతిమలు

వీరగల్లులో పులివేట, పందివేట శిల్పాలు ప్రసిద్ధం. పులులు, అడవి పందుల నుంచి ప్రజలను రక్షించడానికి గ్రామాల్లోని వీరులు పోరాడి, అమరులైనప్పుడు.. ప్రజలు వీరుల జ్ఞాపకంగా వీరశిలలను పొలిమేరలలో ఏర్పాటు చేసేవారు. ఈ శిల్పాలను చూసినవారు ఆ ఊరివీరుల శౌర్యాన్ని గుర్తు చేసుకొని కీర్తించేవారు. కోటలో అనేక కట్టడాలు, ఫిరంగులతోపాటు ఎన్నో శిల్పాలు, వీరగల్లు విగ్రహాలున్నాయి. కోటలోకి వెళ్తుంటే ముళ్లగవిని అనే ప్రదేశం దగ్గర దాదాపు నాలుగు అడుగులున్న పులివేట వీరగల్లును కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకులు కనుగొన్నారు. కుడివైపు సిగ, తలపై పాగా, మెడలో కంటె, వీరకాసెతో కనిపిస్తున్న వీరుడు రెండు చేతుల బల్లెంతో పులిని చంపుతున్న దృశ్యం ఒక రాతిపలక మీద ఉల్బణ శిల్పంగా చెక్కి ఉంది. ఈ వీరగల్లును క్రీ.శ.13, 14వ శతాబ్దాల నాటి శైలిలో చెక్కారు. అరుదుగా కనిపించే, ప్రతిష్ఠించే ఈ పులివేట వీరగల్లు ప్రతిమ ఇదే మండలం బుసిరెడ్డిపల్లిలో కూడా ఉంది. ఇది అరుదైన వీరగల్లు అని.. ఇలాంటివి తెలంగాణలో నిజామాబాద్, భువనగిరి, ఖమ్మం, వరంగల్, నిర్మల్ జిల్లాల్లోనూ ఉన్నట్లు గుర్తించారు. ఈ శిల్పాలను భద్రపరచడమో.. లేదా ఏదేని మ్యూజియానికి చేర్చాలని కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ రామోజు హరగోపాల్, సభ్యులు బైరోజు చంద్రశేఖర్, శ్యాంసుందర్, స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



చారిత్రక ప్రాధాన్యమున్న పాన్‌గల్ ఖిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు, అధికారులు కృషి చేయాలి. కోటపై ఉన్న అనేక చారిత్రక కట్టడాలు ధ్వంసం అవుతున్నాయి. వనపర్తి జిల్లాకు తలమానికంగా నిలిచే కోటను భావితరాల వారికి తెలిసేందుకు పర్యాటక కేంద్రంగా మారిస్తే.. ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.

- కుమ్మరి చంద్రయ్య, పాన్‌గల్

అభివృద్ధి చేస్తాం




ఎంతో చారిత్రక ప్రాధాన్యమున్న పాన్‌గల్ ఖిల్లాను మంత్రి జూపల్లి సహకారంతో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాం. ఇప్పటికే ఖిల్లాకు సంబంధించిన నివేదికలను పంపించాం. పర్యాటక శాఖ అధికారులు ఖిల్లాను సందర్శించి వివరాలను సేకరించారు. మరోమారు ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లి చారిత్రక కట్టడాలు కనుమరుగవకుండా కాపాడుతూ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం.

- హైమావతి, మాజీ ఎంపీటీసీ, పాన్‌గల్



ఖిల్లాపై శతాబ్దాల క్రితమే.. నిర్మించిన మసీదు



పాన్‌గల్ కోటపై శతాబ్దాల నాటి బురుజు



పాన్‌గల్ ఖిల్లాపై నాటి రామ గుండం

టీమ్ ఇండియాకు సీఎం అభినందన

సాక్షి, హైదరాబాద్: ఆసియా కప్ విజేతగా నిలిచిన టీమ్ ఇండియాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. పాకిస్తాన్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్ చివరి వరకు ఉత్కంఠ రేపిందని పేర్కొన్నారు. ఈ అద్భుత విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ క్రికెటర్ తిలక్ వర్మ అంతర్జాతీయ స్థాయిలో మన రాష్ట్రానికి గొప్ప పేరు, గౌరవం తెచ్చాడని ప్రశంసించారు.

ఆర్టీసీ బస్‌స్టేషన్ల ఆధునికీకరణ

రూ.108 కోట్లతో పనులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 28 బస్‌స్టేషన్‌లను ఆధునికీకరించాలని ఆర్టీసీ నిర్ణయించింది. మరో రెండు చోట్ల బస్ స్టేషన్ భవనంతోపాటు షాపింగ్ కాంప్లెక్స్ కూడా నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకు రూ.108.021 కోట్ల వ్యయానికి పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. చాలాకాలంగా బస్‌స్టేషన్ భవనాలను పట్టించుకోకపోవటంతో.. రాష్ట్రవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో అవి కనీస వసతులు కూడా లేకుండా ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. వాటిని మెరుగుపరచాలని ప్రయాణికులు కోరుతున్నా, నిధుల లేమితో ఆర్టీసీ చర్యలు తీసుకోలేకపోతోంది. తాజాగా మహాలక్ష్మి పథకం రూపంలో ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో పెరిగి ఆదాయం కూడా మెరుగైంది (ప్రభుత్వం రీయింబర్స్ సరిగ్గా చేస్తేనే). ఈ నేపథ్యంలో మాడ్గుల్, నాగర్‌కర్నూలు బస్ డిపో, మహబూబ్‌నగర్ బస్‌స్టేషన్, రేగొండ, వేములవాడ, గంగాధర, నిజామాబాద్, ఘన్‌పూర్, పాల్వంచ, మునుగోడు, చండూరు, చౌటుప్పల్, ఐజా, వనపర్తి, పెబ్బేరు, కొల్లాపూర్, పెంటవెల్లి, దమ్మపేట, మండలపల్లి, అశ్వారావుపేట బస్‌డిపో, హుస్నాబాద్ బస్ డిపో, కథలాపూర్, గోదావరిఖని, గూడూరు, మర్రిగూడ, నెక్కొండ బస్‌స్టేషన్, షాపింగ్ కాంప్లెక్స్, నర్సంపేట బస్‌స్టేషన్, నర్సంపేట బస్‌స్టేషన్ షాపింగ్ కాంప్లెక్స్ రెండంతస్తులు, వలిగొండ బస్‌స్టేషన్‌లను మెరుగుపరచాలని నిర్ణయించింది. పదేళ్లుగా ఆర్టీసీ నిర్వీర్యమైందని, ఇప్పుడు మహాలక్ష్మి పథకం రూపంలో ఆర్టీసీ లాభాల్లోకి వచ్చినందున ఈ పనులు నిర్వహించబోతున్నామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.





ఆసియా కప్‌లో పాకిస్తాన్‌పై భారత్ గెలుపొందిన తర్వాత కరీంనగర్ మహాశక్తి ఆలయ ప్రాంగణంలో దాండియా ఆడుతున్న మహిళలు ఆనందంతో త్రివర్ణ పతాకం చేతబూని నినాదాలు చేస్తుండగా.. ఆనందంతో చప్పట్లు కొడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



ఆసియా కప్‌లో భారత్ విజయంతో రాజేంద్రనగర్ మండలం పీరన్‌చెరులోని గిరిధారి ఎగ్జిక్యూటివ్ పార్క్‌లో దాండియా నృత్యంతో అతివల ఆనందహేల



శ్రీశైలం పది గేట్ల నుంచి కిందకు వస్తున్న కృష్ణమ్మ

ఆదివారం సాయంత్రం 6 గంటలకు కృష్ణా బేసిన్‌లో ప్రధాన ప్రాజెక్టులోకి వరద ప్రవాహం ఇలా..

ప్రాజెక్టు పేరు	గరిష్ట నీటిమట్టం (అడుగుల్లో)	గరిష్ట నీటినిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత నీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నీటి నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
ఆల్మట్టి	1705.00	129.72	1704.63	127.67	64,035	64,035
నారాయణపూర్	1615.00	37.64	1614.11	36.93	77,497	77,497
ఉజ్జయిని	1630.00	117.24	1630.00	117.24	12,253	12,253
జూరాల	1045.00	9.66	1041.27	7.43	5,10,000	5,39,281
తుంగభద్ర	1633.00	105.79	1626.06	80.00	10,314	10,314
శ్రీశైలం	885.00	215.81	882.80	203.43	5,93,680	5,83,409
నాగార్జునసాగర్	590.00	312.05	586.80	304.47	6,25,511	6,25,511
పులిచింతల	175.00	45.77	167.98	35.55	6,86,906	6,50,000

బీసీ రిజర్వేషన్ల జీవో పేరిట మోసం

తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి

సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో ఒక మోసమని తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి విమర్శించారు. ఆయన ఆదివారం రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీని అమలు చేసేలా కవిత ఆధ్వర్యంలో తెలంగాణ జాగృతి పోరాటం చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేసి బీసీలను ఏకం చేసినట్లు వివరించారు. ఈ పోరాటంతో ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. 9వ షెడ్యూల్‌లో చేర్చకుండా ఎన్ని జీవోలు ఇచ్చినా ప్రయోజనం ఉండదన్నారు.



బతుకమ్మ వేడుకల సందర్భంగా ఆదివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు కోసం సాధన చేస్తున్న మహిళలు

ఆదివారం హైదరాబాద్‌లో బతుకమ్మకుంట ప్రారంభోత్సవ కార్యక్రమ వేదికపైకి వస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీని నెట్టివేస్తున్న సీఎం సెక్యూరిటీ సిబ్బంది



ప్రకృతి సౌందర్యాలకు నిలయమైన కొల్లేరు సరస్సు.. పక్షుల కిలకిలరావాలతో కళకళలాడే విహంగాల స్వర్గధామం. కానీ ఇప్పుడు ఆ స్వర్గంలో మరణమృదంగం మోగుతోంది. అతిథులను ఆత్మీయంగా ఆదరించాల్సిన మన సంస్కృతి సూక్తిని విస్మరించిన వేటగాళ్లు, విదేశీ పక్షులపై విరుచుకుపడుతున్నారు. తుపాకీ గుండ్లతో మూగజీవాల గుండెలను చీల్చేస్తూ, వలల ఉచ్చులతో ఊపిరి ఆడకుండా చేస్తున్నారు. అటవీ అభయారణ్య చట్టాలు కేవలం పుస్తకాలకే పరిమితమైపోయాయి. నియంత్రించాల్సిన అధికారుల కళ్లముందే వేటగాళ్ల దౌర్జన్యం పెరుగుతోంది. కూటమి ప్రభుత్వంలో మరింత బరితెగించి కొల్లేరు ఒడిలో సేదతీరుతున్న పక్షుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. - కైకలూరు


కొల్లేరులో విహరిస్తున్న పక్షుల గుంపులు

విహంగాల స్వర్గంలో వేటగాళ్ల మరణమృదంగం


వేటగాళ్ల గుళికలకు మరణించిన కొల్లేరు జమ్ముకోడి పక్షులు (ఫైల్)

కొల్లేరులో వలలకు అరుదైన పక్షులు బలి
నాటు తుపాకులకు ప్రాణాలు హరీ

గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు
చేతులెత్తేసిన అటవీశాఖ అధికారులు

ఆక్వా చెరువులపై వాలినా ఆయువు తీరినట్లే...

ఆక్వా చెరువులపై వాలిన అరుదైన పక్షి జాతులు సైతం వేటగాళ్ల నాటు తుపాకులకు బలవుతుండడం సమస్యకు మరో కోణం. రాష్ట్రంలో 5.75లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుండగా, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ విస్తీర్ణం 2.90 లక్షల ఎకరాలుగా ఉంది. ఎక్కువ విస్తీర్ణం కలిగిన చేపల రైతులు సాగు ప్రారంభంలో చేప పిల్లలను పక్షులు తినకుండా నాటు తుపాకుల కలిగి వేటగాళ్లను నియమించుకుంటారు. ఇందుకోసం తమిళనాడు, సూళ్లూరుపేట నుంచి వచ్చిన దాదాపు 150 కుటుంబాలు కైకలూరు, ఉండి నియోజకవర్గాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. తుపాకితో ఒక్క పక్షిని చంపితే వీరికి రూ.200 నుంచి రూ.300 వరకూ పనికి తీసుకెళ్లిన చెరువు రైతులు చెల్లించాలి. ఈ క్రమంలో కొల్లేరులో సంచరించే పక్షులు చెరువులపై వాలితే వేటగాళ్లు కాల్చేస్తున్నారు. చేపలు పెద్దవైన తర్వాత సైతం వేటగాళ్లు తమ పక్షుల వేటను కొనసాగిస్తుండడం గమనార్హం. నాటు తుపాకులకు పేలే మందు తయారీ క్రమంలో అనేక మంది వేటగాళ్లు మరణించిన ఘటనలు కొల్లేరు ప్రాంతంలో చోటుచేసుకోవడం గమనార్హం.

అక్రమ వేటకు ఎన్నో ఆనవాళ్లు..

గుడివాకలంక, నిడమర్రు, అడవి కొలును, శృంగవరప్పాడుతో పాటు నడి కొల్లేరులోని అనేక ప్రాంతాల్లో వేట సాగిస్తున్నారు.

ఆగస్టు 29న ఏలూరు జిల్లా గుడివాకలంక వద్ద కొల్లేరు పక్షులను వేటాడి తెస్తున్న వ్యక్తిని ఫారెస్టు సిబ్బంది పట్టుకున్నారు. కైకలూరు మండలం కొల్లేటికోట ప్రాంతంలో వేటాడానని అతను చెప్పాడు. ఇదే ప్రాంతంలో కొన్ని నెలల క్రితం బతికి ఉన్న పక్షుల తీసుకెళుతున్న ఒకరిని పట్టుకున్నారు. కేసు నమోదు చేసి మేజిస్ట్రేట్ తీర్పుతో పక్షులను వదిలేశారు.

సెప్టెంబర్ 4న నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం చేపల మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన 13 మృతి చెందిన పక్షులను, ఏడుగురు వేటగాళ్లను, 3 నాటు తుపాకులను భీమవరం ఫారెస్టు సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు.

కొద్దిరోజుల క్రితం వేటగాళ్లు గుళికలతో చంపిన గ్లోసి ఐబీస్ కొల్లేరు పక్షుల ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమయ్యాయి.

ఇవే కాకుండా కొల్లేరులో పక్షుల వేటలో వెలుగు చూడని అనేక ఘటనలు గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్నాయి.


గుడివాకలంకలో మృతిచెందిన కొల్లేరు పక్షులు


నిడమర్రు ప్రాంతంలో వేటగాళ్ల చేతిలో మృతి చెందిన కొల్లేరులో సంచరించే గ్లోసీ ఐబీస్ పక్షులు

సరస్సు ముఖ్యాంశాలు..

ప్రాంతం: **901** చ.కి.మీ.

విస్తీర్ణం: **2,22,300** ఎకరాలు

అభయారణ్యం: **77,138** ఎకరాలు (9 మండలాలు)

గ్రామాలు: **122**

జనాభా: **3.50** లక్షలు

విహరించే పక్షి జాతులు: **182**

వలస పక్షులు: ప్రత్యేక ఆకర్షణ

సమస్యలు

వేటగాళ్లు 30 అడుగుల ఎత్తులో చిక్కు వలలు కడుతున్నారు

గుళికలు ఎరగా పెడుతున్నారు	జత పక్షులు సైజు బట్టి రూ.600–1,000 శ్రేణిలో విక్రయం
పక్షులను పట్టి గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు	వేటగాళ్లపై గ్రామ పెద్దలు జరిమానాలు విధిస్తామన్నా ఫలితం లేదు.

పూర్వం వేటాడిన పక్షులను బహిరంగంగానే కొన్ని జాగ్రత్తలతో విక్రయించేవారు.

ఇప్పుడు నాయకుల సిఫార్సుల ఆధారంగా భారీగా విక్రయాలు సాగిపోతున్నాయి.

వేటకు గురవుతున్న ప్రధాన పక్షులు

పర్పూల్ శాంఫన్ (కొండింగాయి)	గ్లోసీ ఐబీస్ (నల్ల కంకణాల పిట్ట)
కామన్ మోర్‌హెన్ (జమ్ముకోడి)	విజిటింగ్ టీల్ (సిలువ బాతులు)
కామన్ కూట్ (నామాల కోడి)	గ్రేహెరాన్ (నారాయణ పక్షి)
టీల్ (పరజా)	కార్మోరెంట్ (నీటి కాకులు)



నిఘా ముమ్మరం



కొల్లేరు ప్రాంతంలో పక్షుల వేటగాళ్లపై నిఘాను ముమ్మరం చేశాం. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం వేటాడినా, వాటి ఆవాసాలను నాశనం చేసినా, అభయారణ్యంలో ప్రవేశించినా నేరంగా పరిగణిస్తాం. రెండేళ్ల జైలు, రూ.20 వేల జరిమానాతో పాటు రెండు శిక్షలను ఏకకాలంలో అనుభవించాల్సి ఉంటుంది. నాటు తుపాకులతో అభయారణ్యంలో ప్రవేశం నేరం.

– కె.రామలింగాచార్యులు, జిల్లా ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, ఏలూరు

ఏఐటీటీలో దేశంలోనే గిరిజన విద్యార్థిని టాప్


ఝాన్సీ లక్ష్మీభాయి

సీతంపేట(పార్వతీపురం మన్యం): ఈ ఏడాది జూలైలో జరిగిన ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్‌లో(ఏఐటీటీ) స్థానిక ప్రభుత్వ ఐటీఐలో చదువుతున్న గిరిజన విద్యార్థిని తంబర ఝాన్సీ లక్ష్మీభాయి 600 మార్కులకుగాను 600 సాధించి దేశంలోనే తొలి స్థానంలో నిలిచింది. ఝాన్సీ లక్ష్మీభాయిని ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

జీఎస్టీ 2.0 సంస్కరణలతో రైతులకు మేలు

వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీ రావు

సాక్షి, అమరావతి: కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ -2.0 సంస్కరణలు వ్యవసాయానికి ఎంతో మేలు చేయనున్నాయని వ్యవసాయశాఖ డైరెక్టర్ సేనాపతి డిల్లీరావు వెల్లడించారు. జీఎస్టీ పన్ను తగ్గింపు వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలపై 30, అక్టోబర్ 1వ తేదీల్లో జిల్లా, మండల, రైతు సేవా కేంద్రాల ద్వారా గ్రామ స్థాయి వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈసందర్భంగా వ్యవసాయ పనిముట్ల ప్రదర్శనతో పాటు ఏఏ పనిముట్లపై గతంలో ఎంత జీఎస్టీ ఉండేది, ప్రస్తుతం ఎంత ఉంది, దాని వల్ల ఏ మేరకు ఆదాఅవుతుందో రైతులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. వ్యవసాయ, అనుబంధ మత్స్య, పశు సంవర్ధక రంగాల్లో ఉపయోగించే వివిధ రకాల పరికరాల తయారీ, వాటి ఉత్పత్తులు, ఉపఉత్పతులకు సంబంధించిన 837 వస్తువులకు జీఎస్టీ 18 శాతం నుంచి 5 శాతం వరకు తగ్గించారన్నారు. జీఎస్టీ ప్రయోజనాలపై శాఖల వారీగా నిర్వహించ తలపెట్టిన ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా 'జీఎస్టీ 2.0–అద్భుతమైన పొదుపు' అనే నినాదంతో వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా పోస్టర్స్, కరపత్రాలు పంపిణీ చేయడంతో పాటు గ్రామ స్థాయి వరకు అవగాహన సదస్సులు నిర్వహించాలని నిర్ణయించినట్టు ఆదివారం డిల్లీరావు ఓ ప్రకటనలో తెలిపారు.

పొట్ట పోషణ కోసం



కూలాడితే గానీ కుందాడని బతుకులు వారివి. కొండకోనలు, వాగువంకలు, చెట్టుపుట్టలు తప్ప మరో దృశ్యానికి నోచుకోని అమాయక ప్రజలు వారు. మూడు పూటలా నాలుగు వేళ్లు నోటిలోకి వెళ్లాలంటే గ్రామం దాటి కూలి పనికి వేరే ఊరు వెళ్లేందుకు వారికి గెడ్డ దాటక తప్పదు. వర్షాకాలంలో అదారుగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. ఆకలితో పస్తులుండలేక, పొట్టపోషణ కోసం ప్రాణాలు అరచేతబట్టుకుని ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు. దీనికి పక్కనున్న చిత్రమే నిలువెత్తు సాక్ష్యం. పార్వతీపురం మన్యం జిల్లా, మక్కువ మండలం, పనసభద్ర పంచాయతీ, గుంటభద్ర గ్రామానికి చెందిన గిరిజనులు మార్కొండపుట్టి గ్రామానికి చెందిన ఓరైతు సాగుచేస్తున్న మొక్కజొన్న పంటలో కూలిపనులు చేసేందుకు 10 మంది గిరిజన మహిళలు శనివారం గుంటభద్ర గ్రామం నుంచి ఉదయం వెళ్లారు. సాయంత్రం పనులు ముగించుకుని గ్రామానికి వస్తున్న క్రమంలో అదారుగెడ్డ ఉగ్రరూపం దాల్చింది. గ్రామానికి చెందిన ఓ గిరిజనుడు ఒక్కో మహిళను పీకల్లోతు గెడ్డ నుంచి తాడు సహాయంతో ఒడ్డుకు చేర్చాడు. – మక్కువ

డీఈవో పూల్ భాషా పండితులకు న్యాయం చేయండి

స్కూల్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో డీఈవో పూల్‌లో ఉండి విధులు నిర్వర్తిస్తోన్న భాషా పండితులకు న్యాయం చేయాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొన్నేళ్లుగా శాశ్వత స్థానాలు లేక పాఠశాలలు మారుతూ భాషా పండితులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు 1,207 సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించి డీఈవో పూల్ భాషా పండితులందరికీ శాశ్వత స్థానాలు కల్పించి పదోన్నతులివ్వాలని డిమాండ్ చేశారు.

మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి: ఆప్టా

డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణపతిరావు, ప్రకాష్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొత్త అభ్యర్థులకు జిల్లాల్లోని పాఠశాలలు ఉన్న ప్రాంతాలపై అవగాహన ఉండదని, ఈ క్రమంలో వారికి ఆన్‌లైన్ కౌన్సెలింగ్ సరికాదన్నారు. ఈ విషయంపై ప్రభుత్వానికి లేఖ రాసినట్టు తెలిపారు. అలాగే, డీఎస్సీ అభ్యర్థులకు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించి, వారివారి జిల్లాలోనే శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ ప్రభుత్వాన్ని కోరారు.

చట్ట సభల్లోనే కుల వివక్ష ఉంటే బయట పరిస్థితి ఏంటి?

మండలి చైర్మన్ మోషేన్‌రాజుపై వివక్ష తగదు
కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం

సాక్షి, అమరావతి: ఎస్సీ అనే కారణంగా శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుపై కుల వివక్ష చూపడం తగదని, చట్టాలు చేసి, అమలు చెయ్యాల్సిన చట్ట సభల్లోనే ఇలా ఉంటే సమాజంలో పరిస్థితి ఏమిటని ప్రభుత్వాన్ని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ప్రశ్నించింది. సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా చేయవద్దని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ.నల్లప్ప, ఏ.మాల్యాద్రి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విప్‌ల కోసం నిర్మించిన భవన సముదాయ ప్రారంభోత్సవానికి మండలి చైర్మన్ మోషేన్‌రాజును ఆహ్వానించకుండా ప్రభుత్వం అవమానించిందని మండిపడ్డారు. దళితుడనే కారణంతో మోషేన్‌రాజును ఆహ్వానించకుండా అవమానించినట్లు కన్పిస్తోందన్నారు. మంత్రులు క్షమాపణలు చెబితే సరిపోదని, ప్రారంభోత్సవ శిలాఫలకంపై ఆయన పేరును చేర్చి ఆ భవనాన్ని పునః ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇటీవల తిరుపతిలో నిర్వహించిన మహిళా సాధికార సమావేశాలకూ మండలి చైర్మన్‌ను ఆహ్వానించలేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికమైంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ గోగర్భం డ్యాం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 75,006 మంది స్వామివారిని దర్శించుకోగా 45,413 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.36 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

వైభవంగా కల్యాణ వెంకన్న గరుడోత్సవం



తిరుపతి రూరల్ : కోలాటాలు, చెక్క భజనలు, దేవతా మూర్తుల కళారూపాలతో తుమ్మలగుంట గ్రామం ఆధ్యాత్మికతను సంతరించుకుంది. స్వామి వారి బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన గరుడోత్సవం వైభవంగా సాగింది. తిరుమలకు వెళ్లి శ్రీవారి గరుడోత్సవాన్ని తిలకించలేని సుమారు 75 వేల మంది భక్తులు తుమ్మలగుంటకు చేరుకుని గరుడోత్సవాన్ని తిలకించారు. రాత్రి 7.30 గంటలకు బయలుదేరిన గరుడ వాహనం అర్ధరాత్రి 12.30 గంటల వరకు సాగింది. కల్యాణ వేంకటేశ్వరుడు గరుడునిపై మలయప్ప స్వామిగా కొలువుదీరి భక్తులను కటాక్షించారు. వాహన సేవ ముందు కళాకారుల సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలంలోని సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లో కొలువైన శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి పుట్టలో పాలు పోశారు. పాల పొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద స్వామి మూర్తులను ప్రతిష్ఠించేందుకు అర్చకులతో పూజలు చేయించి ప్రతిష్ఠ తంతు నిర్వహించారు. నాగబంధాల వద్ద, గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి: ఏలూరు జిల్లా పెదవేగి మండలం రాట్నాలకుంట గ్రామంలో కొలువైన శ్రీ రాట్నాలమ్మ దేవస్థానం దేవీ నవరాత్రులను పురస్కరించుకొని భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం శ్రీ రాట్నాలమ్మకు ప్రీతికరమైన రోజు కావడంతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి, పూజలు నిర్వహించి, మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ వారం పూజా టిక్కెట్లపై రూ.39,450, విరాళంపై రూ.7,069, లడ్డూ ప్రసాదంపై రూ.18,975, ఫొటోల అమ్మకంపై రూ.2,130 కలిపి మొత్తం రూ.67,624 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు.



• శ్రీలంక టూర్

బౌద్ధ రామాయణం

మహా సముద్రంలో నీటిబొట్టంత దేశం. అందులో రాముడు కట్టిన శివాలయం. రాజుకు ఆశ్రయమిచ్చిన దంబుల్లా గుహలు. కశ్యపుని రాజప్రాసాదం సిగిరియా కోట. క్యాండీ బుద్ధుని దంతావశిష్ట ఆలయం. అశోకవాటిక నువారా సీతా ఎలియాలు. మూడు నిలువులెత్తు ధీర హనుమాన్. రథమెక్కిన పంచముఖ ఆంజనేయుడు. సీతమ్మ అగ్నిపరీక్ష సాక్షి దివురుంపోలా. విభీషణుడి పట్టం కట్టిన కెలానియ తీరం. ఇవన్నీ శ్రీలంక రామాయణ యాత్రలో.



1 రోజు హైదరాబాద్ నుంచి శ్రీలంకకు ప్రయాణం. ఉదయం పదిన్నరకు హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని టూర్ ఆపరేటర్‌లకు రిపోర్ట్ చేయాలి. మధ్యాహ్నం 13.30 గంటలకు యుఎల్178 విమానం హైదరాబాద్ నుంచి బయలుదేరి, మధ్యాహ్నం 15.25 గంటలకు కొలంబోకు చేరుతుంది. ఫ్లయిట్ దిగిన తర్వాత చిలా లోని మునీశ్వర ఆలయ దర్శనం, ఆ తర్వాత మనవేరి ఆలయ దర్శనం చేసుకుని దంబుల్లాలో హోటల్ గదిలో చెక్ ఇన్ కావడం. రాత్రి బస.

రాముడు మొక్కిన శివుడు

మునీశ్వర ఆలయం ఉన్న ప్రదేశం పేరు చిలా. రామాయణం కథనం ప్రకారం రావణ సంహారం తర్వాత రాముడు తిరుగు ప్రయాణంలో ఉన్నప్పుడు ఈ ప్రదేశంలో ఆగి శివుడిని ప్రార్థించాడు. రాముడికి దీవెనలిచ్చిన శివుడు నాలుగు శివలింగాలను ప్రతిష్ఠించమని చెప్పాడని విశ్వాసం. ఆ మాట కోసం రాముడు నిర్మించిన ఆలయం 16వ శతాబ్దంలో పూర్తిగా ధ్వంసమైంది. అప్పుడు రాజు మొదటి రాజసింఘె పునర్నిర్మించాడు. దానిని 17వ శతాబ్దంలో పోర్చుగీసు వాళ్లు ధ్వంసం చేశారు. ఇప్పుడు మనం చూసే అందమైన ఆలయాన్ని స్థానికులు నిర్మించుకున్నారు. ఈ ఆలయానికి సమీపంలోనే ఉన్న మనవెరి ఆలయం కూడా స్వయంగా రాముడు నిర్మించినదేనని అందుకే దీని పేరు రామలింగం అని స్థలపురాణం.

2 రోజు దంబుల్లా నుంచి క్యాండీకి ప్రయాణం. హోటల్‌లో బ్రేక్‌ఫాస్ట్ తర్వాత దంబుల్లా కేవ్ టెంపుల్, సిగిరియా ఫోర్ట్రెస్ వీక్షణం. మధ్యాహ్న భోజనం తర్వాత క్యాండీ ప్రవేశం. పెరడేనియాలోని రాయల్ బొటానికల్ గార్డెన్స్ సందర్శనం, సాయంత్రం క్యాండీ కల్చరల్ షో వీక్షణం, రాత్రి బస క్యాండీలో.

రాజుకు ఆశ్రయమిచ్చిన గుహలు



దంబుల్లా క్రీస్తుపూర్వం నుంచి నివాస ప్రదేశం. ఇందులోని భారీ కొండను బౌద్ధ భిక్షువులు తమకు నివాసం కోసం గుహలుగా తొలుచుకున్నారు. అనూరాధపురాను పాలించిన వత్తగామిని అభయ క్రీ.పూర్వంలో ఒకటవ శతాబ్దంలో 14 ఏళ్లపాటు రాజ్య బహిష్కరణకు గురయిన సందర్భంలో అతడికి బౌద్ధ భిక్షువులు ఇక్కడే ఆశ్రయమిచ్చారు. తిరిగి అనూరాధపురకు వెళ్లి రాజ్య సింహాసనాన్ని స్వాధీనం చేసుకున్న వత్తగామిని బౌద్ధభిక్షువుల పట్ల కృతజ్ఞతతో ఈ గుహలను మరింత చక్కగా మెరుగులు దిద్దించాడు. అద్భుతమైన ఈ గుహాలయాలను ఫొటో తీయడానికి అనుమతి ఉండదు. కాబట్టి మనోఫలకం మీద ముద్రించుకోవడమే.

సిగిరియా దుర్గం

సిగిరియా దుర్గం ప్రాచీనమైన రాతి కోట. దంబుల్లాకు సమీపాన ఉంది. ఈ నిర్మాణం యునెస్కో గుర్తించిన వరల్డ్ హెరిటేజ్ సైట్. కోట ఒక కొండ మీద ఉంటుంది. ఆశ్చర్యమేమిటంటే రాజస్థాన్ కోటలు కూడా ఎక్కువ భాగం కొండల మీదనే ఉన్నాయి. కానీ ఈ సిగిరియా కోట ఉన్న కొండ నిటారుగా ఉంటుంది. మొక్కలను రకరకాల ఆకారాల్లో ప్రూనింగ్ చేసినట్లు ఈ కొండను కోట నిర్మాణానికి తగినట్లు చెక్కినట్లు ఉంటుంది. శత్రుదుర్భేద్యంగా నిర్మించడంలో ఇదొక పద్ధతి. శ్రీలంక రాజు కశ్యపుని కోసం నిర్మించిన రాజప్రాసాదం ఇది. శ్రీలంకలో బౌద్ధం విస్తరించిన నేపథ్యంలో కశ్యపుని తర్వాత ఈ రాజప్రాసాదం బౌద్ధుల అధీనంలోకి వెళ్లింది. ప్రాచీన నగర నిర్మాణశైలికి నిదర్శనం ఈ రాజప్రాసాదం. ఆర్కిటెక్చర్ స్టూడెంట్స్‌కు ఒక పాఠ్యగ్రంథం వంటిది.

రాయల్ బొటానికల్ గార్డెన్

ఈ గార్డెన్ క్యాండీ నగరం నుంచి ఆరు కిలోమీటర్ల దూరాన ఉంది. దాదాపుగా 150 ఎకరాల్లో విస్తరించిన ఈ గార్డెన్‌లో నాలుగు వేల రకాల మొక్కలున్నాయి. ఇక్కడ పర్యటిస్తుంటే మ్యాప్‌లో కనిపించే గోరంత దీవిలో చూడాల్సిన ప్రదేశాలు ఇన్ని ఉన్నాయా అని ఆశ్చర్యం కలుగుతుంది. నీటిబుగ్గ వంటి దీవి కావడంతో ఏడాదంతా పచ్చదనం పరిఢవిల్లుతుంటుంది. శ్రీలంక సాంస్కృతిక కళల ప్రదర్శన చూడకుండా వెనుదిరిగితే ఆ దేశం ఆత్మను అర్థం చేసుకోవడంలో విఫలమైనట్లే. క్యాండీ నగరంలోని లేక్ క్లబ్‌లో రోజూ సాయంత్రం ఐదు గంటల నుంచి శ్రీలంక సంస్కృతి సంప్రదాయాలను, ఆ దేశ చరిత్రను వ్యక్తీకరిస్తూ నాట్యప్రదర్శనలు, సంగీత ప్రదర్శనలు జరుగుతుంటాయి. మన దక్షిణ భారత కళారూపాలకు కొనసాగింపుగా ఉంటాయి. వాటిని మనసు పెట్టి వీక్షించాలి.

3 రోజు క్యాండీ నుంచి నువారా ఎలియాకు ప్రయాణం. ఉదయం త్వరగా బ్రేక్‌ఫాస్ట్ చేసుకుని హోటల్ గది చెక్ అవుట్ చేసి బయలుదేరాలి. క్యాండీలోని బుద్ధుడి దంతావశిష్టం ఆలయ దర్శనం తర్వాత రంబోదాలో భక్త హనుమాన్ టెంపుల్ దర్శనం, టీ ఫ్యాక్టరీ విజిట్. అశోక వాటిక సందర్శనం తర్వాత నువారా ఎలియాలో హోటల్‌లో చెక్ ఇన్. రాత్రి బస.



క్యాండీ బౌద్ధ విశిష్టం

శ్రీలంకలోని హెరిటేజ్ సైట్‌లలో కాండీ నగరం ఒకటి. సముద్ర మట్టానికి పదహారు వందల అడుగుల ఎత్తులో ఉందీ నగరం. క్యాండీలో బుద్ధుడి దంత ధాతువుని ప్రతిక్షేపించిన నిర్మించిన ఆలయం (టూత్ రిలిక్ టెంపుల్) ఉంది. ఇక్కడి నేషనల్ మ్యూజియం ప్రపంచదేశాల్లోని బౌద్ధం అంతటినీ ఒక చోట రాశిపోసినట్లు ఉంటుంది. మన తెలుగు రాష్ట్రం అమరావతి బౌద్ధ స్థూపం నమూనాల నుంచి చైనాలోని లాఫింగ్ బుద్ధ ప్రతిమలతోపాటు భవిష్యత్తులో పుట్టబోయే బుద్ధుడి ఊహా శిల్పం కూడా ఉంది. రిలిక్ టెంపుల్ చుట్టూ ప్రాచీన రాజకుటుంబాల ప్యాలెస్‌లున్నాయి. ఆలయం, రాజప్రాసాదాలు ఏటవాలు పై కప్పుతో మనదేశంలో కేరళలోని నిర్మాణాలను తలపిస్తాయి. శ్రీలంకలో తరచూ వర్షాలు కురుస్తుంటాయి, కాబట్టి నీరు సులువుగా జారిపోవడానికే ఇలాంటి ఏటవాలు కప్పు నిర్మాణాలు. ఈ నగరంలో పోర్చుగీసు, బ్రిటిష్ పరిపాలనలో ఉండడంతో కొన్ని ప్రదేశాలు గుర్రాలు నడవడానికి అనువైన నేలతో కలోనియల్ ఫీల్‌ను కలిగిస్తుంటాయి. యూరప్ నిర్మాణశైలిలో ఉన్న క్వీన్స్ హోటల్‌ను చూసి తీరాలి. ఇక బ్రిటిష్ వాళ్లు హిల్ స్టేషన్‌లను ఎంత చక్కగా వేసవి విడుదులుగా మలుచుకున్నారో చెప్పడానికి కాండీ నగరం ఒక నిదర్శనం. నిర్మాణ పరంగా, చారిత్రక ప్రాధాన్యతలెన్ని ఉన్నప్పటికీ ఈ నగరానికి ఇంతటి పర్యాటక ప్రాముఖ్యత ఏర్పడడానికి కారణం బుద్ధుడి అవశిష్టమే. కాండీ నగరం మొత్తం కనిపించే వ్యూ పాయింట్స్ చాలా ఉంటాయి. అక్కడ ఆగి నగరసౌందర్యాన్ని వీక్షించవచ్చు. ఇక్కడ ఒక సరస్సు ఒడ్డున ఉన్న ధవళ బుద్ధుడిని మిస్ కాకూడదు. కాండీ నగరంలోని ఈ సరస్సు... మనదేశంలో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ముసోరి సరస్సును తలపిస్తుంది.

రంబోదా హనుమాన్

శ్రీలంక అనగానే మన భారతీయులకు గుర్తొచ్చే పేర్లలో రాముడు, సీత, రావణాసురుడి తర్వాత హనుమంతుడిదే. ఇంత గొప్ప పౌరాణిక గ్రంథంలో హనుమంతుడే లేకపోతే రామాయణమే లేదన్నంతగా శ్రీలంకకు హనుమంతుడితో బంధం ముడివడి ఉంది. సీతాన్వేషణలో భాగంగా శ్రీలంక మొత్తాన్ని చుట్టేసిన హనుమంతుడు అలసిపోయినప్పుడు రంబోదా అనే ప్రదేశంలో విశ్రమించాడని విశ్వాసం. ఆ ప్రదేశంలోనే ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలోని హనుమంతుడి విగ్రహం ఎత్తు 18 అడుగులు. శ్రీలంకలో ఉన్న హనుమంతుడి విగ్రహాల్లో పెద్ద విగ్రహం ఇదే. అన్నట్లు ఈ ఆలయంలో డ్రెస్ కోడ్ ఉంది. దుస్తులు భుజాలు కప్పుతుండాలి, మోకాళ్ల కిందకు ఉండి తీరాలి. క్యాండీ నుంచి నువారా ఎలియా వెళ్లే దారి మొత్తం దాదాపుగా టీ తోటలే. దమ్‌రో టీ ఫ్యాక్టరీ, సిలోన్ టీ ఫ్యాక్టరీ వంటి అనేక ఫ్యాక్టరీలున్నాయి. టీ తోట నుంచి సేకరించిన ఆకు కప్పులో టీ గా మారే ప్రక్రియను చూడవచ్చు. రకరకాల ఫ్లేవర్ టీలను రుచి చూసి, నచ్చిన టీ పొడులు కొనుక్కోవచ్చు.

సీతా ఎలియా

నువారా ఎలియా నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉంది సీతా ఎలియా. దీన్నే అశోకవాటిక అంటారు. సీతాదేవి వనవాసం చేసిన ప్రదేశం అని చెబుతారు. రావణాసురుడి రాజమందిరంలో నివసించడానికి సీతాదేవి ఇష్టపడకపోవడంతో ఆమె ప్రకృతి ప్రేమికురాలని గ్రహించి ఈ ఉద్యానవనంలో నివాసానికి ఏర్పాట్లు చేశాడని చెబుతారు. అశోకవాటిక మధ్యలో సెలయేరు నిరంతరం ప్రవహిస్తుంటుంది. సెలయేటి తీరాన సీతాదేవి స్నానం చేసేదని చెప్పడానికి ఆనవాలుగా సిమెంటు నిర్మాణం ఉంది. సీతాన్వేషణలో భాగంగా శ్రీలంకకు వచ్చిన హనుమంతుడు... సీతాదేవిని కలిసింది ఇక్కడే. ఆ ఘట్టాన్ని ప్రతిబింబిస్తూ సెలయేటి తీరాన శిల్పాలున్నాయి. ఆ శిల్పం నేపథ్యంలో ఫొటో తీసుకోవడం మర్చిపోవద్దు. సీతా అమ్మన్ ఆలయం దక్షిణాది ఆలయాల నిర్మాణశైలిలో ఉంటుంది. కానీ మనదేశంలో శిల్పాలతో పోలిస్తే ఈ శిల్పాలలో మానవ శరీర నిర్మాణం మరికొంత దృఢంగా కనిపిస్తుంది.

4 రోజు నువారా ఎలియా నుంచి కతరగామకు ప్రయాణం. బ్రేక్‌ఫాస్ట్ తర్వాత నువారా ఎలియా సైట్ సీయింగ్. దివురుంపోలా ఆలయం, గాయత్రిపీఠం, గ్రెగరీ లేక్ విహారం తర్వాత కతరగామ టెంపుల్ దర్శనం, కతరగామలో హోటల్ గది చెక్ ఇన్, రాత్రి బస.

బ్రిటిష్ జ్ఞాపకాలు

శ్రీలంకలో ఎత్తైన ప్రదేశం నువారా ఎలియా. ఆరు వేల అడుగుల ఎత్తులో ఉంది. చలికాలంలో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌లో ఉంటాయి. వేసవిలో కూడా ఏసీ సిక్స్‌టీన్‌లో పెట్టి స్వింగ్ పెట్టినట్లు గాలి తెమ్మెరలు ఒంటిని తాకుతూ ఉంటాయి. ఇక్కడ ప్రయాణించేటప్పుడు రోడ్డు పక్కన పెట్టిన లోకల్ వెజిటబుల్, ఫ్రూట్ మార్కెట్ కనిపిస్తే కళ్లప్పగించి చూడండి. ఎందుకంటే ఇక్కడి క్యాబేజీ మూడు నుంచి నాలుగు కేజీలు తూగుతుంది. కూరగాయలు, పండ్లు అన్నీ కంటికి ఇంపుగా కనిపిస్తాయి. ప్రతి ఇంటి ముందు కూరగాయల తోట ఉంటుంది. సుమారు ఐదు వందల గజాల స్థలంలో మూడు వందల గజాలు కూరగాయల కోసం వదిలి మిగిలిన ప్రదేశంలో ఇల్లు కట్టుకుంటారు. బ్రిటిష్ పాలన ప్రభావం ఇక్కడి క్వీన్స్ కాటేజ్ వంటి కొన్ని నిర్మాణాల్లో కనిపిస్తుంది.

అగ్ని ప్రవేశం ఇక్కడే

దివురుంపోలా అంటే ఒట్టు పెట్టిన ప్రదేశం అని అర్థం. ఇది సీతాదేవి అగ్ని ప్రవేశం చేసిన ప్రదేశం అని చెబుతారు. ఇక్కడ కట్టిన ఆలయ ప్రాంగణంలో ఒక రాతి నిర్మాణం ఉంది. అరుగు మీద బౌద్ధ స్థూపం, అరుగుకు ముందు బుద్ధుడి చిన్న విగ్రహం ఉన్నాయి. ఆలయంలో రాముడు, సీత, హనుమంతుడి పాలరాతి విగ్రహాలు పూజలందుకుంటున్నాయి. మొత్తానికి ఇది రాయామణం, బౌద్ధం సమ్మేళనంగా కనిపిస్తుంది. ఇక గాయత్రి టెంపుల్ పరిశుభ్రంగా, ప్రశాంతతకు చిహ్నంగా ఉంటుంది. గ్రెగరీ లేక్‌లో పడవ విహారం జీవితకాలపు మధురానుభూతిగా మిగులుతుంది. ఇక కతరగామ టెంపుల్‌కి వస్తే... ఇది కుమారస్వామి-వల్లీ దేవిని కలిసిన ప్రదేశమని చెబుతారు. శ్రీలంలోని తమిళులు, సింహళీయుల ఐక్యత జీవించిన రోజులకు ప్రతిబింబం ఈ ఆలయం. అలాగే వర్తక వాణిజ్యాలకు, రాజ్య విస్తరణకు శ్రీలంకలో అడుగుపెట్టిన అనేక మతాలు కూడా ఈ ఆలయాన్ని తమదిగానే స్వీకరించాయి. దాంతో అనేక మతాల చిహ్నాల సమ్మేళనంగా మారింది.

5 రోజు కతరగామ నుంచి కొలంబోకు ప్రయాణం. బ్రేక్‌ఫాస్ట్ తరవాత హోటల్ గది చెక్ అవుట్ చేసి కొలంబోకు ప్రయాణం. కెలానియా బుద్ధ టెంపుల్, పంచముగ అంజనేయ టెంపుల్, కొలంబో సిటీ టూర్, హోటల్ గదిలో చెక్ ఇన్, రాత్రి బస కొలంబోలో.

విభీషణుడి పట్టాభిషేకం ఇక్కడే!



కేలనియా మహా విహారాయ కొలంబో నగరానికి పది కిలోమీటర్ల దూరంలో 'కేలని గంగా నది' తీరాన ఉంది. ఈ ఆలయం ప్రాచీన శిల్పకళ, అద్భుతమైన చిత్రకళా నైపుణ్యానికి ప్రతీక. గోడలు, పై కప్పు నిండా పెయింటింగ్స్. ఈ చిత్రాల్లో విభీషణుడి పట్టాభిషేకం ఘట్టం కూడా ఉంది. విభీషణుడి రాజభవనం కేలనియా నది తీరాన ఉన్నట్లు వాల్మీకి రామాయణంలో ఉందని చెబుతారు. ఈ ఆలయంలో విభీషణుడి విగ్రహం కూడా ఉంది. విభీషణుడిని సింహళీయులు విభీషణ్ దేవయా అని పిలుచుకుంటూ ప్రాచీనకాలంలో తమను పరిరక్షించిన దేవుడిగా కొలుస్తారు. విభీషణుడిని రాజుగా ప్రకటిస్తూ పట్టాభిషేకం చేసిన ప్రదేశం కేలనియా ఆలయ ప్రాంగణమేనని కూడా చెబుతారు. ప్రస్తుతం ఇది బౌద్ధ క్షేత్రం. బుద్ధుడు శ్రీలంకలో అడుగుపెట్టడం, త్రిపీటకాలను బోధించడం, అష్టాంగమార్గాలను విశదపరచి సమ్యక్ జీవనం దిశగా నడిపించడం, స్థానిక రాజులు బుద్ధుడికి అనుచరులుగా మారిపోవడం, సామాన్యులు బుద్ధుడిని చూడడానికి ఆతృత పడడం, బుద్ధుడి మాటలతో చైతన్యవంతమై వికసిత వదనాలతో సన్మార్గదారులవడం... వంటి దృశ్యాలన్నీ చిత్రాల్లో కనిపిస్తాయి. విశాలమైన ఆలయ ప్రాంగణంలో పెద్ద బోధివక్షం, ఆ వృక్షం మొదట్లో భారీ ధవళ బుద్ధుడి విగ్రహం ప్రధాన ఆకర్షణ.

ఆంజనేయునికి రథం



శ్రీలంకలో రాముడు, సీతతోపాటుగా ఆంజనేయ స్వామికి గౌరవం ఉంటుంది. ఆంజనేయుడికి ఆలయాలు కూడా ఉన్నాయి. కానీ పంచముఖ ఆంజనేయుని విగ్రహం ఇదొక్కటే. ఆంజనేయుడి కోసం ప్రత్యేకంగా రథం ఉండడం ఇక్కడి మరో విశేషం. ఇక కొలంబో సిటీని ఒక రౌండ్ చుట్టేస్తే యూకే, యూఎస్, చైనా, ఇండియాలో ముంబయి, చెన్నై నగరాలు ఒకదాని తర్వాత మరొకటి రీల్ కళ్ల ముందు తిరిగినట్లు ఉంటుంది. శ్రీలంక ఆర్థిక సంక్షోభం ఆనవాళ్లు కొలంబో నగరంలో ఎక్కడా కనిపించవు. ఇది చాలా సంపన్న నగరం. హిందూమహాసముద్ర తీరం గాలే బీచ్ పెద్ద టూరిస్ట్ అట్రాక్షన్. ఇక్కడ ఎకరాల్లో విస్తరించిన గ్రీనరీ అందంగా ఉంటుంది. రొయ్యల వడలు ఇక్కడ రుచి చూడాల్సిన వంటకం. ఇక్కడ గాలే ఫేస్ హోటల్ బ్రిటిష్ పాలన కాలం నాటిది. సాయంత్రాలు ఓపెన్ రెస్టారెంట్‌లో కూర్చుని సముద్రపు అలలను చూస్తూ గడపడం గొప్ప అనుభూతి. పౌర్ణమి రాత్రి ఇక్కడి సీ వ్యూ టేబుల్‌కి డిమాండ్ ఎక్కువ.

6 రోజు శ్రీలంక నుంచి హైదరాబాద్‌కు ప్రయాణం. బ్రేక్‌ఫాస్ట్ తరవాత హోటల్ గది చెక్ అవుట్ చేసి ఎయిర్‌పోర్టుకు ప్రయాణం. 29వ తేదీ ఉదయం 07.25 గంటలకు యుఎల్ 177 విమానం కొలంబోలో బయలుదేరి 09.20 గంటలకు హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరడంతో టూర్ పూర్తవుతుంది.

శ్రీలంక... పచ్చల పాపిడి బొట్టు!

శ్రీలంక దీవి హిందూ మహా సముద్రంలో నీటి బొట్టును పోలి ఉన్న చిన్న భూభాగం. వధువు నుదుటన మెరిసే పచ్చల పాపిడి బొట్టులా ఉంటుంది. ఈ దీవిలో ఎత్తైన పర్వతశిఖరాలు, అగాధాలను తలపించే సరస్సులు కూడా ఉన్నాయి. ఇక్కడి రోడ్ల నిర్మాణం బాగుంటుంది. వాహనాల డ్రైవర్‌లు చక్కటి క్రమశిక్షణ పాటిస్తారు. రోడ్డు ఖాళీగా ఉన్నప్పుడు వాహనం వేగం ఒక్కసారిగా ఇరవై కిలోమీటర్లకు తగ్గిపోయిందంటే అది స్కూల్ జోన్ అన్నమాటే. స్కూలు మొదలయ్యే సమయం, వదిలే సమయం కాకపోయినప్పటికీ ఈ నియమాన్ని పాటించి తీరుతారు. శ్రీలంకలో గొప్ప హిందూ ఆలయాలు, చర్చ్‌లు, మసీదులు, బౌద్ధ స్థూపాలు దేనికది గొప్ప శోభతో వెలుగొందుతూ ఉంటాయి. సముద్రంలో ఓ చిన్న దీవిలో ప్రతి అంగుళమూ పచ్చదనమే, ఏడాదంతా సస్యశ్యామలమే. కొబ్బరి తోటలు, పోక చెట్లు, మామిడి చెట్లు ఎక్కువ. అన్నట్లు ఇక్కడ మామిడి ఏడాదికి రెండు కాపులు కాస్తుంది. దేశం పరిశుభ్రంగా ఉంటుంది. మనుషులు సౌమ్యంగా ఉంటారు. చాలా దుకాణాల్లో మన భారతీయ రూపాయలు తీసుకుంటారు. శ్రీలంక కరెన్సీ కూడా రూపాయే. అయితే మూడు రూపాయిలు మన ఒక రూపాయికి దాదాపుగా సమానం. ఆ రోజు ఎక్స్ఛేంజీని బట్టి తీసుకుంటారు. మిగులు నాలుగైదు రూపాయలు వదిలేసినా కూడా చాలా సంతోషిస్తారు. శ్రీలంక ఆహార సంక్షోభం హోటళ్లలో కనిపిస్తుంది. ఫైవ్ స్టార్ హోటల్‌లో కూడా వెరైటీల సంఖ్య పరిమితంగా ఉంటుంది. ఆహారాన్ని వృథా చేయవద్దని సూచన బోర్డు ఉంటుంది. ఆహారం మన దక్షిణాది రుచిని కలిగి ఉంటాయి. కొబ్బరి వాడకం ఎక్కువగా ఉంటుంది.

రామాయణ లంక

శ్రీలంక రామాయణ యాత్ర ఎక్స్ హైదరాబాద్ టూర్. ఇది ఆరు రోజుల యాత్ర. అక్టోబర్ 24వ తేదీ మొదలవుతుంది. ప్యాకేజ్ కోడ్ 'ఎస్‌హెచ్ఓ10'. ఇందులో కొలంబో, దంబుల్లా, క్యాండీ, నువారా ఎలియా, కతరగామ ప్రదేశాలు కవర్ అవుతాయి.

ప్యాకేజ్ వివరాలివి

సింగిల్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి దాదాపు 90 వేల రూపాయలు (ఇండియన్ రూపీస్). డబుల్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి దాదాపుగా 65 వేలు, ట్రిపుల్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి 64 వేల వరకు ఉంటుంది.

ఇవన్నీ వర్తిస్తాయి!

హైదరాబాద్ నుంచి కొలంబో రానుపోను విమాన టికెట్‌లు. త్రీ స్టార్ హోటల్ బస. 5 బ్రేక్‌ఫాస్ట్‌లు, నాలుగు లంచ్‌లు, ఐదు డిన్నర్‌లు. ఐటినరీ ప్రకారం పర్యాటక ప్రదేశాల ఎంట్రీ టికెట్‌లు. స్థానిక గైడ్ ఫీజులు. శ్రీలంక టూరిస్ట్ వీసా, ఐదు శాతం టీసీఎస్, ట్రావెల్ ఇన్సూరెన్స్ (80 ఏళ్ల లోపు వారికి, ప్రాణాంతకమైన వ్యాధులు లేని వారికి).

ఇవేవీ వర్తించవు!


ఇంటి నుంచి ఎయిర్‌పోర్టుకు, ఎయిర్‌పోర్టు నుంచి ఇంటికి రవాణా ఖర్చులు. లాండ్రీ ఖర్చులు, మద్యం, మెనూలో లేని ఇతర ఆహారాల ఖర్చులు, డ్రైవర్‌లకు - గైడ్‌లకు టిప్‌లు.

డాక్యుమెంట్స్ ఏమేమి తీసుకెళ్లాలి!


- పాస్‌పోర్ట్ (ప్రయాణం చేసే నాటికి కనీసం ఆరు నెలల వ్యాలిడిటీ ఉండాలి)
- పాన్ కార్డు
- కలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో సాఫ్ట్‌కాపీ

ఎవరిని సంప్రదించాలి?


ఐఆర్‌సీటీసీ జోనల్ ఆఫీస్, 9-1-129 /1 /302, ఆక్స్‌ఫర్డ్ ప్లాజా, ఎస్‌డీ రోడ్, సికింద్రాబాద్. ఫోన్ నంబర్ : 040- 27702407







- వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



ఒక పైసా పొదుపు చేయడం అంటే ఒక పైసా సంపాదించినట్టే
-బెంజమిన్ ఫ్రాంక్లిన్, ప్రముఖ అమెరికన్ శాస్త్రవేత్త, రచయిత

సాక్షి ప్లస్
సోమవారం। 29-9-2025

బిజినెస్ రీల్

ఐఎన్ఎస్‌సీఓ చేతికి హెచ్ఎన్‌జీఐఎల్



న్యూఢిల్లీ: రుణ ఊబిలో చిక్కుకున్న హిందుస్తాన్ నేషనల్ గ్లాస్ అండ్ ఇండస్ట్రీస్ సంస్థ(హెచ్ఎన్‌జీఐఎల్)ను దివాలా పరిష్కార ప్రక్రియ ద్వారా చేజిక్కించుకున్నట్లు ఉగాండాకు చెందిన మధ్వాని గ్రూప్ కంపెనీ ఇండిపెండెంట్ షుగర్ కార్పొరేషన్ (ఐఎన్ఎస్‌సీఓ) లిమిటెడ్ తెలిపింది. కొత్తగా ఏర్పడిన హెచ్ఎన్‌జీఐఎల్ బోర్డు ఈ విషయాన్ని అధికారికంగా ధృవీకరించింది. ఈ కొనుగోలు ప్రక్రియ పారిశ్రామికవేత్తలు కమ్లేష్ మాధ్వాని, శ్రై మాధ్వాని నేతృత్వంలో జరిగింది. సెర్బరస్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుండి ఆర్థిక మద్దతు లభించిందని ఐఎన్ఎస్‌సీఓ ప్రకటన ద్వారా తెలిపింది. దాదాపు రూ.2,250 కోట్ల ఈ రిజల్యూషన్ ప్రణాళికకు ఆగస్టు 14న ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలిపింది. తదుపరి ఆర్‌బీఐ, సీసీఐ నుంచి అనుమతులు లభించాయి. మొత్తం 45 రోజుల్లో విలీన ప్రక్రియ పూర్తి అయినట్లు ఐఎన్ఎస్‌సీఓ పేర్కొంది.

ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ఓకే

మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం




న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తాజాగా ఎలక్ట్రిక్ వాహన(ఈవీ) చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటులో నిర్వహణా సంబంధ మార్గదర్శకాలను జారీ చేసింది. తద్వారా రూ. 10,900 కోట్ల పీఎం ఈ–డ్రైవ్ పథకంలో భాగంగా రూ. 2,000 కోట్ల పెట్టుబడులతో 72,300 పబ్లిక్ ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు తెరతీసింది. సబ్సిడీ పథకానికి అనుగుణంగా వివిధ ప్రాంతాలలో వీటి ఏర్పాటుకు నిబంధనలు ప్రకటించింది. ప్రభుత్వ సంబంధ కార్యాలయాలు, రెసిడెన్షియల్ కాంప్లెక్సులు, ఆసుపత్రులు, విద్యా సంస్థలు తదితరాలలో ఏర్పాటు చేసే అప్‌స్ట్రీమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఈవీ చార్జింగ్ ఎక్విప్‌మెంట్‌కు 100 శాతం సబ్సిడీకి వీలుంటుంది. వీటిని ఉచితంగా పబ్లిక్ యాక్సెస్‌కు అనుగుణంగా ఏర్పాటు చేయవలసి ఉంటుంది. కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వం లేదా పీఎస్‌యూల నిర్వహణలోని నగరాలు, జాతీయ రహదారులతో పాటు.. రైల్వే స్టేషన్లు, ఏఏఐ నిర్వహణలోని ఎయిర్‌పోర్టులు, ఓఎంసీల రిటైల్ ఔట్‌లెట్లు, ఎస్‌టీయూ బస్ స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, మునిసిపల్ పార్కింగ్ లాట్లు తదితరాలలో ఏర్పాటు చేసే అప్‌స్ట్రీమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు 80 శాతం, ఈవీ సరఫరా ఎక్విప్‌మెంట్ వ్యయాలలో 70 శాతం సబ్సిడీ కవర్ లభిస్తుంది.

ఆర్‌బీఐ పాలసీపై దృష్టి

- 1న వడ్డీ రేట్లపై నిర్ణయం
- నేడు(29న) ఐఐపీ గణాంకాలు
- 30న ఎఫ్అండ్‌వో ముగింపు
- ఫార్మాపై టారిఫ్‌ల ఎఫెక్ట్
- 2న మార్కెట్లకు సెలవు
- ఈ వారం ట్రెండ్‌పై అంచనాలు

దేశీ స్టాక్ మార్కెట్లపై ఈ వారం పలు అంశాలు ప్రభావం చూపనున్నాయి. దేశీయంగా రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) పాలసీ సమీక్షను చేపట్టనుంది. ఆగస్ట్ నెలకు పారిశ్రామికోత్పత్తి(ఐఐపీ) గణాంకాలు వెలువడనున్నాయి. ఇవికాకుండా యూఎస్ టారిఫ్‌లు, వీటిపై భారత్‌తో చర్చలు తదితర అంశాలు ఈ వారం ట్రెండ్‌ను నిర్దేశించనున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. విజయదశమి, మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గురువారం(2న) మార్కెట్లకు సెలవుకావడంతో ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితంకానుంది. వివరాలు చూద్దాం.. - సాక్షి, బిజినెస్ డెస్క్



హెచ్1బీ వీసా ఫీజు పెంపుతోపాటు.. గత వారం ఫార్మా ప్రొడక్టులపై తాజాగా టారిఫ్‌లు విధించినప్పటికీ యూఎస్‌తో భారత్ చర్చలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే భారత్ దిగుమతులపై విధించిన అదనపు టారిఫ్‌ల తొలగింపునకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో గత వారం దేశీ స్టాక్ మార్కెట్లు బలహీనపడ్డాయి. అయితే ఈ వారం ఇతర పలు అంశాల ఆధారంగా మార్కెట్లు స్పందించనున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. నేడు(29న) ఆర్‌బీఐ పరపతి సమావేశం ప్రారంభంకానుంది. బుధవారం(అక్టోబర్ 1న) వడ్డీ రేట్లపై నిర్ణయాలు వెలువడనున్నాయి. ఆగస్ట్‌లో నిర్వహించిన సమావేశంలో వడ్డీ రేట్లకు కీలకమైన రెపో రేటును 5.5 శాతంవద్దే కొనసాగించేందుకు ఆర్‌బీఐ అధ్యక్షతన మానిటరీ పాలసీ కమిటీ(ఎంపీసీ) నిర్ణయించింది. జూన్‌లో 0.5 శాతం రేపోను తగ్గించినప్పటికీ ఈసారి యథాతథ పాలసీ అమలు లేదా 0.25 శాతం కోతకు వీలున్నట్లు ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు.

ఎఫ్అండ్‌వో ముగింపు

స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ డెరివేటివ్స్ గడువు ముగింపును ప్రతీ నెల చివరి గురువారం నుంచి మంగళవారానికి మార్చడంతో 30న సెప్టెంబర్ సిరీస్ ముగియనుంది.

దీంతో మార్కెట్లలో హెచ్చుతగ్గులకు వీలున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. మరోపక్క బీఎస్ఈ సైతం మంగళవారం నుంచి గురువారానికి ఎఫ్అండ్‌వో ముగింపు గడువును సవరించిన సంగతి తెలిసిందే. యూఎస్ టారిఫ్‌లు, వీటిపై చర్చలు, ఆర్‌బీఐ నిర్ణయాలు తదితర అంశాలన్నీ సెంటిమెంటుపై ప్రభావం చూపనున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా పేర్కొన్నారు. మరోపక్క ఆటో, వైట్‌గూడ్స్ తదితరాలపై పండుగల అమ్మకాల ప్రభావం, ఐఐపీ గణాంకాలపై సైతం ఇన్వెస్టర్లు దృష్టి పెట్టనున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా తెలియజేశారు.

యాక్సెంచర్ దెబ్బ

ఓపక్క ఐటీ దిగ్గజం యాక్సెంచర్ నిరుత్సాహకర ఔట్‌లుక్‌ను ప్రకటించగా, మరోవైపు హెచ్1బీ వీసా వ్యయభరితంకానుండటంతో దేశీ ఐటీ కంపెనీలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశమున్నట్లు జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయిర్ అభిప్రాయపడ్డారు. యూఎస్ తాజా టారిఫ్‌లు సెంటిమెంటును దెబ్బ తీసినట్లు పేర్కొన్నారు. లార్జ్‌క్యాప్స్‌తో పోలిస్తే గత వారం మిడ్, స్మాల్ క్యాప్స్ భారీగా క్షీణించినట్లు తెలియజేశారు. ఈ ప్రభావం మార్కెట్లపై మరోసారి కనిపించవచ్చని అంచనా వేశారు.

ఇతర అంశాలు

ఆగస్ట్‌లో ఐఐపీ గణాంకాలు నేడు వెలువడనున్నాయి. జూలైలో పారిశ్రామికోత్పత్తి 3.5 శాతం పుంజుకుంది. అంతకుముందు నెలలో నమోదైన 1.5 శాతంతో పోలిస్తే భారీగా బలపడింది. సెప్టెంబర్ నెలకు హెచ్ఎస్‌బీసీ తయారీ పీఎంఐ అక్టోబర్ 1న విడుదలకానుంది. ఆగస్ట్‌లో ఈ ఇండెక్స్ 59.3గా నమోదైంది. విదేశీ అంశాలలో చైనా తయారీ, స్పెయిన్, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీల ద్రవ్యోల్బణం, ఆస్ట్రేలియా వడ్డీ రేట్ల సమీక్షసహా సెప్టెంబర్‌లో యూఎస్ నిరుద్యోగ రేటు గణాంకాలు వెల్లడికానున్నాయి. ఈ అంశాలకూ ఈ వారం ప్రాధాన్యత ఉన్నట్లు నిపుణులు పేర్కొన్నారు.

గత వారమిలా

వరుసగా ఆరు రోజులపాటు మార్కెట్లు క్షీణ పథంలో సాగడంతో సెంటిమెంటు బలహీనపడింది. దీంతో గత వారం సెన్సెక్స్ 2,200 పాయింట్లు(2.66 శాతం) పతనమై 80,426 వద్ద ముగిసింది. నిఫ్టీ 672 పాయింట్లు(2.65 శాతం) క్షీణించి 24,655 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్స్ 2 శాతం చొప్పున నీరసించాయి.

రూపాయి క్షీణత

విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐలు) అమ్మకాలు, డాలరుతో మారకంలో రూపాయి భారీ క్షీణత, యూఎస్ వాణిజ్య టారిఫ్‌ల కారణంగా గత వారం మార్కెట్లు బలహీనపడినట్లు నిపుణులు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతుండటంతో రక్షణాత్మక పెట్టుబడిగా బంగారానికి డిమాండ్ పుంజుకోగా.. ఈక్విటీలు క్షీణిస్తున్నట్లు తెలియజేశారు. టారిఫ్‌లపై యూఎస్‌తో ప్రభుత్వ చర్చలు, ముడిచమురు ధరలు, రూపాయి కదలికలు వంటి అంశాలు స్వల్ప కాలానికి మార్కెట్లలో ట్రెండ్‌ను నిర్దేశించే వీలున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా పేర్కొన్నారు.

మరో పావు శాతం రేట్ల కోతకు చాన్స్!

- ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా...
- నేటి నుంచి ఆర్‌బీఐ ఎంపీసీ భేటీ...
- బుధవారం పాలసీ నిర్ణయం వెల్లడి...
- యథతథంగా ఉండొచ్చంటున్న మరికొంత మంది ఆర్థిక వేత్తలు



ముంబై: రుణ గ్రహీతలకు మరింత ఊరటనిచ్చేలా.. రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) పాలసీ వడ్డీరేట్లను మరో పావు శాతం తగ్గించే అవకాశం ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ రిపోర్ట్ అంచనా వేసింది. ప్రస్తుతానికి ఆర్‌బీఐకి ఇదే సరైన ఆప్షన్ అని పేర్కొంది. అయితే, మరికొంత మంది ఆర్థిక నిపుణులు మాత్రం పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) ఈ సారి కూడా రేట్లను యథాతథంగా కొనసాగించవచ్చని అభిప్రాయపడ్డారు. ఆర్‌బీఐ ఎంపీసీ మూడు రోజుల సమావేశం నేటి నుంచి ప్రారంభమవుతోంది. అక్టోబర్ 1న (బుధవారం) పాలసీ నిర్ణయం వెలువడుతుంది. ఒకపక్క భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, మరోపక్క, భారత్ ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకం విధించిన నేపథ్యంలో ఆర్‌బీఐ తాజా పాలసీ సమీక్ష ప్రాధాన్యం సంతరించుకుంది.

ఫిబ్రవరి నుంచి మూడు సార్లు...

ఆర్‌బీఐ కొత్త గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ నెల ఫిబ్రవరిలో జరిగిన తొలి ఎంపీసీ భేటీలోనే దాదాపు ఐదేళ్ల విరామం తర్వాత రెపో రేటును పావు శాతం తగ్గించారు. ఆ తర్వాత ఏప్రిల్లో పావు శాతం మళ్లీ జూన్‌లో ఏకంగా అర శాతం తగ్గింపుతో ఇప్పటి దాకా 1 శాతం రెపో రేటు దిగొచ్చింది. ప్రస్తుతం 5.5 శాతంగా కొనసాగుతోంది. ఆర్‌బీఐ చర్యల నేపథ్యంలో బ్యాంకులు కూడా రేట్ల కోత ప్రయోజనాన్ని రుణ గ్రహీతలకు బదలాయించాయి. దీంతో రుణాలపై వడ్డీ రేట్లు కాస్త దిగొచ్చాయి. అయితే, అమెరికా సుంకాల మోత, ఇతర భౌగోళిక రాజకీయ పరిణామాల ప్రభావంతో ఆగస్టు పాలసీ సమావేశంలో ఆర్‌బీఐ రేట్లను యథాతథంగా కొనసాగించింది.

ద్రవ్యోల్బణం ఊరట...

ప్రస్తుతం ధరలు పూర్తిగా అదుపులో ఉండటంతోపాటు వచ్చే ఏడాది కూడా రిటైల్ ద్రవ్యల్బణం కట్టడిలోనే ఉండొచ్చని, ఈ నేపథ్యంలో తాజా పాలసీ సమీక్షలో మరో పావు శాతం రెపో కోతకు ఆస్కారం ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది. ఆగస్టులో రిటైల్ ద్రవ్యోల్బణం 2.07 శాతంగా, టోకు ధరల ద్రవ్యోల్బణం 0.52 శాతం నమోదైన సంగతి తెలిసిందే. 'రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ టార్గెట్ 4 శాతంగానే (2 శాతం అటు ఇటుగా) ఉంది. జీఎస్‌టీ 2.0కి ముందు, ఆ తర్వాతా ఇదే పరిస్థితి. మరోపక్క, వృద్ధి రేటు స్థిరంగా 6.5 శాతంగా ఉండొచ్చని అంచనా వేస్తున్నప్పటికీ, టారిఫ్‌ల ప్రభావంతో తగ్గే అవకాశం లేకపోలేదు. ఈ తరుణంలో ప్రస్తుతం యథాతథ స్థితికే చాన్సుంది. మార్కెట్ వర్గాలు మాత్రం మరో పావు శాతం కోతను ఆశిస్తున్నాయి' అని బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఎకనమిస్ట్ మదన్ సబ్నవీస్ అభిప్రాయపడ్డారు. 'జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ప్రభావంతో రిటైల్ ద్రవ్యోల్బణం రానున్న నాలుగు త్రైమాసికాల్లో పావు శాతం నుంచి అర శాతం దిగిరావచ్చు. జీఎస్‌టీ రేట్ల హేతుబద్దీకరణ వల్ల డిమాండ్ భారీగా పుంజుకోనుంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఈసారి ఆర్‌బీఐ పాలసీ రేట్లలో ఎలాంటి మార్పు ఉండకపోవచ్చు' అని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా చీఫ్ ఎకనమిస్ట్ అదితి నాయర్ చెప్పారు. అయితే, జీఎస్‌టీ రేట్ల మార్పు, ద్రవ్యోల్బణం అంచనాల కంటే దిగువనే కొనసాగుతుండటంతో పావు శాతం రెపో కోతను అంచనా వేస్తున్నట్లు క్రిసిల్ చీఫ్ ఎకనమిస్ట్ ధర్మకృతి జోషి పేర్కొన్నారు.


ఫుడ్ ప్రాసెసింగ్‌లో పెట్టుబడుల జోరు

- 26 ఒప్పందాలు... రూ.1.02 లక్షల కోట్లు
- వరల్డ్ ఫుడ్ ఇండియా సదస్సులో సాకారం
- కేంద్ర ప్రభుత్వం వెల్లడి



న్యూఢిల్లీ: మన ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోకి పెట్టుబడులు వెల్లువెత్తాయి. ఈ నెల 25–28 మధ్య జరిగిన 'వరల్డ్ ఫుడ్ ఇండియా' సదస్సులో దేశ, విదేశాలకు చెందిన 26 సంస్థలు రూ. 1,02 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి ఒప్పందాలను కుదుర్చుకున్నాయని ప్రభుత్వం వెల్లడించింది. ఈ సదస్సును కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ నిర్వహించింది. 'నాలుగు రోజుల సదస్సులో దేశీ దిగ్గజాలతో పాటు ప్రపంచ స్థాయి కంపెనీలు కూడా పెట్టుబడులకు ముందుకొచ్చాయి. 26 అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) కుదిరాయి. వీటి విలువ రూ.1,02,047 కోట్లు. దేశీ ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో అతిపెద్ద పెట్టుబడుల్లో ఒకటిగా ఇది నిలిచింది' అని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీల జాబితాలో కోకాకోలా సిస్టమ్స్, రిలయన్స్ కన్జూమర్ ప్రోడక్ట్స్, అమూల్, ఫెయిర్ ఎక్స్‌పోర్ట్స్, టాటా కన్జూమర్ ప్రోడక్ట్స్, నెస్లే ఇండియా, కార్ల్స్‌బర్గ్ ఇండియా పతంజలి ఫుడ్స్, గోద్రెజ్ ఆగ్రోవెట్, హాల్దిరామ్ స్నాక్స్ ఫుడ్ వంటివి ఉన్నాయి. రిలయన్స్ కన్జూమర్ ప్రోడక్ట్స్ దేశవ్యాప్తంగా తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రిత్వ శాఖతో రూ.40,000 కోట్ల భారీ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. కాగా, ఈ పెట్టుబడులతో 64,000 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించడంతో పాటు 10 లక్షల మందికి పరోక్షంగా ప్రయోజనం చేకూరుతుందని ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ పేర్కొంది.

నవరాత్రులు.. పెట్టుబడి పాఠాలు



రోహిత్ మట్టూ
నేషనల్ హెడ్ - రిటైల్ సేల్స్, యాక్సిస్ మ్యుచువల్ ఫండ్



నవరాత్రుల్లో ప్రతి రోజు ఒక్కో వర్ణానికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. మనం అంతా కోరుకునే ప్రశాంతత, శక్తి, వృద్ధిని ప్రతిబింబించే విధంగా ఇవి ఉంటాయి. డబ్బు, పెట్టుబడుల విషయంలో పాటించాల్సిన విధానాలకు కూడా ఈ వర్ణాలు ప్రతిబింబించే గుణాలు ప్రాతిపదికగా నిలుస్తాయి. వీటిని అలవర్చుకుంటే ఆర్థిక ప్రయాణం కూడా రంగులమయంగా, సమతూకంగా ఉంటుంది. నవరాత్రులు, తొమ్మిది వర్ణాలు, అవి నేర్పే పెట్టుబడుల పాఠాల గురించి ఒకసారి చూద్దామా..

1వ రోజు - తెలుపు: తెలుపు స్వచ్ఛత, ప్రశాంతత, భద్రత, స్పష్టతకు చిహ్నం. ఆర్థిక కోణంలో చూస్తే సురక్షితమైన పునాదులతోనే ప్రశాంతత లభిస్తుంది. రిస్కు సామర్థ్యాలను అర్థం చేసుకుని, ఈక్విటీ-డెట్-హైబ్రిడ్ ఫండ్స్‌వ్యాప్తంగా సరైన కేటాయింపులు చేయడం ద్వారా ఈ భద్రత మొదలవుతుంది. పటిష్టమైన పునాదులపై నిర్మించిన ఇల్లు ఎలాగైతే తుఫాన్లయినా తట్టుకుని నిలబడుతుందో, క్రమశిక్షణతో కూడుకున్న పోర్ట్‌ఫోలియో అనేది, మార్కెట్లు అనూహ్యంగా మారినా కూడా స్థిరత్వాన్ని అందిస్తుంది.

2వ రోజు - ఎరుపు: ఎరుపు వర్ణం శక్తిని, సంకల్పాన్ని సూచిస్తుంది. సంపద సృష్టించాలంటే స్వల్పకాలిక సవాళ్లను పట్టించుకోకుండా దీర్ఘకాలిక విజన్‌పై దృష్టి పెట్టాలి. సాధారణంగా మార్కెట్లో ఒడిదుడుకులనేవి, ఇన్వెస్టర్లను భయపెడ్తాయి. కానీ వెనకడుగు వేయకుండా స్థిరంగా నిలబడటమే శక్తి. ఈక్విటీ ఫండ్స్ స్వల్పకాలికంగా హెచ్చుతగ్గులకు లోనైనా కాలక్రమేణా, మీ పోర్ట్‌ఫోలియోను శక్తివంతంగా, స్థిరంగా తీర్చిదిద్దుతాయి. ధైర్యం అంటే దుస్సాహసాలు చేయడం కాదు, భయం వెనక్కిలాగినా, మన సంకల్పానికి కట్టుబడి ఉండాలని ఎరుపు వర్ణం సూచిస్తుంది.

3వ రోజు - నీలం: ఈ రంగు నమ్మకానికి, స్థిరత్వానికి చిహ్నంగా నిలుస్తుంది. ఈక్విటీ, డెట్, హైబ్రిడ్ పెట్టుబడులవ్యాప్తంగా వైవిధ్యాన్ని పాటించడం ద్వారా పోర్ట్‌ఫోలియోకు స్థిరత్వం లభిస్తుంది. నీలం వర్ణం ఏ విధంగానైతే విశాలమైన ఆకాశం, లోతైన మహాసముద్రాలను ప్రతిఫలిస్తుందో, అదే విధంగా డైవర్సిఫికేషన్ కూడా పెట్టుబడుల పరిధిని మరింత విస్తృతం చేసి, ఎలాంటి ఒడిదుడుకులనైనా అధిగమించే శక్తిని అందిస్తుంది.

4వ రోజు - పసుపు: పసుపు అనేది ఆశావహ భావాన్ని, సరికొత్త ప్రారంభాలను సూచిస్తుంది. ఎమర్జెన్సీ ఫండ్ ఏర్పాటు చేసుకోవడం కావచ్చు, సిప్‌ను ప్రారంభించడం కావచ్చు, లేదా రిటైర్మెంట్ ప్రణాళికను ప్రారంభించడం కావచ్చు, ప్రతి ఇన్వెస్టరు ప్రస్థానంలో మొదటి అడుగు అనేది ఉంటుంది. ఈ ఆరంభాలు చాలా చిన్నవిగా అనిపించవచ్చు, కానీ కొత్త మార్పునకు శ్రీకారంగా నిలుస్తాయి. చిన్న చిన్న అలవాట్లే దీర్ఘకాలంలో ఆర్థికంగా సానుకూల భావాన్ని పెంపొందిస్తాయి.

5వ రోజు - ఆకుపచ్చ (వృద్ధి): ఆకుపచ్చని వర్ణమనేది ప్రకృతిని, సమృద్ధిని సూచిస్తుంది. ఆర్థిక విషయాలను పరిశీలిస్తే, డబ్బును నిరుపయోగంగా ఉంచడమంటే విత్తనాన్ని నాటకుండా ఉంచినట్లే. సరైన వాతావరణంలో విత్తనాన్ని నాటితే వృద్ధిలోకి వస్తుంది. మ్యూచువల్ ఫండ్స్‌ను వివేకవంతంగా ఎంచుకుంటే, దీర్ఘకాలిక వృద్ధికి సారవంతమైన క్షేత్రం లభించినట్లవుతుంది. నారు ఎలా అయితే వృక్షంగా ఎదుగుతుందో, కాంపౌండింగ్ కూడా అలాగే నిశ్శబ్దంగా పని చేస్తుంది. హరిత వర్ణమనేది సహనాన్ని, స్థిరత్వాన్ని ప్రోత్సహిస్తుంది. హడావిడి పడితే కాదు ఓర్పుగా సాగు చేస్తేనే స్థిరమైన సంపద వస్తుందని తెలియజేస్తుంది.

6వ రోజు - బూడిద వర్ణం: ఈ వర్ణం కాంతిని, నీడను, రెండింటినీ సూచిస్తుంది. జీవితమంటే కేవలం సూర్య కాంతి వెలుగులే కాదు తుఫాన్ల చీకట్లు కూడా ఉంటాయని గుర్తు చేస్తుంది. వీటిని అధిగమించే క్రమంలో క్రమశిక్షణతో బడ్జెట్ వేసుకోవడం, ఇన్వెస్టింగ్ చేయడం ద్వారా ఆర్థికాంశాల్లో సమతౌల్యత వస్తుంది. నెలవారీ సిప్‌లాంటివి మార్కెట్లలో అనిశ్చితి నెలకొన్నప్పటికీ పొదుపు, మదుపు కొనసాగేలా చూస్తాయి.

7వ రోజు - నారింజ: ఈ రంగు శక్తి, ఉత్సాహం, క్రియాశీలతను సూచిస్తుంది. క్రియాశీలకంగా సకాలంలో చర్య తీసుకోవాలని ఆర్థిక పరిజ్ఞానం సూచిస్తుంది. పెట్టుబడులు ఎంత ముందుగా ప్రారంభిస్తే, కాంపౌండింగ్ అంత శక్తివంతంగా ఉంటుంది. ఏ కాస్త జాప్యం చేసినా సరే, దీర్ఘకాలికంగా సంపదను సృష్టించుకోవడంలో భారీ తేడా వస్తుంది. ''సరైన సమయం'' కోసం నిరీక్షిస్తూ కూర్చోకుండా, వెంటనే రంగంలోకి దిగాలని నారింజ వర్ణం సూచిస్తుంది.

8వ రోజు - నెమలి ఆకుపచ్చ: ఈ వర్ణం హుందాతనం, వివేకం, ఆకాంక్షలను సూచిస్తుంది. వెల్త్ మేనేజ్‌మెంట్‌లో ఆకాంక్షలను, దూరదృష్టితో మేళవించాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తుంది. సంపదను పెంచుకోవాలనే కోరికకు ఆకాంక్ష ఓ చోదకంగా నిలుస్తుంది. అదే సమయంలో మన ఎంపికలు దీర్ఘకాలంలో నిలబడగలిగేవిగా ఉండేలా వివేకం చూస్తుంది. స్వల్పకాలిక ధోరణుల మాయలో పడకుండా, జీవిత లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడులపై ఫోకస్ చేయడానికి ఇవి కీలకం.

9వ రోజు - గులాబీ: గులాబీ వర్ణమనేది ప్రేమ, సంరక్షణను సూచిస్తుంది. పిల్లల చదువులు, రిటైర్మెంట్ ప్రణాళికలు, కుటుంబానికి బీమా భద్రత కల్పించడం ఇలా ప్రతి ఆర్థిక లక్ష్యం వెనుక ప్రేమ దాగి ఉంటుంది. ఆయా లక్ష్యాల కోసం ఇన్వెస్ట్ చేయడం కూడా ప్రేమను ఆర్థిక కోణంలో వ్యక్తపర్చడమే అవుతుంది. గులాబీ రంగు అనేది పెట్టుబడులంటే అంకెలు, లెక్కలు కాదని, చేసిన హామీలను నిలబెట్టుకోవడమని తెలియజేస్తుంది.

చివరిగా చెప్పాలంటే, ఆధ్యాత్మికత, క్రమశిక్షణ ఒకదాని వెంటే ఒకటి ఉంటాయని నవరాత్రులు తెలియజేస్తాయి. క్రమశిక్షణతో పెట్టుబడులు పెడితే, ఆర్థికంగా ఎలాంటి క్లిష్ట పరిస్థితులు వచ్చినా ధైర్యంగా ఎదుర్కొనగలిగే శక్తిని అందిస్తాయి. సంపద సృష్టి అనేది ఏదో ఒక్క రోజుతో తేలిపోయే వ్యవహారం కాదు. స్థిరంగా, ఓపికగా, స్పష్టతతో ఒక్కొక్క అడుగు వేస్తూ ముందుకు సాగే ప్రస్థానం.

నవరాత్రులు అందరికీ సంతోషాన్ని, ఆరోగ్యాన్ని, సమృద్ధిని అందించాలని కోరుకుంటూ, శుభాభినందనలు.

ట్యాక్స్ ఆడిట్ గడువు తేదీ... పొడిగింపు



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

ముందుగా అందరికీ విజయదశమి శుభాకాంక్షలు... హైకోర్టులు ఇచ్చిన తీర్పులు, అస్సెస్సీల విజ్ఞాప్తులు, వృత్తి నిపుణుల కోరికల గురించి ఆలోచించిన కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ఎట్టకేలకు ట్యాక్స్ ఆడిట్‌ల రిపోర్టు ఫైలింగ్ గడువు 30.9.2025 నుంచి 31.10.2025 వరకు పొడిగించారు.

మొత్తం ట్యాక్స్ ఆడిట్ల సంఖ్యలోంచి సుమారు 10% మంది మాత్రమే సెప్టెంబర్ 23 నాటికి రిపోర్టులు దాఖలు చేయగలిగారు. మిలిగిన వారు 90%... సంఖ్యాపరంగా 34 లక్షలు మంది ఇంకా దాఖలు చేయాల్సి ఉంది. అందుకనే ప్రభుత్వం మీద ప్రత్యక్షంగా, పరోక్షంగా ఒత్తిడి తేవడం, విజ్ఞప్తులు చేయడం, కోర్టులను ఆశ్రయించడం జరిగింది. ఈ ట్యాక్సు ఆడిట్ రిటర్నులు, రిపోర్టులు వేయకపోవడానికి గల కారణాలు తెలుసుకునేందుకు సర్వే నిర్వహించారు. 1200 మంది వృత్తి నిపుణుల నుంచి వారు ఫైలింగ్‌లో నిత్యం ఎదుర్కొంటున్న సాధకబాధకాలను తెలియజేయమన్నారు. అందరూ తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. ఈ సర్వే ప్రకారం ఇబ్బందులు ఏమిటంటే...

ఫారం 3 CA - 3CD:

ట్యాక్స్ ఆడిట్‌కు సంబంధించిన యుటిలిటీ 18.7.2025 నాడు తయారు చేశారు. ఇదే సౌకర్యాన్ని క్రితం సంవత్సరం 1.4.2025 నాడు విడుదల చేశారు. బండి మొదలు మూడున్నర నెలలు లేటుగా రెడీ అయ్యింది. ఇలా రెడీగా లేకపోవడం వల్ల నాన్-ఆడిట్ కేసుల గడువు తేది 31.7.2025 నుంచి సెప్టెంబర్ 15 2025 వరకు పొడిగించారు. అదే లాజిక్‌తో ట్యాక్స్ ఆడిట్ విషయంలో ఆశించారు కానీ నిమ్మకు నీరెత్తినట్లు నిర్మలమ్మ గారు నిమ్మళంగా ఉన్నారు.

ఇంతకీ సమస్యలు ఎటువంటివి ఉత్పన్నమయ్యాయి అంటే...

→ లాగిన్ సమస్యలు.. జనాలు లాగిన్ అవ్వడానికి ప్రయత్నం చేసి విసిగిపోయారు.

→ రిపోర్ట్/రిటర్న్ ఫైలింగ్ ప్రక్రియ అతి ముఖ్యమైంది ఓటీపీ(వన్‌టైంపాస్‌వర్డ్).. ఈ రోజుల్లో అందరూ ముఖ్యంగా అస్సెస్సీలు ఓటీపీ అంటే భయపడుతున్నారు. సైబర్ నేరస్తులు ఎక్కువ అవడంతో ఈ భయం ఒక పట్టాన పోవడం లేదు. ఈ భయాన్ని తొలిగించుకొని సిస్టమ్ ముందు కూర్చొని ఓటీపీ కోసం వెళితే.. ఓటీపీ రాదు. బఫరింగ్... వెయిటింగ్... ఓటీపీ... ఎప్పుడైనా రావచ్చు లేదా రాకపోవచ్చు. ఓటీపీ వచ్చేసరికి సెషన్ గడువు పూర్తి అవుతుంది. మళ్లీ కథ మొదలు... షరా మామూలే... క్లయింట్ల ఆరాటం... విసుగు... గోల

→ రిటర్న్ వేయటానికి చాలా యుటిలిటీ ఓపెన్ చేయాలి. క్లయింట్ ప్రొఫైల్, ఫామ్ 3CD, ట్యాక్స్ ఆడిట్, AIS, TIS.... ఒకటి ఓపెన్ చేసి, సమాచారమంతా చూసే సరికి... లాగ్ అవుట్ అవ్వాల్సి వస్తోంది.

→ పోర్టల్ స్పీడు తగ్గిపోతోంది. లోడ్ అవ్వడానికి ఎంతో సమయం పడుతుంది. గంటల కొద్దీ నిరీక్షణ కానీ ఇన్‌కంట్యాక్స్ వారి వెబ్‌సైట్ ఈ స్థాయిలో రెడీగా లేదు.

→ లాభనష్టాల ఖాతాలోని అంశాలు, ఆస్తి అప్పుల పట్టికలోని అంశాలు పొందపరిచినప్పుడు, అటాచ్ చేసినప్పుడు కష్టం అవుతుంది. ఎర్రర్ మేసేజ్‌లు వస్తున్నాయి.

→ ఈ రిటర్నులు/రిపోర్టులు వేయడానికి డిజిటల్ సిగ్నేచర్(DSC) తప్పనిసరిగా అవసరం. ఈ DSCలు రిజిస్టర్ అవ్వడం లేదు. అప్‌డేట్ అవ్వడం లేదు.

→ ఈ DSCలు బ్యాలెన్స్ షీటు మీద వేయడం మొదటి ప్రయత్నంలో ఫలించదు. వన్స్‌మోర్‌ప్లీజ్ అనే పరిస్థితి.

→ JSON ఫైలులో పాన్‌నెంబరు కరెక్టుగా అప్‌లోడ్ చేసినా 'తప్పు' అని తప్పనిసరిగా చూపిస్తుంది. ఈ ప్రక్రియ విజయవంతం అయితే మీకు లాటరీ తగిలినట్లే...

→ కొన్ని క్లాజులు వాలిడేట్ అవ్వడం లేదు. వాలి డేట్ అయితేగాని ముందుకు సాగడం జరగదు.

→ ఎటువంటి వివరణ ఇవ్వకుండా/కారణం చెప్పకుండా SOME THING WENT WRONG/ TECHNICAL ERROR అని చూపిస్తే ఎక్కడని వెతకాలి.? ఏమని వెతకాలి..?

→ TAR JSON file అప్‌లోడింగ్ కష్టం అవుతోంది. వెర్షన్ లోపాలు తలెత్తుతున్నాయి. మామూలుగానే 3 CA, 3 CDలో ఎన్నో విషయాలు తెలియచేయాలి. ఎంతో హోమ్‌వర్క్.. ఎంతో సయోధ్య ఉంటుంది 'RECONCILIATION' చెయ్యాలి. వృత్తి నిపుణులు క్లయింట్ల మధ్య సహకారం, సమన్వయం ఉండాలి. లోపరహితంగా ఉండాలి. సిస్టమ్ వేగంగా ఉండాలి. అప్పుడే అందరికీ ఉపశమనం. డిపార్ట్‌మెంట్ వారి 'ATTENTION' సమగ్రంగా ఉంటే వృత్తి నిపుణులకు, క్లయింట్లకు ఉండదు TENSION.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

ఆకుల శ్రీజ శుభారంభం



బీజింగ్: వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) చైనా స్మాష్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్, తెలంగాణ క్రీడాకారిణి ఆకుల శ్రీజ శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 42వ ర్యాంకర్ శ్రీజ 11-6, 11-9, 11-7తో ప్రపంచ 103వ ర్యాంకర్ యాంగ్ యియున్ (చైనా)పై విజయం సాధించి రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. 25 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీజ తన సర్వీస్‌లో 15 పాయింట్లు, ప్రత్యర్థి సర్వీస్‌లో 18 పాయింట్లు సాధించింది. మరోవైపు యాంగ్ తన సర్వీస్‌లో 11 పాయింట్లు, ప్రత్యర్థి సర్వీస్‌లో 11 పాయింట్లు దక్కించుకుంది. శ్రీజ కాకుండా భారత్ నుంచి మెయిన్ 'డ్రా'లో మనిక బత్రా మాత్రమే బరిలో ఉంది. భారత్‌కే చెందిన అహిక ముఖర్జీ, స్వస్తిక ఘోష్, దియా చిటాలె, యశస్విని ఘోర్పడే క్వాలిఫయింగ్ రౌండ్‌ను దాటి మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయారు.

మానవ్ బోణీ

పురుషుల సింగిల్స్ విభాగంలో భారత నంబర్‌వన్, ప్రపంచ 42వ ర్యాంకర్ మానవ్ ఠక్కర్ గెలుపు బోణీ కొట్టాడు. తొలి రౌండ్‌లో మానవ్ 11-5, 11-6, 11-9తో ప్రపంచ 44వ ర్యాంకర్ ఫిన్ లు (ఆస్ట్రేలియా)పై గెలుపొందాడు. 20 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో మానవ్ తన సర్వీస్‌లో 18 పాయింట్లు, ప్రత్యర్థి సర్వీస్‌లో 15 పాయింట్లు సంపాదించాడు. భారత్‌కే చెందిన అంకుశ్ భట్టాచార్య తొలి రౌండ్‌లోనే వెనుదిరిగాడు. క్వాలిఫయర్‌గా మెయిన్ 'డ్రా'లో అడుగు పెట్టిన అంకుర్ 11-3, 9-11, 10-12, 11-6, 8-11తో నికోలస్ లుమ్ (ఆస్ట్రేలియా) చేతిలో పోరాడి ఓడిపోయాడు. భారత్‌కే చెందిన సత్యన్ జ్ఞానశేఖరన్, పాయస్ జైన్, సూరావజ్జుల స్నేహిత్, హర్మీత్ దేశాయ్, మనుశ్ షా క్వాలిఫయింగ్ రౌండ్‌ను అధిగమించడంలో విఫలమయ్యారు.

అభయ్ సంచలనం

తొలి రౌండ్‌లో ప్రపంచ 5వ ర్యాంకర్‌పై విజయం



దోహా: ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్ఏ) ప్లాటినమ్ ఈవెంట్ ఖతర్ క్లాసిక్ టోర్నీలో భారత స్టార్ అభయ్ సింగ్ సంచలనంతో శుభారంభం చేశాడు. ఆదివారం జరిగిన తొలి రౌండ్‌లో ప్రపంచ 35వ ర్యాంకర్ అభయ్ 11-6, 11-4, 1-11, 11-9తో ప్రపంచ 5వ ర్యాంకర్ కరీమ్ గవాద్ (ఈజిప్ట్)పై గెలుపొంది రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. సోమవారం జరిగే రెండో రౌండ్‌లో ప్రపంచ 15వ ర్యాంకర్ ఫరీస్ దెసూకి (ఈజిప్ట్)తో తలపడతాడు. భారత్‌కే చెందిన రమిత్ టాండన్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. ప్రపంచ 36వ ర్యాంకర్ రమిత్ 4-11, 7-11, 4-11తో ప్రపంచ నంబర్‌వన్ ముస్తఫా అసల్ (ఈజిప్ట్) చేతిలో ఓడిపోయాడు.

సూపర్ శ్రీహరి

- ఒకే రోజు మూడు పతకాలు నెగ్గిన భారత స్విమ్మర్
- ఆసియా అక్వాటిక్స్ చాంపియన్‌షిప్



అహ్మదాబాద్: పదహారేళ్ల సుదీర్ఘ నిరీక్షణకు భారత స్విమ్మర్ శ్రీహరి నటరాజ్ తెరదించాడు. ఆసియా అక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఒకేరోజు భారత్‌కు మూడు పతకాలు అందించి అబ్బురపరిచాడు. ఆదివారం మొదలైన ఈ మెగా ఈవెంట్‌లో శ్రీహరి పురుషుల 200 మీటర్ల ఫ్రీస్టయిల్, 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ వ్యక్తిగత విభాగాల్లో రజత పతకాలు నెగ్గగా... 4x100 మీటర్ల మెడ్లీ రిలే ఈవెంట్‌లో కాంస్యం నెగ్గిన భారత బృందంలో సభ్యుడిగా ఉన్నాడు. 2020 టోక్యో ఒలింపిక్స్, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన 24 ఏళ్ల శ్రీహరి... 200 మీటర్ల ఫ్రీస్టయిల్ ఫైనల్‌ను 1ని:48.47 సెకన్లలో ముగించి రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. హైబో జు (చైనా; 1ని:46.83 సెకన్లు) స్వర్ణం... హినాటో అండో (జపాన్; 1ని:48.73 సెకన్లు) కాంస్యం సాధించారు. 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఫైనల్‌ను శ్రీహరి 25.46 సెకన్లలో ముగించి రెండో స్థానాన్ని సంపాదించాడు. గుకైలాల్ వాంగ్ (చైనా; 25.11 సెకన్లు) స్వర్ణం... ములున్ చువాంగ్ (చైనీస్ తైపీ; 25.50 సెకన్లు) కాంస్యం కైవసం చేసుకున్నారు. రిషభ్ దాస్, లిఖిత్ సెల్వరాజ్, బెనెడిక్షన్ బెనిస్టన్, శ్రీహరి నటరాజ్ సభ్యులుగా ఉన్న భారత బృందం 4x100 మీటర్ల మెడ్లీ ఫైనల్‌ను 3ని:40.87 సెకన్లలో పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచింది. తొలి రోజు పోటీలు ముగిశాక చైనా 11 స్వర్ణాలు, 2 కాంస్యాలతో కలిపి 13 పతకాలతో టాప్ ర్యాంక్‌లో ఉండగా... భారత్ మూడు పతకాలతో ఆరో స్థానంలో ఉంది.



అనుష్క అదుర్స్

ప్రపంచకప్ టోర్నీలో రెండో స్వర్ణం సొంతం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) జూనియర్ ప్రపంచకప్ టోర్నమెంట్‌లో భారత షూటర్ అనుష్క ఠాకూర్ గురి అదిరింది. జూనియర్ మహిళల 50 మీటర్ల ప్రోన్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం నెగ్గిన అనుష్క... తాజాగా 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లోనూ మెరిసి పసిడి పతకాన్ని దక్కించుకుంది. ఆదివారం జరిగిన 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఫైనల్లో అనుష్క 461 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచింది. భారత్‌కే చెందిన మహిత్ సంధూ 422.7 పాయింట్లతో ఐదో స్థానంలో, ప్రాచి గైక్వాడ్ 399.3 పాయింట్లతో ఏడో స్థానంలో నిలిచారు. జూనియర్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో భారత షూటర్ అడ్రియన్ కర్మాకర్ రజత పతకాన్ని సంపాదించాడు. అడ్రియన్ 454.8 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచాడు. మరో నాలుగు రోజులపాటు జరిగే ఈ టోర్నీలో ప్రస్తుతం భారత్ పతకాల పట్టికలో నంబర్‌వన్ ర్యాంక్‌లో కొనసాగుతోంది. భారత్ ఖాతాలో 4 స్వర్ణాలు, 6 రజతాలు, 4 కాంస్యాలతో కలిపి మొత్తం 13 పతకాలు ఉన్నాయి.



కోకో గాఫ్ ముందంజ

చైనా ఓపెన్ టెన్నిస్ టోర్నీ

బీజింగ్: అమెరికా టెన్నిస్ స్టార్ కోకో గాఫ్ చైనా ఓపెన్‌లో మూడో రౌండ్‌కు దూసుకెళ్లింది. డబ్ల్యూటీఏ-1000 సిరీస్ టోర్నీ మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఆదివారం గాఫ్ 6-4, 4-6, 7-5తో లేలా ఫెర్నాండెజ్ (కెనడా)పై విజయం సాధించింది. రెండో సీడ్‌గా బరిలోకి దిగిన గాఫ్ ఈ మ్యాచ్‌లో 4 ఏస్‌లు సంధించి... 6 డబుల్ ఫాల్ట్‌లు చేసింది. 8 బ్రేక్ పాయింట్లు కాచుకున్న గాఫ్... మొత్తం 108 పాయింట్లు ఖాతాలో వేసుకుంది. మంగళవారం జరగనున్న మూడో రౌండ్‌లో బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్)తో గాఫ్ తలపడనుంది. ఇతర మ్యాచ్‌ల్లో ప్రపంచ 66వ ర్యాంకర్ ఇవా లైస్ (జర్మనీ) 6-3, 1-6, 6-4తో ప్రపంచ పదో ర్యాంకర్ రిబాకినా (కజకిస్తాన్)పై... జాస్మిన్ పావోలిని (ఇటలీ) 6-3, 6-0తో సోఫియా కెనిన్ (అమెరికా)పై విజయాలు సాధించి ముందంజ వేశారు. అమెరికా ప్లేయర్ కెస్లెర్‌తో మ్యాచ్ సందర్భంగా గాయపడిన చెక్ రిపబ్లిక్ ప్లేయర్ క్రెజికోవా పోటీ నుంచి తప్పుకుంది.

క్వార్టర్ ఫైనల్లో జ్వెరెవ్

మరోవైపు ఏటీపీ-500 పురుషుల టోర్నమెంట్ లో రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. ప్రిక్వార్టర్స్‌లో జ్వెరెవ్ 7-5, 3-6, 6-3తో కొరెన్‌టిన్ మౌటెట్ (ఫ్రాన్స్)పై విజయం సాధించాడు. క్వార్టర్స్‌లో డానియల్ మెద్వెదెవ్ (రష్యా)తో జ్వెరెవ్ తలపడనున్నాడు. మరో మ్యాచ్‌లో లొరెంజో ముసెట్టి (ఇటలీ) 6-3, 6-3తో ఆడియన్ మన్నారినో (ఫ్రాన్స్)పై గెలిచి ముందంజ వేశాడు.

అల్‌కరాజ్...65వ విజయం

జపాన్ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్ అల్‌కరాజ్ (స్పెయిన్) సెమీ ఫైనల్‌కు చేరాడు. పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ అల్‌కరాజ్ 6-2, 6-4తో బ్రాండన్ నకషీమా (అమెరికా)పై గెలిచాడు. మ్యాచ్ ఆరంభం నుంచి ఆధిపత్యం కనబర్చిన ఈ యంగ్‌స్టర్... వరుస సెట్లలో ప్రత్యర్థిని మట్టికరిపించాడు. ఈ సీజన్‌లో అల్‌కరాజ్‌కు ఇది 65వ విజయం కావడం విశేషం. 2023 ఏటీపీ టూర్‌లో సైతం 65 మ్యాచ్‌లు గెలిచిన అల్‌కరాజ్... ఇప్పుడు మరోసారి ఆ ఘనత సాధించాడు. 'మరో సెమీఫైనల్‌కు చేరడం ఆనందంగా ఉంది. జపాన్‌లో తొలి సారి ఆడుతున్నా. మొదటిసారే సెమీస్‌కు చేరుకోవడం చక్కటి ఉత్సాహాన్నిచ్చింది' అని 22 ఏళ్ల అల్‌కరాజ్ అన్నాడు. సెమీస్‌లో నాలుగో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే)తో అల్‌కరాజ్ ఆడతాడు.



డీఎస్పీగా సామ సాత్విక

సాక్షి, హైదరాబాద్: టెన్నిస్ కోర్టులో సంచలన విజయాలతో రాణించిన హైదరాబాద్ ప్లేయర్ సామ సాత్విక... తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో సత్తా చాటి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) కొలువు సాధించింది. ఆరేళ్ల ప్రాయంలో టెన్నిస్ రాకెట్ చేతపట్టి జూనియర్ స్థాయిలో వరుస విజయాలతో దూసుకెళ్లిన సాత్విక... డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో 2020లో అత్యుత్తమంగా 809వ ర్యాంక్ సాధించింది. హార్డ్ కోర్ట్‌పై సత్తాచాటిన ఈ హైదరాబాదీ... 2019 దక్షిణాసియా క్రీడల మహిళల సింగిల్స్‌లో పసిడి పతకంతో మెరిసింది. 2022 తర్వాత ఆటకు విరామమిచ్చిన సాత్విక... తాజాగా గ్రూప్-1 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి డీఎస్పీ పోస్టుకు అర్హత సాధించింది. శనివారం హైదరాబాద్‌లోని శిల్ప కళా వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా 25 ఏళ్ల సాత్విక నియామక పత్రం అందుకుంది. ఐటీఎఫ్ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా 527వ స్థానంలో నిలిచిన సాత్విక ఆ తర్వాత టెన్నిస్ కాలమిస్ట్‌గానూ ఆకట్టుకుంది.

కౌంటీ అరంగేట్రంలో రాహుల్ చహర్ మ్యాజిక్

8 వికెట్లు తీసి 166 ఏళ్ల రికార్డు బద్దలు కొట్టిన భారత స్పిన్నర్



లండన్: భారత లెగ్ స్పిన్నర్ రాహుల్ చహర్ కౌంటీ క్రికెట్‌లో 166 ఏళ్ల రికార్డుకు పాతరేశాడు. సర్రే కౌంటీ జట్టు తరఫున అరంగేట్రం చేసిన ఈ మ్యాచ్‌లోనే చహర్ (8/51) తన స్పిన్ మాయాజాలంతో హ్యాంప్‌షైర్ బ్యాటర్లను తిప్పేశాడు. చహర్ 24-7-51-8 బౌలింగ్ గణాంకాలు నమోదు చేశాడు. తద్వారా 1859లో విలియమ్ మడిల్ (7/61) నెలకొల్పిన రికార్డును చహర్ తిరగరాశాడు. ఈ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఈ భారత స్పిన్నర్ 10 వికెట్లు తీశాడు. ఇవి తన ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లోనే అత్యుత్తమ గణాంకాలు కావడం విశేషం. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఇప్పటివరకు ఉన్న 9/148 ఉత్తమ ప్రదర్శనను మరింత మెరుగు పర్చుకున్నాడు. ఒక ఇన్నింగ్స్‌లో 8/51 ప్రదర్శన వ్యక్తిగత అత్యుత్తమంగా ఉంది. అతను స్పిన్ ఉచ్చు బిగించడం వల్లే కౌంటీ డివిజన్-1 చాంపియన్‌షిప్‌లో సర్రే జట్టు 20 పరుగుల తేడాతో హ్యాంప్‌షైర్‌పై గెలుపొందింది. కాగా... మరో భారత క్రికెటర్ వాషింగ్టన్ సుందర్ హ్యాంప్‌షైర్ తరఫున ఆడాడు. తొలి ఇన్నింగ్స్‌లో రాహుల్ చహర్ జట్టు సర్రేను సుందర్ 3.2-0-5-3 స్పెల్‌తో ఇబ్బంది పెట్టాడు. కానీ రెండో ఇన్నింగ్స్‌లో అతనికి వికెట్లు దక్కలేదు. బ్యాటింగ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో (56, 11) ఆకట్టుకున్నాడు. సుందర్ త్వరలో జరిగే వెస్టిండీస్ పర్యటన కోసం కౌంటీ క్రికెట్‌లో రాటుదేలుతున్నాడు. కానీ రాహుల్ చహర్ మాత్రం 2019 నుంచి 2021 వరకు ఒక వన్డే, ఆరు టి20లు మాత్రమే టీమిండియాకు ఆడగలిగాడు.


విండీస్‌కు నేపాల్ షాక్

తొలిసారి ఐసీసీ శాశ్వత సభ్య దేశంపై విజయం

మొదటి టి20లో 19 పరుగుల తేడాతో గెలుపు

మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం





షార్జా: అంతర్జాతీయ క్రికెట్‌లో నేపాల్ ఒక అనామక జట్టు. కానీ వెస్టిండీస్ మాజీ ప్రపంచ చాంపియన్. రెండు వన్డే ప్రపంచకప్‌లను, మరో రెండు టి20 ప్రపంచకప్‌లను గెలుచుకున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) శాశ్వత సభ్య దేశం. క్రికెట్‌లో ఇంతటి అంతరం ఉన్న జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నేపాల్ సంచలన విజయం సాధించింది. శనివారం అర్ధరాత్రి జరిగిన తొలి టి20లో నాలుగు ప్రపంచకప్‌ల విజేత వెస్టిండీస్‌ను 19 పరుగుల తేడాతో కంగుతినిపించింది. గతంలో నేపాల్... అఫ్గానిస్తాన్‌ను ఓడించింది. 2014లో జరిగిన టి20లో అఫ్గానిస్తాన్‌పై గెలిచినప్పుడు ఆ జట్టు అసోసియేట్ జట్టుగానే ఉంది. ఇప్పుడు శాశ్వత సభ్యదేశమైనప్పటికీ అఫ్గానిస్తాన్‌కు... విండీస్‌కున్న ఘనచరిత్ర అయితే లేదు. కాబట్టి నేపాల్ తాజా సిరీస్‌లో తమ క్రికెట్ చరిత్రలోకెక్కే విజయాన్ని సాధించింది. ముందుగా నేపాల్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 148 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ పౌడెల్ (35 బంతుల్లో 38; 3 ఫోర్లు, 1 సిక్స్), కుశాల్ మల్లా (21 బంతుల్లో 30; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. హోల్డర్ 4, నవిన్ బిడైసి 3 వికెట్లు తీశారు. అనంతరం సులువైన ప్రత్యర్థిపై సులువైన లక్ష్యాన్ని కరీబియన్ జట్టు ఛేదించలేక... 20 ఓవర్లలో 9 వికెట్లకు 129 పరుగులకే పరిమితమైంది. 10 మంది బ్యాటింగ్‌కు దిగితే ఒక్కరు కూడా మూడు పదుల స్కోరు చేయలేకపోయారు. ఒకే ఒక్కడు నవిన్ బిడైసి (22) ఇరవై పైచిలుకు స్కోరు చేశాడు. మిగతా అందరూ మూకుమ్మడిగా విఫలమయ్యారు. నేపాల్ బౌలర్లు కుశాల్ భుర్టెల్ (2) వికెట్లు తీయగా, దీపేంద్ర, కరణ్, నందన్, లలిత్, రోహిత్ తలా ఒక వికెట్ తీసి విండీస్‌ను ఓడించారు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో నేపాల్ 1-0తో ఆధిక్యంలో ఉండగా... నేడు ఇరు జట్ల మధ్య రెండో టి20 జరుగుతుంది.


ముంబైలోని 79వ నార్త్ బాంబే దుర్గాపూజ మంటపంలో జరిగిన పూజల్లో పాల్గొన్న బాలీవుడ్ నటులు రాణి ముఖర్జీ, కాజోల్


పశ్చిమబెంగాల్‌లోని నదియాలో దిఘాస్ జగన్నాథుని ఆలయం ఇతివృత్తంగా ఏర్పాటైన దుర్గా పూజ మంటపం


బెంగాల్‌లోని నదియాలో వాటికన్‌సిటీలోని సెయింట్ బసిలికా మాదిరిగా ఏర్పాటైన దుర్గా పూజ మంటపం


'ఆపరేషన్ సిందూర్' ఇతివృత్తంగా కోల్‌కతాలోని సంతోష్ మిత్రా స్క్వేర్ వద్ద ఏర్పాటైన దుర్గ మంటపం


ప్రముఖ సినీ దర్శక నిర్మాత రిత్విక్ ఘటక్ చిత్రాలే ఇతివృత్తంగా కోల్‌కతాలోని పూజా మంటపం


కోల్‌కతాలో దుర్గా పూజ మంటపంలో ఏర్పాటైన దుర్గామాత విగ్రహం


బెంగాలీ రచయిత శరదిందు సృష్టించిన బ్యోమకేశ్ బక్షి అనే కల్పిత డిటెక్టివ్ పాత్ర ఇతివృత్తంగా కోల్‌కతాలో రూపుదిద్దుకున్న దుర్గ మంటపం

సీఆర్పీఎఫ్ వల్లే లేహ్‌లో హింస

బలగాల టియర్‌గ్యాస్ ప్రయోగంతో రాళ్లు రువ్విన యువత

- సోనమ్ వాంగ్‌చుక్ హింసావాదాన్ని కలలో కూడా ఊహించలేదు
- పాక్‌తో ఆయనకు సంబంధాలు అంటగట్టడం అత్యంత దారుణం
- ఐదేళ్లుగా ఆయన లద్దాఖ్ కోసం గాంధీమార్గంలో పోరాడుతున్నారు
- జాతీయ భద్రతా చట్టం కింద ఆయనపై కేసు పెట్టడం దుర్మార్గం
- సోనమ్ అరెస్టుపై ఇప్పటివరకు మాకు సమాచారం కూడా ఇవ్వలేదు
- వాంగ్‌చుక్ సతీమణి గీతాంజలి ఆంగ్మో మండిపాటు

లేహ్: కేంద్రపాలిత ప్రాంతం లద్దాఖ్‌కు రాష్ట్ర హోదాతోపాటు దానిని రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్‌చేస్తూ ఐదేళ్లుగా శాంతియుత పోరాటం చేస్తున్న పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్‌వాంగ్‌చుక్‌కు పాకిస్తాన్‌తో సంబంధాలు అంటగట్టడం దారుణమని ఆయన సతీమణి గీతాంజలి ఆంగ్మో మండిపడ్డారు. లేహ్‌లో ఈ నెల 24న చోటుచేసుకున్న హింసకు సీఆర్పీఎఫ్ బలగాలే కారణమని ఆరోపించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఉద్యమకారులపైకి సీఆర్పీఎఫ్ బలగాలు భాష్పవాయు గోళాలు ప్రయోగించటంతో ఆగ్రహించిన యువత రాళ్లు రువ్విందని తెలిపారు. సోనమ్ వాంగ్‌చుక్ రెచ్చగొట్టడం వల్లే హింస చెలరేగిందన్న పోలీసుల వాదనను ఆమె తోసిపుచ్చారు. నాటి హింస, తర్వాతి పరిణామాలపై గీతాంజలి ఆంగ్మో ఆదివారం మీడియాతో మాట్లాడారు. వాంగ్‌చుక్ కలలో కూడా హింసాత్మక ఉద్యమాన్ని ఊహించలేదని తెలిపారు. ఈ నెల 24న చెలరేగిన హింసలో నలుగురు మరణించగా, 90 మంది గాయపడ్డారు. ఈ ఘటనకు వాంగ్‌చుక్ రెచ్చగొట్టే ప్రసంగమే కారణమని లద్దాఖ్ డీజీపీ ఎస్‌డీ సింగ్ జమ్‌వాల్ ఆరోపించారు.

ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన కేంద్ర ప్రభుత్వం.. వాంగ్‌చుక్‌ను అత్యంత కఠినమైన జాతీయ భద్రతా చట్టం (ఎన్‌ఎస్‌ఏ) కింద అరెస్టు చేసి రాజస్తాన్‌లోని జోధ్‌పూర్ జైలుకు పంపింది. వారి స్వచ్ఛంద సంస్థ హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్ లెర్నింగ్ (హెచ్‌ఐఏఎల్) లైసెన్స్‌ను కూడా రద్దుచేసింది. ఎన్‌ఎస్‌ఏ కింద అరెస్టు చేస్తే ఎలాంటి విచారణ లేకుండా 12 నెలలపాటు జైల్లో నిర్బంధించవచ్చు.

నా భర్తతో మాట్లాడనివ్వటం లేదు

వాంగ్‌చుక్‌ను అరెస్టు చేసిన నాటి నుంచి ఆయనతో కనీసం మాట్లాడేందుకు కూడా పోలీసులు తనకు అనుమతి ఇవ్వటం లేదని గీతాంజలి ఆరోపించారు. 'సోనమ్ వాంగ్‌చుక్ నిర్బంధ ఆదేశాల కాపీని శుక్రవారం నాకు అందజేస్తామని హామీ ఇచ్చారు. కానీ, ఇవ్వలేదు. దీనిపై మేము న్యాయపోరాటం చేస్తాం. పాకిస్తాన్‌లో ఇటీవలి మా పర్యటన పూర్తిగా వృత్తిగతమైనది, పర్యావరణ పరమైనది. వాంగ్‌చుక్ విదేశీ పర్యటనలన్నీ అంతర్జాతీయంగా ఎంతో పేరు ప్రతిష్ఠలు కలిగిన యూనివర్సిటీలు, సంస్థలు పంపిన ఆహ్వానాల మేరకే జరిగాయి. వాతావరణ మార్పులపై పాకిస్తాన్‌లో ఐక్యరాజ్యసమితి విభాగం నిర్వహించిన సమావేశానికి మేం హాజరయ్యాం. ఆ సదస్సును నిర్వహించిన సంస్థలు ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ మౌంటెయిన్ డెవలప్‌మెంట్ (ఐసీఐఎంఓడీ) సంస్థకు సంబంధించినవే. ఈ సంస్థలో హిందూకుష్ పర్వతాలతో ముడిపడి ఉన్న 8 దేశాలైన భారత్, నేపాల్, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్, భూటాన్, చైనా, మయన్మార్, బంగ్లాదేశ్ సభ్యులుగా ఉన్నాయి. పర్యావరణ మార్పులలో మహిళల పాత్రపై పరిశోధన పత్రం సమర్పించేందుకు నేను ఆ సదస్సుకు వెళ్లాను. ఆ సదస్సులో ప్రధాని మోదీని వాంగ్‌చుక్ ఎంతో పొడిగారు. సోనమ్ వాంగ్‌చుక్‌పై ఎన్‌ఎస్‌ఏను ప్రయోగించటం దారుణం.



ఆయన ఎన్నడూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పని చేయలేదు. ఆయన ఎప్పుడూ గాంధీమార్గంలోనే ఉద్యమం నడిపారు. 24న హింస చెలరేగటానికి ముందు విద్యార్థులు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వీడియోలు మా వద్ద ఉన్నాయి. ఆ సమయంలో సీఆర్పీఎఫ్ కాల్పులు జరపటానికి ఎవరు అనుమతి ఇచ్చారు? మీ సొంత ప్రజలపై, యువతపై కాల్పులు ఎందుకు జరిపారు? ఆ రోజు ఆయన ఎవరినీ రెచ్చగొట్టలేదు. మార్పు అనేది ఒక వ్యక్తితోనో, ఒకరి మరణం వల్లనో ప్రారంభమవుతుంది. బహుశా ప్రాణాలు అర్పించే ఆ ఒక్క వ్యక్తిని నేనే కావచ్చు. ఈ ఉద్యమంకోసం సంతోషంగా నా ప్రాణాలర్పిస్తాను అని వాంగ్‌చుక్ చెప్పారు. కానీ, ఆయన మాటలను వక్రీకరించారు. అయినా, భారత సైన్యానికి షెల్టర్ల కోసం, చైనా వస్తువుల బహిష్కరణకు ఉద్యమిస్తున్న వ్యక్తిని దేశద్రోహి అని ఎలా అంటారు?' అని గీతాంజలి ప్రశ్నించారు. ఎహెచ్‌ఐఏఎల్ సంస్థ అక్రమంగా విదేశీ విరాళాలు స్వీకరిస్తోందన్న ఆరోపణలను ఆమె ఖండించారు. విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్‌ఏ) అనుమతి మేరకే విరాళాలు సేకరిస్తున్నామని స్పష్టం చేశారు.

చైనా మాజీ మంత్రికి మరణ శిక్ష రద్దు... రెండేళ్ల జైలు

బీజింగ్: లంచం తీసుకున్నారనే ఆరోపణలపై మరణశిక్ష ఎదుర్కొంటున్న చైనా అధికార కమ్యూనిస్ట్ పార్టీ నేత, మాజీ వ్యవసాయ, గ్రామీణ వ్యవహారాల శాఖ మంత్రి టంగ్ రెంజియన్‌కు కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. 2007-2024 వివిధ హోదాల్లో పనిచేసి, అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించింది. సుమారు రూ.336 కోట్ల మేర లంచాలు తీసుకున్నారని తెలిపింది. అయితే, తన ఆస్తులతోపాటు, అక్రమంగా సంపాదించిన సొత్తును సైతం ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించారని, విచారణకు పూర్తిస్థాయిలో సహకరించారని కోర్టు తెలిపింది. పశ్చాత్తాపం వ్యక్తం చేసినందున ఆయనకు మరణ శిక్షను రద్దు చేస్తూ రెండేళ్ల జైలు శిక్ష విధిస్తున్నట్లు పేర్కొంది. జిలిన్ ప్రావిన్స్‌లోని చంగ్‌చున్ పీపుల్స్ కోర్ట్ ఆదివారం ఈ మేరకు తీర్పు వెలువరించింది. 2012లో జిన్‌పింగ్ అధికార పగ్గాలు చేపట్టాక అవినీతి ఆరోపణలునన కనీసం 10 లక్షల మంది అధికారులకు శిక్షలుపడ్డాయి. వీరిలో కమ్యూనిస్ట్ పార్టీ అగ్ర నేతలు సైతం పదుల సంఖ్యలో ఉన్నారు.

12 మంది భారత జాలర్లను అరెస్ట్ చేసిన శ్రీలంక

కొలంబో: శ్రీలంక ఉత్తర ప్రాంతంలోని జాఫ్నా వద్ద ఆదివారం ఆ దేశ నేవీ 12 మంది భారతీయ జాలర్లను అరెస్ట్ చేయడంతోపాటు, వారి బోటును స్వాధీనం చేసుకుంది. ఆదివారం ఉదయం శ్రీలంక ప్రాదేశిక జలాల్లో డెల్ఫ్‌ట్ దీవి పక్కన అక్రమంగా చేపలు పడుతుండగా పట్టుకున్నామని నేవీ ఒక ప్రకటనలో తెలిపింది. కంకసేతురై హార్బర్‌కు మత్స్యకారులతోపాటు బోటును తరలించామంది. భారత్–శ్రీలంక ద్వైపాక్షిక సంబంధాలలో మత్స్యకారుల అంశం వివాదాస్పదంగా మారింది. శ్రీలంక నేవీ పాక్ జలసంధిలో భారత మత్స్యకారులపై కాల్పులు జరిపి, వారి పడవలను స్వాధీనం చేసుకోవడం పరిపాటిగా మారింది.

ఇరాన్‌పై ఐరాస మళ్లీ ఆంక్షలు

పదేళ్ల తర్వాత 'స్నాప్‌బ్యాక్'

- అణు కార్యక్రమంపై వెనక్కి తగ్గనందుకే..
- ప్రతిచర్య తప్పదంటున్న ఇస్లామిక్ రిపబ్లిక్

దుబాయ్: ఇరాన్ అణు కార్యక్రమం కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి మళ్లీ ఆ దేశంపై పూర్తి స్థాయి ఆంక్షలను విధించింది. ఇప్పటికే ఆ దేశ ప్రజలు సంపాదించిందంతా ఆహారం కోసమే ఖర్చు పెడుతూ, భవిష్యత్తుపై ఆందోళన చెందుతుండగా వారిపై ఆంక్షల వల మళ్లీ పడింది. అణు కార్యక్రమాన్ని వదిలేయాలంటూ చిట్టచివరి నిమిషంలో ఐరాసలో జరిగిన దౌత్య చర్చలు విఫలం కావడంతో ఆదివారం రాత్రి 8 గంటల సమయం నుంచి ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. దీనిఫలితంగా, విదేశాల్లో ఉన్న ఇరాన్ ఆస్తులు ఫ్రీజ్ అవుతాయి. ఇరాన్ కుదుర్చుకున్న ఆయుధ ఒప్పందాలూ ఆగిపోతాయి. ఇరాన్ తన బాలిస్టిక్ క్షిపణి అభివృద్ధి కార్యక్రమాన్ని కొనసాగించాలని చూస్తే మరిన్ని ఆంక్షలు మోపే ప్రమాదముంది. ఈ ఆంక్షలు 'స్నాప్‌బ్యాక్'గా (స్వయంచాలికంగా–ఆటోమేటిక్)గా అమల్లోకి వస్తాయి. దీని వల్ల, ఇరాన్‌పై విధించిన ఇతర ఆంక్షల మాదిరిగా చైనా, రష్యాలు భద్రతామండలిలో వీటిని వీటో చేయడం కుదరదు. అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, యూకేలతో ఇరాన్ 2015లో కుదుర్చుకున్న అణు ఒప్పందంలో ఈ షరతులన్నీ ఉన్నాయి. జూన్‌లో ఇజ్రాయెల్‌తోపాటు అమెరికా తమ అణు కేంద్రాలపై దాడి చేసిన నేపథ్యంలో ఇరాన్ అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ)నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించింది. ఇప్పటికీ ఆ దేశం వద్ద 60% శుద్ధి చేసిన యురేనియం నిల్వలున్నాయి. 90% శుద్ధి చేసిన యురేనియంతో బాంబులను తయారు చేసే సామర్థ్యం ఇరాన్ సొంతమవుతుంది. తమ అణు కార్యక్రమం శాంతియుత అవసరాలకేనంటూ ఇరాన్ చెబుతున్నా అమెరికా, పశ్చిమదేశాలు అనుమానిస్తున్నాయి. నెల రోజుల క్రితమే స్నాప్‌బ్యాక్‌ను ప్రయోగిస్తామంటూ ఫ్రాన్స్, జర్మనీ, యూకేలు హెచ్చరించాయి. అయినప్పటికీ ఇరాన్ ఐఏఈఏ పరిశీలకులను అణు కేంద్రాల్లో తనిఖీలకు అనుమతించేందుకు అంగీకరించలేదు. శుద్ధి చేసిన యురేనియం నిల్వల గురించిన సవివర నివేదికను ఐఏఈఏకు పంపలేదు. దీంతో ఆంక్షలు అనివార్యమయ్యాయని పశ్చిమ దేశాలంటున్నాయి. శాంతియుత ప్రయోజనాల కోసమైతే యురేనియంను 60 శాతం వరకు శుద్ధి చేయాల్సిన అవసరం లేదు కదా అని ప్రశ్నిస్తున్నాయి.

ఎన్‌పీటీ నుంచి వైదొలిగే యోచన

ఐరాస ఆంక్షలు అమల్లోకి రావడంతో ఇరాన్ ప్రతీకార చర్యలపై తీవ్ర సమాలోచనలు చేస్తోంది. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం(ఎన్‌పీటీ) నుంచి వైదొలిగే ప్రతిపాదనను ఇరాన్ పార్లమెంట్ పరిశీలించే అవకాశాలున్నాయని ఎక్కువగా ఉన్నాయని స్పీకర్ మహ్మద్ బఘెర్ కలిబాఫ్ తెలిపారు. ఆంక్షలను ఆయన అన్యాయమన్నారు. ఎన్‌పీటీ నుంచి వైదొలగడం ద్వారా అణు బాంబును తయారు చేసే అవకాశాలున్నాయన్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. అమెరికా ట్రంప్ హయాంలో 2018లో అణు ఒప్పందం నుంచి ఏకపక్షంగా వైదొలిగినందున యూరప్ దేశాలైన యూకే, జర్మనీ, ఫ్రాన్స్‌లకు స్నాప్‌బ్యాక్ అమలు చేసే అర్హత లేదని ఆయన తెలిపారు. అయితే, ఇరాన్‌కు దౌత్య మార్గాలు తెరిచే ఉన్నాయని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో తెలిపారు. ఇందుకోసం ముందుగా ఇరాన్ తమతో నేరుగా చర్చలకు రావాలని ఆయన స్పష్టం చేశారు. ఐఏఈఏ నుంచి వైదొలగడం ఇరాన్ తీవ్రమైన తప్పిదమని, ఇదే సాకుతో అమెరికా, ఇజ్రాయెల్‌లు ఆ దేశంపై మళ్లీ దాడులకు దిగే ప్రమాదముందని విశ్లేషకులు అంటున్నారు.

మాది విశేషమైన బంధం

- భారత్ విదేశాంగ విధానాలను గౌరవిస్తాం
- అమెరికాతో ఇండియా సంబంధం మాకు ప్రామాణికం కాదు
- ఐరాస సభలో రష్యా మంత్రి లావ్‌రోవ్ స్పష్టీకరణ

ఐక్యరాజ్యసమితి: భారతదేశ ప్రయోజనాలను, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరించే స్వతంత్ర విదేశాంగ విధానాలను తాము సంపూర్తిగా గౌరవిస్తామని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్ పేర్కొన్నారు. అమెరికాతోగానీ మరే ఇతర దేశంతోగానీ భారత్ సంబంధాలు, భారత్, రష్యాల మధ్య సంబంధాలకు ప్రామాణికం కావని స్పష్టం చేశారు. భారత్, రష్యాలు విశేషమైన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయన్నారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ఆయన ఈ మేరకు విస్పష్టంగా ప్రకటించారు. అమెరికా లేదా మరే ఇతర దేశంతో భారత్ సంబంధాల్లో ఏర్పడే ఉద్రిక్తతల ప్రభావం భారత్–రష్యాల మధ్య పడబోదని లావ్‌రోవ్ తెలిపారు. అంతకుముందు, ఆయన మీడియాతో మాట్లాడారు. రష్యా ఆయిల్ కొనరాదంటూ భారత్‌పై అమెరికా చేస్తున్న ఒత్తిడుల నేపథ్యంలో ఆయన పైవిధంగా వ్యాఖ్యానించారు. 'అమెరికాతో సంబంధాలను గురించి భారతీయ మిత్రులను అడగను. ఇలాంటి విషయాలపై స్వయంగా తీసుకోగల సామర్థ్యం వారికి ఉంది' అని ఆయన అన్నారు. 'అమెరికా ఒక వేళ మాకు చమురు విక్రయించాలనుకుంటే ఆ విషయంలో ఆ దేశంతో సంప్రదింపులకు మేం సిద్ధం. అంతేతప్ప, ఇతర దేశాల నుంచి మేం ఏం కొనాలి, రష్యాతో ఏం కొనాలి, ఏం కొనకూడదు అనేవి మా సొంత విషయం. దీనికి భారత్–అమెరికా అజెండాతో సంబంధం లేదు' అని అమెరికాకు బదులిచ్చినట్లు జై శంకర్ నాతో అన్నారు. ఆయనది చాలా సరైన సమాధానం, ఆత్మగౌరవాన్ని నిలబెట్టే అంశం' అని లావ్‌రోవ్ వివరించారు. రెండు దేశాల మధ్య ఉన్న తస్థాయి సంబంధాలు సాధారణంగానే కొనసాగుతున్నాయన్నారు. ఈ విషయంలో ఎటువంటి ఇబ్బందీ కలగలేదని తెలిపారు. ఇటీవల చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) సమావేశాల సమయంలో తమ అధ్యక్షుడు పుతిన్, ప్రధాని మోదీ సమావేశమైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అధ్యక్షుడు పుతిన్ డిసెంబర్‌లో భారత్‌లో పర్యటించే అవకాశాలున్నాయని లావ్‌రోవ్ వెల్లడించారు. వాణిజ్యం, సైనిక, సాంకేతిక సహకారం, ఆర్థిక, మానవీయ అంశాలు, ఆరోగ్యం, హైటెక్, కృత్రిమ మేధ వంటి అంశాల్లో ద్వైపాక్షిక సంబంధాలతోపాటు, ఎస్‌సీవో, బ్రిక్స్ వంటి అంతర్జాతీయ వేదికలపై రెండు దేశాల మధ్య సన్నిహిత సహకారం కొనసాగుతోందన్నారు. ఐరాస సమావేశాలకు హాజరైన భారత విదేశాంగ మంత్రి జై శంకర్‌తోనూ లావ్‌రోవ్ భేటీ అయ్యారు. బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రులతో భేటీ అయ్యారు.

వియత్నాంకు బ్వాలోయి తుఫాను ముప్పు

హనోయి: వియత్నాం ప్రభుత్వం ఆదివారం బ్వాలోయి తుఫాను భయంతో వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. ఊహించిన దానికంటే వేగంగా తుఫాను రావచ్చన్న హెచ్చరికల నేపథ్యంలో తీరప్రాంతాల్లోని నాలుగు విమానాశ్రయాలను సైతం ముందు జాగ్రత్తగా మూసివేసింది. గంటకు 133 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, సముద్రంలో అలలు మీటరు ఎత్తున ఎగసిపడే ప్రమాదముందని వాతావరణ శాఖ తెలిపింది. ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదముందని పేర్కొంది. దీంతో, మత్స్యకారులను సముద్రంలోకి వెళ్లవద్దని హెచ్చరికలు జారీ అయ్యాయి. ఉత్తర, సెంట్రల్ ప్రాంతాల్లోని ప్రజలను ఖాళీ చేయించేందుకు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. బ్వాలోయి తీవ్రతకు ఫిలిప్పీన్స్‌లో శుక్రవారం 20 మంది ప్రాణాలు కోల్పోయారు. ఫిలిప్పీన్స్ ప్రభుత్వం 1,400 అత్యవసర షెల్టర్లను ఏర్పాటు చేసి 23 వేల కుటుంబాలను వాటిలోకి తరలించింది. ఇటీవలి రాగస తర్వాత ఈ వారంలో ఆసియాలో ముంచుకొచ్చిన రెండో తుఫాను బ్వాలోయి.

66 వేలు దాటిన గాజా మరణాలు

కైరో: ఇజ్రాయెల్–హమాస్ పోరుతో ఇప్పటి వరకు 66 వేల మందికి పైగా పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారని గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. ఆదివారం నుసెయిరత్ శరణార్థి శిబిరంలోని రెండు నివాసాలపై జరిగిన వైమానిక దాడుల్లో కనీసం 10 మంది చనిపోయారంది. అంతే కాకుండా, గడిచిన 24 గంటల్లో వివిధ ఆస్పత్రులకు మరో 79 మృతదేహాలను సహాయక సిబ్బంది తరలించారని వివరించింది. దీంతో, 2023 అక్టోబర్ 7న హమాస్ దాడి జరిగాక ఇజ్రాయెల్ సాగిస్తున్న దాడులు, కాల్పులతో ఇప్పటి వరకు మృత్యువాతపడిన వారి సంఖ్య 66,605కు, క్షతగాత్రుల సంఖ్య 1,68,162కు చేరిందని పేర్కొంది. బాధితుల్లో సగం మందికి పైగా మహిళలు, చిన్నారులేనని తెలిపింది. భవనాల కూల్చివేత, పేలుళ్లు శనివారం రాత్రంతా కొనసాగాయని గాజా నగరంలో షిఫా ఆస్పత్రి పక్కన ఆశ్రయం పొందుతున్న సయ్యద్ బకెర్ తెలిపారు. అయితే, గత 24 గంటల వ్యవధిలో హమాస్‌కు చెందిన 140 మిలటరీ లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ తెలిపింది. ఇజ్రాయెల్ సాగిస్తున్న తీవ్ర విధ్వంసం కారణంగా గాజాలోని 90 శాతం మంది జనాభాకు నిలువ నీడ కరువైంది. నీరు, ఆహారం, వైద్య సౌకర్యాలను ఇజ్రాయెల్ ఆర్మీ నిరాకరించడంతో ఆ ప్రాంతంలో తీవ్ర కరువు, ఆకలిచావులతో మానవీయ సంక్షోభం ఏర్పడింది.

బిహార్ సహా పలు రాష్ట్రాలకు 470 మంది పరిశీలకులు

320 మంది ఐఏఎస్, 60 మంది ఐపీఎస్‌లను నియమించనున్న ఈసీ

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్ శాసనసభ సాధారణ ఎన్నికలు, తెలంగాణ సహా 7 రాష్ట్రాల్లోని 8 అసెంబ్లీ స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీ) పటిష్టమైన ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు 470 మంది సీనియర్ అధికారులను రంగంలోకి దింపుతోంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324, ప్రజాప్రాతినిధ్య చట్టం–1951 ప్రకారం నియమితులయ్యే కేంద్ర పరిశీలకులు సాధారణ, ఉప ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు కమిషన్‌కు కళ్లూ చెవుల్లా వ్యవహరిస్తారు. క్షేత్రస్థాయి నివేదికలను నేరుగా ఈసీకి అందిస్తారు. సాధారణ (జనరల్), పోలీస్, వ్యయ (ఎక్స్‌పెండిచర్) విభాగాలుగా వీరు పనిచేస్తారు. ముఖ్యంగా అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై వ్యయ పరిశీలకులు ప్రత్యేక నిఘా ఉంచుతారు. ఈ బృందాల్లో 320 మంది ఐఏఎస్, 60 మంది ఐపీఎస్, 90 మంది ఐఆర్‌ఎస్/ఐఆర్‌ఏఎస్/ఐసీఏఎస్ తదితర ఉన్నతాధికారులు ఉంటారు. బిహార్ రాష్ట్ర అసెంబ్లీ సాధారణ ఎన్నికలు, తెలంగాణలోని జూబ్లీహిల్స్, జమ్మూకశ్మీర్‌లోని బుద్గాం, నౌగ్రోటా, రాజస్తానలోని అంటా, ఝార్ఖండ్‌లోని ఘాట్‌శిల, పంజాబ్‌లోని తరన్ తారన్, మిజోరంలోని దంప, ఒడిశాలోని నౌపడ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరగనున్నాయి.

బిహార్ ఎన్నికల తర్వాతే బీజేపీకి కొత్త అధ్యక్షుడు?

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్ ఎన్నికల ఫలితాల తర్వాతే బీజేపీకి కొత్త జాతీయ అధ్యక్షుడు రానున్నారు. వచ్చే ఏడాది జనవరిలో పార్టీ అధ్యక్షుడి పేరు ప్రకటించే అవకాముంది. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలను కమలదళం కీలకమైనవిగా భావిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో కొత్త అధ్యక్షుడిని ప్రకటిస్తే సంస్థాగత సమతుల్యత దెబ్బతింటుందని అధిష్టానం భావిస్తోంది. ఈ పరిస్థితుల్లో అధ్యక్షుడి మార్పు నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా, బిహార్ ఎన్నికల ఫలితాలు కొత్త అధ్యక్షుడి ఎంపికలో కీలకంగా మారనున్నాయి. సంస్థాగతంగా, మంత్రి వర్గంలో రాష్ట్ర స్థాయిలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. జాతీయ అధ్యక్షుడి రేసులో ధర్మేంద్ర ప్రధాన్, భూపేంద్ర యాదవ్, శివరాజ్ సింగ్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అయితే, అభ్యర్థి ఎంపికపై ఇప్పటికే ప్రధాని మోదీ, ఆర్‌ఎస్‌ఎస్ ఏకాభిప్రాయానికి వచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

బిహార్ ఎన్నికలతోపాటే నౌపడా బైపోల్: ఈసీ

భువనేశ్వర్: నవంబర్‌లో జరిగే బిహార్ అసెంబ్లీ ఎన్నికలతోపాటే ఒడిశాలోని నౌపడా అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరిగే అవకాశం ఉందని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆదివారం తెలిపింది. బిహార్ ఎన్నికలతోపాటు ఏడు రాష్ట్రాల్లో ఉప ఎన్నికలకు జాతీయ ఎన్నికల సంఘం పరిశీలకులను ప్రకటించింది. ఈ సందర్భంగా ఉప ఎన్నికలపై స్పష్టత ఇచ్చింది. నౌపడా సిట్టింగ్ బీజేడీ ఎమ్మెల్యే రాజేంద్ర ధొలాకియా ఈ నెల 8న మరణించటంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఆయన నవీన్ పట్నాయక్ కేబినెట్‌లో 2022–24 మధ్య మంత్రిగా పనిచేశారు.

అమెరికా బార్‌లో కాల్పులు ; ముగ్గురు మృతి

సౌత్‌పోర్ట్ (యూఎస్): అమెరికాలోని నార్త్ కరోలినాలో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు జరిపిన కాల్పుల్లో ముగ్గరు వ్యక్తులు మరణించారు. 8 మంది గాయపడ్డారు. సముద్రతీర ప్రాంతంలో ఉన్న ఓ బార్‌లో ఈ కాల్పులు జరిగాయి. స్థానిక కాలమానం ప్రకారం శనివారం రాత్రి 9.30 గంటల సమయంలో కాల్పులు జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఒక చిన్న బోటులో వచ్చిన దుండగుడు ఒడ్డున దాని నిలిపి కాల్పులు జరిపి తిరిగి అందులోనే వేగంగా వెళ్లిపోయినట్లు చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి ఒక అనుమానితుడిని అమెరికా కోస్ట్ గార్డ్ అరెస్టు చేసింది. కాల్పులకు గల కారణాలు ఇంకా తెలియలేదని పోలీసులు చెప్పారు.

అస్సాంలో నలుగురు దొంగల కాల్చివేత

గోల్‌పారా (అస్సాం): అస్సాంలోని గోల్‌పారాలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు దొంగలు మరణించారు. ఫిలాదుబి ప్రాంతంలో కొన్నిరోజులుగా సాయుధ నేర ముఠా సంచరిస్తోందన్న సమాచారంతో గాలింపు చేపట్టగా చెక్‌పాయింట్ వద్ద కారులో వస్తున్న దొంగలు పోలీసులను చూసి కాల్పులు జరిపారని, పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో నలుగురు తీవ్రంగా గాయపడ్డారని, వారిని సమీప ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారని గోల్‌పారా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నబనీత్ మహంత తెలిపారు. వీరిపై దోపిడీలు, కిడ్నాప్‌లు, నేర కార్యకలాపాల కేసులు ఉన్నట్లు చెప్పారు. వారి నుంచి నాలుగు పిస్తోళ్లు, ఐదు మొబైల్ ఫోన్లు, రెండు వాకీటాకీలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

శబరిమల ద్వారపాలక పీఠం ఆచూకీ దొరికింది

పథనంతిట్ట: శబరిమల ఆలయ ద్వార పాలకపీఠాల్లో కనిపించకుండా పోయిన మరో బంగారు పూత పూసిన వెండి పీఠాన్ని కనుగొన్నారు. ట్రావెన్‌కోర్ దేవస్వోమ్ బోర్డు(టీడీబీ) విజిలెన్స్ అధికారులు శనివారం తిరువనంతపురంలోని వెంజరమూడులో ఉన్న ఉన్నికృష్ణన్ పొట్టి అనే స్పాన్సర్ బంధువు ఇంట్లో ఉండగా స్వాధీనం చేసుకున్నారు. శబరిమల ఆలయానికి కానుకగా అందజేసిన పీఠం కనిపించడం లేదంటూ 2019లో పొట్టి ఆరోపించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీనిపై దర్యాప్తు చేపట్టాలని కేరళ హైకోర్టు ఆదేశించింది. అప్పట్లో టీడీబీ స్ట్రాంగ్ రూంలో వెతగ్గా కనిపించలేదు. ఇటీవల హైకోర్టు ఈ విషయాన్ని ప్రస్తావించడంతో మరోసారి కదలిక వచ్చింది. శనివారం పీఠాన్ని స్వాధీనం చేసుకుని, శబరిమలకు తరలించినట్లు విజిలెన్స్ విభాగం తెలిపింది. హైకోర్టుకు ఈ విషయం తెలియజేస్తామంది.

విద్య, ఉద్యోగ సమాచారం

జాయింట్ సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ డిసెంబర్-2025

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) సీఎస్ఐఆర్-యూజీసీ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) డిసెంబర్–2025 నోటిఫికేషన్ విడుదల చేసింది. సైన్స్ విభాగాల్లో పరిశోధన, బోధనకు అవకాశం కల్పించే జేఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం, పీహెచ్‌డీ ప్రవేశాల కోసం ఈ పరీక్ష నిర్వహిస్తారు.

» సబ్జెక్టులు: కెమికల్ సైన్సెస్, ఎర్త్, అట్మాస్ఫియరిక్,ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్,లైఫ్ సైన్సెస్, మ్యాథమేటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్.
» అర్హత: కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: జేఆర్ఎఫ్‌కు సంబంధించి జనరల్ కేటగిరి అభ్యర్థులకు డిసెంబర్ 2025 నాటికి 30 ఏళ్లు మించకుండా ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/మహిళా అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ(నాన్‌క్రిమిలేయర్)లకు మూడేళ్ల గరిష్ట వయో సడలింపు వర్తిస్తుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్/పీహెచ్‌డీ ప్రవేశాలకు గరిష్ఠ వయో పరిమితి నిబంధన లేదు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 25.09.2025.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 24.10.2025
» ఫీజు చెల్లించడానికి చివరితేది: 25.10.2025.
» దరఖాస్తు సవరణ తేదీలు: 27.10.2025 నుంచి 29.10.2025 వరకు
» పరీక్ష తేది: 18.12.2025.
» వెబ్‌సైట్: https://csirnet.nta.nic.in

జవహర్ నవోదయ విద్యాలయాల్లో తొమ్మిదో తరగతి ప్రవేశాలు

దేశవ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయ (జేఎన్‌వీ)ల్లో తొమ్మిదో తరగతి లేటరల్ ఎంట్రీ ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపికచేస్తారు.

» అర్హత: విద్యార్థి తప్పనిసరిగా జవహర్ నవోదయ విద్యాలయం ఉన్న సంబంధిత జిల్లాల్లో నివాసి అయి ఉండాలి. 2025–26 విద్యా సంవత్సరంలో ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు.
» వయసు: 01.05.2011 నుంచి 31.07.2013 మధ్య జన్మించి ఉండాలి.
» ఎంపిక విధానం: ప్రవేశ పరీక్ష ద్వారా.
» పరీక్ష విధానం: మొత్తం 100 మార్కులకు 100 ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లిష్, హిందీ, సైన్స్, మ్యాథ్‌మేటిక్స్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష మాధ్యమం ఇంగ్లిష్, హిందీ ఉంటుంది. పరీక్ష సమయం 2.30 గంటలు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 07.10.2025
» ప్రవేశ పరీక్ష తేది: 07.02.2026.
» వెబ్‌సైట్: www.navodaya.gov.in

ఏపీ సీఆర్‌డీఏలో వివిధ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీసీఆర్‌డీఏ).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 05.
» పోస్టుల వివరాలు: టీమ్ లీడర్ అప్లికేషన్ సపోర్ట్–01, సీనియర్ ఐసీటీ కన్సల్టెంట్ అప్లికేషన్ సపోర్ట్–01, ఐసీటీ ఎగ్జిక్యూటివ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ అప్లికేషన్ సపోర్ట్–01, ఎంఐఎస్ ఆపరేటర్–02.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 30.09.2025
» పనిచేయాల్సిన ప్రదేశం: ఏపీసీఆర్‌డీఏ, విజయవాడ, అమరావతి.
» వెబ్‌సైట్: https://crda.ap.gov.in

జీఎంసీ శ్రీకాకుళంలో 41 పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లాలో గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్(జీఎంసీ)లో.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 41.
» పోస్టుల వివరాలు: అటెండర్–01, బుక్ బేరర్–01, ల్యాబ్ అటెండెంట్–01, అసిస్టెంట్ లైబ్రేరియన్–01, ఈసీజీ టెక్నీషియన్–02, కార్పెంటర్–01, డేటా ఎంట్రీ ఆపరేటర్–01, ఎంఎన్‌వో–06, ఎఫ్ఎన్‌వో–04, నర్సింగ్ ఆర్డర్లీ–08, థియేటర్ అసిస్టెంట్–03, ఆఫీస్ అటెండెంట్–04, డ్రెస్సర్–01, ఎస్‌టీ బేరర్–01,డ్రైవర్(ఎల్ఎంవీ)–05,వెహికల్ క్లీనర్–01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, డిప్లొమా, బీఎల్ఐబీ, పదోతరగతి, పీజీ డిప్లొమా, ఎంఎల్ఐబీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 18 నుంచి 24 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు పోస్టులను అనుసరించి రూ.15,000 నుంచి రూ.27,045.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్‌ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ అండ్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, శ్రీకాకుళం జిల్లా చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 01.02.2025.
» వెబ్‌సైట్: https://srikakulam.ap.gov.in

ఢిల్లీలో పోలీస్ కొలువు

ఢిల్లీ పోలీస్ విభాగంలో కానిస్టేబుల్ (ఎగ్జిక్యూటివ్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. కేంద్ర ప్రభుత్వ నియామకాల సంస్థ స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. మొత్తం 7,565 ఉద్యోగ నియామకాలకు దరఖాస్తులు కోరుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న పురుషులు, మహిళలు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ కానిస్టేబుల్(ఎగ్జిక్యూటివ్) మేల్ అండ్ ఫిమేల్ ఇన్ ఢిల్లీ పోలీస్ ఎగ్జామినేషన్ 2025కు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» మొత్తం 7,565 కానిస్టేబుల్ పోస్టులకు ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్
» 10+2/ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులు పోటీపడొచ్చు
» దేశవ్యాప్తంగా ఉన్న మహిళా, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు
» సీబీఈ, పీఈ అండ్ ఎంటీ ద్వారా ఎంపిక ప్రక్రియ



స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ), ఢిల్లీ పోలీస్ సర్వీస్ సంయుక్తంగా కానిస్టేబుల్(ఎగ్జిక్యూటివ్) మేల్, ఫిమేల్ పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపడతాయి. అర్హతలున్న అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు.

- మొత్తం పోస్టుల సంఖ్య: 7,565

పోస్టుల వివరాలు

- కానిస్టేబుల్ (ఎగ్జిక్యూటివ్) పురుషులు–4,408, కానిస్టేబుల్ (ఎగ్జిక్యూటివ్) మహిళలు–2,496, కానిస్టేబుల్ (ఎగ్జిక్యూటివ్) పురుషులు (ఎక్స్ సర్వీస్‌మెన్–ఇతరులు)–285, కానిస్టేబుల్(ఎగ్జిక్యూటివ్) ఎక్స్‌సర్వీస్‌మెన్–కమాండోస్)–376

అర్హత

- 21.10.2025 నాటికి అభ్యర్థులు గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్మీడియెట్/10+2(సీనియర్ సెకండరీ) ఉత్తీర్ణులై ఉండాలి.
- ఢిల్లీ పోలీస్ సిబ్బంది కుమారులు/కుమార్తెలు, బ్యాండ్స్‌మెన్, బగ్లర్స్, మౌంటెడ్ కానిస్టేబుల్స్ తదితరులకు అర్హతలో సడలింపు ఉంటుంది.
- పురుష అభ్యర్థులు తప్పనిసరిగా పీఈ, ఎంటీ తేదీ నాటికి చెల్లుబాటు అయ్యే ఎల్ఎంవీ(మోటార్ సైకిల్ లేదా కారు) డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.
- రాష్ట్రీయ రక్షా యూనివర్సిటీలో డిగ్రీ లేదా పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా సర్టిఫికెట్ కలిగి ఉన్న వారు సదరు కోర్సుల్లో చూపిన ప్రతిభ ఆధారంగా 2 నుంచి 5% మార్కుల వెయిటేజీ పొందొచ్చు.

వయసు

01.07.2025 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

వేతనం

పే లెవెల్ 3 ప్రకారం– నెలకు రూ.21,700 నుంచి రూ.69,100 వేతన శ్రేణి లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

- కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీఈ), ఫిజికల్ ఎండ్యూరెన్స్,మెజర్‌మెంట్ పరీక్ష(పీఈ,ఎంటీ), మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- కంప్యూటర్ ఆధారిత పరీక్షలో ప్రతిభ చూపిన అభ్యర్థులకు మాత్రమే తదుపరి దశలో పీఎం, ఎంటీ నిర్వహిస్తారు. పీఈ, ఎంటీ అనేది అర్హత పరీక్ష మాత్రమే.
- సీబీఈ పరీక్ష ఫలితాలు వెల్లడించిన తర్వాత పీఈ, ఎంటీ పరీక్ష షెడ్యూల్‌ను ప్రకటిస్తారు. సీబీఈ పరీక్షను అనేక షిఫ్ట్‌ల్లో నిర్వహిస్తే నార్మలైజేషన్ ప్రక్రియను అనుసరిస్తారు.
- పీఈ, ఎంటీలో అర్హత సాధించిన అభ్యర్థులు కంప్యూటర్ ఆధారిత పరీక్షలో పొందిన స్కోర్ ఆధారంగా మెరిట్ లిస్ట్ రూపొందించి వైద్య పరీక్షలకు పిలుస్తారు. వైద్య పరీక్షల్లోనూ అర్హత సాధించిన వారికి తుది ఎంపిక చేపడతారు.

వంద మార్కులకు సీబీఈ పరీక్ష

- కంప్యూటర్ ఆధారితరాత పరీక్షను వంద ప్రశ్నలు–వంద మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో ఆబ్జెక్టివ్ తరహా మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. జనరల్ నాలెడ్జ్/కరెంట్ అఫైర్స్ నుంచి 50 ప్రశ్నలు–50 మార్కులకు, రీజనింగ్ నుంచి 25 ప్రశ్నలు–25 మార్కులకు, న్యూమరికల్ ఎబిలిటీపై 15 ప్రశ్నలు–15 మార్కులకు; కంప్యూటర్ ఫండమెంటల్స్, ఎంఎస్ ఎక్సెల్, ఎంఎస్ వర్డ్, కమ్యూనికేషన్, ఇంటర్నెట్, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ, వెబ్ బ్రౌసర్ తదితరాల నుంచి 10 ప్రశ్నలు–10 మార్కులకు అడుగుతారు.
- పరీక్ష వ్యవధి 90 నిమిషాలు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్/హిందీలో ఉంటుంది. ఈ పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది.
- ప్రతి పొరపాటు సమాధానానికి 0.25 మార్కు తగ్గిస్తారు.

సిలబస్-ప్రిపరేషన్ ఇలా..

- జనరల్ నాలెడ్జ్/కరెంట్ అఫైర్స్ విభాగంలో అడిగే ప్రశ్నలు తన చుట్టూ జరుగుతున్న తాజా పరిణామాలు, శాస్త్రసాంకేతిక రంగాల్లో మార్పులపై అభ్యర్థికి ఉన్న అవగాహనను పరిశీలించేలా ఉంటాయి. ఇందులో భారత్, పొరుగుదేశాలు, ముఖ్యంగా చరిత్ర, సంస్కృతి, జాగ్రఫీ, భారత ఆర్థిక వ్యవస్థ, జనరల్ పాలిటీ, రాజ్యాంగం, క్రీడలు, శాస్త్రపరిశోధనలపై ప్రశ్నలు అడిగే అవకాశముంది. ఈ విభాగంలో స్కోర్ కోసం జాతీయంగా, అంతర్జాతీయంగా జరుగుతున్న తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా స్కూల్ స్థాయి సైన్స్, సోషల్ పాఠ్యపుస్తకాలను అధ్యయనం చేయడం ద్వారా జనరల్ నాలెడ్జ్ పెంచుకోవాలి.
- రీజనింగ్ విభాగంలో నాన్ వెర్బల్ ప్రశ్నలు అడగడం ద్వారా అభ్యర్థి విశ్లేషణ సామర్థ్యాన్ని పరీక్షస్తారు. ఇందులో అనాలజీస్, సిమిలారిటీస్, డిఫరెన్సెస్, స్పాటియల్ విజువలైజేషన్, స్పాటియల్ ఓరియంటేషన్, విజువల్ మెమొరీ, డిస్క్రిమినేషన్, అబ్జర్వేషన్స్, రిలేషన్‌షిప్ కాన్సెప్ట్స్, అరిథమెటికల్ రీజన్స్, ఫిగరల్ క్లాసిఫికేషన్, అరిథమెటిక్ నంబర్ సిరీస్, నాన్ వెర్బల్ సిరీస్, కోడింగ్, డీకోడింగ్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఈ విభాగంలో మంచి మార్కులు సాధించేందుకు అభ్యర్థులు గత ప్రశ్నలను, మోడల్ ప్రశ్నలను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.
- న్యూమరికల్ ఎబిలిటీ విభాగంలో.. నంబర్ సిస్టమ్స్, హోల్ నంబర్స్, డెసిమల్స్, ఫ్రాక్షన్స్, రిలేషన్‌షిప్ బిట్వీన్ ద నంబర్స్, ఫండమెంటల్ అర్థమెటికల్ ఆపరేషన్స్, పర్సంటేజెస్, రేషియోస్ అండ్ ప్రపోర్షన్స్, యావరేజెస్, ఇంట్రస్ట్, ప్రాఫిట్ అండ్ లాస్, డిస్కౌంట్, మెన్సురేషన్, టైమ్ అండ్ డిస్టెన్స్, రేషియో అండ్ టైమ్, టైమ్ అండ్ వర్క్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇందులో రాణించేందుకు అభ్యర్థులు పదో తరగతి స్థాయి వరకూ గణితంపై పట్టు సాధించాలి. తొలుత స్కూల్ స్థాయి గణిత పాఠ్య పుస్తకాల ద్వారా ప్రాథమిక అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ఆ తర్వాత ప్రీవియస్ ప్రశ్నలతోపాటు సాధ్యమైనన్ని మోడల్ పేపర్స్ ప్రాక్టీస్ చేయాలి.
- కంప్యూటర్ ఫండమెంటల్స్, ఎంఎస్ ఎక్సెల్, ఎంఎస్ వర్డ్,కమ్యూనికేషన్, ఇంటర్నెట్, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ, వెబ్ బ్రౌసర్ విభాగం నుంచి అడిగే ప్రశ్నలు రోజువారీ కంప్యూటర్ వినియోగంపై అభ్యర్థి అవగాహనను పరీక్షించేలా ఉంటాయి. ఇందుకోసం ఎంఎస్ వర్డ్, ఎంఎస్ ఎక్సెల్ వాడకం, ఈమెయిల్ బేసిక్స్,పంపడం, రిసీవ్ చేసుకోవడం, వెబ్ బ్రౌజింగ్, ఇంటర్నెట్, సెర్చ్ ఇంజిన్స్, వీడియో కాన్ఫరెన్సింగ్, ఈ బ్యాంకింగ్ తదితర అంశాలను తెలుసుకోవాలి.

దరఖాస్తు ఫీజు

దరఖాస్తు ఫీజు రూ.100. ఎస్సీ, ఎస్టీ, ఎక్స్ సర్వీస్‌మెన్, మహిళలు, దివ్యాంగ అభ్యర్థులకు ఎలాంటి ఫీజు లేదు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 21.10.2025.
- దరఖాస్తు ఫీజు చెల్లించడానికి చివరితేది: 22.10.2025.
- దరఖాస్తు సవరణ తేదీలు: 29.10.2025 నుంచి 31.10.2025.
- కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష తేదీ: డిసెంబర్ 2025/జనవరి 2026
- వెబ్‌సైట్: https://ssc.gov.in

Where did he complete his education?



Question Tags

We use question tags to confirm the information. It is very small, may be contains 2 or 3 words. We write positive tag to negative statement and negative tag to positive statement.

Ex: Kiran is a doctor.

Question Tag: Isn't he.

Steps to write question tags:

1. Write auxiliary verb of the sentence as a beginning word (am, is, are, was, were, will, would, shall, should, can, could, do, does, did, has, have, had, may, might, need, ought to etc.)
2. If there are no auxiliaries use "do, does, did" depend on the tense of the verb.
3. Do not write no, not & never if they are in the sentence.
4. Write no, not & never if they are not in the sentence.
5. Write subject or reflexive pronoun (I, we, you, he, she, it, they) as the last word. Use question mark (?) at the end.
6. Use positive tags only for the negative words "few, little, never, rarely, scarcely, hardly, seldom".

Examples:

Statement	Question Tag
Sita sings well.	Doesn't she?
They came yesterday.	Did they?
I like sweets.	Don't I?
Raju cannot swim.	Can he?
I am right.	Aren't I?
You will help me.	Won't you?

Vocabulary:

The knowledge of words is called vocabulary. Generally synonyms (same meaning words), Antonyms (opposite meaning words), Spellings, Silent letters will be given in TET.

Synonyms:

Abandon: leave, relinquish, forsake, resign

Appreciate: estimate, value, recognize

Bliss: happiness, joy, delight, felicity, rapture

Capital: chief, principal, preeminent, excellent

Antonyms:

Abstract	×	concrete
Barren	×	fertile
Cheerful	×	gloomy
Dawn	×	dusk
Expand	×	contract
Foreign	×	native

Silent Letters:

The letters in brackets are not pronounced. They are silent.

- clim(b), com(b), dum(b), dou(b)t, de(b)t
- mus(c)le
- han(d)kerchief, san(d)wich, we(d)nesday
- champa(g)ne, forei(g)n, si(g)n
- bou(gh)t, brou(gh)t, cau(gh)t, thou(gh)t, borou(gh), dau(gh)ter, hei(gh)t, hi(gh), li(gh)t, mi(gh)t, kni(gh)t, nei(gh)bour, ni(gh)t, ri(gh)t, strai(gh)t, throu(gh), ti(gh)t, wei(gh)
- w(h)at, w(h)en, w(h)ere, w(h)ether, w(h)ich, w(h)ip, w(h)y
- (h)onest, (h)onour, (h)our
- (k)nee, (k)nife, (k)nob, (k)nock, (k)now and similarly in other words beginning **kn**
- ca(l)m, cou(l)d, ha(l)f, sa(l)mon, shou(l)d, ta(l)k, pa(l)m, sta(l)k, wa(l)k, wou(l)d, autum(n), hym(n)
- (p)neumatic, (p)sychiatrist, (p)sychology, (p)sychotherapy, (p)tero-dactyl and similarly in other words beginning pn, ps or pt.
- cu(p)board
- i(r)on
- (w)rap, (w)rite, (w)rong
- (w)ho, (w)hom, (w)hose, (w)hole

Phrasal Verbs:

Phrasal verbs are verbs followed by prepositions and adverbs which give them special idiomatic meanings. Here is a list of important phrases.

1. Break down = collapse
   Ex: The woman broke down when she heard the news of her husband's death.
2. Call in = bring in
   Ex: Please call in your friend.
3. Draw out = take out from his pocket
   Ex: He drew out the knife.
4. Fall off = declined
   Ex: The demand for scooters has fallen off.
5. Get over = recover from
   Ex: She got over the shock.

Sentences:

There are 4 types of sentences depend on no. of clauses they have. They are

Simple sentence:

A simple sentence is one which has only one subject and one predicate. That means it has only one clause.

Ex: Ramu is a doctor.

Compound sentence: Compound sentence is made up of two or more clauses and combined by coordinating conjunctions like "and, so, but".

Ex: He ran fast but missed the train.
'He ran fast' is one clause and 'missed the train' is another clause.

Complex sentence:

Some clauses cannot stand independently. They depend upon main clauses. Complex sentence is one which has one main clause and one or more subordinate clauses.

Ex: He told me that he was a doctor.
He told me- main clause
That he was a doctor - subordinate clause.

Compound-Complex sentence: If there are more than one main clauses and at least one subordinate clause it becomes Compound-Complex sentence.

Ex: When Sachin completed the century the audience clapped and the cheer girls danced.
The audience clapped – main clause 1
The cheer girls danced – main clause 2
When Sachin completed the century – subordinate clause

Transformation of sentences

1. **Simple to compound:** Change the phrase as another main clause and combine them with conjunction.
   Ex: I praised him for his intelligence (simple)
   Change the phrase as clause.
   For his intelligence => he was an intelligent
   Use conjunction 'so'.
   He was an intelligent, so I praised him. (Compound)
2. **Compound to Complex:** Change one main clause as subordinate clause.
   Ex: He was sick and so he could not come to school. (Compound)
   As he was sick, he could not come to school. (Complex)
3. **Compound to Simple:** Change a main clause into a phrase.
   Ex: Ravi felt hungry, he had his lunch. (Compound)
   Being hungry, Ravi had his lunch. (Simple)
4. **Complex to Simple:** Change the subordinate clause into phrase and use it along with main clause.
   Ex: He doesn't know where she works. (Complex)
   Where she works (sub. Clause) => her working place. (Phrase)
   He doesn't know her working place. (Simple)
5. **Complex to Compound:** Change the subordinate clause into main clause and combine with conjunction (and, or, but).
   Ex: Though Ravi is irregular, he is a bright student. (Complex)
   Ravi is irregular but he is a bright student. (Compound)

Letter writing:

We can divide the letters into Personal and business. In multiple choice questions few things only can be asked from this.

Salutations of the Personal letters: Dear father, My dear mother, Dear Ravi, Dear friend.

Salutations of the Business letters: Sir, Madam, M/s

Subscriptions of the personal letter: Yours affectionately, Yours sincerely (only for friends), Yours lovingly, Your

Subscriptions of the business letters: Yours faithfully, Yours truly.

No apostrophe in subscriptions.

Often confused phrase:

Your's faithfully (wrong)
Yours faithful (wrong)
Yours faithfully (correct)
-ly comes compulsory at the end, if it started with 'yours'.
-ly doesn't come if it is 'your'
Yours loving son (wrong)
Your loving son (correct)

Comprehension passage:

Read the passage once carefully before reading the questions corresponding. Again read the paragraph. Then you can get central idea of the passage. Finally answer the questions. Model passage is given here.

Louis Braille lost his sight accidentally as a child. Nevertheless, he was able to complete his education at a school for the blind in Paris and became a teacher. In his days, the few books that were available for blind people were printed in big, raised type, the letters used were those of the ordinary alphabet. The reading of such books required immense effort. Writing was almost impossible for a blind person was still restricted to an alphabet which was extraordinarily difficult to reproduce on paper. Braille's idea was to use raised dots instead of raised letters. He evolved a system which used only six dots in all. By various combinations of these dots, it not only proved possible to represent each letter in the alphabet, but punctuation marks, numbers and musical notations as well. Reading and writing have thus been enormously simplified. The sensitive fingers of a blind person can travel rapidly over the dots.

Choose the correct answer from the given four alternatives:

1. **Louis Braille**
   1.was blind by birth
   2. lost his sight gradually
   3. became blind accidentally
   4. became blind after he completed his education
2. **The books for blind before Braille were**
   1. printed in raised letters
   2. used raised dots
   3. used a special alphabet
   4.were not available
3. **Braille's new system:**
   1. introduced a new alphabet for the blind
   2.used six dots in different combinations
   3. introduced a new typewriter
   4. trained the blind to use their fingers
4. **His new system can represent**
   1. alphabets & numbers
   2. punctuation marks
   3. musical notations
   4. all of the above
5. **Where did he complete his education?**
   1. New York 2. Paris
   3. London 4. Russia

Answers:

1) 3 2) 1 3) 2 4) 4 5) 2

దేశంలో మొదటి బయోస్పియర్ రిజర్వ్?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
జాగ్రఫీ

జీవ వైవిధ్య సంరక్షణ (అటవీ వనరుల, వన్యజాతి జీవుల సంరక్షణ)

జీవావరణంలోని సమస్త జీవజాతుల మధ్య ఉన్న జన్యుపరమైన, జాతులపరమైన, ఆవరణ వ్యవస్థల పరమైన తేడాలు, వైవిధ్యతలనే జీవ వైవిధ్యతగా పరిగణిస్తారు. పర్యావరణ, ఆహార, వైద్య, వాణిజ్య, పారిశ్రామిక, సామాజిక, సాంస్కృతిక, సౌందర్యపరంగా జీవ వైవిధ్య ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత, భవిష్యత్ తరాలకు జీవ వనరులను అందుబాటులో ఉంచుతూ, సుస్థిరాభివృద్ధి సాధించడానికి సాంకేతిక విజ్ఞానం ద్వారా జీవ వైవిధ్యతను సమర్థంగా నిర్వహించడమే జీవ వైవిధ్య సంరక్షణ.

జీవ వైవిధ్య సంరక్షణలో ఇమిడి ఉన్న అంశాలు:

1. మానవ చర్యల వల్ల ప్రమాదస్థితిలో ఉన్న వన్య, వృక్ష, జంతుజాతులను గుర్తించి, వాటిని పునఃస్థాపితం చేసే రక్షణ ప్రణాళికలను రూపొందించాలి.
2. ప్రమాద స్థితిలో ఉన్న జాతుల బీజద్రవ్యాలను, విత్తనాలను, పిండాలను భద్రపరిచే ప్రయోగశాలలను ఏర్పాటు చేయాలి
3. దేశవాళి రకాల జాతుల ఆవాసాలను గుర్తించి, వాటి పరిరక్షణకు రక్షిత ప్రాంతాలను గుర్తించాలి. జీవ జాతుల అక్రమ రవాణాను, అంతర్జాతీయ వ్యాపారాన్ని అరికట్టే శాసనాలు, చట్టాలను అమలు చేయాలి.
4. బహుళ జాతి కంపెనీలు సాగించే జీవ చౌర్యాన్ని అరికట్టే చర్యలు చేపట్టాలి.

* జీవ వైద్య సంరక్షణకు రెండు రకాల వ్యూహాలను అమలు చేస్తున్నారు. అవి..
  1) IN-Situ సంరక్షణ (ఆవాసాంతర సంరక్షణ)
  2) Ex-Situ సంరక్షణ(ఆవాసేతర సంరక్షణ)

బయోస్పియర్ రిజర్వ్	రాష్ట్రం
నీలగిరి (దేశంలోని మొదటి బయోస్పియర్, 1986లో ప్రకటించారు.	తమిళనాడు
అగస్త్యమలై	కేరళ
గల్ఫ్ ఆఫ్ మన్నార్	తమిళనాడు
గ్రేట్ నికోబార్	అండమాన్ నికోబార్
సిమ్లిపాల్	ఒడిశా
అమర్ కంటక్-అదానకర్	మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్
పాంచ్‌మర్హి	మధ్యప్రదేశ్
సుందర్‌బన్	వెస్ట్‌బెంగాల్
దిబ్రూసికాయ్	అసోం
మానస	అసోం
నోక్రేక్	మేఘాలయ
దిబాంగ్-దెహాంగ్	అరుణాచల్‌ప్రదేశ్
కాంచనజంగా	సిక్కిం
నందాదేవి	ఉత్తరాఖండ్
రాణ్ ఆఫ్ కచ్	గుజరాత్
కోల్డ్ డెసర్ట్	హిమాచల్‌ప్రదేశ్
శేషాచల	ఆంధ్రప్రదేశ్
పన్నా	మధ్యప్రదేశ్

IN-Situ సంరక్షణ:
ఏదైనా భౌగోళిక ప్రాంతంలో అంతరించిపోయే ప్రమాదంలో ఉన్న జీవజాతులను వాటి జన్యు సంపదను అదే భౌగోళిక ప్రాంతంలో మానవ ప్రమేయంతో రక్షించే విధానమే IN-Situ సంరక్షణ. ఈ పద్ధతిలో సమాజానికి లాభం కలిగించే విభిన్న రకాల రక్షిత ప్రాంతాల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ విధానంలో 4 రకాల కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తున్నారు. అవి..

ఎ) జాతీయ పార్కులు:
ప్రకృతి సంపద, సుందర ప్రదేశాలు, దృశ్యాలు, వన్యజీవులను సంరక్షించేందుకు జాతీయ పార్కులను ఏర్పాటు చేస్తారు. ఈ ప్రాంతాల నుంచి వంట చెరకును సేకరించుకోవడం, పశువులను మేపుకోవడం, అటవీ ఉత్పత్తులను సేకరించడం నిషిద్ధం. ఈ ప్రాంతాలపై వ్యక్తిగత హక్కులు ఉండవు. జాతీయ పార్కుల హద్దులను శాసనం ద్వారా నిర్ణయిస్తారు. ప్రస్తుతం దేశంలో 4.2 మిలియన్ హెక్టార్లలో (దేశ భూభాగంలో 1.3శాతం) 97 జాతీయ పార్కులు ఉన్నాయి.

బి) వన్యమృగ సంరక్షణ కేంద్రాలు (అభయారణ్యాలు):
వీటిని వన్యప్రాణుల సంరక్షణకు కేటాయించినప్పటికీ వీటి సరిహద్దులను శాసనం ద్వారా నిర్ణయించరు. ఇక్కడి వన్యప్రాణులకు కీడు కలిగించనంత వరకు అటవీ కార్యకలాపాలను చేపట్టేందుకు అనుమతి ఉంది. ప్రస్తుతం 12 మిలియన్ల హెక్టార్ల భూభాగంలో (దేశభూభాగంలో 3.7 శాతం) 512 జాతీయ పార్కులు ఉన్నాయి.

సి) బయోస్పియర్ రిజర్వ్:
ఏదైనా భౌగోళిక ప్రాంతంలో వృక్ష, జంతుజాతులు, వాటి జన్యువుల పరిరక్షణ, గిరిజనుల జీవనశైలి, పెంపుడు మొక్కల, జంతువుల జన్యు ఆధారాలను సంరక్షించేందుకు ఏర్పాటైన బహుళ ప్రయోజనకర రక్షిత ప్రాంతాలే బయోస్పియర్ రిజర్వ్‌లు. యునెస్కో ఆధ్వర్యంలో ఏర్పాటైన మ్యాన్ అండ్ బయోస్పియర్ ప్రోగ్రామ్ (1971) ప్రస్తుతం దేశంలో 19 బయోస్పియర్ ప్రాంతాలను ప్రకటించింది.

డి) దుర్బల, ప్రమాద స్థితిలో ఉన్న జీవజాతుల పరిరక్షణకు ప్రత్యేక పథకాలు:

ప్రాజెక్టు టైగర్:
అంతరించిపోతున్న పులుల సంతతిని పరిరక్షించడానికి, వాటి సంఖ్యను పెంపొందించడానికి, వాటిలోని సౌందర్య, సాంస్కృతిక, వాణిజ్య, ఆవరణ వ్యవస్థల పరమైన విలువలను కాపాడడానికి 1973 నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పథకం కింద దేశంలో 55 పులి సంరక్షణా కేంద్రాలు ఏర్పాటయ్యాయి. పులిసంరక్షణా కేంద్రాలు, పులులు ఎక్కువ సంఖ్యలో ఉన్న రాష్ట్రం మధ్యప్రదేశ్. అందుకే దీన్ని పులి రాష్ట్రంగా పిలుస్తారు. అంతేకాకుండా పులిని 1973లో జాతీయ జంతువుగా ప్రకటించారు.

ప్రాజెక్టు ఎలిఫెంటా: ఏనుగుల సంతతిని పెంచడానికి 1992లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్రస్తుతం దేశంలోని 13 రాష్ట్రాల్లో 33 ఏనుగు సంరక్షణా కేంద్రాలున్నాయి.

ప్రాజెక్టు క్రోకోడైల్: మొసళ్ల పరిరక్షణకు 1975 నుంచి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్రస్తుతం ఎనిమిది రాష్ట్రాల్లో 34 మొసలి సంరక్షణా కేంద్రాలు ఏర్పాటయ్యాయి.

ప్రాజెక్టు సీ టర్టుల్స్: సముద్ర తాబేళ్ల పరిరక్షణకు 1975లో ఈ పథకాన్ని ఒడిశాలోని గహిర్‌మతాబీచ్‌లో ఏర్పాటు చేశారు. ఇందులో రిడ్లే రకానికి చెందిన తాబేళ్లను పరిరక్షిస్తున్నారు.

జాతీయ పార్కు/ వన్యమృగ సంరక్షణ కేంద్రం	రాష్ట్రం/ కేంద్రపాలిత ప్రాంతం	ప్రత్యేకత
దచిగాం జాతీయ పార్కు	జమ్మూ కాశ్మీర్	హంగుల్ (కాశ్మీరి దుప్పి)
సలీం అలీ పక్షి సంరక్షణ కేంద్రం	జమ్మూ కాశ్మీర్	హిమాలయన్ మంచుకోడి
జిమ్ కార్బెట్ జాతీయ పార్కు (దేశంలోనే తొలి జాతీయ పార్కు)	ఉత్తరాఖండ్	పులులు
ఘనా పక్షి సంరక్షణ కేంద్రం	రాజస్థాన్	సైబీరియన్ కొంగలు
ఖాజీరంగా జాతీయ పార్కు	అసోం	ఒంటికొమ్ము ఖడ్గమృగం
వాలీ ఆఫ్ ఫ్లవర్స్ జాతీయ పార్కు	ఉత్తరాఖండ్ పరిరక్షణ	భిన్నరకాల పుష్పజాతుల
సరిస్కా వన్యమృగ సంరక్షణ కేంద్రం	రాజస్థాన్	పులులు
కన్హా జాతీయ పార్కు	మధ్యప్రదేశ్	పులులు
కన్నేర్‌ఘాట్ జాతీయపార్కు	చత్తీస్‌గఢ్	పులులు
కంచర గాడిదల సంరక్షణా కేంద్రం	గుజరాత్	కంచర గాడిదలు
గిర్ వన్యమృగ సంరక్షణ కేంద్రం	గుజరాత్	సింహాలు
బోరివిల్లా జాతీయపార్కు	మహారాష్ట్ర	అరిచే జింకలు
బన్నేర్‌ఘాట్ జాతీయపార్కు	బెంగళూరు	ప్రపంచంలో అతిపెద్ద సీతాకోక చిలుకల సంరక్షణ కేంద్రం
సైలెంట్ వ్యాలీ జాతీయ పార్కు	కేరళ	మకాక్ కోతులు (సింహపు తోక ఉన్న కోతులు)
పెరియార్ వన్యమృగ సంరక్షణ కేంద్రం	కేరళ	ఏనుగులు, పులులు
రాజీవ్‌గాంధీ పులుల సంరక్షణ కేంద్రం	ఆంధ్రప్రదేశ్	పులులు

2) Ex-Situ సంరక్షణ:
ఏదైనా భౌగోళిక ప్రాంతంలో అంతరించే స్థితిలో ఉన్న జీవ జాతులను వాటి సహజ ఆవాసాలకు వెలుపల పరిరక్షించే విధానమే Ex-Situ సంరక్షణ. ఈ విధానంలో జీవజాతులు, వాటి నమూనాలను, విత్తన, పిండ నిల్వల బ్యాంకులు, కణజాల వర్ధన కేంద్రాలు, జన్యుబ్యాంకులు, బీజ ద్రవ్య బ్యాంకులు, చేపల గుడ్ల నిల్వ కేంద్రాలు, జంతు ప్రదర్శనశాలలో సంరక్షిస్తారు.

పైన తెలిపిన విధానాలతోపాటు దేశంలో అనేక చట్టాలు, పరిశోధనా కేంద్రాలను కూడా జీవ వైవిధ్య సంరక్షణలో భాగంగా రూపొందించి అమలు చేస్తున్నారు. అవి..

1. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, కోల్‌కతా
2. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా, డెహ్రాడూన్
3. ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, డెహ్రాడూన్
4. అరిడ్ ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్- జోధ్‌పూర్(రాజస్థాన్)
5. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్రీ- డెహ్రాడూన్
6. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఉడ్ సైన్స్ ఆఫ్ టెక్నాలజీ-బెంగళూరు
7. ట్రోఫికల్ ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ - జబల్‌పూర్(మధ్యప్రదేశ్)
8. హిమాలయా ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, సిమ్లా(హిమాచల్ ప్రదేశ్)
9. సెంటర్ ఫర్ సోషల్ ఫారెస్ట్రీ ఆఫ్ ఎకొలాజికల్ రిహాబిలిటేషన్-అలహాబాద్
10. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్-భోపాల్
11. వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, డెహ్రాడూన్
12. జీబీ పంథ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ ఎన్విరాన్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్- అల్‌మోరా(ఉత్తరాఖండ్)
13. నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్- నాగ్‌పూర్

మాదిరి ప్రశ్నలు

1. in-Situ జీవ వైవిధ్య సంరక్షణా విధానంలో ఒక కార్యక్రమం కానిది?
   1) జాతీయ పార్కులు 2) ప్రాజెక్ట్ టైగర్
   3) బయోస్పియర్ రిజర్వ్
   4) ఉద్యానవనాలు
2. కన్హా జాతీయపార్కు ఏ నది ఒడ్డున ఉంది?
   1) చంబల్ 2) బెట్వా
   3) కెన్ 4) సోన్
3. సైబీరియన్ కొంగలకు ప్రసిద్ధి చెందిన పక్షి సంరక్షణా కేంద్రం?
   1) నేలపట్టు 2) సలీంఅలీ
   3) ఘనా 4) సుల్తాన్‌పూర్
4. కన్నేర్‌ఘూట్ జాతీయ పార్కు ఏ రాష్ట్రంలో ఉంది?
   1) జార్ఖండ్ 2) కర్ణాటక
   3) చత్తీస్‌గఢ్ 4) మధ్యప్రదేశ్
5. దేశంలో మొదటి బయోస్పియర్ రిజర్వ్?
   1) సుందర్‌బన్
   2) గల్ఫ్ ఆఫ్ మన్నార్
   3) కాంచనజంగా 4) నీలగిరి
6. అరిచే జింకలకు ప్రసిద్ధి చెందిన వన్యమృగ సంరక్షణా కేంద్రం?
   1) కన్హా 2) సైలెంట్ వ్యాలీ
   3) బోరివిల్లా 4) రణతంబోర్
7. సైలెంట్ వ్యాలీ జాతీయ పార్కు దేనికి ప్రసిద్ధి?
   1) పులులు 2) ఏనుగులు
   3) మకాక్ కోతులు
   4) సీతాకోక చిలుకలు
8. నేలపట్టు పక్షి సంరక్షణా కేంద్రం ఏ సరస్సు ఒడ్డున ఉంది?
   1) కొల్లేరు 2) సాంబార్
   3) చిల్కా 4) పులికాట్
9. పులి రాష్ట్రంగా దేన్ని పిలుస్తారు?
   1) చత్తీస్‌గఢ్ 2) మధ్యప్రదేశ్
   3) ఆంధ్రప్రదేశ్ 4) అసోం

సమాధానాలు
1) 4 2) 2 3) 3 4) 3 5) 4
6) 3 7) 3 8) 4 9) 2

How will RIGHT be written in the same code?

BANK EXAMS
REASONING

CODING - DECODING

In this chapter a word or message is coded according to a definite pattern or rule. An aspirant is expected to identify the pattern or rule to decode the given word or message so that the same pattern can be applied to code or decode another word or message.

Types of coding-decoding

I. **Letter Coding:** In this coding certain letters of alphabet stand for certain other letters of the alphabet.
II. **Number Coding:** In this coding letters are replaced by position of the letter in English alphabet.

Now let us look at different types of letter coding.

1. **Forward Sequence Pattern:** Here each letter is coded by its next letter in alphabet.
   For ex: If 'DREAMS' is coded as "ESFBNT" then how will you code 'POLICE'?
   Here D, R, E, A, M and S
   ↓ ↓ ↓ ↓ ↓ ↓
   E, S, F, B, N and T... are coded by next letters in alphabet
   So the letters of the word "POLI CE" will be coded by their next letters of alphabet "QPMJDF".
2. **Backward Sequence Pattern:** In this type each letter is coded by its preceding letter in English alp habet. For ex: If 'DREAMS' is coded as "CQDZLR" then how 'CARNAGE' will be coded?
   In the above pattern the letters of the word 'DREAMS' viz
   D, R, E, A, M and S are
   ↓ ↓ ↓ ↓ ↓ ↓
   C Q D Z L and R
   coded by the preceding letters in English alphabet
   In the same way the letters of the word "CARNAGE" will be coded as "BZQMZFD"
3. **Skipped Sequence Pattern:** In this pattern each letter is coded by a letter obtained after skip ping certain number of letters in English alphabet. In such patterns continuity of letters is maintained i.e Z is followed by A without disturbing the continuity. For e.g. If 'DREAMS' is coded as "FUIFSZ" then how will you code 'SAKSHI'?
   In the above coding D, R, E, A, M and S are coded by letters obtai ned after skipping 1, 2, 3, 4, 5 and 6 letters i.e 'D' by 'F' (skip 1), 'R' by 'U' (skip 2), 'E' by 'I' (skip 3) and so on.
   In the same way skip 1, 2, 3, 4, 5 and 6 letters for the letters S, A, K, S, H and I to obtain U, D, O, X, N and P. Therefore 'SAKSHI' will be coded as "UDOXNP'.
4. **Coding in fictious language:** *Here a new fictious language is used to code words. In such questions, the codes for a group of words is usually given. By eliminating the common words we may find out the codes for each word. The procedure is explained below:*
   In a certain code language 'hit bit mit' means 'git rim nit', 'sit pit mit' means 'lit git tit' and 'fit zit pit' means 'dit vit tit'. What does 'sit' stand for in that code lang uage?
   In the first two sentences 'mit' is a common word and in the corres ponding codes 'git' is common word. Therefore 'mit' is coded as 'git'. Similarly in the second and third sentences the word 'pit' is common and in the correspo-nding code language 'tit' is common word. Therefore 'pit' is coded as 'tit'.
   So the remaining word 'sit' in second sentence is coded by remaining word 'lit'.

PRACTICE QUESTIONS

1. In a certain code, IDEAS is written as HEDBR and WOULD is written as VPTMC. How will RIGHT be written in the same code?
   1) QJHIS 2) QJFGS
   3) SHHGU 4) QJFIU 5) QJFIS

A: 5;
In the given words IDEAS and WOULD, the first, third and fifth letters are replaced with the preceding letters of the alphabet. The second and the fourth letters of the given words are replaced by the next letters.

```
I  D  E  A  S     W  O  U  L  D
-1 +1 -1 +1 -1    -1 +1 -1 +1 -1
↓  ↓  ↓  ↓  ↓     ↓  ↓  ↓  ↓  ↓
H  E  D  B  R     V  P  T  M  C
```

So the letters of the word RIGHT will be coded as R → Q, I → J, G → F, H → I, T → S.
So the coded word will be QJFIS.



2. In a certain code PAUSE is written as OBVTD and SHIFT is written as RIJGS. How will THI NK be written in the same code?
   1) UGHML 2) SIJOJ 3) SILOJ
   4) SIJQJ 5) SIJ0L

A: 2;
In the given words PAUSE and SHIFT, the first and fifth letters are replaced with the preceding letters of the alphabet. The second, third and the fourth letters of the given words are replaced by the next letters.

```
P  A  U  S  E     S  H  I  F  T
-1 +1 +1 +1 -1    -1 +1 +1 +1 -1
↓  ↓  ↓  ↓  ↓     ↓  ↓  ↓  ↓  ↓
O  B  V  T  D     R  I  J  G  S
```

∴ THINK will be coded as SIJOJ.

3. In a certain code, DRENCH is written as CSFODG and GEMI NI is written as FFNJOH. How will PIGEON be written in the same code?
   1) QJHFPO 2) RJHFPO
   3) OJFHPM 4) OJHFMP
   5) None of these

A: 5;
In the two given words, the first and the last letters are replaced with the preceding letters of the word. The letters between are replaced with the next letters of the alphabet.

```
D  R  E  N  C  H     G  E  M  I  N  I
-1 +1 +1 +1 +1 -1    -1 +1 +1 +1 +1 -1
↓  ↓  ↓  ↓  ↓  ↓     ↓  ↓  ↓  ↓  ↓  ↓
C  S  F  O  D  G     P  I  G  E  O  N
```

∴ PIGEON is coded as OJHFPM

4. If PAPER is written as OZODQ then how PENCIL can be written in that code?
   1) ODMBHK 2) DOMBHK
   3) ODMHBK 4) OMDBHK
   5) None of these

A: 1;
All the letters of the given word are replaced by the preceding letters of the alphabet.

```
P  A  P  E  R
-1 -1 -1 -1 -1
↓  ↓  ↓  ↓  ↓
O  Z  O  D  Q
```

In the same way PENCIL can be coded as

```
P  E  N  C  I  L
-1 -1 -1 -1 -1 -1
↓  ↓  ↓  ↓  ↓  ↓
O  D  M  B  H  K
```

5. In a certain code 'PAINT' is coded as 'RCKPV' and 'STOMP' is written as 'UVQOR'.
   In the same code 'HELPS' will be coded as '_____'.
   1) JGNRU 2) GJNRU
   3) KGNRU 4) JGNSU 5) JGNRV

A: 1;
All the letters of the given words are replaced by second next letter of the alphabet.

```
P  A  I  N  T     S  T  O  M  P
+2 +2 +2 +2 +2    +2 +2 +2 +2 +2
↓  ↓  ↓  ↓  ↓     ↓  ↓  ↓  ↓  ↓
R  C  K  P  V     U  V  Q  O  R
```

In the same way HELPS can be coded as

```
H  E  L  P  S
+2 +2 +2 +2 +2
↓  ↓  ↓  ↓  ↓
J  G  N  R  U
```

6. If in a certain code, 'O' is written as 'E', 'A' as 'C', 'M' as 'I', 'S' as 'O', 'N' as 'P', 'E' as 'M', 'I' as 'A', 'P' as 'N' and 'C' as 'S', then how will 'COMPANIES' be written in that code?
   1) SEIACPAMO 2) SMINCPAMO
   3) SEINCPAMO 4) SEINCPMIO
   5) None of these

A: 3;
O → E, A → C, M → I, S → O, N →P, E → M, I → A, P → N, C →S

```
C  O  M  P  A  N  I  E  S
↓  ↓  ↓  ↓  ↓  ↓  ↓  ↓  ↓
S  E  I  N  C  P  A  M  O
```

7. In a certain code, 'what else can you do for me, Mr.Ajay' is written as 'You Mr. what can Ajay else do me for'. How will 'anyone else who can do such favour to me' be written in that code?
   1) can to who anyone me else do favour such
   2) can favour anyone who me else do such
   3) can to anyone who me else do such favour
   4) can to anyone who me do else favour such
   5) None of these

A: 3;
By looking at the given sentence and its code it can be said that the words are same in both the cases. Also the words are not arranged in dictionary order, because the word 'Mr.' comes before 'You' in a dictionary. So the words are arranged among themselvesin different positions. To solve such questions use the following method. First number the words of the given sentence.

```
1    2    3   4   5  6  7   8   9
what else can you do for me, Mr. Ajay
```

Now look at the order in which these words are arranged in coded form

```
You Mr. what can Ajay else do me for
4   8   1    3   9    2    5  7  6
```

In the same way words of the given sentence is coded as

```
1      2    3   4   5  6    7      8  9
anyone else who can do such favour to me
```

Then decoding the above one:

```
4   8  1      3   9  2    5
can to anyone who me else do
7    6
such favour
```

Directions (8-12): *Study the following information carefully and answer the questions given below:*
In a certain code language '5 1 6 7 2 1' is written as 'the black dog frightened the cat', '6 4 5 8 1' is written as 'the frightened cat run away', '3 6 2 1' is written as 'the cat was black' and '7 4 1' is written as 'the dog run'.

8. What is the code for 'away'?
   1) 8 2) 6 3) 3 4) 1
   5) Can't be determined

A: 1;

9. What is the code for 'black'?
   1) 2 2) 4 3) 6 4) 5
   5) Can't be determined

A: 1;

10. What is the code for 'frightened'?
    1) 2 2) 6 3) 7
    4) 5 5) Can't be determined

A: 4;

11. What is the code for 'the cat was frightened'?
    1) 5267 2) 5371 3) 8475
    4) 5367 5) None of these

A: 5;

12. Which of the following words is represented by '4'?
    1) cat 2) dog
    3) run 4) the
    5) Can't be determined

A: 3;

SOLUTIONS (8-12)

Try to identify which number is assigned to each word.
'5 1 6 7 2 1' → 'the black dog frightened the cat' ...... (i)
'6 4 5 8 1' → 'the frightened cat run away' .... (ii)
'3 6 2 1' → 'the cat was black' ... (iii)
'7 4 1' → 'the dog run' .... (iv)
'the' is common in all the four sets. So the code for 'the' is 1.
Considering the (iv) statement, it has 7 and 4.
Comparing the '7' in (i) and (iv),
7 → dog & 4 → run.
Comparing (i) & (iii), 3 →was
Now comparing (ii) & (iii), 6 → cat
Now in (iii), 2 → black Comparing(i) &(ii), 5→ frightened & 8 → away
Now answer the questions based on the above data.